


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50



బ్లాక్ కోబ్రా

నల్లధనం కుబేరులకు అండగా నిలిచిన రామోజీ

- నల్లధనం అడ్డాగా మార్గదర్శి ఫైనాన్సియర్స్, చిట్ ఫండ్స్
- అక్రమ డిపాజిట్లు, చిట్టీల ముసుగులో మనీ లాండరింగ్
- ఘోస్ట్ చందాదారుల పేరుతో నల్లధనం తరలింపు
- ఉత్తుత్తి చెక్కులతో తిమ్మినిబమ్మి చేస్తున్న 'ఛీట్'ఫండ్స్
- అక్రమార్జన బాబులకు అండగా నిలిచిన వైనం

II లో

అక్రమార్జనతో పేరుకుపోయిన నల్లధనాన్ని దాచిపెట్టేందుకు 'మార్గదర్శి'

మనీ లాండరింగ్ ద్వారా పోగేసిన నల్లధనం మూటలు తరలించేందుకు 'మార్గదర్శి'

లేని పేర్లతో బ్యాంకు ఖాతాలు సృష్టించి అక్రమ నిధులను తరలించే షెల్ కంపెనీ 'మార్గదర్శి'

ఒక్క మాటలో చెప్పాలంటే.. చెరుకూరి రామోజీరావు మినీ స్విస్ బ్యాంకు 'మార్గదర్శి'

– సాక్షి, అమరావతి

'మార్గదర్శి' బాధితుల సంఘం ఏర్పాటు

3లో

బ్లాక్ కోబ్రా



సాక్షి, అమరావతి

మార్గదర్శి ఫైనాన్సియర్స్ అయినా.. మార్గదర్శి చిట్ ఫండ్స్ అయినా అంతిమంగా చేసేది నల్లధనం దందానే అని తేటతెల్లమైంది. అందుకోసం రశీదు డిపాజిట్లు, భవిష్యత్ చందాలు, ఘోస్ట్ చందాదారులు.. ఇలా అనేక పేర్లతో రామోజీరావు సాగిస్తున్న అక్రమ ఆర్థిక సామ్రాజ్యమే మార్గదర్శి చిట్ ఫండ్స్ అని స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ సోదాల్లో ఆధారాలతోసహా బట్టబయలైంది. అందుకే తమ దర్యాప్తులో భాగంగా ఆ అంశాలపై సమాధానం చెప్పమంటే రామోజీరావు, ఆయన కోడలు శైలజ కిరణ్ ముఖం చాటేశారు. రామోజీరావు ఏకంగా గుడ్లు తేలేసినట్టు మంచం ఎక్కి మెలో డ్రామా నడిపితే.. శైలజ కిరణ్ తనకు ఆరోగ్యం బాగోలేదు.. కళ్లు సరిగా కనిపించడం లేదంటూ టీవీ సీరియళ్లను తలపించే రీతిలో నటనా చాతుర్యం ప్రదర్శించారు. కానీ సోదాల్లో బయటపడిన ఆధారాలు అబద్ధం చెప్పవు కదా! అందుకే ఆ ఆధారాలతోనే మార్గదర్శి చిట్ ఫండ్స్‌పై సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేయడం రామోజీ అక్రమ ఆర్థిక సామ్రాజ్యం పునాదులతో సహా కదులుతోంది.

బ్లాక్ మనీ డెన్

మార్గదర్శి చిట్ ఫండ్స్ రశీదు డిపాజిట్ల పేరుతో సేకరిస్తున్న అక్రమ డిపాజిట్ల వెనుక నల్లధనం గూడుపుఠాణి దాగుంది. రాష్ట్రంలోని 37 మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల్లో సేకరించిన రశీదు డిపాజిట్ల వివరాలను సీఐడీ పరిశీలించడంతో ఈ బాగోతం బయట పడింది. ఆర్థిక లావాదేవీల నిర్వహణలో సంబంధిత వ్యక్తుల పాన్, ఆధార్ నంబర్లు నమోదు చేయాలనేది బ్యాంకింగ్, నాన్ బ్యాంకింగ్ సంస్థలు కచ్చితంగా పాటించాల్సిన నిబంధన. కానీ మార్గదర్శి చిట్ ఫండ్స్ సేకరించిన అక్రమ డిపాజిట్లకు ఇస్తున్న రశీదుల్లో ఎక్కడా కూడా డిపాజిట్‌దారుల పాన్ నంబరు, ఆధార్ నంబర్లను నమోదు చేయడం లేదు. అంటే ఆ డిపాజిట్ల వివరాలేవీ ఆదాయ పన్ను శాఖ పరిశీలించే అవకాశం లేదు. ఎంత భారీ మొత్తాన్ని డిపాజిట్ చేసినా గుట్టు బయటపడదు. ఆ పేరుతో నల్ల కుబేరుల నుంచి భారీగా నల్లధనాన్ని అక్రమ డిపాజిట్లుగా సేకరిస్తోంది. అక్రమ మార్గాల్లో సంపాదించిన నల్లధనాన్ని దాచుకునేందుకు వారికి మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఓ మార్గంగా కనిపిస్తోంది. జాతీయ బ్యాంకులు సేవింగ్స్ ఖాతాలపై 5 శాతం కంటే అధికంగా వడ్డీ చెల్లిస్తున్నాయి. మార్గదర్శి చిట్ ఫండ్స్ కేవలం 5 శాతం వడ్డీ చెల్లిస్తామన్నా సరే డిపాజిట్లు చేస్తుండటం గమనార్హం. ఎందుకంటే జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ చేయాలంటే ఆ ఆదాయం ఎలా వచ్చిందన్నది చెప్పాల్సి ఉంది. పాన్ నంబర్, ఆధార్ నంబర్ ఇతర వివరాలను సమర్పించాలి. అవి ఆర్‌బీఐ, ఆదాయ పన్ను, సీబీడీటీ మొదలైన అధికారుల దృష్టిలో ఉంటాయి. ఆ వివరాలేవీ వెల్లడించడానికి సుముఖంగా లేని వారు మాత్రమే ఇతర సంస్థల్లో డిపాజిట్ చేసేందుకు ఆసక్తి చూపిస్తారు. ఎందుకంటే వారు డిపాజిట్ చేసేదంతా నల్ల ధనమే కాబట్టి. ఈ విధంగా వేల సంఖ్యలో అక్రమ డిపాజిట్ల రూపంలో భారీగా నల్ల ధనాన్ని చలామణిలోకి తీసుకువచ్చినట్టు సీఐడీ గుర్తించి దర్యాప్తు ముమ్మరం చేసింది. మొదటి దశలో రూ.కోటికిపైగా డిపాజిట్ చేసిన దాదాపు వెయ్యి మందిని గుర్తించింది. అంటే మొదటి దశలో రూ.వెయ్యి కోట్ల అక్రమ డిపాజిట్లపై దృష్టి సారించింది.

ఆ విధంగా డిపాజిట్ చేసిన రూ.కోటి నిధులు ఏ ఆదాయ మార్గంలో వచ్చాయో తెలపాలని నోటీసుల్లో పేర్కొంది. కానీ ఇప్పటి వరకు ఎవరూ సీఐడీ నోటీసులకు సమాధానం ఇవ్వనే లేదు. దీనిపై మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఉద్యోగులను ప్రశ్నిస్తే విస్మయకర సమాధానమిచ్చారు. పాన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలను ఆన్‌లైన్ ఖాతాల్లో ఎందుకు లింక్ చేయలేదని మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లను ప్రశ్నిస్తే అది తమ విధానమని కూడా చెప్పడం గమనార్హం. అంటే పక్కా పన్నాగంతోనే నల్లధనం దాచుకునేందుకు మార్గదర్శి చిట్ ఫండ్స్‌ను అడ్డాగా చేశారన్నది స్పష్టమవుతోంది.

ఘోస్ట్ చందాదారులతో నల్ల దందా

బహుశా దేశంలో ఏ ఆర్థిక సంస్థ కూడా చేయని రీతిలో రామోజీరావు సరికొత్త నల్లధనం దందాకు తెరతీశారు. అందుకోసం ఆయన తెరపైకి తెచ్చిన విధానమే 'ఘోస్ట్ చందాదారులు'. తమ ఏజెంట్ల ద్వారా రాష్ట్రంలోని చిరు వ్యాపారులు, గృహిణులు, ప్రైవేటు ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు ఇలా పలు వర్గాలకు చెందిన వారి ఆధార్ కార్డులు సేకరించారు. ఓ పట్టణంలోని వారి ఆధార్ నంబర్ల ఆధారంగా దూరంగా ఉన్న పట్టణంలో మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయంలో చిట్టీ వేస్తారు. తన పేరుతో చిట్టీ ఉందనే విషయం సంబంధిత వ్యక్తులకు తెలియదు. వారినే ఘోస్ట్ చందాదారులుగా వ్యవహరిస్తారు. వారు చిట్టీలకు చందాలు చెల్లించరు. కానీ వారి పేరున చిట్టీ గ్రూపులు నిర్వహిస్తుంటారు. మార్గదర్శి చిట్ ఫండ్స్ కూడా ఆ చిట్టీ చందాలు చెల్లించదు. కేవలం పుస్తకాల్లో సర్దుబాట్ల ద్వారా చందా చెల్లించినట్టు చూపిస్తారు. కానీ ప్రతి నెల డివిడెండ్లు, ఓసారి చిట్టీ పాట మొత్తాన్ని తీసుకుంటారు. ఆ చిట్టీ పాట మొత్తాన్ని మళ్లీ మార్గదర్శి చిట్ ఫండ్స్‌లోనే డిపాజిట్లు చేస్తారు. ఇలా రాష్ట్రంలో వేల సంఖ్యలో ఘోస్ట్ చందాదారుల పేరిట చిట్టీలు తెరచి.. భారీగా నల్ల ధనాన్ని అక్రమ డిపాజిట్లుగా చలామణిలోకి తీసుకువస్తున్నారు. ఆ విధంగా వేల కోట్ల రూపాయాల నల్లధనాన్ని చలామణిలోకి తీసుకురావడం రామోజీరావుకే చెల్లింది. మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల్లో సీఐడీ సోదాలు చేయగా అటువంటి ఘోస్ట్ చందాదారుల చిట్టీలు గుట్టలు గుట్టలుగా బయటపడ్డాయి.

ఉత్తుత్తి చెక్కులతో 'బ్లాక్' మ్యాజిక్

మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల నుంచి అక్రమంగా తమ సొంత కంపెనీల్లోకి పెట్టుబడులుగా తరలిస్తున్న నల్లధనానికి మసి పూసి మారేడు కాయ చేసేందుకు రామోజీరావు జిత్తులమారి ఎత్తులు వేస్తున్నారు. ఏటా మార్చి 31న మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల్లో బ్యాలన్స్ షీట్లు చూపించాలి. కానీ అప్పటికే ఆ నిధులను అక్రమంగా తమ సొంత కంపెనీలు ఉషా కిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ఉషోదయ ఎంటర్ ప్రైజస్‌లతోపాటు మ్యూచువల్ ఫండ్స్ కంపెనీల్లోకి తరలించేస్తున్నారు. కానీ మార్చి 31న బ్యాలన్స్ షీట్‌తో సరిపోవాలి. అందుకోసం మార్చి 31న పెద్ద సంఖ్యలో చందాదారులు చెక్కుల రూపంలో చిట్టీల మొత్తం చెల్లించినట్టుగా చూపిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఆ చెక్కులను 90 రోజుల్లో నగదుగా మార్చాలి. కానీ మార్గదర్శి చిట్ ఫండ్స్ మాత్రం ఆ చెక్కులను నగదుగా మార్చి, బ్యాంకు ఖాతాలో జమ చేసినట్టు చూపించడం లేదు. అంటే మార్చి 31న బ్యాలన్స్ షీట్ పూర్తి కాగానే.. ఆ చెక్కులను గుట్టు చప్పుడు కాకుండా మాయం చేస్తోంది. ఎందుకంటే అవన్నీ ఉత్తుత్తి చెక్కులే. ఆ ఖాతాల్లో నగదు ఉండదు. ఆ చెక్కులు బ్యాంకులో వేసినా ఎన్‌క్యాష్ కావు. కేవలం చిట్స్ రిజిస్ట్రార్, రిజర్వ్ బ్యాంకును బురిడీ కొట్టించేందుకే ఈ ఉత్తుత్తి చెక్కులతో కనికట్టు చేస్తోంది. ఆ విధంగా ఏటా మార్చి 31న దాదాపు రూ.550 కోట్ల విలువైన చెక్కులను మార్గదర్శి చిట్ ఫండ్స్ చూపిస్తోంది. అంటే ఏటా దాదాపు రూ.550 కోట్ల నల్లధనాన్ని గుట్టుగా దాటిస్తోందన్నది సుస్పష్టం. ఇలా దశాబ్దాల నుంచి ఏటా రూ.550 కోట్ల చొప్పున నల్లధనం దందా సాగిస్తుండటం రామోజీ బరితెగింపునకు నిదర్శనం.

మార్చి 3న అద్దంకిలో సిద్ధం సభ

- కొరిశపాడు మండలం పిచ్చికలగుడిపాడు గ్రామం వద్ద సభ నిర్వహణ
- ఏర్పాట్ల సన్నాహక సమావేశంలో వేణుంబాక విజయసాయిరెడ్డి

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మార్చి 3న నాల్గవ సిద్ధం సభను నిర్వహించనున్నారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం కొరిశపాడు మండలం పిచ్చికలగుడిపాడులో ఈ సభ జరుగుతుంది. ఏర్పాట్లపై తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పలు జిల్లాల కార్యకర్తలు హాజరయ్యారు. మంత్రులు విడదల రజిని, మేరుగు నాగార్జున, ఎంపీ మోపిదేవి వెంకటరమణ పాల్గొన్నారు. అద్దంకి నియోజకవర్గంలో సభ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్టు విజయసాయిరెడ్డి చెప్పారు. భీమిలి, ఏలూరు, రాప్తాడు సభల్లాగే అద్దంకి సభను కూడా చరిత్రలో నిలిచిపోయే విధంగా విజయవంతం చేయాలన్నారు. గత మూడు సభలు విజయవంతమైన తరువాత టీడీపీ నైతిక స్థైర్యం దెబ్బతిని, ఆ పార్టీ సందిగ్ధంలో పడిపోయిందన్నారు. ఎన్నికలకు సిద్ధం అవుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు మరింత ఉత్సాహాన్నిచ్చాయని పేర్కొన్నారు.

అసమానతలు తొలగించేందుకు ప్రభుత్వం కృషి

సమాజంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక, అసమానతలు తొలగించేందుకు ఈ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేసిందని విజయసాయిరెడ్డి అన్నారు. ఈ సంస్కరణలను ప్రజలందరికీ వివరించాలని పిలుపునిచ్చారు. పార్టీ న్యాయ విభాగం ఆధ్వర్యంలో న్యాయవాదులతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జూనియర్ న్యాయవాదులకు వైఎస్సార్ లా నేస్తం కార్యక్రమం అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5,000 చొప్పున స్టైఫండ్ అందిస్తోందని చెప్పారు. న్యాయవాది మరణిస్తే బార్ కౌన్సిల్ రూ. 4 లక్షలు ఇస్తోందని తెలిపారు. దానికి మ్యాచింగ్ గ్రాంటు ప్రకటించిన రాష్ట్రం కేవలం ఆంధ్రప్రదేశేనన్నారు. న్యాయవాదుల సంక్షేమ నిధి కింద రూ.25 కోట్లు ఇచ్చిందని వివరించారు. మంగళగిరిలో వైఎస్సార్‌సీపీ నిర్ణయించిన అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా న్యాయవాదులు స్పష్టం చేశారు.

26న కుప్పంలో సీఎం జగన్ పర్యటన

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ ఈ నెల 26న చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ మేరకు సీఎం ఆరోజు ఉదయం 8.15 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి రామకుప్పం మండలం రాజుపేట చేరుకుంటారు. అక్కడ కుప్పం కెనాల్‌కు నీటిని విడుదల చేస్తారు. అనంతరం శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లికి చేరుకుంటారు. అక్కడ బహిరంగసభలో ప్రసంగించిన తర్వాత సాయంత్రం తాడేపల్లి చేరుకుంటారు.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 334

శనివారం 24-2-2024



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



ఇంగ్లండ్ 'రూట్' మారింది

సిరీస్ గెలిచేందుకు భారత్, సమం చేసేందుకు ఇంగ్లండ్ జట్ల మధ్య మొదలైన నాలుగో టెస్టు తొలిరోజు ఆట ఆసక్తికరంగా సాగింది. రూట్ సెంచరీ ఇంగ్లండ్‌ను నిలబెట్టింది.

- వివరాలు 10లో



ఐఐఎస్‌సీతో నోకియా జట్టు

భారత్‌లో 6జీ టెక్నాలజీని వినియోగించుకునేందుకు గల అవకాశాలపై అధ్యయనం చేసేందుకు ఐఐఎస్‌సీతో నోకియా చేతులు కలిపింది. బెంగళూరులో ఈ పరిశోధనలు సాగనున్నాయి.

- వివరాలు 11లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అభివృద్ధికి నమూనాగా భారత్

వచ్చే ఐదేళ్లలో అభివృద్ధికి మోడల్‌గా భారత్ మారడం ఖాయమని, ఇది 'మోదీ గ్యారంటీ' అని ప్రధాని మోదీ వారణాసిలో అన్నారు.


వివరాలు 6లో ▸



అతి త్వరలోనే కేజ్రీవాల్ అరెస్ట్

మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసేందుకు సీబీఐ యత్నిస్తోందని ఆప్ నేత సౌరభ్ ఆరోపించారు.

వివరాలు 6లో ▸



నవాల్నీ కుటుంబంతో బైడెన్ భేటీ

రష్యా విపక్ష నేత దివంగత అలెక్సీ నవాల్నీ భార్య యూలియా, కుమార్తె దషాతో అమెరికా అధ్యక్షుడు బైడెన్ భేటీ అయ్యారు.

వివరాలు 6లో ▸



చంద్రుడి ఒడిలో 'ఒడిస్సియస్'

అమెరికన్ ప్రైవేట్ సంస్థ ఇంట్యూటివ్ మెషిన్స్ రూపొందించిన ఒడిస్సియస్ ల్యాండర్ చంద్రుని ఉపరితలంపై దిగింది.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

అప్పటి 'సర్వీస్' కమిషన్ కాదు 'బాసూ'

- ఇప్పుడు ఉన్నది సమర్థవంతమైన ఏపీపీఎస్సీ
- గతంలో ఏపీపీఎస్సీని అక్రమాలకు అడ్డాగా మార్చిన చంద్రబాబు
- ఎన్నారైల నుంచి పార్టీ ఫండ్ ఇప్పించిన వ్యక్తి చైర్మన్
- 2014–18 మధ్య ఇచ్చిన నోటిఫికేషన్లపై 350కి పైగా కేసులు నమోదు
- మొత్తం ఏపీపీఎస్సీని ప్రక్షాళన చేసిన సీఎం వైఎస్ జగన్

9లో



ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



అంతరాలు అంతం

మన ప్రభుత్వంలో పెత్తందారులకు కాదు.. పేదలకే పదవులు, పథకాలు: సీఎం జగన్

పేదలకో న్యాయం.. పెద్దవారికి మరో న్యాయం అనే విధానాలకు తెరదించాం

అంతరాలను తొలగిస్తూ అందరికీ విద్య, వైద్యం ఒకే రకంగా అందేలా విప్లవాత్మక నిర్ణయాలు

అక్కచెల్లెమ్మల సొంతింటి కలను నెరవేరుస్తుంటే 1,191 కేసులు వేసి చంద్రబాబు అడ్డుపడ్డారు

మనం ఎన్నికలకు సిద్ధం అంటుంటే కుప్పంలో బాబు సతీమణే బైబై బాబూ అంటున్నారు

నేను దేవుడిని, ప్రజలనే నమ్ముకున్నా.. నాకు మధ్యలో బ్రోకర్లు ఎవరూ లేరు

ఒంగోలు పరిధిలో 20,840 ఇళ్ల స్థలాల రిజిస్టర్డ్ కన్వేయన్స్ డీడ్స్ పంపిణీని ప్రారంభించిన సీఎం

2లో



సభలో ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పేదలకూ పెద్దల తరహాలోనే

"ఇళ్ల పట్టాల విషయంలో ఆ రోజు నేను అధికారులందరినీ ఒకటే అడిగా. మీకు, ఎమ్మెల్యేలకు, ఇతర ప్రముఖులకు ప్రభుత్వం ఎలా ఇస్తోందని అడిగితే దానికి వేరే పద్ధతి ఉందన్నారు. ప్రముఖులకు ఇచ్చే విధానంలో, పూర్తి హక్కులతో రాష్ట్రంలో ప్రతి నిరుపేదకూ ఇంటి పట్టాలివ్వాలని ఆదేశాలివ్వడమే కాకుండా చట్టంలో మార్పులు చేశాం. ఈరోజు అవే పూర్తి హక్కులతో పట్టాలన్నీ రిజిస్ట్రేషన్ చేసి కన్వేయన్స్ డీడ్స్ నా అక్కచెల్లెమ్మల చేతుల్లో పెడుతున్నాం."

– ముఖ్యమంత్రి వైఎస్ జగన్

పారాచూట్ నేతలతో.. టీడీపీలో భగభగలు



- ఎన్నికలకు ముందు పలు నియోజకవర్గాల్లో దిగిపోయిన బయట వ్యక్తులు
- ధన బలం, ఇతర హంగులుండడంతో వారికే చంద్రబాబు ప్రాధాన్యం
- మొదటినుంచి ఉన్నవారిని పక్కన పెట్టడంతో వారిలో తీవ్ర అసంతృప్తి
- గుడివాడలో వెనిగళ్ల రాము రాకతో మొదటి నుంచి ఉన్న 'రావి'కి చెక్
- గుంటూరులో ఎన్నారై ఉయ్యూరు శ్రీనివాస్ కోసం పార్టీ నేతలకు ఝలక్
- పార్వతీపురంలో చిరంజీవులును పక్కనపెట్టి ఎన్ఆర్ఐకి పెద్దపీట
- అన్ని జిల్లాల్లోనూ పారాచూటర్లతో స్థానిక నేతలకు ఇబ్బందులు

7లో


ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉంటాం..



ఉద్యోగులకు సంబంధించిన అంశాలను సానుకూలంగా పరిష్కరిస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ హామీ ఇచ్చారు. వెలగపూడి సచివాలయంలో శుక్రవారం ఉద్యోగ సంఘాల నాయకులతో మంత్రివర్గ ఉపసంఘం సమావేశమై పలు అంశాలపై చర్చించింది. బొత్స మాట్లాడుతూ.. ఉద్యోగులు ఆందోళనను విరమించుకోవాలని కోరగా.. వారు అంగీకరించారని తెలిపారు. ఇవ్వాల్సిన సమయంలోనే పీఆర్సీని ప్రకటిస్తామన్నారు.

5లో

515 ఆలయాలకు కొత్త ట్రస్టు బోర్డులు



- 15 రోజుల్లో కమిటీల ఏర్పాటు పూర్తికి దేవదాయ శాఖ కసరత్తు
- 5 వేల మందికి పైగా నామినేటెడ్ పదవులు దక్కే చాన్స్
- ఒక్కో ట్రస్టు బోర్డులో 7–15 మంది నియామకం.. ప్రతి ట్రస్టు బోర్డులో సగం బీసీ, ఎస్సీ, ఎస్టీలకే రిజర్వు
- జనరల్ సహా అన్ని కేటగిరీల్లో 50 శాతం పదవులు మహిళలకే

- వివరాలు 5లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఒంటరి బతుక్కు సర్కారు అండ



పుట్టుకతోనే పోలియో మహమ్మారి బారినపడి నా రెండు కాళ్లు చచ్చుపడిపోయాయి. నా తల్లిదండ్రులు చాలా కాలం క్రితమే కాలం చేశారు. నా అన్నవారు లేక విజయనగరం జిల్లా రేగిడి మండలం వన్నలి గ్రామంలో ఒంటరిగా జీవిస్తున్నా. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో నాకు ట్రై సైకిలు వచ్చింది. ఆ తర్వాత టీడీపీ అధికారంలోకి వచ్చాక మాకు ఎలాంటి లబ్ధి కలగలేదు. కనీసం పింఛన్ కూడా మంజూరు కాలేదు. ఆ సైకిల్ కాస్తా మూలకు చేరడంతో సొంతంగా కొనుగోలు చేసే శక్తి లేక ఇంటి వద్దే ఉండిపోయాను. తర్వాత ముఖ్యమంత్రిగా వచ్చిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విభిన్న ప్రతిభావంతుల బాధలను గుర్తించి ప్రత్యేకంగా సదరం క్యాంపులు నిర్వహించారు. ఉపకరణాల శిబిరాలు పెట్టగా విజయనగరం జిల్లా రాజాంలో నేను పాల్గొని నా పరిస్థితి వివరించాను. వివరాలు తీసుకున్న అధికారులు నాకు బ్యాటరీతో నడిచే ట్రై సైకిలు అందించారు. ఈ సైకిలు విలువ సుమారు రూ.50 వేలు పైబడి ఉంటుంది. ఎవరి సాయం లేకుండా నేనే బయటకు వెళ్లి ఇంటికి కావల్సిన వస్తువులు తేవడం, ఇతర పనులు చేయగలుగుతున్నా. నాకు ఈ ప్రభుత్వ హయాంలో పింఛన్ కూడా మంజూరైంది. రేషన్ బియ్యం ఇంటికే వస్తున్నాయి. వాటితోనే నా జీవనం సాగుతోంది. ఎలాంటి దిక్కులేని నాలాంటి వారికి అండగా నిలిచిన జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నటికీ మరచిపోలేను.

– సవిరిగాన దుర్గారావు, వన్నలి
(ఎస్.ప్రసాదనాయుడు, విలేకరి, రేగిడి)

నా కాళ్లపై నిలబడగలుగుతున్నా..



మా ఆయన తోపుడు బండిపై వ్యాపారం చేసేవారు. ఆయన తెచ్చిన అరకొర ఆదాయంతోనే గుట్టుగా సంసారం చేస్తుండేవాళ్లం. అనుకోకుండా ఆయన కన్ను మూయడంతో ఇద్దరు పిల్లలను ఏ విధంగా పెంచుకోవాలో అర్థం కాలేదు. మా సొంత ఊరైన కాకినాడ జిల్లా సామర్లకోట మండలం అయోధ్యరామపురంలో ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే అందుకు అవసరమైన పెట్టుబడి సమస్యగా మారింది. గత ప్రభుత్వ హయాంలో మాకు ఎలాంటి లబ్ధి కలగలేదు. కనీసం వితంతు పింఛన్ కూడా మంజూరు కాలేదు. ఈ లోగా జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వలంటీర్లు ఇంటింటా సర్వే చేసి నా భర్త చనిపోయాడని తెలుసుకొని వితంతు పింఛనుకు దరఖాస్తు చేయించారు. రెండు నెలల్లోనే పింఛను మంజూరైంది. ప్రతి నెలా పింఛను రావడంతో నా కుటుంబానికి భరోసా ఏర్పడింది. వైఎస్సార్ ఆసరా కింద నాలుగేళ్లలో రూ.పది వేలు వచ్చింది. దానికి పింఛన్ మొత్తం కలిపి చిన్న వ్యాపారం చేసుకోవాలని భావించా. నా భర్త తోపుడు బండిపై కర్రీ పాయింట్ పెట్టాను. దాంతో మా కష్టాలు చాలా వరకు తొలగిపోయాయి. ఇటీవల నా కుమార్తెకు వివాహం చేశాను. చిన్నమ్మాయికి ఇంటర్మీడియట్ వరకు ఏటా రూ.15,000 చొప్పున అమ్మ ఒడి వచ్చింది. జగనన్న లేఅవుట్‌లో ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయం చేశారు. ఇంటి నిర్మాణం పూర్తయింది. ఇంత చేసిన జగనన్న మేలు ఎలా మరచిపోగలను?

– పలివెల ఆదిలక్ష్మి, అయోధ్యరామపురం
(అడపా వెంకటరావు, విలేకరి, సామర్లకోట)

ప్రభుత్వ సాయంతో నా భర్తకు పునర్జన్మ



మేము చేనేతలం. గుంటూరు జిల్లా పాతమంగళగిరిలో చేనేత వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మాకు ముగ్గురు పిల్లలు. ఇద్దరు ఆడ పిల్లలకు పెళ్లిళ్లు చేశాం. అబ్బాయి బంగారం పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. ఆరు నెలల క్రితం మా ఆయన రామకృష్ణకు ఉన్నట్టుండి సుస్తీ చేసింది. ఆస్పత్రికి తీసుకెళ్తే గుండె ఆపరేషన్ చేయాలన్నారు. అంత డబ్బు ఎలా సమకూర్చాలో అర్థం కాక తల్లడిల్లిపోయాం. ఆ సమయంలో ఆరోగ్యశ్రీ కార్డు ఆదుకుంది. డాక్టర్లు ఉచితంగా ఆపరేషన్ చేయడంతో పాటు ఆస్పత్రిలో ఉన్నన్ని రోజులు భోజనం, మందులు ఇచ్చారు. ఇంటికి వచ్చిన తర్వాత కూడా మందులు ఉచితంగా అందజేస్తున్నారు. ప్రతి వారం వలంటీర్, ఆరోగ్య కార్యకర్తలు వచ్చి మావారి ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకుంటున్నారు. ఆరోగ్యశ్రీ పుణ్యమా అని మా ఆయనకు పునర్జన్మ లభించింది. వయసు మీదపడి ఏ పని చేయలేని పరిస్థితుల్లో ప్రభుత్వం మా ఇద్దరికీ పెన్షన్ మంజూరు చేసింది. ఇప్పుడు ఇదే మా జీవనానికి ఆధారమైంది. వైఎస్సార్ చేయూత ద్వారా ఏడాదికి రూ.18,750 చొప్పున అందింది. మా బతుకులకు భరోసా కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– జొన్నాదుల వెంకట నాగమల్లీశ్వరి, పాత మంగళగిరి
(ఐ.వి.రెడ్డి, విలేకరి, మంగళగిరి)

అడుగడుగునా టీడీపీ ఆటంకాలు..

ఒంగోలులో నిరుపేదలకు ఇళ్ల పట్టాలిచ్చి ఇళ్లు కట్టిద్దామని ప్రయత్నించినప్పుడల్లా టీడీపీ నాయకులు అడుగడుగునా అడ్డు పడుతూనే ఉన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలోనే యరజర్ల వద్ద 800 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఒకేచోట శాటిలైట్ టౌన్‌షిప్ ఏర్పాటుకు లేఅవుట్‌తో హద్దు రాళ్లు కూడా వేశాం. టీడీపీ నాయకులు ఆ భూములు మైనింగ్‌కు చెందినవని హైకోర్టులో కేసులు వేసి అడ్డుకోవడంతో ఆగిపోయింది. తరువాత రైతుల వద్ద నుంచి భూములు కొనుగోలు చేసి పట్టాలిస్తుంటే అనర్హులకు ఇస్తున్నారంటూ మళ్లీ హైకోర్టులో దావా వేశారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం, ఇళ్లు కట్టించడం టీడీపీ నాయకులకు ఏమాత్రం ఇష్టం లేదు. పేదలు సంతోషంగా, సుఖంగా ఉంటే వారికి కడుపు మంట.

– బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి

వాసన్న భరోసాతో..



గతంలో పలుదఫాలు ఇంటి పట్టా కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సమయంలో వాసన్న (ఎమ్మెల్యే బాలినేని) మా ఇంటికి ఇచ్చి సమస్యలు తెలుసుకున్నారు. నాకు ఇల్లు లేదని చెప్పడంతో భరోసా పత్రం ఇప్పించారు. నేడు పట్టా ఇస్తున్నారు. అది కూడా రిజిస్ట్రేషన్ చేసి. ఇదంతా సాధ్యమవుతుందని కలలో కూడా అనుకోలేదు. మీ చేతి చలువతో సాధ్యమైంది. మా పొదుపు సంఘానికి ఇప్పుడు రూ.20 లక్షలు ఇస్తున్నారు. నాకు రూ.2 లక్షలు రావడంతో బ్యూటీ పార్లర్ నిర్వహిస్తూ నెలకు రూ.7 వేలు దాకా సంపాదిస్తున్నా. వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగు సార్లు డబ్బులు అందాయి. మూడు సార్లు సున్నా వడ్డీ కూడా వచ్చింది. నా భర్త ఆటో డ్రైవర్. ఆయనకు వాహన మిత్ర వచ్చింది. పిల్లలను ప్రభుత్వ బడిలో మీరు ప్రవేశపెట్టిన ఇంగ్లిష్ మీడియంలో చదివించుకుంటున్నా. జగనన్న గోరుముద్దతో పుష్టికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. పట్టాతో పాటు ఇంటి నిర్మాణానికి డబ్బులిస్తున్నారు. నాలాంటి నిరుపేదలు ఎంతో మంది ఇలా లబ్ధి పొందారు.

– లలిత మౌనిక, ఒంగోలు 16వ డివిజన్ నివాసి

రాష్ట్రంలో ఎంతమందికి లబ్ధి చేకూరిందో..



ఒంటరి మహిళనైన నాకు ఇద్దరు పిల్లలున్నారు. గతంలో ఇంటి పట్టా కోసం దరఖాస్తు చేసుకోవడమే కానీ వచ్చింది లేదు. ఇప్పుడు రూ.6 లక్షల విలువైన పట్టా ఇస్తున్నారు. ఇంటి నిర్మాణం కూడా చేసి పెడతామంటున్నారు. నాకు రూ.3 వేలు పెన్షన్ ఇస్తున్నారు. పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉంటూ రూ.2 లక్షలు రుణంతో ఇంట్లో పిండిమర ఏర్పాటు చేసుకున్నా. నెలకు రూ.6 వేలు దాకా వస్తున్నాయి. నేను పేదరికం వల్ల చదువుకోలేకపోయా. మా పిల్లల్లో ఒకరికి అమ్మఒడి వస్తుండగా మరొక బాబు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన ద్వారా డిగ్రీ పూర్తి చేస్తున్నాడు. నేను విన్నాను...నేను ఉన్నాను అని నాడు మీరు భరోసా ఇస్తే ఆనందపడ్డా. నేడు నిజంగా సంతోషిస్తున్నా. ఒక్క నాలాంటి పేద మహిళకే ప్రభుత్వం ఇంత అండగా ఉంటే ఈ రాష్ట్రంలో ఎంతమందికి లబ్ధి చేకూరిందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. మళ్లీ మిమ్మల్ని సీఎంగా చేసుకుని మీ రుణం తీర్చుకుంటామన్నా.

– శివపార్వతి, ఒంగోలు 33వ డివిజన్





పలు పథకాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అంతరాలు అంతం

మన ప్రభుత్వంలో పెత్తందారులకు కాదు.. పేదలకే పదవులు, పథకాలు: సీఎం జగన్

పేదలకో న్యాయం.. పెద్దవారికి మరో న్యాయం అనే విధానాలకు తెరదించాం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: పేదలకో న్యాయం.. పెద్దవారికి మరో న్యాయం అనే విధానాన్ని సమూలంగా మారుస్తూ 58 నెలలుగా మనందరి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పేదలకు ఉచితంగా అందించిన ఇళ్ల పట్టాల నుంచి విద్య, వైద్యం, సామాజిక రంగాలలో ఇదే ఒరవడిని అనుసరిస్తూ ధనిక – పేద అంతరాలను తొలగిపోయేలా విప్లవాత్మక చర్యలు చేపట్టినట్లు గుర్తు చేశారు. నాడు – నేడుతో తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ చదువులను పేదింటి పిల్లలకు చేరువ చేయడంతోపాటు ఖరీదైన, నాణ్యమైన వైద్యాన్ని సర్కారీ ఆస్పత్రుల్లో పేదలకు ఉచితంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమం కింద లబ్ధిదారులకు సర్వ హక్కులతో రిజిస్టర్డ్ కన్వేయన్స్ డీడ్స్ పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రకాశం జిల్లా ఒంగోలులో సీఎం జగన్ లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా పది రోజుల పాటు పండుగలా కొనసాగనున్నాయి.



లబ్ధిదారుకు ఇళ్ల స్థలాల రిజిస్టర్డ్ కన్వేయన్స్ డీడ్ అందిస్తున్న సీఎం వైఎస్ జగన్

రెండు రకాల రూల్సా..?

దేశ చరిత్రలో తొలిసారిగా 31 లక్షల మందికి ఇచ్చిన డీ పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి అక్కచెల్లెమ్మల చేతుల్లో పెడుతున్న కార్యక్రమం ఈరోజు ఒంగోలు నుంచి జరుగుతోంది. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 20,840 రిజిస్టర్డ్ కన్వేయన్స్ డీడ్స్ పంపిణీ చేస్తున్నాం. పేదలందరికీ ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణం, మంచి చేయడంలో గత ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి ఎంత తేడా ఉందో అంతా గమనించాలి. పేదల బతుకులు మారి వారి బిడ్డలు గొప్పగా ఎదిగేలా 58 నెలలుగా మన ప్రతి అడుగూ పడింది. పేదలకు ఒక న్యాయం, పెద్దలకు మరో న్యాయం ఉండటానికి వీల్లేదనే సంకల్పంతో ముందుకు వెళుతున్నాం. ఐఏఎస్‌లు, ఎమ్మెల్యేలు, ఇతర పెద్దలకు ఇచ్చే ప్లాట్లకు విధించే నిబంధనలే పేదలకూ వర్తింపచేయాలనే ఉద్దేశంతో కన్వేయన్స్ డీడ్‌లతో రిజిస్ట్రేషన్ చేసి అందిస్తున్నాం. రాష్ట్రంలో రెండు రకాల నిబంధనలు ఉన్నట్లు తెలుసుకున్నప్పుడు నాకు ఆశ్చర్యం అనిపించింది. పేదలకు ఒక రకంగా, పెద్దలకు మరో రకంగా నిబంధనలు ఉండటం సరికాదు. అలాంటి విధానాలపై తిరుగుబాటు చేస్తూ విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నాం. 58 నెలల ప్రయాణంలో ప్రతి అడుగూ అలాగే వేస్తున్నాం.

చదువుల్లో అంతరాన్ని తొలగిస్తూ..

పేదలకో న్యాయం, పెద్దవారికి మరో న్యాయం అనే విధానాన్ని మార్చేయాలనే తపనతో మన అడుగులు పడ్డాయి. మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు పేద పిల్లలు గవర్నమెంట్ పాఠశాలల్లో తెలుగు మీడియంలో చదువుతుంటే డబ్బున్న వారి పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంలో చదువుతున్నారు. ఇప్పుడు కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా మన గవర్నమెంట్ స్కూళ్లలో నాడు–నేడుతో సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. ఇంగ్లిష్ మీడియంతో పాటు బైలింగ్యువల్ బుక్స్, బైజూస్ కంటెంట్, 8వ తరగతి నుంచి ట్యాబ్‌లు అందిస్తున్నాం. 6వ తరగతి నుంచి ప్రతి క్లాసు రూములో డిజిటల్ బోధన. ఐఎఫ్‌పీ ప్యానళ్లు అందుబాటులోకి తెచ్చాం. పేద పిల్లలు కాన్వెంట్ డ్రస్, షూస్ వేసుకుని చిరునవ్వుతో ప్రభుత్వ స్కూళ్లకు వెళుతున్నారు. సీబీఎస్ఈ నుంచి ఐబీ విద్యా విధానం స్థాయికి గవర్నమెంట్ బడులను తీసుకెళుతున్నాం. పెద్ద చదువులు చదివే పిల్లలకు వంద శాతం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తూ విద్యాదీవెన, వసతి దీవెనతో పాటు కేంబ్రిడ్జ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, హార్వర్డ్ లాంటి ప్రఖ్యాత వర్సిటీల నుంచి ఉచితంగా ఆన్‌లైన్‌లో కోర్సులు చదివేలా మనందరి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. డబ్బులేని వారి పిల్లలకు, డబ్బున్న వారి పిల్లలకు మధ్య చదువుల పరంగా అంతరాన్ని చెరిపేయడం అంటే ఇదీ అని చెప్పడానికి గర్వపడుతున్నా.

పేదలకు, పెద్దలకు ఒకే రకమైన వైద్యం

ధనికులకు మాత్రమే అందుబాటులో ఉండే కార్పొరేట్ వైద్యం ఇవాళ పేదలకు ఉచితంగా అందుబాటులోకి వచ్చింది. ఆరోగ్యశ్రీలో ప్రొసీజర్లు 1,000కి మాత్రమే పరిమితం చేసిన పరిస్థితి నుంచి ఇప్పుడు 3,300 ప్రొసీజర్లకు తీసుకెళ్లింది మన ప్రభుత్వమే. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షల వరకు ఉచితంగా విస్తరించింది కూడా మీ బిడ్డ ప్రభుత్వం వచ్చిన తర్వాతే. అంతేకాకుండా శస్త్ర చికిత్సల తరువాత రోగి విశ్రాంతి తీసుకునే సమయంలో నెలకు రూ.5 వేలు చేతిలో పెడుతూ ఆరోగ్య ఆసరా తెచ్చింది కూడా మీ బిడ్డ ప్రభుత్వమే. విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష ద్వారా ఉచితంగా వైద్యంతోపాటు మందులు కూడా అందుతోంది మీ బిడ్డ ముఖ్యమంత్రి అయిన తర్వాతే. నేను చెప్పే ప్రతి మాటా కూడా ఆలోచన చేయమని అడుగుతున్నా. గతానికి, ఇప్పటికి మధ్య తేడాను గమనించండి. పేదలకు, పెద్దలకు ఒకే రకమైన వైద్యం అందించడం అంటే ఇదీ.

బడుగు, బలహీన వర్గాలకు పదవులు

గతంలో పెత్తందార్ల మనుషులు మాత్రమే అనుభవించిన నామినేటెడ్ పదవులను చట్టం చేసి ఏకంగా 50 శాతం బడుగు, బలహీన వర్గాల చేతుల్లో పెట్టింది కూడా మీ బిడ్డ ముఖ్యమంత్రి అయిన తర్వాతే. సామాజిక అంతరాలను చెరిపేయడం అంటే ఇదీ. సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారత అంటే ఇదీ. పేదల ఆంధ్రప్రదేశ్ వేరు... డబ్బున్న వారి ఆంధ్రప్రదేశ్ వేరు అనే భావాలను పూర్తిగా తుడిచి వేస్తూ, పేదలకో న్యాయం – డబ్బున్న వారికో న్యాయం అనే విధానాలను రద్దు చేస్తూ మన అడుగులు పడ్డాయి.

సచివాలయాల్లో సర్టిఫైడ్ కాపీలు..

రిజిస్టర్డ్ కన్వేయన్స్ డీడ్స్ వల్ల ఆస్తిపై అక్కచెల్లెమ్మల హక్కులు భద్రంగా ఉంటాయి. దొంగ సర్టిఫికెట్లు సృష్టించేందుకు వీలుండదు. ఎప్పుడు పడితే అప్పుడు రద్దు చేయలేరు. సచివాలయాల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆస్తికి సంబంధించిన సర్టిఫైడ్ కాపీలు ఎన్నిసార్లైనా పొందవచ్చు. అందులో హక్కుదారు మీరే అన్న విషయం సచివాలయాల్లో శాశ్వతంగా, భద్రంగా ఉంటుంది. సరిహద్దు రాళ్లతో స్థలం వద్ద అక్కచెల్లెమ్మల ఫొటో తీసి జియోట్యాగింగ్ చేసి ఇస్తున్నాం కాబట్టి ఎవరూ కబ్జా చేయలేరు. పదేళ్లు కాగానే ఆ పట్టాలను అమ్ముకునేందుకు, వారసత్వంగా ఇచ్చేందుకు, గిఫ్ట్‌గా ఇచ్చేందుకు పట్టా భూములున్న వారితో సమానంగా ఆటోమేటిక్‌గా హక్కులు సంక్రమిస్తాయి. ఆ తేదీ వివరాలతో సహా స్పష్టంగా రిజిస్టర్డ్ డాక్యుమెంట్‌లో పొందుపరిచాం. ఎన్‌ఓసీ కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా ఆటోమేటిక్‌గా జరిగిపోతాయి. బ్యాంకు రుణాలు కావాలంటే సులభంగా తక్కువ వడ్డీకే అక్కచెల్లెమ్మలకు అందుతాయి. నా అక్కచెల్లెమ్మలు, పేదలకు ఇచ్చే స్థలాలు, హక్కులు, ఆత్మగౌరవం గురించి ఇంతగా ఆలోచన చేస్తున్న ప్రభుత్వాన్ని ఎప్పుడైనా చూశారా? అక్కచెల్లెమ్మలకు మంచి అన్నగా, మంచి తమ్ముడిగా ముఖ్యమంత్రి స్థానంలో వారి బిడ్డ ఉన్నాడు కాబట్టే ఇవన్నీ జరుగుతున్నాయి. గ్రామ స్వరాజ్యానికి అర్థం చెబుతున్నాం.

ఇంతకన్నా దారుణం ఉంటుందా?

ఇవన్నీ చూస్తుంటే వంద మంది సినిమా విలన్ల కంటే, పురాణాల్లో రాక్షసులందరి కంటే ఒక్క చంద్రబాబు దుర్మార్గమే ఎక్కువ అనిపిస్తుంది. చివరికి అమరావతిలో మనం పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే సామాజిక సమతుల్యం దెబ్బ తింటుందంటూ ఆ పెద్దమనిషి నిస్సిగ్గుగా కోర్టుల్లో కేసులు వేసి తన లాయర్లతో వాదించాడు. ఇంత అమానుషంగా ప్రవర్తించిన వ్యక్తి జంకు లేకుండా ప్రజల్లో తిరుగుతున్నాడంటే ఇంతకన్నా అన్యాయం ఉంటుందా? గవర్నమెంట్ బడుల్లో ఇంగ్లిష్ మీడియం వద్దని వాదిస్తే తల్లిదండ్రులంతా గట్టి గుణపాఠం చెబుతారనే భయం లేకుండా చంద్రబాబు పాపిష్టి రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తున్నారంటే ఇంతకన్నా దారుణం ఉంటుందా? ఎస్సీ కులాల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అని దారుణమైన వ్యాఖ్యలు చేసి కూడా బరితెగించి తిరుగుతున్నారంటే ఇంతకన్నా దారుణం ఉంటుందా? బీసీల తోకలు కత్తిరిస్తా.. ఖబడ్దార్! అని వ్యాఖ్యానిస్తే బీసీలంతా బుద్ధి చెబుతారన్న భయం కూడా లేకుండా ఉండగలుగుతున్నాడంటే ఇంతకన్నా దారుణం ఉంటుందా? రుణమాఫీ పేరుతో రైతులను, డ్వాక్రా మహిళలను మోసగించిన ఈ మాయలోడు ఏ జంకూ గొంకూ లేకుండా ఇప్పటికీ రాష్ట్ర రాజకీయాల్లో ఉన్నాడంటే ఇంతకన్నా దారుణం ఉందా? 650 వాగ్దానాలిచ్చి కనీసం 10 శాతం కూడా అమలు చేయకుండా ఎన్నికలొచ్చేసరికి నిస్సిగ్గుగా మళ్లీ కొత్త మేనిఫెస్టోతో సిద్ధమయ్యాడంటే ఇంతకన్నా దారుణం ఉంటుందా? మన ఖర్మ ఏమిటంటే ఇలాంటి వ్యక్తులతో ఈరోజు మనం రాజకీయాలు చేస్తున్నాం.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ, సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, మంత్రులు ఆదిమూలపు సురేష్, ధర్మాన ప్రసాదరావు, మేరుగు నాగార్జున, ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కరరెడ్డి, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్, ఐజీ రామకృష్ణ, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, సీనియర్ ఐఏఎస్ ముత్యాలరాజు, కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్, ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెంటు కూడా ఇవ్వకపోగా బాబు కుట్రలు..

2020 ఉగాది నాటికే ఈ ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి అక్కచెల్లెమ్మలకు ఇవ్వాలనుకున్నా కొందరు రాక్షసుల మాదిరిగా అవరోధాలు సృష్టించారు. అధికారంలో ఉండగా పేదవాడికి ఒక్క సెంటు స్థలం ఇచ్చిన పాపానపోని చంద్రబాబు ఇవాళ మనం ఇస్తుంటే అడ్డుపడి ఆయన మనుషుల ద్వారా ఏకంగా 1,191 కేసులు దాఖలు చేశారు. వీటిని అధిగమించి ఇవాళ ఒక్క ఒంగోలులోనే 21 వేల మంది పేదలకు సర్వ హక్కులతో ఇళ్ల పట్టాలిస్తున్నాం. ఒంగోలు అర్బన్‌లో నిరుపేదల ఇళ్ల స్థలాల కోసం యర్రజర్ల హిల్స్‌లో 866 ఎకరాలను 2020లోనే గుర్తించి 24 వేల ప్లాట్లతో లేఅవుట్లు సిద్ధం చేశాం. ఈ గొప్ప కార్యక్రమానికి అడ్డుపడి చంద్రబాబు, ఆయన మనుషులు కోర్టులో కేసు వేశారు. ఒక్క ఒంగోలే కాకుండా ఏ జిల్లాలో చూసినా చంద్రబాబు పేదలకు ఇళ్ల స్థలాలివ్వలేదు. మనం ఇస్తుంటే ఆయన అసూయ దాగటం లేదు. ఇవన్నీ దాటుకుంటూ మీ బిడ్డ అడుగులు వేశాడు. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మల్లేశ్వరపురం, ఎస్.అగ్రహారం, వెంగముక్కపాలెం, యర్రజెర్ల గ్రామాలకు చెందిన 342 మంది రైతన్నల దగ్గర నుంచి 536 ఎకరాల భూమిని సేకరించేందుకు రూ.210 కోట్లు ఖర్చు చేసి ఇళ్ల పట్టాలిచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. మరో రూ.21.33 కోట్లు లేఅవుట్ అభివృద్ధి కోసం వ్యయం చేస్తున్నాం. ఇదే ఎస్.అగ్రహారం, మల్లేశ్వరపురంలో 31 బ్లాక్స్‌లో, వెంగముక్కపాలెం, యర్రజెర్లలో మరో 32 బ్లాక్స్‌తో జగనన్న మోడల్ టౌన్‌షిప్స్‌ను పూర్తి మౌలిక వసతులతో అభివృద్ధి చేస్తున్నాం. ఎస్టీపీ ప్లాంట్, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, వాటర్ సప్లయ్ కోసం రూ.247 కోట్లు ఖర్చు చేసేలా ఆదేశాలు ఇచ్చాం. ఒంగోలుకు మంచి చేస్తూ పట్టణంలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు మరో రూ.339 కోట్లతో డ్రింకింగ్ వాటర్ స్కీమ్‌కు కూడా ఈరోజే శంకుస్థాపన చేస్తున్నాం.

బైబై బాబు అంటున్న బాబు సతీమణి

చంద్రబాబును నేను ఇవన్నీ ప్రశ్నిస్తే నన్ను సవాల్ చేస్తున్నావా? అంటాడే కానీ ఇంటింటికీ ఫలానా మంచి చేశాను అని మాత్రం చెప్పడు. గ్రామ గ్రామానికీ ఇదిగో ఈ ఈ మంచి చేశానని చెప్పలేదు. జగన్ మాదిరిగా బటన్ నొక్కి రూ.2.55 లక్షల కోట్లు పేదల ఖాతాల్లోకి జమ చేశాననే మాటలు ఈ పెద్దమనిషి నోట్లో నుంచి రావు. ఆయన చేయలేదు కాబట్టే చెప్పలేదు. ఒకవైపు ఎన్నికలకు మనమంతా సిద్ధం అంటుంటే.. మరోవైపు చంద్రబాబు భార్య మా ఆయన సిద్ధంగా లేరని అంటున్నారు. ఏకంగా కుప్పంలోనే బైబై బాబు.. అంటూ ఆయన అర్ధాంగి నోటి పంచ్ డైలాగులు వస్తున్నాయి. ఇలాంటి చంద్రబాబును రాష్ట్రంలో ప్రజలెవరూ సమర్థించడం లేదు. కుప్పంలో ఉన్న ప్రజలు కూడా సమర్థించడంలేదు. ఏపీకి రాని వారు, సొంత ఊరు ఏదంటే తెలియని వారు, రాష్ట్రంలో ఓటే లేని వారు, ఇక్కడ దోచుకున్నది పంచుకోవడానికి అలవాటైన నాన్ రెసిడెంట్ ఆంధ్రాస్ మాత్రమే చంద్రబాబును సమర్థిస్తారు. నాకు ఆయన మాదిరిగా నాన్ రెసిడెంట్ ఆంధ్రాస్, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, దత్తపుత్రుడి మద్దతు లేవు. మీ ఇంట్లో మీకు మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు మీరే తోడుగా నిలబడాలని కోరుతున్నా. నేను పైన దేవుడిని, కింద మిమ్మల్ని మాత్రమే నమ్ముకున్నా. మధ్యలో దళారులను, బ్రోకర్లను నమ్ముకోలేదు.

అడ్డంకులను అధిగమించి..

అధికారంలోకి రాగానే అందరికీ స్థలాలు ఇవ్వడానికి 71,811 ఎకరాలను సేకరించి పంపిణీ చేశాం. 17,005 లేఅవుట్లలో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు, కరెంటు, మంచినీరు, పార్కులు, కామన్ ఏరియాలు, ఇతర సదుపాయాల కోసం రూ.32 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. 22 లక్షల ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించగా 8.90 లక్షల ఇళ్లను ఇప్పటికే పూర్తి చేశాం. మిగతావి వివిధ దశల్లో వేగంగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఆ ఇంటి స్థలాల విలువ ప్రాంతాన్ని బట్టి రూ.2.5 లక్షల నుంచి రూ.15 లక్షల దాకా ఉంది. ఒంగోలులో అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన ఇంటి స్థలం విలువ గజం రూ.10 వేల పైచిలుకే ఉన్నట్లు ఇంతకు ముందే అధికారులు చెప్పారు. ఇక్కడ రెండు లేఅవుట్లలో పేదలకు ఇచ్చిన ఒక్కో స్థలం విలువే రూ.6 లక్షలు కాగా రూ.2.70 లక్షలు ఖర్చు చేసి ఇళ్లు కట్టించి ఇస్తున్నాం. రోడ్లు, డ్రెయినేజీ, కరెంటు సదుపాయాల కోసం మరో రూ.లక్ష దాకా వెచ్చిస్తున్నాం. ఇలా ఇల్లు పూర్తయ్యే సరికే ఒక్కో ఇంటి విలువ రూ.10 లక్షలు పైమాటే ఉంటుందని చెప్పడానికి సంతోషపడుతున్నా. అక్కచెల్లెమ్మలను మిలియనీర్లుగా చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అక్కచెల్లెమ్మ చేతిలో రూ.7 లక్షల నుంచి రూ.20 లక్షల దాకా విలువైన స్థిరాస్తిని పెడుతున్నాం. తద్వారా ఏకంగా రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల వరకు కేవలం ఈ ఒక్క పథకం ద్వారా నా అక్కచెల్లెమ్మల కోసం ఖర్చు చేశామని చెప్పేందుకు గర్వపడుతున్నా.

మహిళలకు ఆర్థిక సాధికారత, భద్రత

పేదింటి అక్కచెల్లెమ్మల సాధికారత కోసం వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, చేయూత, అమ్మ ఒడి, ఇళ్ల పట్టాలు, గృహ నిర్మాణాలతోపాటు దిశ యాప్, సచివాలయంలో మహిళా పోలీసుల ద్వారా అండగా నిలబడ్డాం. నా అక్కచెల్లెమ్మలకు ఆర్థిక సాధికారత, భద్రత రెండూ అందుతున్నాయి. ఇవన్నీ గతంలో లేవు. మన పథకాల ఫలితంగా మహిళా ఆర్థిక సాధికారత పెరిగింది. అంతరాలు తగ్గుతున్నాయని నేను చెప్పడం కాదు.. నిన్ననే విడుదలైన జాతీయ గణాంకాలే చెబుతున్నాయి. ఆర్థిక అంతరాలను చెరిపేయడం అంటే ఇదీ. గత 58 నెలల్లో డీబీటీతో ఏకంగా రూ.2.55 లక్షల కోట్లు నేరుగా నా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి జమ చేయగా ఇందులో 75 శాతం పైచిలుకు నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకే అందించగలిగాం.



ఒంగోలు పరిధిలోని ఇళ్ల స్థలాల లేఅవుట్

క్లుప్తంగా...

పేదల తలరాత మార్చిన ఘనత సీఎం జగన్‌దే

ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి



మాట్లాడుతున్న నారాయణస్వామి

తిరుమల: పేదల తలరాత మార్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డికే దక్కుతుందని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి స్పష్టం చేశారు. శుక్రవారం తిరుమల శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పేదల తలరాత మార్చాలనే ఆలోచనతోనే సీఎం జగన్‌ నిరంతరాయంగా వివిధ సంక్షేమ ఫలాలను నేరుగా వారికి అందజేస్తున్నారని వివరించారు. షర్మిల గురించి పెద్దగా మాట్లాడనన్నారు. అధ్యక్షురాలి పదవి మోజుతో వైఎస్సార్‌ పేరును ఎఫ్‌ఐఆర్‌లో చేర్చిన కాంగ్రెస్‌ గూటికి చేరడం హాస్యాస్పదమన్నారు. జగన్‌ను సీఎం కుర్చీ నుంచి దించేయాలని ప్రతిపక్ష పార్టీలు కంకణం కట్టుకున్నాయని, వాళ్ల ఆటలు సాగవని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ప్రజలే బుద్ధి చెప్తారని స్పష్టం చేశారు.

పచ్చ కండువా మాకొద్దు 'బాబూ'

జనం లేక వెలవెలబోతున్న టీడీపీ కార్యక్రమాలు



ఏలూరు 29వ డివిజన్‌లో ఓ మహిళకు నచ్చజెప్పి పచ్చ కండువా వేస్తున్న బడేటి చంటి

ఏలూరు రూరల్‌ : ఏలూరు నియోజకవర్గంలో టీడీపీ నాయకుల పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుక చందంలా మారింది. పార్టీలో జోష్‌ పెంచేందుకు నేతలు నానా అగచాట్లు పడుతున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి నిర్వహించే ఇంటింటి ప్రచార కార్యక్రమాలకు జనం రాకపోవడంతో జుట్టు పీక్కుంటున్నారు. నగరంలోని శాంతినగర్, పత్తేబాద, తంగెళ్లమూడి తదితర డివిజన్లలో నిర్వహించిన కార్యక్రమం జనం లేక వెలవెలబోయాయి. 29వ డివిజన్‌ తాపీమేస్త్రి కాలనీలో జరిగిన కార్యక్రమానికి ఒక్కొక్కరికి రూ.350 ఇచ్చి పలువురు మహిళలను తీసుకువచ్చారు. స్టేజీపై ఉన్న బడేటి చంటి మహిళల మెడలో పచ్చ కండువా కప్పేందుకు ప్రయత్నించగా కొందరు మహిళలు 'పచ్చ కండువా మాకొద్దు బాబూ' అంటూ తిరస్కరించారు. దీంతో కంగుతిన్న నాయకులు 'మా పార్టీ అధికారంలోకి రాగానే ఉచిత సిలిండర్లు మీకే ఇస్తాం' అంటూ నమ్మబలికారు. సిలిండర్లు మాకెందుకు..మీటింగ్‌కు వస్తే డబ్బులు ఇస్తామన్నారు.. వచ్చాం..ఇప్పుడు పార్టీలో చేరమంటారేంటని పలువురు మహిళలు తిరగబడ్డారు. దీంతో బిక్కముఖం వేసిన నాయకులు, పలు మాటలు చెప్పి మహిళలను నమ్మబలికి చంటి చేతుల మీదుగా మెడలో కండువా వేశారు.

'మార్గదర్శి' బాధితుల సంఘం ఏర్పాటు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ మోసాలపై పోరాడేందుకు 'మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ బాధితుల సంఘం' ఏర్పాటైంది. విజయవాడ కేంద్రంగా ఈ సంఘాన్ని రిజిస్టర్‌ చేయించినట్టు ఆ సంఘం అధ్యక్షుడు, న్యాయవాది ఎం.శ్రీనివాస్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ బాధితులకు న్యాయ సహాయం, ఇతర సహకారం అందించేందుకు ఈ సంఘాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. బాధితుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతామన్నారు. రామోజీరావు, మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ మోసాలకు వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడటం ద్వారా బాధితులకు న్యాయం చేయడమే తమ సంఘం ప్రధాన లక్ష్యమన్నారు. బాధితులు తమ సమస్యలను తెలిపేందుకు 9849055267 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వామపక్షాలతో కాంగ్రెస్‌ పొత్తు

- సీపీఎం, సీపీఐ నేతలతో భేటీ అనంతరం ఏపీసీసీ చీఫ్‌ షర్మిల

సాక్షి, అమరావతి : వామపక్షాలతో పొత్తు పెట్టుకుంటున్నట్లు ఏపీసీసీ చీఫ్‌ షర్మిల వెల్లడించారు. సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణలతో శుక్రవారం విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో ఆమె భేటీ అయ్యారు. అనంతరం వారితో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర హక్కుల కోసం పోరాడే కాంగ్రెస్‌ పార్టీ ఈ ప్రయాణంలో భాగంగా వామపక్షాలతో కలిసి పోరాడే అంశంపై చర్చించామని, కలిసికట్టుగా పోరాటాలు చేయాలని నిర్ణయించామని షర్మిల తెలిపారు. ఎన్నికల్లో సీట్లపై చర్చలు జరుగుతున్నాయని, పొత్తులపై త్వరలో స్పష్టత వస్తుందని చెప్పారు. 2014లో కాంగ్రెస్‌ అధికారంలో వచ్చి ఉంటే రాష్ట్రానికి పదేళ్లు ప్రత్యేక హోదా వచ్చేదన్నారు.

బాబు, పవన్‌లు మోదీకి దాసోహం

బీజేపీ మీద దుమ్మెత్తి పోసిన చంద్రబాబు ఇప్పుడు వారి చుట్టూ పొర్లు దండాలు పెడుతున్నారని శ్రీనివాసరావు విమర్శించారు. బాబు, పవన్‌లు మోదీకి దాసోహం అంటున్నారని, తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని బీజేపీ దగ్గర తాకట్టు పెట్టారని ఆరోపించారు. బీజేపీ మళ్లీ అధికారంలోకొస్తే అంబేడ్కర్‌ రాజ్యాంగాన్ని కూడా మార్చేస్తారని రామకృష్ణ ఆందోళన వ్యక్తంచేశారు.

బహిరంగ విచారణ దేనికి.!

టారిఫ్‌ ఆర్డర్, ట్రూ అప్‌ చార్జీలకు మాత్రమే బహిరంగ విచారణ

- 'సెకీ' నుంచి విద్యుత్‌ కొనుగోలుకు ఇప్పటికే అనుమతి
- టారిఫ్‌ నిర్ణయం ఏపీఈఆర్సీదే
- అవగాహన లేకుండా స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థపై తప్పుడు రాతలు
- 'ఈనాడు' రాతలపై మండిపడ్డ విద్యుత్‌ నియంత్రణ మండలి

సాక్షి, అమరావతి: వ్యవసాయానికి పగటి పూట తొమ్మిది గంటలు నిరంతరాయంగా విద్యుత్‌ అందించడానికి, రైతులకు ఉచిత విద్యుత్‌పై రానున్న 30 ఏళ్ల పాటు హక్కు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్‌ పంపిణీ సంస్థ (డిస్కం)లు కేంద్ర ప్రభుత్వానికి చెందిన సోలార్‌ ఎనర్జీ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా (సెకీ)తో ఒప్పందం కుదుర్చుకున్నాయి. యూనిట్‌ కేవలం రూ.2.49 పైసలకే 7 వేల మెగావాట్ల విద్యుత్‌ కొనుగోలుకు ఈ ఒప్పందం కుదిరింది.విద్యుత్‌ చట్టాలకు అనుగుణంగానే అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాయి. తక్కువ రేటుకే విద్యుత్‌ కొని 30 ఏళ్ల పాటు రాష్ట్రంలోని అన్నదాతలకు ఉచితంగా విద్యుత్‌ అందించే మంచి కార్యక్రమం ఈనాడుకు నచ్చలేదు. రామోజీ ఏకంగా స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఆంధ్రప్రదేశ్‌ విద్యుత్‌ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ)నే తప్పుబడుతూ ఈనాడులో కథనాలు ఇస్తున్నారు. సాక్షాత్తూ మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో జరుగుతున్న కార్యకలాపాలపైనే అడ్డగోలుగా అక్కసు వెళ్లగక్కుతున్నారు. రెండు రోజులుగా ఈనాడు పత్రికలో వస్తున్న అసత్య కథనాలను ఏపీఈఆర్సీ తీవ్రంగా పరిగణించింది. కనీస అవగాహన



సెకి ఒప్పందం.. ఎందుకంత రహస్యం?



లేకుండా, చట్టం గురించి తెలుసుకోకుండా తప్పుడు రాతలు రాయడంపై తీవ్రంగా మండిపడింది. ఈ మేరకు ఏపీఈఆర్సీ 'సాక్షి'కి శుక్రవారం వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

ఈనాడు ఆరోపణ: సెకీతో 2021లో కుదుర్చుకున్న 7 వేల మెగావాట్ల విద్యుత్‌ కొనుగోలు ఒప్పందానికి సంబంధించి విద్యుత్‌ నియంత్రణ మండలి బహిరంగ విచారణ జరపకుండా గోప్యత పాటించడం పలు అనుమానాలకు దారితీస్తోంది.

వాస్తవం: విద్యుత్‌ నియంత్రణ మండలి స్వతంత్ర ప్రతిపత్తి గల రాష్ట్ర స్థాయి అత్యున్నత సంస్థ. మండలి తీసుకునే ప్రతి నిర్ణయం అత్యంత పారదర్శకంగా, చట్టబద్ధంగా ఉంటాయి. ఇందులో ఎటువంటి అనుమానాలకు ఆస్కారం లేదు. మండలి నిర్ణయాలపై ఎలాంటి గోప్యతకు తావులేదు. బహిరంగ విచారణ విషయానికొస్తే మండలి అనుసరించే విచారణ ప్రక్రియ విద్యుత్‌ సరఫరా చట్టం, అందుకు అనుగుణంగా మండలి జారీ చేసే మార్గదర్శకాలకు లోబడి ఉంటుంది. సెక్షన్‌ 62 – 64 ప్రకారం పంపిణీ సంస్థల టారిఫ్‌ను నిర్దేశించే క్రమంలో డిస్కంలు దాఖలు చేసిన ప్రతిపాదనలను పత్రికాముఖంగా తెలియజేయాలి. ఆ ప్రతిపాదనలపై వచ్చే అన్ని అభ్యంతరాలను పరిశీలించి, మండలి వాటిపై తుది నిర్ణయం తీసుకుంటుంది. అలాగే సెకీతో ఒప్పందం కుదుర్చుకునే ముందు డిస్కంలు మండలి అనుమతి కోరాయి. ఐదో నియంత్రిత కాలం లోడ్‌ ఫోర్‌కాస్ట్‌ రిసోర్స్‌ ప్లాన్‌ ప్రకారం ఉన్న విద్యుత్‌ అవసరాల రీత్యా 7 వేల మెగావాట్ల విద్యుత్‌ అవసరం అని మండలి భావించింది. ఇందుకు సహేతుక కారణాలు తెలుపుతూ 2021 నవంబర్‌ 11న డిస్కంల విద్యుత్‌ కొనుగోలు ప్రతిపాదనలకు మండలి షరతులతో కూడిన ఆమోదం తెలిపింది. విద్యుత్‌ టారిఫ్‌ విషయానికి వస్తే సంబంధిత విద్యుత్‌ నియంత్రణ మండలి మాత్రమే టారిఫ్‌ని నిర్ధారిస్తుందని ఆ ఉత్తర్వుల్లో స్పష్టంగా చెప్పింది. 2022లో సెంట్రల్‌ ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్‌ కమిషన్‌ (సీఈఆర్సీ)లో దాఖలైన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని యూనిట్‌ రూ.2.49 పైసలుగా టారిఫ్‌ను నిర్ధారించింది. దీనికి సంబంధించి ఏపీ హైకోర్టులో అభ్యంతరదారులు పిల్‌ దాఖలు చేశారు. ఆ కేసు ప్రస్తుతం హైకోర్టులో పెండింగ్‌లో ఉంది.

ఆరోపణ: విద్యుత్‌ పంపిణీ సంస్థలు సెకీతో చేసుకున్న ఒప్పందం ఆమోదం కోసం దాఖలు చేసిన పిటిషన్‌ను మండలి వెబ్‌సైట్‌లో ఉంచలేదు.

వాస్తవం: ఈ విమర్శల్లో ఎటువంటి వాస్తవికత గాని, హేతుబద్ధత గాని లేదు. ఏదైనా ప్రతిపాదనపై విచారణ ప్రక్రియ చట్టానికి అనుగుణంగా జరుగుతుంది. వినియోగదారుల విద్యుత్‌ చార్జీల సవరణ, ట్రూఅప్‌ చార్జీలపై మాత్రమే కమిషన్‌ బహిరంగ విచారణ చేపడుతుంది. వాటికి సంబంధించిన అంశాలను మాత్రమే వెబ్‌సైట్‌లో ఉంచుతుంది. ఇతర ఏ ప్రతిపాదనలకు బహిరంగ విచారణ జరపాలని గానీ, వెబ్‌సైట్‌లో పెట్టాలని గానీ చట్టంలో నిబంధన లేదు. అందువల్ల పత్రికలో మండలిపై చేసిన ఆరోపణలు పూర్తి నిరాధారాలు. ఇటువంటి వార్తలు ప్రచురించడం ద్వారా మండలి లాంటి స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థలపై ప్రజల్లో అపోహలు కలిగించడం వ్యవస్థకు ఎంత మాత్రం మేలు చేయదు.



వివాద రహితంగా ఎన్నికల ప్రక్రియ

- పారదర్శకంగా ఓట్ల లెక్కింపు కేంద్రాలు
- పోస్టల్‌ బ్యాలెట్‌ లెక్కింపు కోసం ప్రత్యేక కౌంటర్లు
- నిష్పక్షపాతంగా ఫిర్యాదుల పరిష్కారం
- ఎస్పీలతో ప్రతి వారం ఎన్నికల అధికారుల సమీక్ష
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్‌ మీనా వెల్లడి



సాక్షి, అమరావతి: వివాదాలకు ఆస్కారం లేకుండా ఎన్నికల ప్రక్రియ కొనసాగించాలని, పారదర్శకంగా ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్‌ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలనూ పరిగణలోకి తీసుకుంటూ కౌంటింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించి ఎన్నికల సంసిద్ధతకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. మీనా మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు, ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులకు సంబంధించి అందే ఫిర్యాదుల పరిష్కారం విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని చెప్పారు. అలాగే దినపత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తాంశాలపై చర్యలు తీసుకుని, సంబంధిత వివరాలను ప్రతివారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించే సమావేశంలో వివరించాలన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చేయాల్సిన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు, శిక్షణా కార్యక్రమాల నిర్వహణ, ఓటర్లను ప్రభావితం చేసే వస్తువుల అక్రమ రవాణా నియంత్రణ అంశాలకు సంబంధించి ప్రతివారం సంబంధిత జిల్లాల ఎస్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించాలని ఎన్నికల అధికారులకు ఆయన సూచించారు. ఎలక్షన్‌ సీజర్‌ మేనేజ్‌మెంట్‌ సిస్టం యాప్‌ ఇప్పటికే సిద్ధంగా ఉందని, ఆ యాప్‌ ట్రయల్‌ రన్‌ను మార్చి మొదటి వారంలో నిర్వహిస్తామన్నారు. ఆ యాప్‌ను అధికారులు డౌన్‌లోడ్‌ చేసుకోవాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులతో పాటు ఫ్లయింగ్‌ స్క్వాడ్లు, స్టాటిక్‌ సెర్వైలెన్స్‌ టీమ్‌లు, జిల్లాస్థాయి బ్యాంకర్ల కమిటీ సభ్యులు లాగిన్‌ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోనే పోస్టల్‌ బ్యాలెట్‌ లెక్కింపు కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా ఎన్నికల అధికారులకు ఆయన సూచించారు. పోలింగ్‌ కేంద్రాల్లో కనీస వసతుల కల్పన, ఎన్నికల అధికారులు, సిబ్బంది నియామకం, శిక్షణ తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. అదనపు సీఈవోలు కోటేశ్వరరావు, హరేంధిర ప్రసాద్, జాయింట్‌ సీఈవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఈవో విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి భజన

- ర్యాలీకి వెళ్లాలని విద్యార్థులపై కళాశాల యాజమాన్యం ఒత్తిడి
- వెళ్లకుంటే ఇంటర్నల్‌ మార్కులు కట్‌ చేస్తామని బెదిరింపు
- చిత్తూరులో 'విజయం కళాశాల' యాజమాన్యం నిర్వాకం

చిత్తూరు అర్బన్‌: చిత్తూరులో ఓ ప్రైవేటు కళాశాల యాజమాన్యం పచ్చ రంగు పూసుకుంది. తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులను టీడీపీ నేత నారా భువనేశ్వరి కార్యక్రమానికి వెళ్లాలని ఒత్తిడి తీసుకొచ్చింది. ర్యాలీకి వెళ్లకపోతే ఆబ్సెంట్‌ వేస్తామని, ఇంటర్నెల్‌ మార్కులు కట్‌ చేస్తామని బెదిరింపులకు పాల్పడింది. కళాశాల యాజమాన్యం చేష్టలకు విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. కళాశాల గుర్తింపు రద్దు చేయాలని ఉన్నత విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు రంగం సిద్ధం చేశారు.

స్పందన లేకే...

చిత్తూరు నగరంలో నారా భువనేశ్వరి చేపట్టిన కార్యక్రమానికి ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. ఇలా అయితే చిత్తూరు టికెట్‌ ఆశిస్తున్న తన పరువుపోతుందని టీడీపీ నేత విజయం కళాశాల నిర్వాహకులను సంప్రదించి విద్యార్థులను పంపాలని కోరారు. అడిగిందే అదునుగా విద్యార్థుల అభిప్రాయాన్ని ఏమాత్రం పరిగణలోకి తీసుకోని కళాశాల నిర్వాహకుడు ఉన్నఫళంగా విద్యార్థులకు ఆదేశాలిచ్చేశాడు. కళాశాలలో చదువుతున్న 500 మందికి పైగా విద్యార్థులు భువనేశ్వరికి స్వాగతం పలుకుతూ రోడ్డుకిరువైపులా నిలబడాలని హుకుం జారీ చేశాడు. కొందరు విద్యార్థినిలు ఆరోగ్యం బాగోలేదని చెబుతున్నా పట్టించుకోకుండా కళాశాల నిర్వాహకుడు ఒత్తిడి చేసి రోడ్డుపై నిలబెట్టాడు. మరికొందరు విద్యార్థులు రాజకీయ కార్యక్రమాల్లో తాము వెళ్లినట్టు తమ తల్లిదండ్రులకు తెలిస్తే మందలిస్తారని చెప్పినా వినిపించుకోకుండా ర్యాలీకి వెళ్లితీరాల్సిందేనని పట్టుబట్టారు. వెళ్లని వారికి పరీక్షల్లో ఇంటర్నల్‌ మార్కులు కట్‌ చేస్తానని, ఆబ్సెంట్‌ వేస్తానని బ్లాక్‌మెయిల్‌ చేశారు. దీంతో విద్యార్థులు చేసేది లేక దాదాపు మూడు గంటల పాటు చిత్తూరు పీసీఆర్‌ కూడలిలోని రోడ్లపై నిలబడ్డారు. ఓ వైపు ఎండలు మండిపోతుంటే కళాశాల యాజమాన్యం కనీసం తాగడానికి నీళ్లు కూడా ఇవ్వలేదు.

గతంలోనూ ఇదే తీరు

విజయం విద్యా సంస్థలకు ఇలాంటి ఘటనలు కొత్తేమీకాదు. గతంలో లోకేష్‌ యువగళం



చిత్తూరులో ఎండకు తట్టుకోలేక తలపై చున్నీ వేసుకుని నిలబడ్డ విద్యార్థులు

కార్యక్రమానికి సైతం విద్యార్థులను ఒత్తిడి చేసి పంపించారు. నో డ్రగ్స్‌ పేరిట టీడీపీ నేతలు చిత్తూరులో నిర్వహించిన ర్యాలీకి కూడా టీడీపీ జెండాలు పట్టుకుని రోడ్లపై వెళ్లాల్సిందేనంటూ బ్లాక్‌మెయిల్‌ చేశారు. దీనిపై అప్పట్లో కళాశాల యాజమాన్యంపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో నిర్వాహకుడు విద్యార్థుల తల్లిదండ్రులకు క్షమాపణలు చెప్పాడు. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కావని హామీ ఇచ్చారు. ఇప్పుడు తాజాగా భువనేశ్వరి కార్యక్రమానికి విద్యార్థులను పంపడంతో తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. విద్యార్థులను బెదిరింపులకు గురిచేసి, రోడ్లపై నిలబెట్టడంపై తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కళాశాల యాజమాన్యంపై క్రిమినల్‌ కేసు నమోదుచేసి, కళాశాల గుర్తింపును రద్దు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు.

పెత్తందారీ పార్టీలను తరిమికొడతాం

1,244వ రోజు రిలే దీక్షలో బహుజన నేతల హెచ్చరిక



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

తాడికొండ: పేదల సంక్షేమాన్ని అడ్డుకుంటూ పెత్తందారుల దోపిడీ కోసం ఆరాటపడుతున్న బాబు అండ్‌కో పార్టీలను కాలగర్భంలో కలిపేస్తామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్‌ యాక్సిస్‌ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 1,244వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. అధికారం కోసం పాకులాడడమే తప్ప.. బహుజన హక్కుల సాధన కోసం పోరాటం చేయని పార్టీలకు ఎందుకు ఓట్లేసి గెలిపించాలో చెప్పాలని ప్రశ్నించారు. బహుజనులకు రాజ్యాంగబద్ధంగా అందాల్సిన ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్‌ మీడియం విద్య, రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల నిర్మాణం అడ్డుకున్న బాబు అండ్‌ కోకు ఓట్లు వేయాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు. గతంలో కమ్యూనిస్టులు పేదల కోసం పోరాటం చేసి ఇళ్ల స్థలాలు ఇప్పించేవారని.. కానీ నేడు వారు కమ్యూనిస్టులుగా మారి కేపిటలిస్టులకు సహకరిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరితోపాటు పలు ప్యాకేజీ పార్టీల నాయకులు బాబును సీఎం కుర్చీలో కూర్చోబెట్టేందుకు ఆరాటపడుతున్నారని, వారికి భంగపాటు తప్పదని హెచ్చరించారు. నాయకులు మాదిగాని గురునాథం, కొమరవల్లి కిషోర్‌ బాబు, పులి దాసు, ఈపూరి ఆదాం, కొలకలూరి లోకేశ్, కారుమూరి పుష్పరాజు, బొలిమేర శ్యామ్యూల్‌ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో 'షో' ఫ్లాప్‌

- టీడీపీలో వర్గపోరు బట్టబయలు
- భువనేశ్వరి పర్యటనలో బయటపడ్డ విభేదాలు

చిత్తూరు అర్బన్‌: చిత్తూరు తెలుగుదేశం పార్టీలో విభేదాలు మరోమారు బయటపడ్డాయి. శుక్రవారం నారా భువనేశ్వరి చిత్తూరు నగరంలోని పీసీఆర్‌ కూడలి మీదుగా మండలంలో జరిగే ఒక కార్యక్రమానికి హాజరుకావాల్సి ఉన్నారు. అయితే ఆమెను మెప్పించడానికి స్థానిక టీడీపీ నాయకుడు గురజాల జగన్‌మోహన్‌ నాయుడు కొంతమందిని పోగేసుకుని వచ్చారు. కళాశాల విద్యార్థులు, తన కార్యకర్తలను పీసీఆర్‌ కళాశాల కూడలి వద్ద ఉంచి, భువనేశ్వరిపై పూలు చల్లడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే తొలి నుంచి గురజాల రాకను వ్యతిరేకిస్తున్న టీడీపీ జిల్లా పార్టీలోని ఓ సీనియర్‌ నాయకుడు రంగంలోకి దిగి చక్రం తిప్పారు. గురజాల ఏర్పాటు చేసిన ప్రాంతం నుంచి కాకుండా భువనేశ్వరిని నగర శివారుల్లోకి కోశావాండ్లవూరు నుంచి బైపాస్‌ రోడ్డు మీదుగా చిత్తూరు మండలానికి తీసుకెళ్లారు. గంటల తరబడి రోడ్డుపై వేచివుంచిన గురజాల కార్యకర్తలు నిట్టూర్చుతూ వెనుదిరిగారు. ఆ సీనియర్‌ నేత ఉన్నంత వరకు చిత్తూరులో టీడీపీ బతికే అవకాశమేలేదంటూ గురజాల వర్గం దుమ్మెత్తిపోస్తోంది.

ఎస్‌ఆర్‌.పురంలోనూ ఇదే పరిస్థితి

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని ఎస్‌ఆర్‌.పురంలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. భువనేశ్వరి గంగమ్మగుడి వద్ద నిర్వహించిన కార్యక్రమం వద్ద తన ఫ్లెక్సీలు తప్ప మరే బ్యానర్లు ఉండటానికి వీల్లేదని టీడీపీ మండలాధ్యక్షుడు జయశంకర్‌ నాయుడు హుకుం జారీ చేశారు. ఇదేమీ పట్టించుకోకుండా టీడీపీ మెదవాడ మాజీ సర్పంచ్‌ విశ్వనాథనాయుడు, అతని కుమారుడు జ్యోతి నాయుడు పలుచోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీనిపై ఆగ్రహించిన జయశంకర్‌నాయుడు అనుచరులు విశ్వనాథనాయుడు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

పెత్తందార్ల కోసమే బాబు, పవన్‌ల తాపత్రయం

- మళ్లీ సీఎంగా జగన్‌ ప్రమాణ స్వీకారాన్ని ఆపేశక్తి ఎవరికీ లేదు
- గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



గుడ్లవల్లేరు: రాష్ట్రాన్ని సంక్షేమపరంగా, అభివృద్ధిపరంగా ఉన్నత స్థాయిలో నిలబెట్టిన సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికుడిగా నిలిచారని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో శుక్రవారం 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొడాలి నాని మాట్లాడుతూ రూ.2.57 లక్షల కోట్లను బటన్‌ నొక్కి పేదల ఖాతాల్లోకి పంపించి పేదల సీఎంగా జగన్‌ వర్ధిల్లుతున్నారని చెప్పారు. పేదలకు చెందిన ఈ డబ్బును చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు అయితే బటన్‌లు నొక్కి తమ పెత్తందార్ల ఖాతాల్లో జమ చేసేవారని చెప్పారు. పెత్తందార్ల బొజ్జలు నింపేందుకే చంద్రబాబు, పవన్‌లు తాపత్రయపడుతున్నారని కొడాలి విమర్శించారు. విశాఖను వర్తక వ్యాపార, వాణిజ్య రాజధానిగా అభివృద్ధి చేస్తే.. ఆ వచ్చే సంపదతో పేద ప్రజలకు మరింత మేలు చేయొచ్చనే దూరదృష్టి గల రాజనీతిజ్ఞతను సీఎం జగన్‌ కనబరుస్తున్నారని చెప్పారు. ప్రజలకు మేలు చేస్తే సహించలేని బాబు అండ్‌ కో మాత్రం ఇక్కడే రాజధాని ఉండాలని కోర్టులకు వెళ్లి స్టేలు తెచ్చుకుంటున్నారని మండిపడ్డారు. అటు సూర్యుడు ఇటు పొడిచినా మేలో సీఎంగా జగన్‌ ప్రమాణ స్వీకారాన్ని ఆపగలిగే శక్తి ఈ రాష్ట్రంలో ఎవరికీ లేదని కొడాలి నాని స్పష్టం చేశారు. మద్రాస్, బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్, కోల్‌కతా ఇలా ఏ రాజధాని అయినా సుమారు 150 ఎకరాల్లోనే ఉన్నాయని, చంద్రబాబు అండ్‌ కో మాత్రం 33 వేల ఎకరాలను కాజేసేందుకే రైతులకు మాయ మాటలు చెప్పి వారి భూములు సేకరించారని, ఆ తర్వాత గ్రాఫిక్స్‌ను చూపి బాబు దొంగ నాటకాలాడారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఎన్టీఆర్‌ స్టేడియం వైస్‌ చైర్మన్‌ పాలేటి చంటి, కొండలమ్మ ఆలయ మాజీ చైర్మన్‌ కనుమూరి రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ శాయన రవి తదితరులున్నారు.



టీడీపీలో బీసీలకు అన్యాయం


- కర్నూలు జిల్లా నేతల తిరుగుబాటు
- బీసీలను గుర్తించే పార్టీకే మద్దతిస్తామని స్పష్టీకరణ
- ఈ విషయంలో వైఎస్‌ జగన్‌ను చూసి నేర్చుకోవాలని చంద్రబాబుకు హితవు

ఎమ్మిగనూరు: కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీలో ముసలం పుట్టింది. బీసీల ఐక్యత పేరుతో శుక్రవారం ఎమ్మిగనూరులో టీడీపీ నాయకులు చేపట్టిన సమ్మేళనం ఇందుకు వేదికైంది. మాజీ ఎమ్మెల్యే బి.జయనాగేశ్వర రెడ్డికి వ్యతిరేకంగా బీసీ నాయకులు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిసింది. దీంతో ఆ పార్టీలో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. టీడీపీలో 40 ఏళ్లుగా



చేతులెత్తి సంఘీభావం తెలుపుతున్న బీసీ సంఘాల నేతలు

బీసీలు అణచివేతకుగురయ్యారని, ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు ఎంపీ, ఎమ్మిగనూరు, ఆలూరు అసెంబ్లీలకు బీసీ అభ్యర్థులనే ఎంపిక చేయటం హర్షణీయమని పలువురు నేతలు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. వైఎస్‌ జగన్‌ మాదిరిగానే టీడీపీ అధినేత చంద్రబాబు కూడా ఎమ్మిగనూరు అసెంబ్లీ, కర్నూలు పార్లమెంట్‌ స్థానాలను బీసీలకు కేటాయించాలని డిమాండ్‌ చేశారు. అగ్రవర్ణాలకు టికెట్లు కేటాయిస్తే బీసీ కులాలన్నీ ఏకమై తమ సత్తా చూపుతామని గోనెగండ్ల మండల నాయకుడు ప్రభాకర్‌ నాయుడు, వాల్మీకి సంఘం నాయకుడు వీజీఆర్‌ కొండయ్య హెచ్చరించారు. సేవా దృక్పథంతో ఎన్నికల్లో పోటీచేసేందుకు ముందుకు వచ్చిన మాచాని సోమనాథ్‌కు టికెట్‌ కేటాయించాలని కురువ సంఘం నాయకులు మల్లికార్జున, పెద్దనేలటూరు దస్తగిరి, వీఆర్‌పీఎస్‌ రాఘవేంద్రలు కోరారు. బీసీలకు సీట్లు కేటాయించేందుకు రాజకీయ పార్టీల్లో పోటీతత్వం నెలకొనే వాతావరణం ఏర్పడాలని, బీసీలు రాజ్యాధికారం దిశగా అడుగులు వేశాయలని ఓబీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు కిరణ్‌ పేర్కొన్నారు. బీసీల్లో ఏ కులానికి టికెట్‌ వచ్చినా 69 బీసీ కులాలు ఐక్యంగా గెలిపించాలన్నారు. 1978 తరవాత ఎమ్మిగనూరులో బీసీలకు అవకాశమే దక్కలేదని, వైఎస్‌ జగన్‌ మొదటిసారి బీసీ అభ్యర్థికి అవకాశమిచ్చారని గుర్తుచేశారు. తెలుగుదేశం అధినేత కూడా ఎమ్మిగనూరులో బీసీ అభ్యర్థినే నిలిపితే మద్దతు ఇస్తామని, లేకపోతే టీడీపీ అభ్యర్థిపై తిరుగుబాటు జెండా ఎగురవేస్తామని గడిగె లింగప్ప, రాముగౌడ్, నర్సన్న తదితరులు తేల్చిచెప్పారు. మాజీ కౌన్సిలర్‌ శివకుమార్, అడ్వకేట్‌ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు. కాగా, బీసీల ఐక్య వేదిక పేరుతో సమావేశమైన నేతలంతా కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి వర్గీయులని, వీరంతా ఇప్పటికే మాచాని సోమనాథ్‌కు మద్దతుగా టీడీపీలో ప్రచారం చేస్తున్నవారేనంటూ మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి వర్గీయులు ఎద్దేవా చేస్తున్నారు. ఏదేమైనా బీసీ కార్డుతో జయనాగేశ్వరరెడ్డికి చెక్‌ పెట్టాలని కోట్ల ఒకవైపు, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో కోట్ల గ్రూపునే లేకుండా చేయాలంటూ జయనాగేశ్వరరెడ్డి మరోవైపు ఎత్తులు వేస్తున్నారు.



ఏ విధంగానైతే సూర్యుడు ఒక్కడై ఉండీ ఈ సమస్త విశ్వాన్నీ ప్రకాశింపజేస్తాడో, అదేవిధంగా సర్వభూతాల్లోనూ అంతర్యామిగా ఉండే పరమాత్మ ఒక్కడే.

– కఠోపనిషత్తు

సాక్షి

శనివారం, 24 ఫిబ్రవరి 2024

ఉక్రెయిన్ పోరు దారెటు?!

'ఇక్కడ బతుకు దుర్భరంగా వుంది. స్వీయానుభవంలోకి రాకుండా దీన్నర్థం చేసుకోవటం పూర్తిగా అసాధ్యం' అని తన సన్నిహితుడికి రాసిన లేఖలో రష్యాలోని అతి శీతలమైన ఆర్కిటిక్ ప్రాంత కారాగారంలో ఇటీవల కన్నుమూసిన అసమ్మతివాది అలెక్సీ నవాల్నీ అన్నారట. రెండేళ్లు పూర్తయి మూడో యేట ప్రవేశించిన ఉక్రెయిన్ యుద్ధం కూడా అటువంటి పరిస్థితుల్నే సృష్టించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రారంభించిన ఈ దురాక్రమణ యుద్ధం పర్యవసానంగా అటు రష్యా సైనికులూ... ఇటు ఉక్రెయిన్ సైనికులూ, పౌరులూ కూడా చెప్పనలవికాని యాతనలు పడుతున్నారు. ఈ యుద్ధం నిరుడు రెండో ఏడాదిలో ప్రవేశించే సమయానికి ఉక్రెయిన్ పౌరుల్లో కాస్తయినా విశ్వాసం వుండేది. వచ్చే వేసవిలో రష్యా సైనికులను తరిమేయగలమని నమ్మేవారు. ఇప్పుడు అదంతా ఆవిరైంది. 2025 నాటికి మెరుగైన ఫలితాలొస్తాయని తాజాగా పాశ్చాత్య మీడియా నమ్మబలుకుతోంది. అమెరికా అండదండలతో పాశ్చాత్య దేశాలు ఉక్రెయిన్‌కు దండిగా ఆయుధాలు, ట్యాంకులు, యుద్ధ విమానాలు, క్షిపణులు అందించటంతోపాటు రష్యాపై ఆంక్షలు కూడా విధించాయి. 1945 తర్వాత యూరోప్ దేశాలన్నీ చిక్కుకున్న ఈ భారీ యుద్ధం ఎటు పోతుందో, చివరికేమవుతుందో ఎవరి అవగాహనకూ అందటం లేదు. ఈమధ్యే అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నాటో కూటమి దేశాలను హెచ్చరించారు. తమ తమ జీడీపీల్లో రక్షణకు 2 శాతంకన్నా తక్కువ వ్యయం చేసే యూరోప్ దేశాలకు తాను గద్దెనెక్కిన తర్వాత సహకరించబోనని ప్రకటించారు. పైగా యూరోప్‌ను 'మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండ'ని రష్యాకు చెబుతానన్నారు. ఆయన మళ్లీ అధ్యక్షుడు కావటం ఖాయమని దాదాపు సర్వేలన్నీ చెబుతున్నాయి.

ఈనాటికీ 18 శాతం ఉక్రెయిన్ భూభాగం రష్యా అధీనంలో వుంది. అక్కడా, ఇతరచోట్లా ఉక్రెయిన్ పౌరులు భయంతో బతుకులీడుస్తున్నారు. అంతేకాదు... రష్యా క్షిపణి దాడులు జరిగిన ప్రతిసారీ సమీప బంధువులనూ, స్నేహితులనూ కూడా అనుమాన దృక్కులతో చూసే ధోరణి మొదలైంది. కొందరు రష్యాకు అమ్ముడుపోయి క్షిపణి దాడులకు కారణమవుతున్నారన్న అభిప్రాయం అందరిలోనూ వుంది. ఇరాన్, ఉత్తర కొరియాలు రష్యాకు అవసరమైన డ్రోన్లు, క్షిపణులు అందిస్తున్నాయి. యుద్ధంలో పాల్గొనే సైనికులకు అవసరమైన సామగ్రిని తుర్కియే సరఫరా చేస్తోంది. చైనానుంచి పేలుడు పదార్థాల్లో వినియోగించే రసాయనాలు వస్తున్నాయి. 2022 ఫిబ్రవరి మొదలుకొని ఇంతవరకూ రష్యా ఆదాయాన్ని 433 బిలియన్ డాలర్ల మేర (దాదాపు రూ. 35,500 కోట్లు) గండికొట్టగలిగామని పాశ్చాత్య దేశాలు సంబరపడుతున్నా రష్యా దూకుడు తగ్గలేదు. యుద్ధరంగంలో రష్యా వినియోగిస్తున్న ఆయుధాల్లోని 95 శాతం విడిభాగాలు అమెరికా, పాశ్చాత్య దేశాల్లో తయారైనవేనన్నది కియూవ్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అధ్యయన సారాంశం. సీఐఏ డైరెక్టర్ బిల్ బర్న్స్ చెప్తున్న ప్రకారం ఇంతవరకూ 3,15,000 మంది రష్యా సైనికులు ఈ యుద్ధంలో మరణించటమో, గాయపడటమో జరిగింది. మూడింట రెండువంతుల శతఘ్నులు ధ్వంసమయ్యాయి. రక్షణ కేటాయింపులు పెంచే విధానానికి స్వస్తిచెప్పి ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని యుద్ధకాల ఆర్థిక వ్యవస్థగా (వార్ ఎకానమీ) రష్యా మార్చిందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సమర్థతగల నాయకుడనీ, యుద్ధ హీరో అని పాశ్చాత్య మీడియా కీర్తించటంవల్ల ఒరిగేదేమిటో అర్థంకాదు. గతంతో పోలిస్తే ఆయన రేటింగ్స్ పడిపోయాయన్నది వాస్తవం. ముఖ్యంగా కమాండర్ ఇన్ చీఫ్ జలూజినీని తొలగించటం, కియూవ్ నగర మేయర్‌తో విభేదాలు జెలెన్‌స్కీ ప్రతిష్ఠను దెబ్బతీశాయి. ఉక్రెయిన్‌కు మరో ఆరువేల కోట్ల డాలర్ల ఆర్థిక సాయానికి అమెరికా సెనేట్ గతవారం అంగీకారం తెలిపినా రిపబ్లికన్లకు ఆధిక్యతవున్న ప్రతినిధుల సభలో ఏమవుతుందో తెలియదు. కొత్త ఆయుధాల సరఫరాకు ఇప్పటికే రిపబ్లికన్లు బ్రేక్ వేశారు. ఉక్రెయిన్‌కు అందించదలచుకున్న సాయం విషయంలో ప్రత్యామ్నాయ మార్గాలను వెదకాలన్న సూచనలు రావటం అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు సమస్యాత్మకమే.

ఉక్రెయిన్ యుద్ధాన్ని నిలువరించి, యుద్ధ నేరాలకు మూల్యం చెల్లించేలా రష్యాపై అంతర్జాతీయ వేదికల ద్వారా ఒత్తిళ్లు పెంచటమే ఇప్పుడున్న ఏకైక మార్గం. ఈ బాధ్యతను అమెరికా, పాశ్చాత్య దేశాలు విస్మరిస్తున్నాయి. ఉక్రెయిన్‌కు ఆయుధాలందిస్తూ పోతే అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్ తదితర దేశాల ఆయుధ పరిశ్రమలకు ఆర్డర్లు పెరుగుతాయితప్ప ఒరిగేదేమీ వుండదు. ఉక్రెయిన్ గెలుపు గురించీ, రష్యాపై తీసుకునే చర్యల గురించీ ఆర్భాటంగా మాట్లాడుతున్న అమెరికా, పాశ్చాత్య దేశాలు యుద్ధం మొదలై రెండేళ్లవుతున్నా తమ దేశాల్లోని రష్యా ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవటంలో వెనకడుగేస్తున్నాయి. వివిధ ఫైనాన్షియల్ కంపెనీల్లో వున్న 30,000 కోట్ల డాలర్ల విలువైన రష్యా ఆస్తుల్ని యుద్ధం మొదలైన రోజుల్లోనే స్తంభింపజేశారు. కానీ వాటి స్వాధీన ప్రక్రియను ప్రారంభిస్తే డాలర్ల రూపంలో నిధులు డిపాజిట్ చేసే విధానానికి చాలా దేశాలు స్వస్తి చెబుతాయన్న భయం అమెరికాకు ఉంది. ఇలా తమ ఆర్థిక వ్యవస్థల గురించీ, భవిష్యత్తు గురించీ ఆచి తూచి అడుగు లేస్తున్న సంపన్న దేశాలు ఈ యుద్ధాన్ని ఆపటంపై మాత్రం దృష్టి సారించటం లేదు. ఉక్రెయిన్ పోరునూ, గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న దారుణ మారణకాండనూ ఇకనైనా నిలువరించకపోతే అన్ని దేశాలూ పెను సంక్షోభంలో కూరుకుపోతాయి. ఆ పరిస్థితి తలెత్తకుండా చూడటం అందరి కర్తవ్యం కావాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** పౌర్ణమి సా.5.10 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** మఖ రా.9.44 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ఉ.8.32 నుండి 10.16 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.25 నుండి 7.56 వరకు, **అమృతఘడియలు:** రా.7.05 నుండి 8.53 వరకు, మాఘ పౌర్ణమి.

సూర్యోదయం : 6.26
సూర్యాస్తమయం : 6.01
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సహనం, సహజీవనం బాటలో...

విశ్లేషణ



వివేక్ కాట్జూ

యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్ ఇచ్చిన 27 ఎకరాల స్థలంలో స్వామినారాయణ సంస్థ అక్కడ భారీ హిందూ దేవాలయాన్ని నిర్మించింది. ముస్లిమేతర విశ్వాసాలను బహిరంగంగా పాటించడానికి కూడా ఒకప్పుడు అనుమతి లేని ఆ దేశంలో ఇది చాలా పెద్ద మార్పు. స్పష్టంగా, బిన్ జాయెద్ ఇస్లాం శాంతి మతం మాత్రమే కాదు, అది ఇతర ఆధ్యాత్మిక అన్వేషణలను అంగీకరిస్తుందని చూపించాలనుకుంటున్నారు. దీనిపై సంప్రదాయ ఉలేమా నుండి వచ్చివుండిన వ్యతిరేకతను కూడా ఆయన అధిగమించగలిగారు. యూఏఈ పూర్తి స్థాయి సహనం, సహజీవన మంత్రిత్వ శాఖను కలిగివుంది. ముల్లా ఒమర్ తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించిన మూడు దేశాలలో యూఏఈ ఒకటనే వెలుగులో చూస్తే వారి ఈ ప్రయాణం అద్భుతమైనది.

ఫిబ్రవరి 13–14 తేదీలలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పర్యటన సందర్భంగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అబూ ధాబీలో, బోచాసన్ వాసీ అక్షర్ పురుషోత్తమ్ స్వామినారాయణ(బాప్స్) సంస్థ నిర్మించిన హిందూ దేవాలయాన్ని ప్రారంభించారు. యూఏఈ అధ్యక్షుడు, అబూ ధాబీ పాలకుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నాహ్యాన్ (ఎంబీజెడ్) ఇచ్చిన 27 ఎకరాల స్థలంలో ఈ ఆలయాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, స్వామి నారాయణ్ సంస్థ దివంగత అధినేత ప్రముఖ్ స్వామి మహారాజ్‌తో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తమ సంబంధం 'తండ్రీ కొడుకుల మాదిరిగానే ఉండేది' అని చెప్పారు. 'ప్రముఖ్ స్వామి మహారాజ్ కలను సాకారం చేయడంలో నేను సహాయపడినందుకు ఎంతో గౌరవంగా భావిస్తున్నాను' అన్నారు. ప్రముఖ్ స్వామి మహారాజ్ 1997లో యూఏఈని సందర్శించినప్పుడు అబూ ధాబీలో ఒక ఆలయాన్ని నిర్మించాలని కోరుకున్నారు.

షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ సహనం, విభిన్న విశ్వాసాల మధ్య అవగాహన, సహజీవనం వంటి ధర్మాలకు కట్టుబడి ఉన్నారు. దుబాయ్‌లోని జెబెల్ అలీ ప్రాంతంలో పెద్ద హిందూ దేవాలయం, గురుద్వారా నిర్మాణానికి అనుమతించిన దేశ ఉపాధ్యక్షుడు, దుబాయ్ పాలకుడు షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ కూడా బిన్ జాయెద్ అభిప్రాయాలను గణనీయమైన స్థాయిలో పంచుకుంటున్నారు. యూఏఈ ప్రభుత్వం పూర్తి స్థాయి సహనం, సహజీవన మంత్రిత్వ శాఖను కలిగి ఉంది. దీనికి జ్ఞానవంతుడైన షేక్ నాహ్యాన్ బిన్ ముబారక్ అల్ నాహ్యాన్ నేతృత్వం వహిస్తున్నారు.

తమ సాంప్రదాయిక సమాజంలో అబ్రహామిక్ విశ్వాసాల ప్రార్థనా స్థలాలను మాత్రమే కాకుండా ఇప్పుడు హిందూ, సిక్కు, బౌద్ధమతాల ప్రార్థనాలయాలను స్థాపించడానికి అనుమతించడంలోనూ ఈ నాయకులు మార్గదర్శకులుగా నిలిచారు. నేను 1979–82 ప్రాంతంలో అబూ ధాబీలోని భారత రాయబార కార్యాలయంలో పనిచేశాను. ఆ సమయంలో, దుబాయ్‌లో హిందువులు, సిక్కుల ఆరాధనకు సంబంధించి ఒక చిన్న స్థలం ఉండేది. అయితే, బయటి నుండి దానిని గుర్తించలేరు. హిందువులు, సిక్కులు బహిరంగంగా గుర్తించే విధంగా తమ ప్రార్థనలను, కీర్తనలను చేయకూడదనే అవగాహనతో అప్పటి దుబాయ్ పాలకుడు షేక్ రషీద్ బిన్ సయీద్ అల్ మక్తూమ్ దీనిని అనుమతించారు. ఆ రోజుల్లో, ప్రార్థనా స్థలాల నిర్మాణానికి కాదు కదా, ముస్లిమేతర విశ్వాసాలను బహిరంగంగా పాటించుకోవడానికి కూడా యూఏఈ అనుమతించడం అనేది ఊహకందని విషయం. నిజానికి, ఇప్పుడు కూడా, యూఏఈ ఉదాహరణను ఇతర అరబ్ దేశాలు పూర్తిగా అనుసరించలేదు. సౌదీ అరేబియా యువ రాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ అల్ సౌద్ మహిళల బహిరంగ కార్యకలాపాలపై ఇచ్చిన సామాజిక సడలింపులు పూర్తి భిన్నమైన కోవలోకి వస్తాయి.



యూఏఈలో నిర్మితమైన హిందూ దేవాలయం



యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్

యూఏఈ 1971 డిసెంబరులో ఏడు ఎమిరేట్లతో కలిసి ఒక దేశంగా ఆవిర్భవించింది. అవి: అబూ ధాబీ, దుబాయ్, షార్జా, రస్ అల్ ఖైమా, ఉమ్ అల్ క్వైన్, అజ్మాన్, ఫుజైరా. అప్పటివరకు బ్రిటిష్ రక్షిత ప్రాంతాలుగా ఉంటూవచ్చిన అవి ఒక సమాఖ్యను ఏర్పాటు చేసుకున్నాయి. 1962లో అబూ ధాబీలో భారీ పరిమాణంలో చమురును కను గొన్నారు. కానీ దుబాయ్‌లో తక్కువ నిల్వలు ఉండేవి. షార్జాలో ఇంకా తక్కువ. మిగతా ఎమిరేట్స్‌లో అవీ లేవు. 1970వ దశకంలో చమురు ధరల పెరుగుదల యూఏఈ రూపురేఖలను మార్చింది. అబూ ధాబీ తాను అభివృద్ధి చెందడమే కాకుండా, ఇతరులతో తన ఔదార్యాన్ని పంచుకోవడానికి సిద్ధపడింది. దీంతో భారీ నిర్మాణ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఇది భారతదేశంతో సహా అనేక దేశాల నుండి ప్రజలను తీసుకువచ్చింది. వారు వివిధ విశ్వాసాలకు చెందినవారు.

అప్పటి దుబాయ్ పాలకుడైన షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ తన ఎమిరేట్‌ను వ్యాపారం, షిప్పింగ్, ఫైనాన్స్ కోసం ఒక గొప్ప వాణిజ్య కేంద్రంగా నిర్మించడం ప్రారంభించారు. దీని కోసం, ఆయన పెద్ద సంఖ్యలో విదేశీయుల రాకను ప్రోత్సహించవలసి వచ్చింది. బిన్ రషీద్ దార్శనికతను దుబాయ్ ప్రస్తుత పాలకుడు ముందుకు తీసుకెళ్లారు. పర్యాటకాన్ని ప్రోత్సహించడం ప్రారంభించారు. పర్యాటకానికి మహిళలు, ఆహారం, పానీయాలకు సంబంధించిన పాత, కఠినమైన సామాజిక ఆచారాల సడలింపులు అవసరమయ్యాయి. అయితే, అధికారులు దుబాయ్‌లో నివసించడానికీ, పని చేయడానికీ వచ్చిన వారి రాజకీయ కార్యకలాపాలను మాత్రం అనుమతించలేదు. అబూ ధాబీ మినహా కొన్ని ఇతర ఎమిరేట్‌లు దీనిని అనుసరించాయి. ముస్లిమేతర మత కార్యకలాపాలను బహిరంగంగా వ్యక్తీకరించడాన్ని, పర్యవేక్షించడం మరొక అంశం. ఏమైనా విశ్వాసాల విషయంలో వహాబీ, సలాఫీ ఇస్లాం సిద్ధాంతాలు కచ్చితంగా అమలయ్యాయి.

ఇక్కడే యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్ సహనం, సహజీవనాలను ప్రచారం చేయడంలో చాలా ముందుకు వెళ్లిపోయారు. ఇవి ఇస్లామిక్ విశ్వాసంపై అత్యంత కఠినమైన వ్యాఖ్యానం, అభ్యాసం కోసం పట్టుబట్టే ఇబ్న్ వహాబ్ సాంప్రదాయ బోధనలకు భిన్నమైన పరాయి ఆలోచనలు. సౌదీ రాజకుటుంబం వహాబిజంతో ఒప్పందాన్ని కలిగి ఉంది. అరేబియా ద్వీపకల్పంలోని ఇతర గిరిజన పెద్దలు కూడా దానిని అనుసరించారు. ఇస్లాంకు ఇతర వ్యాఖ్యానాల చెల్లుబాటు తిరస్కరించబడింది. వాస్తవానికి, ఇతర మతాలను, ముఖ్యంగా అబ్రహామిక్ కానివాటిని అంగీకరించే ప్రశ్నే లేదు. ఇక విగ్రహారాధనకు అయితే పెద్ద వ్యతిరేకత ఉంటుంది.

స్పష్టంగా, మొహమ్మద్ బిన్ జాయెద్ ఇస్లాం శాంతికి సంబంధించిన మతం మాత్రమే కాదు, అది గౌరవప్రదమైనదనీ, ఇతర ఆధ్యాత్మిక అన్వేషణలను అంగీకరిస్తుందనీ చూపించాలనుకుంటున్నారు. అది ఉదారవాద, జ్ఞానోదయమైన విధానం. తీవ్రవాదం, హింసలను ఇస్లాం ప్రబోధిస్తుందనే అభిప్రాయాన్ని కూడా ఇది తిరస్కరించడానికి ప్రయత్నిస్తుంది. అల్ ఖైదా, ఇస్లామిక్ స్టేట్, లష్కర్ ఎ తొయ్యిబా, అఫ్గాన్ తాలిబాన్ వంటి గ్రూపులు ఆచరిస్తున్న భావజాలాలు, హింస కారణంగా చాలా ముస్లిమేతర ప్రాంతాలలో ఈ అభిప్రాయం ఏర్పడింది. 1990లలో ముల్లా ఒమర్ తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించిన మూడు దేశాలలో యూఏఈ ఒకటి. మిగిలిన రెండూ సౌదీ అరేబియా, పాకిస్తాన్. ఈ వెలుగులో చూస్తే మొహమ్మద్ బిన్ జాయెద్ పాలనలో సహనం, సహజీవనాలకు చెందిన విధానం, దాని అభ్యాసం అద్భుతమైనవి.

అబూ ధాబీలో బోచాసన్‌వాసీ అక్షర్ పురుషోత్తమ్ స్వామి నారాయణ దేవాలయం వంటి ఇస్లామేతర ప్రార్థనా స్థలాలను అనుమతించడంపై సంప్రదాయ వహాబీ ఉలేమా నుండి కచ్చితంగా వచ్చివుండిన వ్యతిరేకతను బిన్ జాయెద్ అధిగమించగలిగారు. 'వహాబీ మజబ్'లోనే మార్పు వస్తున్నదని ఇది సూచిస్తున్నదో లేదో అంచనా వేయడం తొందరపాటే అవుతుంది. బిన్ జాయెద్ నిస్సందేహంగా ఇతర దేశాల సంప్రదాయ ఉలేమాల ఆగ్రహాన్ని కూడా ఎదుర్కొంటారు. అయితే సహనం, సహజీవనం పట్ల తన నిబద్ధతను స్పష్టంగా వ్యక్తీకరించడానికి అటువంటి ఒత్తిళ్లను తట్టుకునే సామర్థ్యాన్ని ఆయన కలిగివున్నారు. కానీ అది ఎడారి గిరిజనుల స్పృహలోకి ఎంత లోతుగా ప్రవేశించిందో కాలమే చెబుతుంది.

వ్యాసకర్త, విదేశాంగ మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

గొప్ప పరిశ్రమ



మలయాళం సినిమా పరిశ్రమ అసలు ఆగడం లేదుగా! వాళ్లు వారానికి రెండు క్లాసిక్స్‌ను వదులుతున్నారు బ్రో. అన్నింటినీ చూడటానికి టైమే చాలట్లేదు. ఓ పదేళ్లు పడుతుంది. అయినా తొందరేముంది? సమీక్షలను చూస్తుంటే 2024 ఎంత సంచలనాత్మకంగా మొదలైందో!

– రాహుల్ రవీంద్రన్, నటుడు

నాయకుడికి నివాళి



మా పార్టీ సీనియర్ నాయకుడు, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, లోక్‌సభ మాజీ స్పీకర్ మనోహర్ జోషీజీ వెళ్లిపోయారని తెలియడం బాధాకరం. ఆయన కుటుంబానికి నా హృదయపూర్వక నివాళి. ఓం శాంతి.

– ప్రియాంక చతుర్వేది, రాజ్యసభ ఎంపీ

ఆంగ్లం వద్దా?



కర్ణాటకలో ఇంగ్లీష్ సైన్ బోర్డులను కాంగ్రెస్ కార్యకర్తలు పడగొడుతున్నారు. అదే బోర్డులో కన్నడ అక్షరాలున్నా వారు వదలడం లేదు. కానీ అదే కాంగ్రెస్ కార్యకర్తలు ఒక ఇటాలియన్ మహిళను మాత్రం తల్లిగా భావిస్తారు.

– రవి బాగ్రీ, వ్యాఖ్యాత

నిజంగా చేస్తుందా?



కోవిడ్‌కు వ్యతిరేకంగా ఆయుర్వేదం పనిచేసిందని భారత ప్రధాన న్యాయమూర్తి చెప్పడం అర్థరహితం. దీనికి ఏ విధమైన శాస్త్రీయ రుజువులు లేవు. దీన్ని ఉదారవాదులకు తగిలిన దెబ్బగా కొందరు ఐటీ సెల్ వాళ్లు అభివర్ణించడం ఇంకా చీదరగా ఉంది.

– అజయ్ కామత్, నేత్ర వైద్యుడు

నాకు కదా ఇవ్వాలి!



ఒకవేళ మతాన్ని రాజ్యం గుర్తిస్తున్నట్టయితే, అది నాస్తికత్వాన్ని కూడా గుర్తించాలి. ఎవరో ఆకాశంలోని ఒక ముసలాయనను నమ్మే వాళ్లకు ప్రత్యేకమైన మర్యాద ఎందుకు ఇవ్వడం? అదే హేతుబద్ధంగా, సహానుభూతితో, శాస్త్రీయ దృక్పథంతో వ్యవహరించే నాకేమో ఏమీ దక్కదా?

– హెన్రీ ఫాన్‌తోమ్, ఆర్కిటెక్ట్

వాళ్లెందుకు బాధపడాలి?



నేను యూదు వ్యతిరేకత మీద చాలాకాలం పోరాడాను. అది ఒక సామాజిక సమస్య. కానీ నాకు దీనికి జవాబు తెలియాలి: యూదులకు వ్యతిరేకంగా యూరప్, అమెరికాల్లో శతాబ్దాలుగా జరిగిన నేరాలకు పాలస్తీనియన్లు ఎందుకు మూల్యం చెల్లించాలి? నాజీల నేరాలకు వాళ్లెందుకు మూల్యం చెల్లిస్తున్నారు?

– అర్నేసా బుల్జూస్మిక్ కుస్తూరా జినోసైడ్ రీసెర్చర్

ఇక్కడికీ వచ్చారు!



ఇజ్రాయెల్ మీద అక్టోబర్ 7 నాటి హమాస్ దాడిని సెలబ్రేట్ చేసుకునేవాళ్లు స్వీడన్‌లో ఉన్నారన్న వాస్తవం తెలుస్తుండటం నాకు చాలా కష్టంగా ఉంది. నేను ఇన్నాళ్లూ ఆటవిక తీవ్రవాదుల నుంచి తప్పించుకున్నానన్న భ్రమలో ఉన్నాను. కానీ వాళ్లు నాతో స్వీడన్‌కు కూడా వచ్చారు. నేను అరబ్‌ను అయినప్పటికీ ఇజ్రాయిలీలు, యూదులకు బేషరతుగా మద్దతునిస్తాను.

– లుయీ అహ్మద్, స్వీడన్ యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

కొత్త చూపును ఇవ్వాల్సిన సందర్భం

తెలంగాణ రచయితల వేదిక (తెరవే) కార్యకలాపాలనూ, కొనసాగింపునూ విశ్లేషించాలంటే... ఈ సంస్థ తెలంగాణ ఉద్యమ కాలంలో నిర్వహించిన పాత్ర, తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన పిదప పనిచేసిన తీరు తెన్నులనూ పరిగణనలోకి తీసుకోవాలి. 2001 చివరలో తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ సృజనకారులకు ఒక వేదికగా తెరవే ప్రారంభమైంది. తెలంగాణ సాధనలో తనదైన స్పష్టమైన గొంతుతో చురుకైన పాత్ర పోషించింది. 'సోయి' సాహిత్య పత్రికను తన చేతనైన మేరకు తీసుకువచ్చింది. జిల్లా సభలు, రాష్ట్ర మహాసభలు నిర్వహించినది. ఆ క్రమంలో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ భాష, సంస్కృతులూ, సాహిత్యాన్ని చూసిన చిన్న చూపునూ, అన్యాయాలనూ అత్యంత ప్రతిభావంతంగా తెలంగాణ సమాజం దృష్టికి తీసుకుపోగలిగింది. అందులో భాగంగానే పోతన 'ఒంటి మిట్ట' వాడంటే కాదు కాదు తెలంగాణలోని బమ్మెర గ్రామానికి చెందిన వాడని, ట్యాంక్ బండ్ మీద పోతన విగ్రహం దగ్గరకు సినారెను ఆహ్వానించి నిరసన తెలిపింది. తెలుగు సాహిత్యంలోని అన్ని బాధిత వర్గాలవారికీ మద్దతుగా నిలబడింది. తెలంగాణ సాహిత్య స్పృహను వీలైనంత మేరకు పాక్షికంగానైనా రాష్ట్రంలోని అన్ని పాంతాలకూ తీసుకుపోగలిగింది.

అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత తెరవే రెండు శిబిరాలుగా విడిపోయింది. ఒకటి పాలక పక్షం వైపు నిలబడి మాట్లాడితే, అసలు సిసలైన తెరవేలో మిగతా వారు ప్రజల పక్షం వహించి తమ సృజనను కొనసాగించారు. గత ప్రభుత్వం తెలంగాణ సబ్బండ వర్ణాల ఆకాంక్షలను నెరవేర్చకపోగా కనీస ప్రజాస్వామ్య విధానాలనూ, విలువలనూ పాటించ లేదు. ఈ పరిస్థితుల్లో తెరవేతో కొనసాగిన సాహిత్యకారులు తమ తమ సృజనాత్మక ప్రక్రియల ద్వారా ప్రభుత్వ చర్యలను వ్యతిరేకించారు. ఇక మిగతావారు ప్రభుత్వంలో కొలువైన పెద్దల పట్ల అక్షరాలతో తమ స్వామి భక్తిని చాటుకున్నారు.

ప్రస్తుత పరిస్థితులలో తెలుగు సాహిత్యానికి ప్రజలే కేంద్రంగా ఒక చూపునూ, విలక్షణ రూపునూ ఇవ్వాల్సిన బరువు బాధ్యతలు తెరవేపై ఉన్నాయి. తెలంగాణ సాహిత్యంలో ఏర్పడిన ఒక ఖాళీని పూరించాల్సిన బాధ్యత కూడా ఉన్నది. వినియోగదారీ సంస్కృతి విరాజిల్లుతున్న ఈ రోజుల్లో వ్యక్తిత్వాన్ని కాపాడుకొంటూ, ఒత్తిళ్లను తట్టుకొంటూ నిలబడడం కత్తుల వంతెన మీద నడవడం లాంటిదే మరి. ఈ నేపథ్యంలో జరుగుతున్న తెరవే మహాసభలు ఎంతో ప్రాముఖ్యం సంతరించుకున్నాయి.

– శబరి (ఫిబ్రవరి 25న హైదరాబాద్‌లో తెరవే రాష్ట్ర మహాసభలు)

వైఎస్ తొలి సంతకానికి తొలి సాక్షి



ఎ. చంద్రశేఖర రెడ్డి

నిలువెత్తు నిజాయితీ, నిబద్ధత, నిపుణతకు మారు పేరుగా 32 ఏళ్ల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సేవ చేసిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జన్నత్ హుస్సేన్ మరణం అత్యంత విషాదకరం. ఆయన మృతి ఉభయ రాష్ట్రాల తెలుగు ప్రజలకూ తీరని లోటు. పరిపాలనాధికారిగా ప్రజల సమస్యలు ఆయనకు కరతలామలకం. జన చైతన్యానికీ, నాగరికతకూ, అభివృద్ధికీ ప్రజా జీవన ప్రమాణాల శీఘ్ర పురోగతికీ కేంద్రాలయిన నెల్లూరు, గుంటూరు జిల్లాలకు ఒకప్పుడు కలెక్టర్‌గా పనిచేసిన ఆయన ఆ యా జిల్లాల పరిపాలనలో తనదైన ముద్ర వేశారు. విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శిగా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిగా, వ్యవసాయ శాఖ కమిషనర్‌గా, ఎక్సైజ్ శాఖ కమిషనర్‌గా ఆయన తన అసమాన ప్రతిభను కనపర్చారు. ఎక్సైజ్ శాఖ కమిషనర్‌గా పనిచేసే రోజుల్లో జిల్లాల వారిగా మద్యం వ్యాపారాన్ని రాజకీయ మాఫీయా ఏ విధంగా ప్రభావితం చేస్తున్నదో సవివరమైన నివేదికను రూపొందించి, అప్పట్లో సంచలనం సృష్టించారు. ఆయన రూపొందించిన నివేదిక అక్షర సత్యం అనేది నేటికీ రుజువవుతున్నది. వ్యవసాయ శాఖ కమిషనర్‌గా ఉమ్మడి రాష్ట్రంలో ఎరువుల కొరత లేకుండా ఆయన రూపొందించిన వ్యూహం సత్ఫలితాలు ఇచ్చింది. 2002 – 03లో ఉమ్మడి రాష్ట్రంలో నెలకొని ఉన్న తీవ్ర దుర్భిక్షం, కరువులను కేంద్ర పరిశీలక బృందానికి అత్యంత ప్రతిభావంతంగా వివరించి కేంద్రం నుంచి ఎక్కువ నిధులు రాబట్టగలిగారు.

ఎవరికైనా జన్నత్ హుస్సేన్ పేరు స్ఫురణకు రాగానే ఆయనలోని సౌమ్యత, ముఖంలో ఉట్టిపడే సౌహార్ద్రత కళ్లల్లో మెదలుతాయి. వినయ విధేయతలకు మారు పేరు అయిన హుస్సేన్ దివంగత ముఖ్యమంత్రులు కోట్ల విజయ భాస్కర రెడ్డి, ఎన్టీ రామారావు, వైఎస్ రాజశేఖర రెడ్డి మన్నన పొందారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రి కాగానే అధికారగణం నుంచి తొలి ఎంపికగా జన్నత్ హుస్సేన్‌ను తన కార్యాలయంలో ముఖ్య కార్యదర్శిగా నియమించుకున్నారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే యావత్ రాష్ట్ర రైతులందరికీ ఉచిత విద్యుత్ వరాన్ని ప్రసాదిస్తూ జన్నత్ హుస్సేన్ రూపొందించిన ఫైల్‌పై తన తొలి సంతకాన్ని చేశారు. హుస్సేన్ ఉచిత విద్యుత్‌ను గట్టిగా సమర్థించేవారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో రైతులకు నేటికీ ఉచిత విద్యుత్ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఆనాడు ఉచిత విద్యుత్ ఫైల్‌పై వైఎస్ఆర్ తొలి సంతకం చేసే చారిత్రక సన్నివేశానికి తొలి ప్రత్యక్ష సాక్షిగా జన్నత్ హుస్సేన్ ఎప్పటికీ చరిత్ర పుటలలో మిగిలిపోతారు.



ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం చేస్తున్న వైఎస్‌తో జన్నత్ హుస్సేన్

ఆయన సీనియర్ ఐఏఎస్ అధికారిగా... చిత్తశుద్ధిగా పనిచేసే యువ ఐఏఎస్ అధికార్లను ప్రోత్సహించారు. అపోహలతో వారిని బదిలీ చేసినప్పుడు వారికి అండగా నిలిచి వారి బదిలీలను నిలిపి వేశారు. ఇంధన కార్యదర్శిగా ఆ రంగం అభివృద్ధికి పాటు పడ్డారు. పదవీ విరమణ అనంతరం ప్రధాన సమాచార కమిషనర్‌గా ప్రజలకు ఉపయోగపడే ఎన్నో తీర్పులు ఇచ్చారు. ఇలాంటి మహోన్నతమైన వ్యక్తిత్వం కల జన్నత్ హుస్సేన్‌తో నాకు దశాబ్దాల అనుబంధం ఉన్నందుకు గర్విస్తున్నాను. ఈ గొప్ప పాలనా దక్షుడికి అశ్రు నివాళి అర్పిస్తున్నాను.

వ్యాసకర్త 'బీఈఈ' మీడియా ఎడ్వైజర్, నాటి సీఎం వైఎస్ ప్రెస్ సెక్రటరీ

సామాజిక సమరసతా మూర్తి

భారతదేశ తాత్విక ఉద్యమాలలో భక్తి కవులదొక అధ్యాయం. అందులో సంత్ రవిదాస్ పాత్ర కీలకమైనది. అనేక రూపాల్లో దురాచారాలు, మూఢాచారాలు ఉన్న 14 శతాబ్దంలో జన్మించిన రవిదాస్ తన భక్తిగీతాల ద్వారా భక్తి ఉద్యమానికి తెరతీశారు. మనిషి స్వతంత్రుడై గౌరవమైన ఆలోచనలతో జీవించాలన్నారు. తలవంచి జీవించడాన్ని నిరాకరించారు.

క్రీ.శ. 1377లో కాశీ సమీపంలోని సీర్ గోవర్ధన పురం అనే గ్రామంలో, మాఘ పౌర్ణమి రోజున చర్మకార కుటుంబంలో దాస్ జన్మించారు. ఆయన ఆధ్యాత్మిక సన్యాసిగానే అంటరానివారి కోసం ఉద్యమాన్ని నడిపారు. వారి సాంఘిక విముక్తి కోసం కృషి చేశారు. లక్షలాది శూద్ర, అంటరాని కులాలకు చెందిన ప్రజలు ఆయనను అనుసరించారు. 'ఎక్కడైతే అందరికీ భోజనం లభిస్తుందో, ఎవరూ ఆకలితో నిద్రపోరో... ఎక్కడ ఎక్కువ తక్కువల అసమానతలు లేకుండా ప్రజలు జీవిస్తూ ఉంటారో... అలాంటి సమాజాన్నీ, అలాంటి పాలనా వ్యవస్థనూ' రవిదాస్ కోరుకున్నారు.



సంత్ రవిదాస్

'కులం గురించి ఎవరూ, ఎవర్నీ అడగ కూడదు. బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రుడు అందరూ మనిషి కులానికి చెందినవారే. మానవత్వమే పరమ ధర్మం' అని ఆయన బోధించారు. ఆయన భక్తి ఉద్యమంలో కుల వ్యతిరేక పోరాట దృక్పథం ఉంది. రవిదాస్ తనను తాను చమర్‌గా ప్రబోధించుకుంటూ... కులాలను దేవుడు సృష్టించ లేదనీ, వాటిని మనిషే సృష్టించాడనీ స్పష్టంగా చెప్పారు. 'మనిషి పీల్చుతున్న శ్వాస బ్రాహ్మణుడిదైనా, చండాలునిదైనా ఒక్కటే అయినప్పుడు మనుషులలో ఎక్కువ తక్కువలు ఎందుక'ని ప్రశ్నించారు. 'మనిషి కులాన్ని బట్టి ఉన్నతుడు కాలేడు. గుణంతో, పనులతో గొప్పవాడు అవుతాడు' అని చాటారు.

ఆయన తన సాహిత్యం ద్వారా ఎవరినైనా ప్రశ్నించ వచ్చనే ధైర్యాన్ని ప్రజలలో నింపారు. జాతి వైతాళికులైన అంబేడ్కర్, పూలే లాంటి వారిపై రవిదాస్ తదితర భక్తి కవుల ప్రభావం ఉంది. ఆయన ఒక వ్యక్తి కాదు, ఉద్యమం. సామాజిక సమరసత కోసం పోరాడే ప్రతి ఒక్కరికీ ఒక ఉత్తేజం.

– సాకి (నేడు మాఘ పౌర్ణమి: సంత్ రవిదాస్ జయంతి)

అప్పన్న సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి


కప్పస్తంభం వద్ద జస్టిస్ శ్రీనరసింహ దంపతులు

సింహాచలం (విశాఖ జిల్లా): శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిగంటం శ్రీనరసింహ సతీ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. తొలుత ఆయనకు అర్చకులు, అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి దంపతులు ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు అష్టోత్తరం పూజ నిర్వహించారు. పండితులు వేద ఆశీర్వచనం పలుకగా, ఆలయ ఈవో శ్రీనివాసమూర్తి స్వామివారి ప్రసాదం, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

అపజయాలను నిజాయితీతో విశ్లేషిస్తే అద్భుతాలు

శంషాబాద్: అపజయాలను నిజాయితీతో విశ్లేషిస్తేనే అద్భుత విజయాలు సాధ్యమవుతాయని రక్షణ శాఖ వైజ్ఞానిక సలహాదారు, ఏరోనాటికల్ అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ జి. సతీశ్‌రెడ్డి అన్నారు. సొసైటీ ఫర్ ఫెయిల్యూర్ అనాలసిస్ (ఎస్ఎఫ్ఏ) సంస్థ నోవాటెల్‌లో ఏర్పాటు చేసిన ఫెయిల్యూర్ ఫర్ మెటలర్జికల్ ఇండస్ట్రీ అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారతదేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురోగమిస్తున్నా, కొన్ని రకాల ముడిసరుకులను విదేశాల నుంచి ఇంకా దిగుమతి చేసుకునే పరిస్థితి ఉందన్నారు.

515 ఆలయాలకు కొత్త ట్రస్టు బోర్డులు

15 రోజుల్లో కమిటీల ఏర్పాటు పూర్తికి దేవదాయ శాఖ కసరత్తు



సాక్షి, అమరావతి : రాష్ట్రవ్యాప్తంగా 515 ఆలయాలకు కొత్త ట్రస్టు బోర్డులను నియమించాలని ప్రభుత్వం నియమించింది. పదిహేను రోజుల్లో ఈ బోర్డుల ఏర్పాటుకు దేవదాయ శాఖ కసరత్తు చేస్తోంది. దేవదాయ శాఖ పరిధిలో ఏడాదికి రూ. 5 లక్షలు, అంతకు పైబడి ఆదాయం ఉండే ఆలయాలు 1,234 వరకు ఉన్నాయి. వీటిలో 678 ఆలయాలకు ట్రస్టు బోర్డులు ఉన్నాయి. ట్రస్టు బోర్డుల పదవీ కాలం ముగిసిన ఆలయాలు 556 ఉన్నాయి. వీటిలో ట్రస్టు బోర్డుల నియామకానికి ఎలాంటి పాలన పరమైన, న్యాయపరమైన చిక్కులు లేని 515 ఆలయాలకు నూతన ట్రస్టు బోర్డులను నియమిస్తున్నారు. ట్రస్టు బోర్డులో ఆలయం స్థాయినిబట్టి 7 నుంచి 15 మంది వరకు సభ్యులు ఉంటారు. ఈ ట్రస్టు బోర్డుల నియామకం ద్వారా ఐదు వేల మందికి పైనే నామినేటెడ్ పదవులు దక్కే అవకాశం ఉంది. ఈ పదవుల్లో సగం బీసీ, ఎస్సీ, ఎస్టీలకే ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. జనరల్ సహా అన్ని కేటగిరీల్లో 50 శాతం పదవులు మహిళలకే దక్కనున్నాయి. రూ. 5 లక్షల లోపు వార్షికాదాయం ఉండే ఆలయాలకు ట్రస్టు బోర్డుల నియామకం నుంచి పూర్తిగా మినహాయించారు. ఈ ఆలయాల వంశ పారంపర్య ధర్మకర్తలు లేదంటే వంశ పారంపర్య అర్చకులు, లేదా ప్రముఖ హిందూ సంస్థలు వాటి నిర్వహణకు ముందుకొస్తే వారికే అప్పగించేలా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

ట్రస్టు బోర్డుల్లోనూ 50 శాతం రిజర్వేషన్లు అమల్లోకి తెచ్చింది సీఎం జగనే..

ఆలయ ట్రస్టు బోర్డుల్లోనూ సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ సీఎం వైఎస్ జగన్ ఇంతకు ముందే ప్రత్యేకంగా దేవదాయ శాఖ చట్టానికి సవరణలు తీసుకొచ్చారు. ప్రతి ట్రస్టు బోర్డులో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం రిజర్వేషన్లు, జనరల్ సహా ఆయా రిజర్వు కేటగిరిల్లో సగం పదవులు తప్పనిసరిగా మహిళలకే కేటాయించేలా జగన్ ప్రభుత్వం ఈ చట్టం చేసింది. దీంతో పాటు ఆలయాల కేశ ఖండన శాలల్లో నాయీ బ్రాహ్మణుల సేవలు ప్రముఖంగా ఉంటే ట్రస్టు బోర్డులోనూ ఆ వర్గం వారిని ఒక సభ్యుడిగా నియమించే వీలు కల్పించారు. అదే సమయంలో ట్రస్టు బోర్డు సభ్యుల్లో ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, అక్రమాలకు పాల్పడినా ప్రభుత్వం వారిని వారి పదవీ కాలం కంటే ముందే తొలగించేలా విస్పష్టంగా చట్టాన్ని సవరించారు. ఈ చట్ట సవరణలు అనంతరం ప్రభుత్వం నియమించిన అన్ని ఆలయ ట్రస్టు బోర్డుల్లో ఇప్పటి వరకు 4,024 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చోటు దక్కింది. 3,787 మంది మహిళలూ ఆయా ట్రస్టు బోర్డుల్లో భాగస్వాములయ్యారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆలయాల ట్రస్టు బోర్డు సభ్యుల నియామకంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు నామ మాత్రపు ప్రాధాన్యత కూడ ఉండేది కాదని అధికార వర్గాలు వివరిస్తున్నాయి.

ఆలయాల్లో వార్షికాదాయం ప్రకారం ట్రస్టు బోర్డు సభ్యుల సంఖ్య ఇలా..

ఆలయం వార్షికాదాయం	ట్రస్టు బోర్డులో సభ్యుల సంఖ్య	బోర్డును నియమించే అధికారం
రూ. 20 కోట్లకు పైబడి	15	ప్రభుత్వం
రూ. 5 కోట్లు - రూ. 20 కోట్లు	11	ప్రభుత్వం
రూ. కోటి - రూ. 5 కోట్లు	9	ప్రభుత్వం
రూ. 25 లక్షలు - రూ. కోటి	9	ధార్మిక పరిషత్
రూ. 5 లక్షలు- రూ. 25 లక్షలు	7	దేవదాయ శాఖ కమిషనర్

తిరుపతమ్మ తిరునాళ్లు ప్రారంభం



పెనుగంచిప్రోలు: ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 6.01 గంటలకు ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో అఖండజ్యోతి స్థాపన, ప్రత్యేక పూజలు అనంతరం దీక్షా స్వాముల తిరుముడి సమర్పణతో ఉత్సవాలు మొదలయ్యాయి. శ్రీస్వయంభూ శంభులింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు మర్రెబోయిన ద్వారకా దీక్షాస్వాములకు తిరుముడి కట్టారు. స్వాములు అమ్మవారిని దర్శించుకొని తిరుముడి సమర్పించి హోమగుండంలో నెయ్యిని సమర్పించారు. దీక్షా స్వాములకు మునేరు అవతల అమ్మవారి ఆలయానికి చెందిన మామిడితోటలో అన్నదానాన్ని ఈవో, చైర్మన్, పాలకవర్గ సభ్యులు, ఈఈ వైకుంఠరావు ప్రారంభించారు. తెల్లవారుజామునుంచి భక్తులు మునేరులో స్నానమాచరించి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆర్టీసీకి 1,500 కొత్త బస్సులు

- 3,200 డ్రైవర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఎండీ ద్వారకా తిరుమలరావు


పెట్రోల్ బంకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మల్లికార్జునరెడ్డి, ద్వారకా తిరుమలరావు

మదనపల్లె : ప్రయాణికులకు మరింత మెరుగైన, సురక్షితమైన సేవలు అందించేందుకు 1,500 కొత్త బస్సులను కొనుగోలు చేశామని ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జున రెడ్డి, ఎండీ సీహెచ్.ద్వారకాతిరుమలరావు తెలిపారు. వచ్చేవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా 100 బస్సులు ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను శుక్రవారం వారు ప్రారంభించారు. అనంతరం మీడియాతో వారు మాట్లాడారు. ఆర్టీసీకి టికెట్ ఆదాయంతో పాటు ప్రత్యామ్నాయ ఆదాయ వనరులుగా కార్గో, పార్శిల్ కొరియర్ సర్వీస్, కమర్షియల్ యాక్టివిటీస్ చేపడుతున్నామన్నారు. రాష్ట్ర ఇప్పటికే ఏడు పెట్రోల్ బంకులను నిర్వహిస్తున్నామని, మదనపల్లెలో 8వ బంకును ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మార్చిలో రాజంపేట, నూజివీడు, ఉయ్యూరులో పెట్రోల్ బంకులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆర్టీసీలో రిటైర్‌మెంట్స్, కొత్త ఖాళీలను దృష్టిలో పెట్టుకుని 3,200 డ్రైవర్ పోస్టుల భర్తీ నిమిత్తం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. అనుమతులు వచ్చిన వెంటనే భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉంటాం

ఉద్యోగ సంఘాలతో మంత్రివర్గ ఉపసంఘం చర్చ


ఉద్యోగ సంఘాలతో సమావేశమైన బొత్స, సజ్జల, జవహర్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి

సాక్షి, అమరావతి : ఉద్యోగులకు సంబంధించిన అంశాలను సానుకూలంగా పరిష్కరిస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ హామీ ఇచ్చారు. వెలగపూడి సచివాలయంలో శుక్రవారం ఉద్యోగ సంఘాల నాయకులతో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులైన బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, మరో ప్రభుత్వ సలహాదారు(ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖర్‌రెడ్డి సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం బొత్స మీడియాతో మాట్లాడారు. ఉద్యోగులు ఆందోళనను విరమించుకోవాలని కోరగా.. వారు అంగీకరించారని తెలిపారు. ఇవ్వాల్సిన సమయంలోనే పీఆర్సీని ప్రకటిస్తామన్నారు. మధ్యంతరం భృతి (ఐఆర్) ఇవ్వడం ప్రభుత్వ విధానం కాదని, పీఆర్సీ ఆలస్యమైతే ఐఆర్ ఇస్తారని, ఇవ్వాల్సిన సమయంలోనే పీఆర్సీ ఇస్తున్నప్పుడు ఐఆర్ గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక రెండేళ్లు కోవిడ్ ప్రభావంతో పీఆర్సీ ఆలస్యమైందని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని చెప్పారు. మార్చిలోపు ఉద్యోగులకు సంబంధించిన బకాయిలను చెల్లిస్తామన్నారు. క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌పై వచ్చిన అభ్యర్థనను సీఎం జగన్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఉద్యోగ సంఘాల నాయకులతో జరిగిన సమావేశంలో కొత్త పీఆర్సీకి సంబంధించిన ఫిట్‌మెంట్, డీఏ, జీపీఎఫ్, ఎస్ఎల్ఎస్ బిల్లుల చెల్లింపు వంటి పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో ప్రభుత్వ సర్వీసెస్ శాఖ కార్యదర్శి పోలా భాస్కర్, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగ సంఘాలతో మంత్రివర్గ ఉప సంఘం భేటీ

అలాగే, సెర్ప్ ఉద్యోగ సంఘాలతో మంత్రివర్గ ఉప సంఘం భేటీ అయింది. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం అనంతరం మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఉద్యోగ సలహాదారులు ఎస్.చంద్రశేఖరరెడ్డి, సీఎస్ జవహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో ఫైనాన్స్ మినిస్టర్ సమావేశపు హాల్లో ఈ సమావేశం నిర్వహించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సంబంధించిన క్యాడర్ ఫిక్సేషన్, పేఫిక్సేషన్ అంశాన్ని చర్చించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ గౌరవ స్పెషల్ సీఎస్ బి.రాజశేఖర్, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అడిషనల్ సీఈవో విజయకుమారి, అడ్మిన్ డైరెక్టర్ సుశీల, సెర్ప్ ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు టి.ధనంజయరెడ్డి, కె.నాగరాజు, జె.శోభన్‌బాబు ఎంఎస్ మూర్తి, అబ్దుల్ రెహమాన్, ఆదయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మేకలపై పెద్దపులి పంజా

దేవరపల్లి: తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో పెద్దపులి సంచరిస్తోంది. 2 నెలల నుంచి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 10 మండలాల ప్రజలకు పెద్దపులి కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. బుధవారం రాత్రి తాళ్లపూడి మండలం మలకపల్లి, తిరుగుమెట్ట ప్రాంతాల్లో పెద్దపులి సంచరించినట్లు పాదముద్రల ద్వారా అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఇక్కడ నుంచి పోలవరం మీదుగా పాపికొండల అభయారణ్యంలోకి వెళుతుందని అధికారులు భావించారు. అయితే పులి తన రూటు మార్చుకుంది. దేవరపల్లి మండలం బందపురం–గొల్లగూడెం రోడ్డులోని వరదలమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో ఉన్న రైతు వెలగా సత్యనారాయణ పొగాకు తోటలో పులి 400 మీటర్లు సంచరించినట్లు పాదముద్రల ద్వారా గుర్తించారు. గోపాలపురం మండలం కోమటికుంట వద్ద గల మాతగమ్మమెట్టపైన గల జీడి మామిడి తోటలో కూడా రైతులు పులి పాదముద్రలను గుర్తించారు. అక్కడ నుంచి కరగపాడు గ్రామానికి పెద్దపులి తన ప్రయాణం సాగించి రిజర్వ్‌డ్ ఫారెస్టులో ఉన్న రెండు మేకలను పీక కొరికి చంపింది. ఆ సమయంలో ఆ ప్రదేశంలో ఉన్న మేకల యజమాని బొమ్మిన బాబూరావు పులిని చూసి పారిపోయాడు.

భవిష్యత్ అంతా చిరుధాన్యాలదే..


చిరుధాన్యాలకు మద్దతు ధర ప్రకటించిన ఏకైక రాష్ట్రం ఏపీ: మంత్రి కాకాణి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి, స్పెషల్ కమిషనర్ హరికిరణ్


సాక్షి, అమరావతి: భవిష్యత్ అంతా చిరుధాన్యాలదేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా మిల్లెట్ పాలసీని తేవడమే కాదు, ఏటా మద్దతు ధర ప్రకటిస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. చిరుధాన్యాలతో విలువ జోడింపు ఉత్పత్తులు.. రుచికరమైన 100 రకాల వంటల తయారీ పుస్తకాన్ని శుక్రవారం మంత్రి తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ పేద వారి ఆహారంగా గుర్తింపు పొందిన చిరుధాన్యాల వినియోగం కోవిడ్–19 తర్వాత పెరగడంతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. ఏపీలో 1.50 లక్షల హెక్టార్లలో చిరుధాన్యాలు సాగవుతుండగా, 3.75 లక్షల టన్నుల దిగుబడులొస్తున్నాయని తెలిపారు. కొర్రలు, వరిగ, సామా, అరిక, ఊదలు, అండు కొర్రలకు క్వింటాకు రూ.2,500 చొప్పున మద్దతును కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వీటి సాగును మరింత విస్తరించేందుకు పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తున్నామన్నారు. ఎన్జీ రంగా వర్సిటీ వీసీ డాక్టర్ శారద జయలక్ష్మి, ఉపసంచాలకులు బాలూనాయక్ పాల్గొన్నారు.

ఉద్యోగుల పక్షపాతి సీఎం జగన్

టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి



తిరుపతి సిటీ/తిరుపతి(అలిపిరి): ఉద్యోగుల పాక్షపాతిగా సీఎం జగన్ సుస్థిర స్థానం సంపాదించుకున్నారని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి కొనియాడారు. శుక్రవారం తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలో ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభకు ఆయన హాజరయ్యారు. దివంగత నేత డాక్టర్ వైఎస్సార్, ఆయన తనయుడు సీఎం జగన్ పాలనలో రెండుసార్లు టీటీడీ చైర్మన్‌గా తనకు అవకాశం దొరకడం శ్రీవారి ఆశీస్సులుగా భావిస్తున్నానన్నారు. ఉద్యోగుల చిరకాలపు సొంతింటి కలను నెరవేర్చే విషయంపై సీఎం జగన్ దగ్గర చర్చించగా వెంటనే ఆయన స్పందించి 8,000 మందికి 800 ఎకరాల స్థలాన్ని కేటాయించారని గుర్తుచేశారు. ప్రపంచంలోనే ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇచ్చిన ఘనత టీటీడీకే దక్కుతుందన్నారు. వేద పండితుల ఆశీర్వాచనాలతో ఉద్యోగులు భూమనను సత్కరించారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



చంద్రుడి ఒడిలో ఒడిస్సియస్

తొలి ప్రైవేటు ల్యాండర్‌గా చరిత్ర ● 50 ఏళ్ల తర్వాత అమెరికా ముద్ర

జాబిలిపైకి ల్యాండర్ల పరంపర కొనసాగుతోంది. జపాన్ 'మూన్ స్నైపర్' ల్యాండర్ తర్వాత తాజాగా అమెరికా వంతు వచ్చింది. అర్ధ శతాబ్దం తర్వాత చంద్రుడిపై మరోమారు అగ్రరాజ్యం జెండా రెపరెపలాడింది. అమెరికాలో హ్యూస్టన్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రైవేటు సంస్థ ఇంట్యూటివ్ మెషీన్స్ రూపొందించిన ఒడిస్సియస్ (నోవా-సీ శ్రేణి) ల్యాండర్ చంద్రుని ఉపరితలంపై దక్షిణ ధ్రువం చేరువలోని 'మాలాపెర్ట్ ఎ' అనే చిన్న బిలంలో దిగ్విజయంగా దిగింది. చంద్రుని దక్షిణ ధ్రువానికి అతి సమీపంలో దిగిన వ్యోమనౌకగా చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండర్ పేరిట ఉన్న రికార్డును ఒడిస్సియస్ బద్దలు కొట్టింది. తొలుత ల్యాండర్ నేవిగేషన్ వ్యవస్థలోని లేజర్ రేంజిఫైండర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దాంతో కాస్త ఆలస్యంగా భారత కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున 4:53కు చంద్రుడిపై దిగి భూమికి సంకేతం పంపింది. ఈ మానవరహిత చంద్రయాత్రకు మిషన్ 'ఐఎం-1'గా నామకరణం చేశారు. ల్యాండర్‌కు 'ఒడీ' అని ముద్దు పేరు పెట్టుకున్నారు. అయితే ఒడిస్సియస్ ల్యాండర్ భూమికి పంపిన సంకేతం బలహీనంగా ఉండటంతో దాని భవితపై అనిశ్చితి నెలకొంది.

జీవితకాలం ఏడు రోజులే!

పూర్తిగా ఓ ప్రైవేటు కంపెనీ తయారీ, నిర్వహణలోని ల్యాండర్ చంద్రుడి ఉపరితలంపై సజావుగా దిగడం ఇదే తొలిసారి. టెలిఫోన్ బూత్ కంటే కాస్త పెద్దగా ఉన్న ఈ ల్యాండర్లో 100 కిలోల బరువైన ఐదు నాసా పేలోడ్లు, ఇతర వాణిజ్య సంస్థలకు చెందిన ఆరు పేలోడ్లున్నాయి. జాబిలిపై ఒడిస్సియస్ జీవితకాలం కేవలం ఏడు రోజులే. అది దిగిన ప్రదేశంలో మరో వారం రోజుల్లో సూర్యాస్తమయం అవుతుంది. దాంతో ల్యాండర్ పని చేయడానికి సౌరశక్తి లభించదు. అంతరిక్ష వాతావరణం చంద్రుడి ఉపరితలంతో చర్యనొందే విధానం, రేడియో ఆస్ట్రానమీ, చంద్రావరణానికి సంబంధించిన డేటాను 'నాసా' పేలోడ్స్ సేకరించనున్నాయి. అమెరికా చివరిసారి 1972లో చేపట్టిన అపోలో-17 మానవసహిత యాత్రలో వ్యోమగాములు జీన్ సెర్నాన్, హారిసన్ ష్మిట్ చంద్రుడిపై దిగారు. ఆ తర్వాత అమెరికా వ్యోమనౌక నియంత్రిత విధానంలో చంద్రుడిపై దిగడం ఇదే తొలిసారి.

చంద్రుడి సూక్ష్మ శిల్పానికి గాంధీ పేరు!

ఆరు కాళ్లపై నిలబడే ఒడిస్సియస్ ల్యాండర్ ఎత్తు 4 మీటర్లు, వెడల్పు 2 మీటర్లు. బరువు ప్రయోగ సమయంలో 1,908 కిలోలు. ఈ నెల 15న ఫ్లోరిడాలోని కేప్ కెనెవరాల్ నుంచి కెన్నెడీ అంతరిక్ష కేంద్రం వేదికగా ఎలాన్ మస్క్ సంస్థ స్పేస్ ఎక్స్‌కు చెందిన ఫాల్కన్ 9 రాకెట్ సాయంతో దీన్ని ప్రయోగించారు. భూమి నుంచి చూస్తే చంద్రుడిలో కనిపించే 62 దశలు, అంతరిక్షంలోని ఇతర ప్రాంతాల నుంచి చూస్తే అగుపించే మరో 62 దశలు, ఒక చంద్రగ్రహణం... మొత్తం చంద్రుడి 125 దశలను ప్రతిబింబించే సూక్ష్మ శిల్పాలను ఓ పెట్టెలో పెట్టి ల్యాండర్లో అమర్చడం విశేషం. వీటిని అమెరికన్ కళాకారుడు జెఫ్ కూన్స్ రూపొందించారు. ఈ బుల్లి శిల్పాలకు అరిస్టాటిల్, లియోనార్డో డావిన్సీ, గాంధీ, డేవిడ్ బొయీ, బిల్లీ హాలిడే వంటి ప్రముఖుల పేర్లు పెట్టారు.

- జమ్ముల శ్రీకాంత్

యుద్ధం @ రెండేళ్లు

ఉక్రెయిన్‌ను మరుభూమిగా మార్చిన రష్యా

అంతులేని వలసలు, మానవీయ సంక్షోభం ● ఇరువైపులా అపార ప్రాణ, ఆయుధ నష్టం

సైనికంగా సూపర్ పవరైన రష్యా చోటా దేశమైన ఉక్రెయిన్‌పై ఉన్నట్టుండి విరుచుకుపడి నేటికి రెండేళ్లు. ఉక్రెయిన్ 'సంపూర్ణంగా నిస్సైనికీకరణే' లక్ష్యంగా 2022 ఫిబ్రవరి 24న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చేపట్టిన ఈ దుందుడుకు చర్య ప్రపంచ దేశాలన్నింటినీ నిత్యం ఏదోలా ప్రభావితం చేస్తూనే వస్తోంది. రోజుల్లో ముగుస్తుందనుకున్న యుద్ధం రెండేళ్లు దాటినా కొనసాగుతూనే ఉందంటే ఉక్రెయిన్ కనబరచిన తిరుగులేని తెగువే ప్రధాన కారణం. కానీ కొన్నాళ్లుగా ఉక్రెయిన్ క్రమంగా చతికిలపడుతుండగా రష్యా దూకుడు పెంచుతోంది. అయినా లొంగేందుకు ఉక్రెయిన్ ససేమిరా అంటోంది. పైగా ఆక్రమిత భూభాగాల నుంచి వైదొలగి, తమకు కలగజేసిన అపార నష్టానికి రష్యా భారీగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో యుద్ధం ఇప్పుడప్పట్లో ముగిసే సూచనలు కన్పించడం లేదు...

యుద్ధం తొలినాళ్లలో రష్యా దూకుడు ప్రదర్శించింది. రష్యా సేనలు ఉక్రెయిన్ రాజధాని కీవ్ సమీపం దాకా దూసుకెళ్లాయి. యూరప్‌లోనే అతి పెద్దదైన జపోరిజియా అణు విద్యుత్కేంద్రాన్ని ఆక్రమించడంతో యావత్ యూరప్ ఖండం భద్రతాపరమైన ఆందోళనలతో ఉలిక్కిపడింది. కానీ ఆ జోరుకు నెల రోజుల్లోనే బ్రేకులు పడ్డాయి. ఉక్రెయిన్ దళాలు ముప్పేట దాడులతో రష్యా సైన్యాన్ని దిగ్బంధించాయి. అమెరికాతో పాటు పాశ్చాత్య దేశాల దన్నుతో పైచేయి సాధిస్తూ వచ్చాయి. వాటి తీవ్ర ఆంక్షలతో రష్యా అతలాకుతలమైంది. కానీ సెప్టెంబర్ నాటికి జపోరిజియాతో పాటు కీలకమైన డొనెట్స్క్, లుహాన్స్క్, ఖెర్సన్ ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నట్టు ప్రకటించింది. రష్యాకు చెందిన భారీ యుద్ధ నౌకలతో పాటు క్రిమియాతో రష్యాను కలిపే కీలక బ్రిడ్జిని పేల్చేయడం వంటి చర్యలతో ఉక్రెయిన్ అప్పుడప్పుడూ పైచేయి సాధిస్తూ వచ్చింది. 2023 మేలో ఏకంగా మాస్కోలో పుతిన్ అధికార నివాసమైన క్రెమ్లిన్‌పై రెండు ఉక్రెయిన్ డ్రోన్లు దూసుకెళ్లి కలవరం రేపాయి. తర్వాత నుంచీ ఉక్రెయిన్ దూకుడు నెమ్మదించసాగింది. ఉక్రెయిన్ డ్రోన్ల దాడి దెబ్బకు తొలుత అపార నష్టం చవిచూసిన రష్యా సైన్యం తానూ అదే బాట పట్టింది. కొంతకాలంగా ఇరు బలగాలూ డ్రోన్లపైనే ప్రధానంగా ఆధారపడుతున్నాయి! విదేశాల నుంచి భారీగా అందుతున్న వాటికి అదనంగా 2023లోనే ఉక్రెయిన్ ఏకంగా 3 లక్షల డ్రోన్లను తయారు చేసుకుంది! వాటిని 2024లో 10 లక్షలకు పెంచజూస్తోంది. వీటికి చిన్న తరహా మిసైళ్లు తోడవుతున్నాయి.

ఇప్పుడేంటి...!

రష్యా తాజాగా ఉక్రెయిన్‌లోని అద్వివ్‌కా నగరాన్ని ఆక్రమించింది. ఆ క్రమంలో అతి భారీగా ఆయుధ సామగ్రిని కోల్పోయింది. కాకపోతే కొన్నాళ్లుగా విపరీతంగా వచ్చిపడుతున్న చమురు అమ్మకాల లాభాలతో రెట్టించిన ఉత్సాహంతో యుద్ధాన్ని తీవ్రతరం చేస్తోంది. పైగా లక్షలాదిగా అదనపు సైనికులను సిద్ధం చేసుకుంటోంది. ఇవన్నీ ఉక్రెయిన్‌కు భారీ హెచ్చరిక సంకేతాలే. స్వీయ సాయుధ సామగ్రి నిండుకుంటుండటమే గాక ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న అమెరికా, పాశ్చాత్య దేశాల నుంచి సాయమూ బాగా తగ్గింది. ఏదేమైనా రష్యా గెలిచేదాకానో, పుతిన్ అధికారంలో ఉన్నంత వరకో యుద్ధం కొనసాగుతుందని భావిస్తున్నారు. ఈ పోరులో ఉక్రెయిన్ మాత్రం ఇప్పటికే బహుశా ఇంకెప్పటికీ కోలుకోలేనంతగా దెబ్బ తిన్నది.

- సాక్షి, నేషనల్ డెస్క్



అపార నష్టం...

- యుద్ధంలో మరణించిన, క్షతగాత్రులైన రష్యా, ఉక్రెయిన్ సైనికుల సంఖ్య ఏకంగా 5 లక్షలు దాటినట్టు అంచనా.
- 12,000 మందికి పైగా అమాయక ఉక్రేనియన్లు యుద్ధానికి బలయ్యారు. 20,000 పై చిలుకు మంది క్షతగాత్రులయ్యారు.
- కోటి మంది దాకా ఉక్రేనియన్లు నిర్వాసితులయ్యారు. వీరిలో 60 లక్షలకు పైగా విదేశాలకు వలస బాట పట్టారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఇదే అతి పెద్ద వలసగా నిలిచింది.
- అమెరికా, పాశ్చాత్య దేశాలు ఉక్రెయిన్‌కు ఇప్పటికే బిలియన్ల కొద్దీ ఆర్థిక సాయం, అంతకు మించి అత్యాధునిక ఆయుధ సాయం చేస్తూ వస్తున్నాయి.
- ఐఎంఎఫ్ కూడా 15.6 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం అందజేసింది. యుద్ధంలో ఉన్న ఓ దేశానికి ఆర్థిక సాయం ఐఎంఎఫ్ చరిత్రలోనే తొలిసారి.
- రెండేళ్ల యుద్ధంలో 20 శాతం ఉక్రెయిన్ భూభాగాన్ని మాత్రమే రష్యా ఆక్రమించగలిగింది. అందులోనూ సగం తిరిగి తమ వశమైనట్టు ఉక్రెయిన్ చెబుతోంది.

ఐదేళ్లలో అభివృద్ధికి నమూనాగా భారత్

వారణాసి పర్యటనలో మోదీ

- రూ.13,000 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన

వారణాసి: భారత్ వచ్చే ఐదేళ్లలో అభివృద్ధికి నమూనా(మోడల్)గా మారడం ఖాయమని, ఇది 'మోదీ గ్యారంటీ' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఆయన గురువారం రాత్రి ఉత్తరప్రదేశ్‌లోని తన సొంత నియోజకవర్గం వారణాసికి చేరుకున్నారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బనారస్ హిందూ యూనివర్సిటీలో 'సంసద్ సంస్కృత్ ప్రతియోగితా' అవార్డుల ప్రదానోత్సవంలో ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా వారసత్వం, అభివృద్ధికి కాశీ నగరం ఒక మోడల్‌గా కనిపిస్తోందని, సంస్కృతి, సంప్రదాయం చుట్టూ ఆధునిక అభివృద్ధిని ప్రపంచం వీక్షిస్తోందని అన్నారు. వచ్చే ఐదేళ్లలో మన దేశం అభివృద్ధికి మోడల్‌గా మారుతుందని చెప్పారు. భారతీయ సుసంపన్న ప్రాచీన వారసత్వం గురించి ప్రపంచమంతటా చర్చించుకుంటున్నారని తెలిపారు. కాశీ సంసద్ జ్ఞాన్ ప్రతియోగితా, కాశీ సంసద్ ఫొటోగ్రఫీ ప్రతియోగితా, కాశీ సంసద్ సంస్కృత్ ప్రతియోగితా అవార్డులను నరేంద్ర మోదీ విజేతలకు అందజేశారు. అనంతరం రూ.13,000 కోట్లకుపైగా విలువైన ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేశారు. బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. తాను గత పదేళ్లుగా ఇక్కడి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నానని, వారణాసి తనను బనారసిగా మార్చిందని అన్నారు. వారణాసి యువతను కొందరు కాంగ్రెస్ నేతలు నషేరీ(మత్తులో మునిగిపోయినవారు) అని దూషిస్తున్నారని పరోక్షంగా రాహుల్ గాంధీపై మోదీ మండిపడ్డారు. నిజంగా స్పృహలో ఉన్నవారు అలా మాట్లాడరని చెప్పారు. గత 20 ఏళ్ల పాటు తనను తిట్టారని, ఇప్పుడు యువతపై ఆక్రోశం ప్రదర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. అయోధ్య, కాశీని అభివృద్ధి చేయడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదన్నారు. అయోధ్యలో రామాలయ ప్రాణప్రతిష్ఠ జరిగినప్పుడు వారు ఏం మాట్లాడారో గుర్తుచేసుకోవాలని ప్రజలను కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ గురువారం అర్ధరాత్రి వారణాసి రోడ్లపై నడుస్తూ తనిఖీ చేశారు.

ప్రజలను విపక్షాలు కులాల పేరిట రెచ్చగొడుతున్నాయ్

విపక్ష 'ఇండియా' కూటమిపై ప్రధాని మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. విపక్షాలు కులాల పేరిట ప్రజలను రెచ్చగొడుతున్నాయని, గొడవలు సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. దళితులు, గిరిజనులు ఉన్నత పదవులు చేపడితే విపక్ష నాయకులు సహించలేకపోతున్నారని ఆరోపించారు. రాష్ట్రపతి పదవికి గిరిజన మహిళ ద్రౌపది ముర్మును తాము పోటీకి దింపితే ప్రతిపక్షాలు మద్దతు ఇవ్వలేదని, ఆమెను ఓడించేందుకు ప్రయత్నించాయని గుర్తుచేశారు. దళితులు, అణగారిన వర్గాల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను విపక్షాలు వ్యతిరేకించాయని చెప్పారు. వారణాసిలో శుక్రవారం సంత్ రవిదాస్ 647వ జయంతి వేడుకల్లో మోదీ మాట్లాడారు. ప్రతి శకంలో యోగులు ప్రజలకు దారి చూపారని, తప్పుడు మార్గంలో నడవకుండా అప్రమత్తం చేశారని చెప్పారు. కులం పేరిట ఎవరైనా వివక్ష చూపితే అది మానవత్వంపై చేసిన దాడి అవుతుందని పేర్కొన్నారు.



శుక్రవారం వారణాసిలో బహిరంగ సభ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ



నవాల్నీ కూతురు దషా, భార్య యూలియాతో భేటీ అయిన బైడెన్

రష్యాపై భారీ ఆంక్షలు

అమెరికా, ఈయూ వెల్లడి

వాషింగ్టన్: ఉక్రెయిన్‌పై యుద్ధానికి తెగబడ్డ రష్యా మీద అమెరికా, యూరోపియన్ యూనియన్ శుక్రవారం మరిన్ని ఆంక్షలకు తెర తీశాయి. ఈసారి కూడా ప్రధానంగా ఆ దేశ ఆర్థిక, రక్షణ, పారిశ్రామిక నెట్‌వర్కులను లక్ష్యం చేసుకున్నాయి. రష్యా, దాని సన్నిహితులపై ఏకంగా 500పై చిలుకు ఆంక్షలు విధిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు! మతిలేని హత్యాకాండకు, వినాశనానికి పుతిన్ మూల్యం చెల్లించి తీరాల్సిందేనని స్పష్టం చేశారు. మరోవైపు భారీ ఆయుధాల తయారీ తదితరాలకు ఉపయోగపడే నిషేధిత వస్తువులను రష్యాకు ఎగుమతి చేసిన ఆరోపణలపై పలు విదేశీ కంపెనీలపై కఠిన ఆంక్షలు విధిస్తున్నట్టు ఈయూ సమాఖ్య ప్రకటించింది.

నవాల్నీ కుటుంబంతో బైడెన్ భేటీ: అంతకుముందు రష్యా విపక్ష నేత దివంగత అలెక్సీ నవాల్నీ భార్య యూలియా నవాల్నయా, కూతురు దషాతో బైడెన్ భేటీ అయ్యారు. నవాల్నీ మృతి పట్ల దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ''నవాల్నీ సాటిలేని ధైర్యశాలి. ఆయన పోరాటాన్ని యూలియా, దషా ముందుకు తీసుకెళ్తారని పూర్తి విశ్వాసముంది'' అన్నారు. నవాల్నీ మృతదేహానికి గోప్యంగా తక్షణ అంత్యక్రియలు జరిపేందుకు అంగీకరించేలా జైలు అధికారులు తనపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని తల్లి లుడ్మిలా ఆరోపించారు. ఆలస్యమైతే శవం కుళ్లిపోతుందంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. గురువారం కుమారుని మృతదేహాన్ని చూసిన అనంతరం ఆమె ఈ మేరకు వీడియో విడుదల చేశారు.

నేనేం మలాలాను కాను...

మా దేశంలో సంతోషంగా ఉన్నా

కశ్మీర్‌లో అణచివేత లేదన్న కశ్మీరీ యువతి

లండన్: ఉగ్రవాదానికి భయపడి మలాలా యూసఫ్‌జాయ్ మాదిరిగా బ్రిటన్‌కు మకాం మార్చాల్సిన అగత్యం తమకు లేదని కశ్మీర్‌కు చెందిన హక్కుల కార్యకర్త, పాత్రికేయురాలు యానా మిర్ కుండబద్దలు కొట్టారు. ఈ మేరకు బ్రిటన్ పార్లమెంట్ భవనం వేదికగా ఆమె చేసిన ప్రసంగంపై ప్రశంసలు కురుస్తున్నాయి. బ్రిటన్ పార్లమెంట్ భవనంలో జమ్మూకశ్మీర్ స్టడీ సెంటర్ నిర్వహించిన 'సంకల్ప్ దివస్'లో ఆమె మాట్లాడారు. కశ్మీర్‌లో స్థానికులను కేంద్రం అణచివేస్తోందన్న వార్తలు పచ్చి అబద్ధమంటూ కుండబద్దలు కొట్టారు. ''భారత్‌లో అంతర్భాగమైన నా సొంత గడ్డ కశ్మీర్లో నేను స్వేచ్ఛగా, సురక్షితంగా, సంతోషంగా ఉన్నా. మలాలా మాదిరిగా స్వదేశంలో ఉగ్రవాదానికి భయపడి బ్రిటన్‌కు వెళ్లలేదు. పారిపోయి శరణార్థిగా బతకాల్సిన అగత్యమూ నాకు లేదు. మలాలాకు ఒక్కటే చెప్పదలచా. ప్రగతిశీల భారత్‌లో, అందులోనూ కశ్మీర్లో అణచివేత ఉందంటే ఒప్పుకోను. కశ్మీర్‌ను ఒక్కసారి కూడా ప్రత్యక్షంగా చూడని వాళ్లు విదేశాల్లో ఉంటూ సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు వండుతున్నారు. బ్రిటన్, పాక్‌లో ఉంటూ అంతర్జాతీయ వేదికలపై ఇలాంటి దుష్ప్రచారాలను ఆపండి. ప్రశాంతంగా మమ్మల్ని బతకనివ్వండి. జై హింద్' అని అన్నారు.

కేసు నమోదయ్యాకే అంత్యక్రియలు

- పది రోజులైనా వేచి ఉంటాం
- తేల్చి చెప్పిన రైతు సంఘాలు

చండీగఢ్: పంజాబ్-హరియాణా సరిహద్దుల్లోని ఖనౌరీ వద్ద బుధవారం 'ఢిల్లీ చలో'ఆందోళనల్లో పాల్గొన్న రైతులు హరియాణా పోలీసుల మధ్య జరిగిన ఘర్షణలో శుభ్‌కరణ్‌సింగ్(21) అనే యువ రైతు గాయాలతో ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై రైతు సంఘాలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నాయి. శుక్రవారం ఖనౌరీ వద్ద కొనసాగుతున్న ఆందోళనలో పలువురు రైతు సంఘాల నేతలు పాల్గొన్నారు. శుభ్‌కరణ్ మృతికి బాధ్యులైన వారిపై పంజాబ్ ప్రభుత్వం కేసు నమోదు చేసే వరకు అంత్యక్రియలు జరిపేది లేదని నేతలు తేల్చి చెప్పారు. శుభ్‌కరణ్‌ను అమరుడిగా ప్రకటించాలని కూడా డిమాండ్ చేశారు. రైతుల డిమాండ్ మేరకు శుభ్‌కరణ్ కుటుంబానికి రూ.కోటి పరిహారంతోపాటు అతడి సోదరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామంటూ పంజాబ్ సీఎం మాన్ ప్రకటించారు. రైతు మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలుంటాయని కూడా సీఎం స్పష్టం చేశారు. అనంతరం రైతు నేత సర్వాన్ సింగ్ పంధేర్ మీడియాతో మాట్లాడారు. 'మాక్కావాల్సింది డబ్బు కాదు. మృతికి బాధ్యులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడమే మాకు ముఖ్యం. ఆ తర్వాతే అంత్యక్రియలు జరుపుతాం. ఇందుకు అవసరమైతే 10 రోజులైనా సరే వేచి ఉంటామని శుభ్‌కరణ్ కుటుంబసభ్యులు మాకు చెప్పారు'అని వివరించారు.

రైతులపైకి టియర్ గ్యాస్..

హిసార్: హరియాణా పోలీసులతో శుక్రవారం మరోసారి రైతులు తలపడ్డారు. ఖనౌరీ వద్ద నిరసనల్లో పాల్గొనేందుకు వెళ్తున్న ఖేరి చోప్తా గ్రామ రైతులను పోలీసులు అడ్డగించారు. కొందరు రైతులు పోలీసులపైకి రాళ్లు రువ్వారు. ఈ సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణలో కొందరు రైతులతోపాటు పోలీసులు గాయపడ్డారు. పోలీసులు వారిపైకి టియర్ గ్యాస్ ప్రయోగించారు. కొందరు రైతులను అదుపులోకి తీసుకున్నారు.

గుండెపోటుతో మరో రైతు మృతి

పంజాబ్-హరియాణా సరిహద్దుల్లో ఆందోళనల్లో పాల్గొంటున్న దర్శన్ సింగ్(62) అనే రైతు గుండెపోటుతో చనిపోయినట్లు రైతు సంఘం నేతలు చెప్పారు. మరోవైపు ఆందోళనలకు సారథ్యం వహిస్తున్న రైతు సంఘాల నేతలు శుక్రవారం పలు అంశాలపై చర్చించారు. తదుపరి కార్యాచరణను 29న ప్రకటిస్తామని మీడియాకు తెలిపారు. శనివారం కొవ్వొత్తులతో ర్యాలీ చేపడతామన్నారు.

పంజాబ్‌వ్యాప్తంగా బ్లాక్ డే

అమృత్‌సర్: రైతులపై పోలీసుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ పంజాబ్ అంతటా రైతులు బ్లాక్ డే పాటించారు. శుభ్‌కరణ్ మృతిని నిరసిస్తూ అమృత్‌సర్, లూధియానా, హోషియార్‌పూర్ సహా 17 జిల్లాల్లో నిరసనలు చేపట్టినట్లు రైతు సంఘాలు వెల్లడించాయి.

మార్చి 13 తర్వాత ఎన్నికల షెడ్యూల్!

న్యూఢిల్లీ: దేశంలో సార్వత్రిక ఎన్నికల హడావుడి ఇప్పటికే మొదలైంది. తమ భవితవ్యాన్ని నిర్దేశించే ఈ ఎన్నికల కోసం రాజకీయ పార్టీలు అస్త్రశస్త్రాలతో సిద్ధమవుతున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో ప్రచారం జోరుగా సాగుతోంది. మార్చి 13వ తేదీ తర్వాత లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉందని, దీనిపై ముమ్మరంగా కసరత్తు జరుగుతోందని ఎన్నికల సంఘం వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. ఎన్నికల సన్నాహాల్లో భాగంగా కేంద్ర ఎన్నికల కమిషన్ బృందం వివిధ రాష్ట్రాల్లో పర్యటించింది. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశాలు నిర్వహించింది. దేశవ్యాప్తంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం) పరిశీలన దాదాపు పూర్తి చేసింది. మిగిలిన రాష్ట్రాల్లో ఈసీ బృందం పర్యటన మార్చి 13లోగా పూర్తవుతుందని సమాచారం. ఆ తర్వాత షెడ్యూల్‌ను ప్రకటించనున్నారు. సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా, లోపాలకు తావులేకుండా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం పటిష్టమైన ఏర్పాట్లు చేస్తోంది.

అతి త్వరలోనే కేజ్రీవాల్ అరెస్ట్

తమకు సమాచారం ఉందన్న ఆప్ నేతలు


న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను త్వరలోనే అరెస్ట్ చేసేందుకు సీబీఐ ప్రయత్నాలు చేస్తోందని శుక్రవారం ఆప్ తెలిపింది. లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకు కాంగ్రెస్, ఆప్ చేస్తున్న ప్రయత్నాలతో బీజేపీలో భయం మొదలైందని పేర్కొంది. రెండు పార్టీల మధ్య పొత్తు కుదరకుండా చేసేందుకే తమ నేత కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయాలని చూస్తోందని ఆరోపించింది. ఢిల్లీ మంత్రి, ఆప్ సీనియర్ నేత సౌరభ్ భరద్వాజ్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల పంపకంపై ఆప్, కాంగ్రెస్‌ల మధ్య చర్చలు కొలిక్కి వచ్చిన విషయం తెలియగానే ఈడీ గురువారం కేజ్రీవాల్‌కు ఏడో విడత నోటీసులిచ్చిందని ఆయన చెప్పారు. కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసేందుకు సీబీఐ ప్రయత్నాలు చేస్తున్నట్లు తమ వద్ద విశ్వసనీయ సమాచారం ఉందన్నారు. శుక్రవారం సాయంత్రానికల్లా కేజ్రీవాల్‌కు నోటీసులు అందజేస్తుందని, రెండు మూడు రోజుల్లో అరెస్ట్ చేస్తుందని ఆయన అన్నారు.

ఎక్స్ మెయిల్ వచ్చేస్తోంది !

సూచనప్రాయంగా వెల్లడించిన కుబేరుడు ఎలాన్‌మస్క్

వాషింగ్టన్: ప్రముఖ సామాజిక మాధ్యమం ట్విట్టర్ పేరును 'ఎక్స్'గా మార్చిన దాని నూతన యజమాని, కుబేరుడు ఎలాన్ మస్క్ అదే పేరుతో ఒక ఈమెయిల్‌ను తీసుకురానున్నారు. 'ఎక్స్ మెయిల్' త్వరలో రాబోతోందని ఆయన స్వయంగా ప్రకటించారు. ఈమెయిల్ సేవల ముఖచిత్రం మారబోతోందని వ్యాఖ్యానించారు. అయితే సొంత ఎక్స్‌మెయిల్‌ను ఎప్పుడు ప్రారంభిస్తారు, అందులోని ప్రత్యేకతలు ఏంటి అనే వివరాలను ఇంకా వెల్లడించలేదు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు నెటిజన్లు అందరూ వాడే గూగుల్ వారి జీమెయిల్ త్వరలో తన సేవలను నిలిపివేయనుందన్న పుకార్ల నడుమ ఎక్స్ మెయిల్ అరంగేట్రం చేయనుండటం గమనార్హం. జీమెయిల్ 2024 ఆగస్ట్ ఒకటో తేదీన కనుమరుగుకానుందంటూ 'ఎక్స్'లో ఒక వార్త ప్రత్యక్షమై విస్తృత చర్చకు తెరలేపింది. గూగుల్ పంపిన ఒక ఈమెయిల్‌లో 'త్వరలో జీమెయిల్ అస్తమించబోతోంది' అంటూ ఒక సందేశం ఉందని ఆ వార్తలోని సారాంశం. దీనిపై జీమెయిల్ మాతృసంస్థ గూగుల్ స్పందించింది. 'అవన్నీ శుద్ధ అబద్ధాలు. ఇన్నాళ్లు బేసిక్ హెచ్‌టీఎంఎల్ వ్యూ ఫార్మాట్‌లో జీమెయిల్ సేవలు అందించాం. ఆ సేవలను ఈ ఏడాది నిలిపివేసి త్వరలోనే 'స్టాండర్డ్' వ్యూలో జీమెయిల్ సేవలను అధునాతనంగా అందిస్తాం' అని గూగుల్ స్పష్టతనిచ్చింది. దీంతో జీమెయిల్ యూజర్లంతా ఊపిరి పీల్చుకున్నారు. కొత్తగా రాబోయే ఎక్స్‌మెయిల్ ఏమేరకు జీమెయిల్‌కు పోటీ ఇవ్వగలదో చూడాలి మరి. త్వరలోనే అది అందుబాటులోకి వస్తుందని 'ఎక్స్' ఇంజనీరింగ్, సెక్యూరిటీ టీమ్ సీనియర్ సభ్యుడు న్యాట్ మెక్‌గ్రేడీ వెల్లడించారు.

మనోహర్ జోషి అస్తమయం



ముంబై: మహారాష్ట్ర రాజకీయాల్లో ముఖ్యనేతగా పేరొందిన ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, లోక్‌సభ మాజీ స్పీకర్ మనోహర్ జోషి శుక్రవారం తుదిశ్వాస విడిచారు. గుండె లయ (కార్డియాక్ అరెస్ట్) ఆగడంతో ముంబైలోని పీడీ హిందూజా ఆస్పత్రిలో 21వ తేదీన తేదీన ఆయనను చేర్పించి ఐసీయూలో చికిత్సనందిస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మెదడులో రక్తస్రావం కారణంగా గత ఏడాది మే నెలలోనూ ఆయన ఆస్పత్రిలో చేరారు. ఈయన భార్య అనఘ 2020లో మరణించారు. ఈయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జోషి సర్‌గా అందరూ పిలుచుకునే 86 ఏళ్ల మనోహర్ శివసేన నుంచి ముఖ్యమంత్రి అయిన తొలినేతగా పేరొందారు. 1995-96 కాలంలో సీఎంగా ఉన్నారు. వాజ్‌పేయి ప్రభుత్వంలో 2002-2004 మధ్య లోక్‌సభ స్పీకర్‌గా ఉన్నారు.

సందేశ్‌ఖాలీలో పెల్లుబికిన నిరసనలు

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ నేత షాజహాన్ షేక్, సోదరుడు సిరాజ్, వారి అనుచరులు తమపై లైంగిక దాడులకు పాల్పడి భూములను లాక్కున్నారంటూ పశ్చిమబెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో కొద్దిరోజులుగా మహిళలు చేస్తున్న నిరసనలు మరింత ఎక్కువయ్యాయి. సందేశ్‌ఖాలీలోని ఝుప్‌ఖాలీ ప్రాంతంలోకి పోలీసులు రాకుండా ఆందోళనకారులు రోడ్లపై దుంగలతో నిప్పుపెట్టారు. తృణమూల్ కాంగ్రెస్ నేతల ఆస్తులను తగలబెట్టారు. ఇన్నిరోజులైనా షాజహాన్, అతని అనుచరులను అరెస్ట్‌చేయకపోవడంపై పోలీసుల నిర్లిప్త వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. బెల్మాజూర్ దగ్గరి ఫిషింగ్‌యార్డ్ నిర్మాణాలను తగలబెట్టారు. పోగొట్టుకున్న భూములు, గౌరవాన్ని తిరిగి పొందేందుకు, పోలీసుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈ ఆందోళనలు చేపట్టామని స్థానికులు చెప్పారు. వీరిలో ఎక్కువ మంది మహిళలే ఉన్నారు. ఆందోళనలను అడ్డుకున్న పోలీసులు కొందరిని అరెస్ట్‌చేసి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా మహిళలు పోలీసు వాహనాలకు అడ్డంగా పడుకున్నారు. 'షాజహాన్‌ను అరెస్ట్‌చేసే దమ్ములేని మీరు మా వాళ్లను ఎలా తీసుకెళ్తారు? మా మనుషుల అండలేకుండా మాకు రక్షణ ఎలా ఉంటుంది?' అని ఒక మహిళ పోలీసులను నిలదీసింది. దీంతో కొంత ఉద్రిక్తత నెలకొంది.

అపార్టుమెంట్లలో అగ్నికీలలు

పదిమంది మృతి, మరో 14 మంది గల్లంతు

వలెన్సియా(స్పెయిన్): స్పెయిన్‌లోని తూర్పు ప్రాంత వలెన్సియా నగరంలోని నివాస సముదాయంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గురువారం ఓ అపార్టుమెంట్‌లో చెలరేగిన మంటలు పక్కనే ఉన్న మరో అపార్టుమెంట్‌కు వ్యాపించాయి. మంటల్లో పదిమంది సజీవదహనం కాగా మరో 14 మంది జాడ తెలియకుండా పోయింది. గాయాలతో మరో ఆరుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మంటల తీవ్రతకు 14 అంతస్తుల భవనం కూలడానికి సిద్ధంగా ఉందని మేయర్ మర జోస్ తెలిపారు. వేడి తీవ్రత కారణంగా లోపల చిక్కుబడిపోయిన వారిని గుర్తించేందుకు అత్యవసర సిబ్బంది వెళ్లలేకపోతున్నారని అన్నారు. ఈ సముదాయంలో 140 అపార్టుమెంట్లున్నాయన్నారు. భవన నిర్మాణంలో వాడిన పాలియురేథేన్ షీట్లే మంటలు వేగంగా వ్యాపించడానికి కారణమని భావిస్తున్నామని నిపుణులు అంటున్నారు. 2017లో లండన్‌లోని గ్రెన్‌ఫెల్ టవర్‌లో సంభవించిన అగ్ని ప్రమాదానికి ఇలాంటి షీట్లే కారణమన్నారు. అప్పటి ఘటనలో 70 మందికి పైగా చనిపోయారని గుర్తు చేశారు.



స్పెయిన్‌లోని వలెన్సియాలో అగ్నికి ఆహుతవుతున్న అపార్ట్‌మెంట్లు

క్లుప్తంగా...

ఎస్సీ గురుకులాల్లో బదిలీలకు శాశ్వత మార్గదర్శకాలు

● మంత్రి నాగార్జున వెల్లడి



సాక్షి, అమరావతి: ఎస్సీ గురుకులాల్లో బదిలీలకు శాశ్వత మార్గదర్శకాలు రూపొందించనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున వెల్లడించారు. గురుకులాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులందరికీ అదనంగా ఐదురోజుల క్యాజువల్ లీవులు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. తాడేపల్లిలోని బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. గురుకులాల్లో పనిచేస్తున్న టీజీటీ టీచర్లకు పీజీ తప్పనిసరిగా ఉండాలన్న నిబంధనను ఎన్సీఆర్టీ మార్గదర్శకాల ప్రకారంగా సడలించాలని నిర్ణయించామన్నారు. ప్రభుత్వం బదిలీలపై నిషేధం ఎత్తివేసిన సమయంలో బోధన, బోధనేతర సిబ్బందినీ త్వరితగతిన బదిలీలు చేయడానికి శాశ్వత మార్గదర్శకాలు రూపొందిస్తామన్నారు. గురుకులాల్లో పనిచేస్తున్న జిల్లా సమన్వయ అధికారుల(డీసీఓ) పదోన్నతులు కూడా ఇదివరకే ఉన్న జీవోల ప్రకారంగానే చేస్తామని వివరించారు. గురుకులాల్లో రెగ్యులర్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు అందరికీ కూడా అదనంగా ఐదు రోజులు సెలవు ఇస్తామని పేర్కొన్నారు. ఎస్సీ గురుకులాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న టీచర్లను జీవో నంబర్ 59 ప్రాతిపదికన రెగ్యులర్ చేయాలంటూ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ చేసిన విజ్ఞప్తి మేరకు కాంట్రాక్ట్ టీచర్లను రెగ్యులర్ చేయాలనే ప్రతిపాదనను తదుపరి చర్యల నిమిత్తం ప్రభుత్వానికి పంపుతున్నట్లు నాగార్జున వెల్లడించారు.

25న 'ఎయిమ్స్'ను జాతికి అంకితం చేయనున్న ప్రధాని



మధబానందకర్

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)ను ఈ నెల 25న ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్, సీఈవో డాక్టర్ మధబానందకర్ తెలిపారు. శుక్రవారం ఎయిమ్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్చువల్ విధానంలో ప్రధాని ఎయిమ్స్‌ను జాతికి అంకితం చేస్తారని అనంతరం ఏపీలోని 9 క్రిటికల్ కేర్ బ్లాక్‌లకు శంకుస్థాపన చేసి, విశాఖలో మైక్రోబయాలజీ, ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీని, 4 మొబైల్ టెస్టింగ్ ల్యాబ్‌లను ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్రమంత్రులు డాక్టర్ మన్సుక్ మాండవీయ, ప్రహ్లాద్ జోషి పాల్గొంటారన్నారు. 183.11 ఎకరాల్లో రూ.1,618.23 కోట్లతో ఎయిమ్స్‌కు 2015 డిసెంబర్ 19న శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. 2019లో ఓపీ సేవలు ప్రారంభం కాగా, ప్రస్తుతం రోజుకు 2,500 ఓపీలు నమోదవుతున్నట్లు తెలిపారు. 2018లో ఎంబీబీఎస్ అడ్మిషన్‌లు ప్రారంభించగా 600 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నట్లు వివరించారు. డీడీ(అడ్మినిస్ట్రేషన్) శశికాంత్ తుమ్మా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వినీత్ థామస్, మీడియా సెల్ ప్రతినిధి డాక్టర్ కె.వంశీకృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

విద్యాశాఖలో ఐదుగురికి పదోన్నతి

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యా శాఖలో డిప్యూటీ డైరెక్టర్లు, డీఈవోలుగా పనిచేస్తున్న వారిలో ఐదుగురికి ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐదుగురు అధికారులకు డైట్ ప్రిన్సిపల్స్‌గా అవకాశం కల్పించినట్టు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరి హతం

● ఛత్తీస్‌గఢ్‌లో హతమార్చిన మావోయిస్టులు

దుమ్ముగూడెం (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా చింతగుఫా పోలీస్‌స్టేషన్ పరిధి దుల్లేడ్ గ్రామానికి చెందిన ఇద్దరిని మావోయిస్టులు గురువారం అర్ధరాత్రి హతమార్చారు. దుల్లేడ్‌కు చెందిన సోడి హంగా, మడివి నందా పోలీసులకు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తుండటంతోనే ఈ ఘటనకు పాల్పడినట్లు మావోయిస్టు పామేడు ఏరియా కమిటీ పేరిట శుక్రవారం లేఖ విడుదల చేశారు. హంగా, నందా కొంతకాలంగా మావోయిస్టుల సంచారాన్ని పోలీసు బలగాలకు తెలియచేయడంతోపాటు గ్రామస్తులపై దాడులు కూడా చేస్తున్నారని ఆరోపించారు. జనవరి 4, 7 తేదీల్లో సుక్మా – బీజాపూర్ జిల్లా సరిహద్దుల్లో పోలీసులు రెండు శిబిరాలను ఏర్పాటుచేయగా, 30 మందికి పైగా సామాన్యులను బలవంతంగా తీసుకెళ్లి తప్పుడు విధానాల్లో లొంగిపోయేలా చేశారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే వారిద్దరూ చేపలు, కోళ్లు, పందులను పోలీసులకు రవాణా చేస్తున్నారని తెలిపారు. అదే గ్రామానికి చెందిన మడకం సులాను పోలీసులు కొట్టి చెవులు కోసేశారని పేర్కొన్నారు. దీంతో వారికి మరణశిక్ష విధించాలని ప్రజలే నిర్ణయించగా...పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) అమలు చేసిందని, ఈ విషయంలో తాము కూడా సానుభూతి వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. ఇంకా ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్న కొందరు తమ తీరు మార్చుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని మావోయిస్టులు హెచ్చరించారు.

ఏపీ డిజిటల్ విద్యకు ప్రశంసల వెల్లువ

విద్యా సమీక్ష కేంద్రాల పనితీరుపై ఎన్సీఈఆర్టీ అభినందన

● అన్ని రాష్ట్రాలకు ఆదర్శమని ప్రకటన
● ఏపీ విద్యా విధానాలను అధ్యయనం చేయాలని సూచన
● గుజరాత్‌లో ఎన్సీఈఆర్టీ ఆధ్వర్యాన జాతీయ సదస్సు
● దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల విద్యాశాఖ ఉన్నతాధికారుల హాజరు



గాంధీనగర్‌లో వీఎస్‌కే, విద్యాశాఖలో డిజిటల్ టెక్నాలజీపై వివరిస్తున్న విద్యాశాఖ అధికారి

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా రంగంలో అమలు చేస్తున్న సంస్కరణలను ఎన్సీఈఆర్టీ మరోసారి ప్రశంసించింది. ఇతర రాష్ట్రాల విద్యాశాఖలు ఏపీ విధానాలను అధ్యయనం చేయాలని సూచించింది. ముఖ్యంగా ఐఎఫ్‌పీల ద్వారా డిజిటల్ బోధన, ట్యాబ్‌ల వినియోగం, విద్యార్థుల ట్రాకింగ్, జగనన్న గోరుముద్ద యాప్, విద్యా సమీక్ష కేంద్రాల పనితీరు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్నాయని కొనియాడింది. దేశవ్యాప్తంగా ఉన్న విద్యా సమీక్ష కేంద్రాల(వీఎస్‌కే) పనితీరుపై గుజరాత్‌లోని గాంధీనగర్‌లో రెండు రోజులు నిర్వహించనున్న జాతీయస్థాయి వర్క్‌షాప్ శుక్రవారం ప్రారంభమైంది. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ(సీఐఈటీ) ఆధ్వర్యంలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్సీఈఆర్టీ) నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో దేశంలోని 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల విద్యాశాఖల అధికారులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్య కమిషనరేట్ ఐటీ విభాగం అధికారి రమేష్‌కుమార్, విద్యా సమీక్ష కేంద్రాల సూపర్‌వైజర్ రమ్యశ్రీ, సమగ్ర శిక్ష నుంచి శ్రీదీప్ హాజరై రాష్ట్ర విద్యాశాఖలో అమలు చేస్తున్న డిజిటల్ విధానాలు, వీఎస్‌కేల పనితీరును వివరించారు. ముఖ్యంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో ఎన్ని కేలరీలు ఉన్నాయో యాప్ ద్వారా లెక్కించడం, ఆన్‌లైన్ విధానంలో విద్యార్థుల హాజరు, ట్రాకింగ్ చేయడం వంటివి వివరిండంతో ఎన్సీఈఆర్టీ ప్రశంసించింది. ఐఎఫ్‌పీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 2డి, 3డీల్లో పాఠాలు బోధించడం అద్భుతమని సీఐఈటీ జాయింట్ డైరెక్టర్ అమరేంద్ర బెహరా కితాబిచ్చారు. విద్యా సమీక్ష కేంద్రాల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ ఎంతో ముందుందని, అక్కడి విధానాలను అధ్యయనం చేసి ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు అనుసరించాలని సూచించారు.

ఏపీలో వీఎస్‌కే పనితీరు ఇలా..

- పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యాన విజయవాడ, విశాఖపట్నంలలో విద్యా సమీక్ష కేంద్రాలు(వీఎస్‌కే) ఏర్పాటు చేశారు. వీటి ద్వారా రాష్ట్రంలోని 58,465 ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో చదువుతున్న 70,70,143 మంది విద్యార్థుల హాజరును ప్రతిరోజు ట్రాక్ చేస్తున్నారు.
- ప్రతిరోజు ఉదయం విద్యార్థుల హాజరును ఉపాధ్యాయులు మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ వెంటనే ఎంతమంది గోరుముద్ద స్వీకరిస్తారు, ఎవరెవరు కోడిగుడ్డు, రాగిజావ, చిక్కీ తీసుకుంటారనే వివరాలు సైతం 'ఏఐ' టెక్నాలజీ అటెండెన్స్ యాప్‌లో నమోదవుతున్నాయి.
- ఉపాధ్యాయుల ఫేషియల్ రికగ్నేషన్ సైతం ఇదే తరహాలో ఉదయం 9 నుంచి 9.15 గంటల మధ్య స్కూలు పరిధిలోనే ఫొటోతో నమోదు చేస్తున్నారు. ఇంటర్నెట్ సిగ్నల్ లేకపోయినా సిగ్నల్ వచ్చినప్పుడు టైమ్‌తో సహా అప్‌డేట్ అయ్యేలా టెక్నాలజీని రూపొందించారు. ఆ వెంటనే 'స్కూల్ ఇన్ఫర్మేషన్ మానిటరింగ్ సిస్టం'(సిమ్స్)లో నమోదై, ఉదయం 11– 12 గంటల్లోగా విజయవాడ, విశాఖల్లోని విద్యా సమీక్ష కేంద్రాలకు చేరుతాయి.
- ఈ టెక్నాలజీ రాకతో గతంలో రోజుకు 68 శాతం కంటే తక్కువగా ఉన్న హాజరు... ఇప్పుడు 99 శాతం పైగా నమోదవుతోంది.
- విద్యార్థి ఒక్కరోజు స్కూలుకు రాకపోతే తల్లిదండ్రులకు, వరుసగా మూడురోజులు రాకపోతే విద్యార్థి ఇంటి పరిధిలోని వలంటీర్‌కు, నాలుగు రోజులు హాజరుకాకపోతే గ్రామ, వార్డు సంక్షేమ కార్యదర్శికి, ఎంఈవో, డీఈవోలకు సమాచారం అందుతుంది. వారు కారణాలను తెలుసుకుని ఆ వివరాలను యాప్‌లో నమోదు చేసి సమస్యకు పరిష్కారం చూపించాలి.
- ఇందుకోసం జిల్లాకు ఇద్దరు చొప్పున 52 మంది సిబ్బంది, జోన్‌కు ఒక్కరు చొప్పున నలుగురు పర్యవేక్షకులు ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉండి, ఆరోజు అంశాలను అదేరోజు పరిష్కరిస్తున్నారు.
- విజయవాడ సెంటర్ నుంచి టీచర్స్ అటెండెన్స్, గోరుముద్ద, బైజూస్, అకడమిక్ అంశాలను, విశాఖపట్నం కేంద్రం ద్వారా విద్యార్థుల హాజరు, కన్‌స్టెన్ రిథమ్(నాడు–నేడు), జేవీకే, డీబీటీ అంశాలను పర్యవేక్షిస్తున్నారు.
- డిజిటల్ టెక్నాలజీని అత్యంత పకడ్బందీగా వినియోగిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొంది, ఇప్పుడు ఎన్సీఈఆర్టీతోపాటు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల దృష్టిని ఆకర్షించింది.

పరిశోధనా ఫలాలు రైతులకు చేరాలి

పీజీ విద్యార్థుల ముఖాముఖిలో వీసీ జానకీరామ్



సాక్షి, అమరావతి: ఆలోచనలు సమున్నతంగా ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధించగలమని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ తోలేటి జానకీరామ్ అన్నారు. పరిశోధనా ఫలాలు రైతులకు చేరినప్పుడే మన కృషికి సార్థకత చేకూరుతుందని ఆయన తెలిపారు. సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మార్గాలు చూపుతూనే, తక్కువ పెట్టుబడి, శ్రమతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులను తీర్చిదిద్దేందుకు ఉపయోగపడేలా నూతన ఆవిష్కరణల దిశగా పరిశోధనలు సాగాలన్నారు. యూనివర్సిటీలో తొలిసారి నిర్వహించిన ఎంఎస్సీ, పీహెచ్‌డీ విద్యార్థులతో వైస్ ఛాన్సలర్ ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేశారు. పరిశోధనా పత్రాల తయారీపై అనుసరించాల్సిన పద్ధతుల గురించి పీజీ విద్యార్థులతో వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ జానకీ రామ్ మాట్లాడుతూ అర్థవంతమైన పరిశోధనల కోసం కృషిచేయాలన్నారు. సొసైటీ ఫర్ హార్టికల్చర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (గజియాబాద్) మేనేజింగ్ ఎడిటర్ డాక్టర్ సోమదత్ వెబినార్ ద్వారా మాట్లాడుతూ పరిశోధనా విద్యార్థులు, యువ శాస్త్రవేత్తలకు పరిశోధనా వ్యాసాలు, సమీక్షలు ప్రచురించే సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ ఎస్ సూర్యకుమారి, డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ ఏఎస్ పద్మావతమ్మ, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ డీఆర్ సలోమి సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఇంటర్ హాల్‌టికెట్లు

● ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో పెట్టిన అధికారులు
● ప్రిన్సిపాల్ సంతకం లేకుండానే పరీక్షకు అనుమతి
● విద్యార్థులకు కాలేజీ యాజమాన్యాల వేధింపుల నుంచి ఊరట

సాక్షి, అమరావతి: మార్చి ఒకటో తేదీ నుంచి ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల హాల్‌టికెట్లను ఇంటర్మీడియెట్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో శుక్రవారం నుంచి అందుబాటులో ఉంచింది. పరీక్ష ఫీజు చెల్లించిన మొత్తం 10,52,221 మంది విద్యార్థుల హాల్‌టికెట్లను ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ లాగిన్ ద్వారా, అదేవిధంగా ఇంటర్మీడియెట్ బోర్డు వెబ్‌సైట్ https://bieap.apcfss.in/ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించింది. 2023–24 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 4,73,058 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 5,79,163 మంది ఉన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు వెబ్‌సైట్‌లో తమ పుట్టిన తేదీని, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పుట్టిన తేదీ లేదా తమ మొదటి సంవత్సరం హాల్‌టికెట్ నంబర్ నమోదు చేసి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ హాల్‌టికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని, నేరుగా విద్యార్థులు పరీక్షలకు హాజరుకావొచ్చని ఇంటర్మీడియెట్ విద్యా మండలి కార్యదర్శి సౌరభ్‌గౌర్ ప్రకటించారు. ఎవరికైనా హాల్‌టికెట్‌పై ఫొటో ప్రింట్ కాకపోతే ఆ విద్యార్థులు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదిస్తే స్కాన్ చేసి ఫొటోతో కూడిన హాల్‌టికెట్‌ను ఇస్తారని వెల్లడించారు. మార్చి ఒకటి నుంచి మొదటి సంవత్సరం, రెండో తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమై 20వ తేదీ వరకు కొనసాగుతాయి. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 1,559 సెంటర్లను సిద్ధం చేశారు. పరీక్షలు జరిగే గదుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థి హాజరును ఆన్‌లైన్ ద్వారా తీసుకోనున్నారు.



ప్రైవేటు యాజమాన్యాల వేధింపులకు చెక్

గతంలో ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఒత్తిడి చేసేవి. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యేవారు. ఈ విషయంపై ఇంటర్ బోర్డుకు కూడా అనేక ఫిర్యాదులు అందేవి. ఇప్పుడు ఎటువంటి వేధింపులు లేకుండా విద్యార్థుల హాల్‌టికెట్లను ఇంటర్ బోర్డు పబ్లిక్ డొమైన్‌లోనే అందుబాటులో ఉంచింది. విద్యార్థులు ఎక్కడి నుంచి అయినా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరయ్యే అవకాశం కల్పించింది.

27 నుంచి ఏపీటెట్–2024

● ఆన్‌లైన్‌లో 2,67,559 మంది హాల్‌టికెట్లు
● సందేహాల నివృత్తికి కాల్ సెంటర్
● ఎస్‌జీటీ పోస్టులకు దరఖాస్తు చేసిన బీఈడీ అభ్యర్థుల ఫీజు రిఫండ్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఏపీటెట్)–2024 నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. శుక్రవారం టెట్ హాల్‌టికెట్లను https://aptet.apchss.in వెబ్‌సైట్‌లో ఉంచింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పరీక్షకు 2,67,559 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారందరికీ పరీక్ష సెంటర్లను సైతం కేటాయించి, ఆయా వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచింది. కాగా బీఈడీ చేసిన అభ్యర్థులు ఎస్‌జీటీ పోస్టులకు అనర్హులని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ తీర్పు నేపథ్యంలో ఎస్‌జీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న బీఈడీ అభ్యర్థుల ఫీజును తిరిగి చెల్లించేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంది. ఆయా అభ్యర్థుల ఆధార్ కార్డుతో అనుసంధానమై ఉన్న బ్యాంకు అకౌంట్‌కు ఫీజులు మొత్తాన్ని తిరిగి జమ చేయనున్నట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ ప్రకటించింది.



నిర్వహణ ఇలా..

పేపర్ 1ఏ : ఈనెల 27 నుంచి మార్చి 1 వరకు
పేపర్ 2ఏ : మార్చి 2, 3, 4, 6 తేదీలు
పేపర్ 1బి : మార్చి 5 (ఉదయం)
పేపర్ 2బి : మార్చి 5 (మధ్యాహ్నం)

120 కేంద్రాల్లో ఏపీటెట్

ఈనెల 27 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 120 కేంద్రాల్లో ఏపీ టెట్ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న పరీక్షా కేంద్రాన్ని మాత్రమే కేటాయించినట్టు కమిషనరేట్ తెలిపింది. సెకండరీ గ్రేడ్ టీచర్ అభ్యర్థుల్లో 76.5 శాతం మందికి వారు ఎంపిక చేసుకున్న మొదటి ప్రాధాన్యత కేంద్రాన్నే కేటాయించారు. పరీక్ష కేంద్రాలపై అభ్యర్థులకు సందేహాలుంటే ఆయా జిల్లా విద్యాశాఖాధికారులను సంప్రదించాలని కమిషనర్ సూచించారు. దీంతోపాటు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉండేలా కమిషనరేట్‌లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఫోన్ నంబర్లు 95056 19127, 97056 55349, 81219 47387, 81250 46997లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

బాబు ఇవ్వాల్సిన డీఎస్సీ పోస్టులను భర్తీ చేస్తున్న సీఎం జగన్: మంత్రి రోజా

షర్మిలకు రాజకీయ అవగాహన లేదు



తిరుమల: చంద్రబాబు సీఎంగా ఉన్నపుడు డీఎస్సీలు నిర్వహించి వదిలేస్తే ఆ పోస్టులను ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భర్తీ చేశారని ఏపీ పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా చెప్పారు. శుక్రవారం ఆమె తిరుమల శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు 1998, 2008, 2018లో ఇవ్వాల్సిన డీఎస్సీలను సీఎం జగన్ ఇచ్చి 17 వేల పోస్టులు భర్తీ చేశారని గుర్తుచేశారు. 6,100 పోస్టులకు సీఎం జగన్ నోటిఫికేషన్ విడుదల చేశారని కొనియాడారు. షర్మిలకు రాజకీయ అవగాహన లేదన్న విషయం నిన్న ఆమె చేసిన హడావుడి చూస్తేనే అర్థమైందన్నారు. నాలుగున్నరేళ్ల ఏపీలో లేకుండా తెలంగాణ బిడ్డను అని చెప్పుకొని, ఇప్పుడు వచ్చి సీఎం జగన్‌పై విషం చిమ్ముతుండటాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, కాంగ్రెస్ పార్టీలు ఆడుతున్న నాటకంలో షర్మిలను పావుగా వాడుకుంటున్నారని చెప్పారు. పిచ్చి మాటలు మాట్లాడడం పవన్ మానుకోవాలని హితవుపలికారు.

పారాచూట్ నేతలతో.. టీడీపీలో భగభగలు

అన్ని జిల్లాల్లోనూ పారాచూటర్లతో స్థానిక నేతలకు ఇబ్బందులు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో తెలుగుదేశం పార్టీలోకి వివిధ నియోజకవర్గాల్లో పారాచూట్ నాయకులు దిగిపోవడంతో ఆ పార్టీలో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేకుండా ఎక్కడ నుంచో ఉన్నట్టుండి నియోజకవర్గాల్లో దిగిన వారితో స్థానిక నేతలు, మొదటి నుంచి పార్టీలో పనిచేస్తున్న వారికి ఏమాత్రం పొసగడంలేదు. పైగా.. ఈ పారాచూట్ నేతలకు ఉన్న ధనబలం, హంగు ఆర్భాటాలకే చంద్రబాబు ప్రాధాన్యతనిస్తున్నారు. దీంతో ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసిన నేతలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. పార్టీ కోసం తాముపడ్డ కష్టాలు, చేసిన పనులన్నింటినీ మరచిపోయి ఇప్పుడు ఒక్కసారిగా బయట నుంచి ఎవరెవరినో తీసుకొస్తే తమ పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. కానీ, చంద్రబాబు మాత్రం వారిని ఏమాత్రం ఖాతరు చేయకుండా డబ్బున్న వారే తన దగ్గరకు రావాలని స్పష్టంగా చెబుతున్నారు. ఎన్నో ఏళ్లుగా నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ఉన్న సీనియర్ నేతలను కూడా పక్కనపెట్టి ఈ పారాచూట్ నేతలను ఇన్‌ఛార్జిలుగా ప్రకటిస్తున్నారు. దీంతో వీరికి.. మొదటి నుంచి పార్టీలో ఉన్న నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది.


కాకినాడలో 'సానా' వర్సెస్ సీనియర్లు..



జ్యోతుల నెహ్రూ

కాకినాడ ఎంపీ సీటు రేసులో వ్యాపారవేత్త సానా సతీష్ దూసు కురావడంతో సీనియర్ నేతలు మండిపడుతున్నారు. టీడీపీ, జనసేన పార్టీల్లో ఏదో ఒక దాన్నుంచి పోటీచేసేందుకు రెడీగా ఉండడం, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మద్దతు ఆయనకే ఉండడం జ్యోతుల నెహ్రూ వర్గానికి మింగుడు పడడంలేదు. నెహ్రూ తన కుమారుడు నవీన్‌కుమార్‌తో ఎంపీగా పోటీచేయించేందుకు చేస్తున్న ప్రయత్నాలకు అసలు పార్టీలో సభ్యత్వం కూడా లేని సతీష్ అడ్డుపడడం చర్చనీయాంశంగా మారింది. ఈ రెండు వర్గాల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఇక తుని నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా యనమల రామకృష్ణుడు కుమార్తె యనమల దివ్యను ఉన్నట్టుండి తీసుకొచ్చి ఇన్‌ఛార్జిగా నియమించారు. దీంతో అప్పటివరకు ఇన్‌ఛార్జిగా ఉన్న యనమలకు వరుసకు సోదరుడైన కృష్ణుడు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఒక దశలో ఆయన పార్టీకి దూరమయ్యేందుకు సిద్ధమయ్యారు. దివ్యను వ్యతిరేకిస్తూ ఆమె వర్గానికి చెందిన యనమల రాజేష్‌పై కృష్ణుడు వర్గం దాడి కూడా చేసింది. ఈ విభేదాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. అలాగే, అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఎంపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ బుచ్చిమహేశ్వరరావు కుమార్తె పాము సత్యశ్రీ తెరపైకి రావడంతో ఇప్పటివరకు పార్లమెంటు ఇన్‌ఛార్జిగా ఉన్న బాలయోగి తనయుడు గంటి హరీష్ అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

ఏలూరు ఎంపీ సీటుపై సిగపట్లు..



మాగంటి బాబు

ఇక ఏలూరు జిల్లా చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఎన్ఆర్ఐ సొంగా రోషన్‌ను నియమించడంతో ఆ సీటుపై ఆశలు పెట్టుకున్న టీడీపీ నేతలు భగ్గుమంటున్నారు. అలాగే, ఏలూరు పార్లమెంటు సీటు కోసం ఎన్ఆర్ఐ గొరుముచ్చు గోపాల్‌యాదవ్ ముందుకురావడంతో ఆ సీటు తమదేనని భావిస్తున్న మాగంటి బాబు, బోళ్ల కుటుంబీకులు ఆందోళనలో మునిగిపోయారు. గోపాల్ నాలుగు నెలలుగా లోకేశ్ పాదయాత్ర, చంద్రబాబు సభలకు ఫుల్‌పేజీ యాడ్స్ ఇస్తూ హడావిడి చేస్తుండడం, పార్టీ నేతలతో సంబంధం లేకుండా విడిగా తన హంగు ప్రదర్శిస్తుండడాన్ని కేడర్ జీర్ణించుకోలేకపోతోంది.


గుడివాడ, గుంటూరులో గరం గరం..



రావి

మరోవైపు.. కృష్ణాజిల్లా గుడివాడ ఇన్‌ఛార్జిగా ఎన్ఆర్ఐ వెనిగళ్ల రాముని నియమించడంతో టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్న రావి వెంకటేశ్వరరావు వర్గం ఆగ్రహంతో రగిలిపోతోంది. కేవలం ధన బలం ఉందనే కారణంతోనే రావిని కాదని వెనిగళ్లకు చంద్రబాబు సీటు ఖరారుచేయడం పార్టీ వర్గాలను నివ్వెరపరిచింది. అలాగే, గుంటూరు ఎంపీ సీటు రేసులో ఎన్ఆర్ఐ పెమ్మసాని చంద్రశేఖర్‌ను చంద్రబాబు రంగంలోకి దింపడం అక్కడున్న నేతలకు మింగుడుపడడంలేదు.

నాగబాబు ఎంట్రీతో అనకాపల్లిలో సీన్ రివర్స్..



అయ్యన్న పాత్రుడు

ఇక అనకాపల్లి టీడీపీ ఎంపీ అభ్యర్థిగా సీనియర్లను కాదని బయట ప్రాంతం నుంచి వచ్చిన బైరా దిలీప్‌కుమార్ పేరును తెరపైకి తీసుకొచ్చారు. టీడీపీ కార్యక్రమాలకు, లోకేశ్ యువగళం యాత్రకు భారీగా ఖర్చుచేసిన దిలీప్ టీడీపీ, జనసేన పొత్తులో పోటీచేయాలని ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు ఆయన్ను కూడా పక్కన పెట్టేలా పవన్‌కళ్యాణ్ సోదరుడు నాగబాబు ఎంట్రీ ఇచ్చారు. దీంతో ఆ సీటుపై గంపెడాశలు పెట్టుకున్న మాజీమంత్రి అయ్యన్నపాత్రుడి కుటుంబం ఆగ్రహంతో ఊగిపోతోంది. విజయనగరం జిల్లా శృంగవరపు కోటకు ఎన్ఆర్ఐ గొంప కృష్ణను దిగుమతి చేయడంతో అక్కడ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి వర్గం రగిలిపోతోంది. పార్వతీపురం అసెంబ్లీ ఇన్‌చార్జి కొత్తగా బోనెల విజయచంద్రను నియమించడంతో మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.



నాగబాబు

పల్నాడులో భాష్యం ప్రవీణ్ హల్‌చల్..



పుల్లారావు

పల్నాడు జిల్లాలో వ్యాపారవేత్త భాష్యం ప్రవీణ్ హడావుడితో సీనియర్ నేతలు మండిపడుతున్నారు. మొదట్లో ఆయన చిలకలూరిపేటపై దృష్టిపెట్టి మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావుకు ఎసరు పెట్టడంతో పార్టీలో అలజడి రేగింది. కేడర్ ఆందోళనతో ప్రవీణ్‌ను చిలకలూరిపేట నుంచి తప్పించినా ప్రస్తుతం పెదకూరపాడు సీటును ఆయనకు ఇస్తామని చంద్రబాబు సూచనప్రాయంగా చెప్పడంతో అక్కడి ఇన్‌ఛార్జి కొమ్మాలపాటి శ్రీధర్ ఆందోళన చెందుతూ తన వర్గంతో సమావేశాలు నిర్వహిస్తూ ఏంచేయాలో చర్చిస్తున్నారు.

ఎన్నికల ఫండ్ ఇచ్చిన వ్యక్తికి అందలం



బొల్లినేని రామారావు

నెల్లూరు జిల్లా ఉదయగిరి అభ్యర్థిగా ఎన్ఆర్ఐ కాకర్ల సురేష్‌ను దాదాపు ఖరారు చేశారు. లోకేశ్ సన్నిహితుడిగా ఉన్న ఆయన ఎన్ఆర్ఐల నుంచి ఎన్నికల ఫండ్ సేకరించి ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఆయన దెబ్బకు ఎన్నో ఏళ్లుగా పార్టీని నమ్ముకున్న మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావుకు సీటు నిరాకరించడంతో ఆయన వర్గం ఆగ్రహం వ్యక్తంచేస్తోంది. కావలి అభ్యర్థిగా పారిశ్రామికవేత్త కావ్య కృష్ణారెడ్డికి దాదాపు ఖరారుచేయడంతో అక్కడి ఇన్‌ఛార్జి సుబ్బానాయుడు, సీనియర్ నేత బీద రవిచంద్రలు గుర్రుగా ఉన్నారు. చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఇటీవలే పార్టీలో తిరుగుతున్న డాక్టర్ థామస్‌కే సీటిస్తానని చంద్రబాబు ప్రకటించడంతో పలువురు సీనియర్ నాయకులకు మింగుడు పడడంలేదు.

కళ్యాణదుర్గం రేసులో కాంట్రాక్టర్

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నుంచి కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్రబాబుని పోటీకి దింపేందుకు అధిష్టానం ప్రయత్నిస్తుండడం సీనియర్ నేతలకు ఇబ్బందికరంగా మారింది. ఉమ్మడి కడప జిల్లా బద్వేల్ టీడీపీ అభ్యర్థిగా నీటిపారుదల శాఖలో డీఈగా పనిచేస్తున్న బొజ్జా రోశన్న పేరును అనూహ్యంగా తెరపైకి వచ్చింది. ఇటీవల ఉద్యోగానికి రాజీనామా చేసి ఆయన రాజకీయాల్లోకి రావడంతో ఆ సీటుపై ఆశలు పెట్టుకున్న డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్ అభ్యర్థిత్వం ప్రశ్నార్థకమైంది.

గ్రూపులతో గుంజాటన

ఉమ్మడి విజయనగరం జిల్లాలో టీడీపీకి బీటలు

- ప్రతీచోటా తప్పని గ్రూపు తగాదాలు
- సీనియర్ నాయకులకూ తప్పని సెగ
- కొత్త ముఖాల రాకతో పాతవారి అసంతృప్తి
- ఎవరికివారే యమునాతీరే అన్న రీతిలో కార్యకలాపాలు
- కనుచూపు మేరలో కనబడని గెలుపు అవకాశాలు



సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఉమ్మడి విజయనగరం జిల్లా తెలుగుదేశం పార్టీలో వర్గపోరు మొదలైంది. మొత్తం అన్ని నియోజకవర్గాల్లో ఇది కనిపిస్తోంది. ఎవరికివారే సొంత గ్రూపులు ఏర్పాటు చేసుకుని కార్యకర్తలను గందరగోళంలోకి నెట్టేస్తున్నారు. కొత్తగా పార్టీలో చేరినవారికి అధిష్టానం ప్రాధాన్యం ఇస్తుండటం పాతనేతలకు మింగుడు పడటం లేదు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలను వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేసింది. నాటి నుంచి ఇక్కడి టీడీపీ నాయకులు జనానికి ముఖం చాటేశారు. ఇక రాబోయే ఎన్నికల్లో ఎలా ముందుకెళ్తారన్నది అగమ్యగోచరమే.

నాయుడు పక్కలో బల్లెంలా 'కరణం'

గజపతినగరం నియోజకవర్గంలో టీడీపీకి అంతా తానే అని భావిస్తున్న కేఏ నాయుడుకు పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ పక్కలో బల్లెంలా మారారు. ఇద్దరూ రెండు గ్రూపులుగా కార్యక్రమాలు చేపడుతుండటంతో కార్యకర్తలు గందరగోళంలో ఉన్నారు. దీనికి తోడు మాజీ మంత్రి పడాల అరుణ జనసేన తీర్థం పుచ్చుకున్నాక ఆమె కూడా పొత్తులో భాగంగా తనకే టికెట్ కేటాయించాలని యత్నిస్తున్నట్టు తెలిసింది.

విజయనగరంలో మూడు ముక్కలాట...

విజయనగరం నియోజకవర్గంలో మూడు గ్రూపులున్నాయి. దశాబ్దాలుగా పార్టీకి పెద్ద దిక్కుగా నిలిచిన అశోక్‌కు ఇంటా, బయటా వర్గ పోరు తప్పట్లేదు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే మీసాల గీతతోపాటు తాజాగా వాజీ కేబుల్ ఎండీ శ్రీనివాసరావు పోటీదారులుగా చేరారు. ఈ ఇద్దరి పోకడ అశోక్‌కు, ఆయన కుమార్తె అదితికి సుతరామూ ఇష్టం లేదు. బలమైన కాపు సామాజిక వర్గానికి చెందిన మీసాల గీత అశోక్ వర్గంపై పైచేయి సాధించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఎటువంటి సామాజిక బలం, ఓటుబ్యాంకు లేకున్నా కేవలం ఆర్థిక బలంతో నెట్టుకొచ్చేద్దామన్న ఆలోచనతో వాజీ సిటీ కేబుల్ ఎండీ శ్రీనివాసరావు మరోవైపు టికెట్ ప్రయత్నాలు చేస్తున్నారు. అశోక్ బంగ్లాతో ప్రమేయం లేకుండా పార్టీ కార్యక్రమాలు చేస్తున్నవారి జాబితాలో మీసాల గీత తర్వాత వాజీ శ్రీనివాసరావు చేరారు. ఆ ఇద్దరి నేతృత్వంలో జరిగే ఏ కార్యక్రమానికీ వెళ్లవద్దని పార్టీ కార్యకర్తలకు అశోక్ ఇప్పటికే హుకుం జారీచేశారు.

బేబినాయనకు కేడర్ సమస్య

బొబ్బిలిలో టీడీపీకి పెద్ద దిక్కుగా నిలుస్తున్న ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు(బేబీనాయన)కే టికెట్ లభిస్తుందనేది అందరి మాట. ఆయన సోదరుడు సుజయ్‌కృష్ణ రంగారావు సీన్‌లోకి వస్తే సీటు తన్నుకుపోతాడనే భయం బేబీనాయన అనుచరుల్లో ఉంది. కానీ మండలాల్లో కేడర్ మాత్రం ఆయనకు అనుకూలంగా లేదు. అన్నిచోట్లా గ్రూపు తగాదాలున్నాయి. రామభద్రపురం మండలంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడక తిరుపతి, కార్యనిర్వాహక కార్యదర్శి రామకృష్ణ గ్రూపుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. తెర్లాం మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్నాయుడు, బాడంగి మండల పార్టీ అధ్యక్షుడు తెంటు రవిబాబు పనితీరుపై కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు.

కళా, ప్రతిభల మధ్య నలుగుతున్న కోండ్రు

రాజాం నియోజకవర్గంలో ఆ పార్టీ అభ్యర్థిగా భావిస్తున్న కోండ్రు మురళీమోహన్‌కు అక్కడి సీనియర్ నేతలైన కిమిడి కళావెంకటరావు, కావలి ప్రతిభాభారతి వర్గాలతో తెగని పేచీ ఉంది. ఇప్పటికే రేగిడి మండలంలో కళా వెంకటరావు సోదరుడు కిమిడి రామకృష్ణంనాయుడు కోండ్రుపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. రాజాం మండలం పొగిరికి చెందిన టీడీపీ మాజీ ఎంపీపీ జడ్డు విష్ణుమూర్తి కోండ్రు ఆధ్వర్యంలో జరిగే ఏ కార్యక్రమానికీ రావట్లేదు. మరోవైపు ప్రతిభాభారతి కుమార్తె గ్రీష్మ ఈసారి తనకు ఎలాగైనా రాజాంలో పోటీ చేసే అవకాశం వస్తుందనే ఆశలో పావులు కదుపుతున్నారు.

గంటా పేరుతో గందరగోళం

చీపురుపల్లిలో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పేరు తెరపైకి రావడంతో గందరగోళ పరిస్థితి ఎదురైంది. ఆయన పోటీ చేసేందుకు విముఖత చూపుతున్నా చంద్రబాబు ఒత్తిడి చేస్తున్నట్టు తెలుస్తోంది. దీనిపై వారిద్దరి మధ్య వాదోపవాదాలు జరిగినట్టు వార్తలొచ్చాయి. గంటా ఇక్కడ పోటీ చేయకపోవచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి. తప్పనిసరైతే స్థానిక కేడర్ సహకారం ఏమాత్రం ఉంటుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో మరోసారి పోటీకి ఆసక్తి చూపుతున్న కిమిడి నాగార్జున అసంతృప్తితో ఉన్నారు. కొద్ది రోజులుగా ఆయన కార్యకర్తలకు అందుబాటులో లేకుండా పోయారు. అంతో ఇంతో కేడర్ బలమున్న కుచ్చర్లపాటి త్రిమూర్తులురాజుకు ప్రతిసారీ పార్టీ అధిష్టానం మొండి చెయ్యి చూపిస్తుండటంతో ఆయన స్తబ్దుగానే ఉన్నారు.

కోళ్లకు కృష్ణ సెగ

శృంగవరపుకోటను మొదటి నుంచీ ఏలుతున్న కోళ్ల కుటుంబానికి గొంప కృష్ణ రూపంలో సెగ తగులుతోంది. మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తానే సీనియర్‌ననీ... లోకేశ్ ఆశీస్సులు తనకే ఉన్నాయని చెప్పుకుంటుండగా చంద్రబాబు అండతో ప్రవాస భారతీయుడు గొంప కృష్ణ వివిధ సేవాకార్యక్రమాలు చేపడుతూ కార్యకర్తలను తనవైపునకు తిప్పుకుంటున్నారు. ఆయన దూకుడుకు కళ్లెం వేసేందుకు లలిత కుమారి ప్రతి గ్రామానికి వెళ్లి బంధువుల ఇళ్లల్లో అంతరంగిక సమావేశాలు పెడుతున్నారు.

నెల్లిమర్లలో అంతా అయోమయం

నెల్లిమర్ల టీడీపీ టికెట్ ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జి భోగాపురం మండలానికి చెందిన కర్రోతు బంగార్రాజుకు ఖరారైనట్లేనని ఆయన అనుచరులు చెబుతున్నారు. అయినా మరో ముగ్గురు ఆశావహులు టికెట్ కోసం తెగ ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో డెంకాడ మండలానికి చెందిన కంది చంద్రశేఖర్, పూసపాటిరేగ మండలానికి చెందిన పతివాడ తమ్మునాయుడు, నెల్లిమర్ల మండలానికి చెందిన కడగల ఆనంద్‌కుమార్ ఉన్నారు. బంగార్రాజు స్పీడుకు మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు వర్గీయులు చెక్ పెట్టే పనిలో ఉన్నారు. ఈ స్థానాన్ని పొత్తులో భాగంగా జనసేనకు కేటాయిస్తే ఆ పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గం ఇన్‌చార్జి లోకం మాధవికే అవకాశం ఉంటుందన్న ప్రచారమూ లేకపోలేదు.

నిమ్మకకు పెరిగిన అసమ్మతి

పాలకొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణకు సొంత పార్టీలోనే అసమ్మతి పెరిగిపోతోంది. ఆయనకు పోటీగా పడాల భూదేవి, వంగర మండలానికి చెందిన ఉపాధ్యాయురాలు తేజోవతి కళా వెంకటరావు ప్రోత్సాహంతో టికెట్ కోసం పోటీపడుతున్నారు. నియోజకవర్గంలో ప్రధాన టీడీపీ నాయకులైన సామంతుల దామోదరరావు, ఖండాపు వెంకటరమణ తదితరులు నిమ్మక తీరుపై గుర్రుగా ఉన్నారు. వారు భూదేవికి పరోక్షంగా మద్దతిస్తున్నారు. వీరికి అచ్చెన్నాయుడు అండగా నిలుస్తున్నట్టు తెలుస్తోంది. మొత్తమ్మీద ఈ వ్యవహారాలవల్ల నియోజకవర్గంలోని కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొంది.

కురుపాంలో కుమ్ములాట...

కురుపాంలో టీడీపీ టికెట్ కోసం ఎనిమిది మంది కుమ్ములాడుకుంటున్నారు. తోయక జగదేశ్వరికి నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు ఇప్పించడంలో మాజీ ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు కీలక పాత్ర పోషించారు. ఇది నచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దత్తి లక్ష్మణరావు మరో ఏడుగురు ఆశావాహులను తెరపైకి తెచ్చారు. ఎవరో ఒకరికి టికెట్ ఇప్పించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పనిలో పనిగా ప్రదీప్‌కుమార్ దేవ్ తనయుడు వీరేశ్‌దేవ్ కూడా టికెట్‌కోసం అశోక్ గజపతి ద్వారా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇక్కడ అభ్యర్థి తెలియక కార్యకర్తల్లో అయోమయం నెలకొంది.

పార్వతీపురంలో తెరపైకి ఎన్నారై

దశాబ్దాలుగా పార్టీకి అండగా ఉన్న మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులుకు చంద్రబాబు మొండిచేయి చూపించారు. ఇక్కడ డబ్బు పెట్టగలిగిన ప్రవాస భారతీయుడు బోనెల విజయచంద్రను తెరపైకి తెచ్చారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తానన్న బాబు హామీతో చిరంజీవులు కార్యక్రమాల్లో పాల్గొంటున్నా... అంత ఉత్సాహం అయితే ఆయనలో కనిపించడం లేదు. మరో సీనియర్ నాయకుడు గర్భాపు ఉదయభానుకు చంద్రబాబు గత రెండు ఎన్నికలుగా మొండిచేయి చూపడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడానికి నిర్ణయించుకున్నారు.

సాలూరులో ఆగని వర్గపోరు...

సాలూరులో టీడీపీ నాయకులు గుమ్మడి సంధ్యారాణి, ఆర్.కె.భంజ్‌దేవ్ మధ్య వైరం కొనసాగుతోంది. ఇరువురూ బయటకు సన్నిహితంగా ఉంటున్నట్టు కనిపిస్తున్నా... ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటూనే ఉన్నారు. వీరిరువురి మధ్య సయోధ్య కుదర్చలేని అధిష్టానం ఇక్కడ కూడా ఓ ఎన్‌ఆర్‌ఐని బరిలో నిలపాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

హే..'కృష్ణా'..

ఉమ్మడి కృష్ణా జిల్లాలో 'తమ్ముళ్ల' లొల్లి

ఇదేమి తంటా ?

చాలా నియోజకవర్గాల్లో పారాచూట్ నేతలకే ప్రాధాన్యం

- మైలవరంలో తెరపైకి కేశినేని చిన్ని
- విజయవాడ సెంట్రల్, ఎంపీ సీటుపై బీజేపీ పట్టు
- పెనమలూరులో అభ్యర్థి ఎంపికపై నో క్లారిటీ
- తిరువూరులో తేలని టికెట్ పంచాయితీ
- జగ్గయ్యపేటలో మరో కొత్త అభ్యర్థి నేనే అంటూ ఫ్లెక్సీ
- గందరగోళంలో జుట్టు పీక్కుంటున్న తమ్ముళ్లు



సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్నికల షెడ్యూల్ ప్రకటించక ముందే టీడీపీలో టికెట్ల లొల్లి మొదలైంది. ఐదేళ్లు పార్టీ కోసం పని చేసిన వారికి కాకుండా హఠాత్తుగా దిగిపడుతున్న పారాచూట్ నేతలకు చంద్రబాబు పెద్ద పీట వేస్తుండటం టీడీపీలో తమ్ముళ్లను కకావికలం చేస్తోంది. జనసేన పొత్తుతోపాటు, బీజేపీతో కూడా ఖాయం అనుకుంటున్న పొత్తు టీడీపీ నేతల టికెట్ అవకాశాలను దెబ్బతీస్తోంది. దీంతో సీనియర్ నేతలతోపాటు, ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు మొండి చెయ్యి మిగలనుందని స్పష్టం అవుతోంది. దీంతో అసలు పార్టీలో ఏమి జరుగుతోందో అన్న స్పష్టత లేక టీడీపీ తమ్ముళ్లు మరింత గందరగోళానికి గురవుతున్నారు.

బొండా ఉమాకు సీటు గండం

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో తనకు పోటీ లేదని భావిస్తున్న బొండా ఉమాకు గడ్డుకాలం మొదలైంది. బీజేపీ పొత్తు రూపంలో ఆయనకు గండం పొంచి ఉంది. దీనికితోడు వంగవీటి రాధా సైతం తనకే సీటు కావాలని పట్టు పడుతుండటంతో విజయవాడ సెంట్రల్ అభ్యర్థి ఎవరన్నది తేలక నేతలు అయోమయంలో పడ్డారు. మరోవైపు పొత్తులో భాగంగా సెంట్రల్ సీటు బీజేపీకి కేటాయిస్తే బొండా టికెట్ గల్లంతు కావడం ఖాయం.

తిరువూరు తెరపైకి రోజుకో అభ్యర్థి...

తిరువూరు నియోజకవర్గంలో రోజుకో అభ్యర్థి పేరు తెరపైకి వస్తోంది. ఇప్పటికే అక్కడ టీడీపీ ఇన్‌చార్జిగా శావల దేవదత్తు ఉన్నారు. ఆయనను కాదని కొలికిపూడి శ్రీనివాస్ తనదే టికెట్ అని ప్రచారం చేసుకుంటున్నారు. అక్కడ మరికొందరు నేతలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుని గ్రామాల్లో తమదే టికెట్ అని చేసుకొంటున్న ప్రచారం అక్కడ తమ్ముళ్లలో అయోమయం నెలకొంది. వైఎస్సార్‌సీపీ టికెట్ నిరాకరించడంతో సిట్టింగ్ ఎమ్మెల్యే రక్షణనిధి కూడా టీడీపీ తరఫున టికెట్ రేసులోకి వచ్చారు. తీరా ఎన్నికల సమయానికి ఇక్కడికి పారాచూట్ నేతలను తీసుకొస్తుండటంతో తెలుగు తమ్ముళ్లలో నైరాశ్యం నెలకొంది.

జగ్గయ్యపేట అభ్యర్థి నేనే'నయా'

ఇప్పటికే చంద్రబాబు జగ్గయ్యపేట నియోజకవర్గం పర్యటనలో పార్టీ అభ్యర్థిగా శ్రీరాం తాతయ్యను ప్రకటించారు. కానీ అక్కడ మాజీ మంత్రి నెట్టెం రఘురాం చాపకింద నీరులా టికెట్ కోసం ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ఇది చాలదన్నట్లు మరో టీడీపీ నాయకుడు బొల్లా రామకృష్ణ పేరుతో 'గెలిస్తే న్యాయం చేస్తా, ఓడినా సాయం చేస్తా, మన జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నా' అంటూ జగ్గయ్యపేటలో వెలిసిన ఫ్లెక్సీలు అక్కడ టికెట్‌పై కొత్త చర్చకు దారితీసేలా చేశాయి. చంద్రబాబు ఇప్పటికే ఇన్‌చార్జిలుగా ప్రకటించిన అభ్యర్థుల్లో సైతం తమకు బీ ఫాం ఇచ్చే వరకు టికెట్ అనుమానమే అన్న భావనను పలువురు వ్యక్తంచేస్తున్నారు. ఇది క్యాడర్‌లో తీవ్ర గందరగోళం రేపుతోంది.

మైలవరంలో తెరపైకి కేశినేని చిన్ని

వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరి మైలవరం అభ్యర్థిగా పోటీ చేద్దామనుకుంటున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు ఎదురుదెబ్బ తగిలింది. బీజేపీతో పొత్తు ఆయన సీటుకు ఎసరు పెట్టనుంది. ఎంపీ సీటుపై బీజేపీ కర్చీఫ్ వేసింది. ఈ నేపథ్యంలో చిన్నికి ఎక్కడైనా టికెట్ కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆయన్ను మైలవరం నుంచి పోటీ చేయించాలని టీడీపీ భావిస్తోంది. అదే జరిగితే మైలవరంపై ఆశలు పెట్టుకున్న వసంతకు ఆశాభంగమే. దీంతో ఆయన్ను బుజ్జగించడానికి పెనమలూరు టికెట్ ఇస్తామని చెబుతున్నారు. కానీ అక్కడ బోడే ప్రసాద్ వర్గం అందుకు ససేమిరా అంటోంది. మరోవైపు దేవినేని ఉమా పరిస్థితి ఏమిటన్నది అంతుచిక్కడం లేదు. ఇప్పటికే మైలవరంలో టికెట్ ఆయనకు లేదని తేలిపోవడంతో పెనమలూరుపై ఆయన ఆశలు పెట్టుకున్నారు. అక్కడ బోడే వర్గంతోపాటు, వసంత పోటీకి రావడంతో పరిస్థితి సంక్లిష్టంగా మారింది. కుప్పంలో ఎదురుగాలి వీస్తుండటంతో చంద్రబాబు మరో నియోజకవర్గంలో పోటీ చేయాలని భావిస్తున్నారు. ఆయన కన్ను పెనమలూరుపై పడిందని సమాచారం. అదే జరిగితే బోడే ప్రసాద్, వసంత, దేవినేని ఉమా ముగ్గురి సీట్లు గల్లంతయినట్టే.


సీట్లు తన్నుకు పోతున్న పారాచూట్‌లు...

ఇప్పటికే నూజివీడులో కొలుసు పార్థసారథి, గన్నవరంలో యార్లగడ్డ వెంకట్రావు, గుడివాడలో ఎన్‌ఆర్‌ఐ వెనిగండ్ల రాము పారాచూట్‌లుగా వచ్చి టికెట్లు తన్నుకుపోయారు. మరోవైపు ఇతర నియోజకవర్గాల్లో కూడా పారాచూట్లకు చంద్రబాబు ప్రాధాన్యత ఇస్తుండటంతో పార్టీకోసం పనిచేసిన నేతలు అధిష్టానంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

వారిద్దరిపై నిరాధార ఆరోపణలా?

ఏజీ శ్రీరామ్, మనోహర్‌రెడ్డిలపై హైకోర్టులో కేసు కొట్టివేత

- న్యాయవాది అయి ఉండీ ఇదేం పని?
- ఇందుకు రూ.లక్ష ఖర్చులు విధించేవాళ్లం.. కానీ ఊరుకుంటున్నాం
- న్యాయవాది గుండాల శివప్రసాద్‌రెడ్డిపై హైకోర్టు మండిపాటు
- వారిద్దరి ప్రతిష్ట దెబ్బతీసేలా ఎలాంటి ఆధారాల్లేకుండా ఆరోపణలా?
- వ్యక్తిగత కక్ష సాధింపు కోసమే పిటిషన్ అంటూ వ్యాఖ్య
- సీజే నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు



సాక్షి, అమరావతి: రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్‌తోపాటు హైకోర్టులో మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల స్టాండింగ్ కౌన్సిల్‌గా వ్యవహరిస్తున్న మలసాని మనోహర్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తూ న్యాయవాది గుండాల శివప్రసాద్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టేసింది. అతనిపై తీవ్రస్థాయిలో మండిపడింది. వ్యక్తిగత కక్ష సాధింపులో భాగంగానే ఏజీ శ్రీరామ్, స్టాండింగ్ కౌన్సిల్ మనోహర్‌రెడ్డిపై ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రజా ప్రయోజనాలను ఆకాంక్షించి ఈ వ్యాజ్యం దాఖలు చేయలేదని ఆక్షేపించింది. శివప్రసాద్‌రెడ్డి తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపింది. కేవలం ఊహలు, అనుమానాల ఆధారంగా శ్రీరామ్, మనోహర్ రెడ్డిలపై వారి ప్రతిష్ట దెబ్బతినేలా ఆరోపణలు చేశారని స్పష్టంచేసింది. వృత్తిపరంగా న్యాయవాది అయి ఉండీ శివప్రసాద్ ఇలా చేశారని వ్యాఖ్యానించింది. ఇలాంటి వ్యాజ్యాలు దాఖలు చేసే పిటిషనర్లకు భారీ జరిమానా విధించి ఇటువంటి ధోరణికి అడ్డుకట్ట వేయాలని సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని హైకోర్టు గుర్తుచేసింది. మామూలుగా అయితే శివప్రసాద్‌రెడ్డికి రూ.లక్ష ఖర్చులను విధించేవారమని.. అయితే అతను వృత్తిపరంగా న్యాయవాది అయినందున ఆ పనిచేయడం లేదని తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. ఏజీ శ్రీరామ్, స్టాండింగ్ కౌన్సిల్ మనోహర్‌రెడ్డిలు వ్యక్తిగత ప్రయోజనాల కోసం తప్పుడు మార్గాల్లో వెళ్తున్నారని, దీనిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ న్యాయవాది గుండాల శివప్రసాద్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మనోహర్‌రెడ్డి నియామక ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. అంతేకాక... ఈ వ్యాజ్యంలో శ్రీరామ్, మనోహర్‌రెడ్డిలపై పలు నిరాధార ఆరోపణలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల సీజే ధర్మాసనం విచారణ జరిపి తీర్పు వాయిదా వేసింది. తాజాగా.. ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది.

పొడిగింపు ఇవ్వనందుకే ఆరోపణలు..

గతంలో మనోహర్‌రెడ్డి నియామకాన్ని సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేసిన ఓ న్యాయవాదికి ఆ తరువాత స్టాండింగ్ కౌన్సిల్ పదవి ఇచ్చారని, ఇది క్విడ్ ప్రో కోలో భాగంగా జరిగిందన్న శివప్రసాద్‌రెడ్డి వాదనపై ధర్మాసనం విస్మయం వ్యక్తంచేసింది. అయితే, శివప్రసాద్‌రెడ్డి అలా లబ్ధిపొందిన న్యాయవాది నియామకాన్ని సవాలు చేయలేదని తెలిపింది. ఈ వ్యాజ్యాన్ని ప్రజా ప్రయోజనాలను ఆశించి దాఖలు చేయలేదన్న ధర్మాసనం, స్టాండింగ్ కౌన్సిల్ పోస్టుకు మరోసారి మనోహర్‌రెడ్డి పేరును సిఫారసు చేసినందుకు ఏజీ శ్రీరామ్‌పై సీబీఐ దర్యాప్తు కోరుతున్నారని, ఇదంతా తన వ్యక్తిగత కక్ష సాధింపులో భాగంగానే చేసిందని తన తీర్పులో పేర్కొంది. మనోహర్‌రెడ్డిపై శివప్రసాద్‌రెడ్డి చేసిన ఆరోపణలకు ఆధారాల్లేవని తేల్చింది. శ్రీరామ్, మనోహర్‌రెడ్డిలపై చేసిన తీవ్ర ఆరోపణలు వారి ప్రతిష్టను దెబ్బతీసే విధంగా ఉన్నాయని ధర్మాసనం తెలిపింది. శివప్రసాద్‌రెడ్డి గతంలో తనకున్న పోస్టుకు పొడిగింపు ఇవ్వలేదన్న బాధతో శ్రీరామ్‌పై ఆరోపణలు చేసినట్లు కనిపిస్తోందని తెలిపింది. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజాప్రయోజన వ్యాజ్యాల పేరుతో దాఖలు చేసే పిటిషన్లను విచారించే విషయంలో జాగ్రత్తగా ఉండాలని సుప్రీంకోర్టు పలుమార్లు పునరుద్ఘాటించిందని ధర్మాసనం తన తీర్పులో గుర్తుచేసింది. వ్యక్తిగత దురుద్దేశాలు, వ్యక్తిగత ప్రయోజనాలతో పాటు ప్రచారాన్ని ఆశించి దాఖలు చేసే ఇలాంటి వ్యాజ్యాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కూడా చెప్పిందని ధర్మాసనం తెలిపింది. వ్యక్తిగత కక్ష సాధింపులో భాగంగానే ఈ వ్యాజ్యం దాఖలు చేశారని తేల్చిన ధర్మాసనం దాన్ని కొట్టేస్తున్నట్లు తెలిపింది.

కాంట్రాక్టర్లతోనే టీడీపీ కాంటాక్ట్!

ఎన్నికల పరిశీలకుడి ముందే నిరసనలకు దిగిన నేతలు

- అనంతపురంలో మాసినేని హోటల్ వేదికగా బుజ్జగింపులు
- టికెట్ ఇవ్వకపోతే టీడీపీకి పనిచేసేది లేదని బెదిరింపులు
- కావాల్సింది డబ్బున్నవారా.. పనిచేసే వాళ్లా అనేది తేల్చుకోవాలని హెచ్చరికలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఎన్నికల వేళ తెలుగుదేశం పార్టీలో అసమ్మతి రాగం పెరుగుతోంది. ఏళ్ల తరబడి పార్టీ జెండా మోసిన నాయకులు నిప్పులు చెరుగుతున్నారు. రెండు రోజులుగా అనంతపురంలో మాసినేని హోటల్‌లో మకాం వేసిన టీడీపీ ఎన్నికల పరిశీలకుడి ముందే ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన తెలుగు తమ్ముళ్లు తమ నిరసనాగ్రహం వ్యక్తం చేయడంతో ఆ పార్టీలో అంతర్గత కలహాలు బట్టబయలయ్యాయి. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి తమ అనుచరులతో వచ్చిన నేతలు 'పనిచేసిన వారికి టికెట్ ఇస్తారా.. లేక నిన్నగాక మొన్న వచ్చిన కాంట్రాక్టర్లకు, డబ్బున్న నేతలకు కట్టబెడతారా' అని నిలదీశారు. వీరే కాకుండా జిల్లాలో పలు నియోజకవర్గాల నుంచి నేతలు అనంతపురం చేరుకుని తమ నిరసన గళం వినిపిస్తున్నారు.

టికెట్ ఇవ్వకపోతే సహకరించేది లేదు

పార్టీలో ఏళ్లతరబడి పనిచేసిన వారికి కాకుండా ఎన్నికలు వచ్చేనాటికి వేరే వాళ్లకు టికెట్లు ధారాదత్తం చేస్తే సహకరించేది లేదని పలువురు నేతలు తెగేసి చెబుతున్నారు. ఏ నియోజకవర్గాల్లో ఎలా అంటే...

- ▲ కొత్తగా పార్టీలోకి వచ్చిన అమిలినేని సురేంద్రకు టికెట్ ఇస్తే తాము కలిసి పనిచేయబోమంటూ కల్యాణదుర్గం నియోజకవర్గ టీడీపీ నేతలు ఉన్నం మారుతీ చౌదరి, ఉమామహేశ్వర నాయుడు తేల్చి చెప్పారు.
- ▲ శింగనమల టికెట్‌ను బండారు శ్రావణికి ఇవ్వొద్దంటూ నియోజకవర్గ టూమెన్ కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు గట్టిగా ఒత్తిడి తీసుకొస్తున్నారు.



అనంతపురంలోని మాసినేని హోటల్లో ఘర్షణపడుతున్న పల్లె, వేణుగోపాల్ వర్గీయులు

- ▲ గుంతకల్లులో కొత్త అభ్యర్థి తెరమీదకు వస్తున్నారన్న వార్తలతో ఆ నియోజకవర్గ నేతలు నిప్పులు చెరుగుతున్నారు.
- ▲ మేము పార్టీ కోసం కష్టపడ్డాం.. ధర్మవరం సీటు మాకే ఇవ్వాలని పరిటాల సునీతవర్గం పట్టుబడుతోంది.
- ▲ కదిరి ఎమ్మెల్యే టికెట్ చెక్ బౌన్సు కేసులో శిక్షపడిన కందికుంట ప్రసాద్ కుటుంబానికి టికెట్ ఇవ్వొద్దని బీసీ నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కందికుంటకు ఇస్తే కచ్చితంగా ఓడిపోతామని చెబుతున్నారు.

కొట్లాటకు దిగిన నేతలు...

తెలుగుదేశం పార్టీలో అసంతృప్తులు ఏ స్థాయిలో ఉన్నాయనడానికి వరుసగా జరుగుతున్న గొడవలే సాక్ష్యం. శుక్రవారం పలువురు నేతలు మాసినేని హోటల్లో అబ్జర్వర్‌ను కలిసిన అనంతరం గొడవకు దిగారు. పుట్టపర్తి టికెట్ ఆశిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్, పల్లె రఘునాథరెడ్డి వర్గీయులు హోటల్‌లోనే బాహాబాహీకి దిగారు. అంతకుముందు రోజే అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత, కాపు సామాజికవర్గానికి చెందిన నేతపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడినట్టు తెలిసింది. నాలుగు రోజుల కిందట ఓ తెలుగుదేశం పార్టీ నాయకుడి ఫాం హౌస్‌లో ఒక దళిత నేతపై దాడిచేసినట్టు ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. టికెట్లు రాకముందే రోజుకో గొడవ జరుగుతుంటే అధికారిక ప్రకటన వెలువడితే పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆ పార్టీ అభిమానుల్లో ఇప్పటి నుంచే గుబులు పట్టుకుంది.

'కొల్లు'వి సొల్లు మాటలు

- ఓటమి భయంతోనే దగాకోరు, అబద్ధపు వ్యాఖ్యలు
- ఐదేళ్లు మంత్రి పదవి అనుభవించి ప్రజాధనం దోచుకున్నారు
- ఎంయూడీఏ పేరుతో 33 వేల ఎకరాల బలవంతపు భూసేకరణకు యత్నం
- మామ, అల్లుళ్లు పేదవానికి ఒక్క పట్టా కూడా ఇవ్వలేదు
- మా తండ్రి నుంచి ఇప్పటివరకు ప్రజా సంక్షేమం, అభివృద్ధికే కృషిచేశా
- 1,700 ఎకరాల ప్రభుత్వ భూముల్లోనే పోర్టు నిర్మిస్తున్నాం
- మాజీమంత్రి కొల్లు రవీంద్రపై ఎమ్మెల్యే పేర్ని నాని ఫైర్



చిలకలపూడి (మచిలీపట్నం): మాజీ మంత్రి కొల్లు రవీంద్ర ఓటమి భయంతోనే సంధి ప్రేలాపనలు, సొల్లు మాటలు మాట్లాడుతున్నారని మరో మాజీ మంత్రి, కృష్ణాజిల్లా మచిలీపట్నం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పేర్ని నాని విమర్శించారు. విషయ పరిజ్ఞానం.. సిగ్గూఎగ్గూ లేకుండా ఆయన, ఆయన మామ తమను దొంగ నాటకాలు ఆడుతున్నామని చేసిన వ్యాఖ్యల్లో నిజానిజాలు నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునన్నారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథిగృహంలో శుక్రవారం పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

పేర్ని కృష్ణమూర్తి, పేర్ని నాని ఏం చేశారో.. నువ్వు, మీ మామ ఏం చేశారో ప్రజలకు తెలుసు. పేర్ని కృష్ణమూర్తి ఎమ్మెల్యేగా ఉండగా మూడు స్తంభాల సెంటరు నుంచి బైపాస్ రోడ్డు అంతా పట్టాలిచ్చారు. అదే మీ మామ హయాంలో పేదవానికి ఒక్క ఇంటి స్థలమైనా ఇచ్చారా? మూడు సెంట్ల స్థలం ఇస్తామని మాయమాటలు చెప్పి ఒక్క సెంటు కూడా ఇవ్వలేదు. దగా కుటుంబం మీదా, మాదా? డ్రామాలు, భయం, కంగారుతో ఏం మాట్లాడుతున్నారో 'కొల్లు'కు అర్థంకావటంలేదు. ఐదేళ్లపాటు మంత్రి పదవి అనుభవించి ప్రజాధనాన్ని దోచుకున్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఎంయుడీఏ పేరుతో 22 గ్రామాల్లో రోడ్లు, పంటబోదెలు, శ్మశానం, రైతుల ఇళ్లు, భూములతో కలిపి 33 వేల ఎకరాలు లాక్కునేందుకు ప్రయత్నించారు. మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి రూ.2ల వడ్డీతో రూ.200 కోట్లు తెచ్చి ఏం చేశారు? 2019 మార్చి 7న ఎలాంటి పర్యావరణ అనుమతి, రుణం మంజూరు కాకుండా సుమారు రూ.8.65 కోట్లతో పోర్టుకు మొక్కుబడిగా శంకుస్థాపన చేసి బందరు ప్రజలను దగాచేసిన మీది దగా కుటుంబం కాదా? కానీ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2023 మే 22న శంకుస్థాపన చేసి 1,700 ఎకరాల ప్రభుత్వ భూమిలో మాత్రమే పనులు ప్రారంభించారు. 2025 జనవరి నాటికి షిప్ వచ్చేలా పోర్టు పనులు జరుగుతున్నాయి. ఇక సీఎం జగన్ అనుమతితోనే ఎంయూడీఏలో ఉన్న నిధుల్లో రూ.20 కోట్లకు అనుమతి తీసుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నాం. చిన్నాపురం, కమ్మవారిచెరువు రహదారి, కోడూరు-ఉల్లిపాలెం వంతెన ఎవరి హయాంలో మంజూరయ్యాయో నీకు తెలియదా? మరోవైపు.. కొనకళ్ల గణపతి పార్కుతో తీర్మానం చేశామని ప్రేమతో చెబుతున్న కొల్లు రవీంద్ర.. రాబోయే ఎన్నికల్లో కొనకళ్లకు సీటు ఇవ్వొద్దని చంద్రబాబుకు చెప్పిన మాటలు మర్చిపోయావా?.

స్థాయిలేని నీతో చర్చ ఏంటి?

ఇక కుమ్మరిగూడెం వాసులను ఖాళీ చేయించి స్టేడియం కడదామని చూసిన రవీంద్ర ఆ కుమ్మరులకు ధైర్యాన్నిచ్చి అండగా నిలిచిన వాడు పేర్ని నాని ఒక్కడే. 2017 జనవరి 31న కొల్లు రవీంద్ర మంత్రిగా ఉన్న హయాంలోనే 3 వేల ఎకరాల శ్మశానం, రైతుల భూములు లాక్కునేందుకు జీఓ తేలేదా? ఎసైన్‌మెంట్ చట్టం ప్రకారమే భూములను స్వాధీనం చేసుకుని రెవెన్యూ సిబ్బంది కష్టపడి సబ్ డివిజన్ చేసి పేదలకు పట్టాలిచ్చేందుకు ప్రయత్నిస్తున్న వారిని వేలెత్తి చూపే అర్హత నీకులేదు. అర్హత కలిగిన ప్రతి పేదవాడికి మేలు చేసే పనిచేస్తాం. నియోజకవర్గ ప్రజలను మోసం చేసేలా దగాకోరు మాటలు చెబుతున్న నీలాంటి స్థాయిలేని వారితో నేను చర్చకు రావటం ఏమిటి?

అప్పటి సర్వీస్ కమిషన్ కాదు బాసూ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్‌సర్వీస్ కమిషన్.. ఒకప్పుడు చంద్రబాబు సేవలో తరించిన ఈ సంస్థ.. ఇప్పుడు నిరుద్యోగుల సేవలో లీనమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ సంస్థను పూర్తిగా ప్రక్షాళన జరిపి, నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చే కేంద్రంగా మలిచారు. ఇది గత నాలుగున్నరేళ్లల్లో 78 నోటిఫికేషన్లు ఇచ్చి, 6,296 ఉద్యోగాలను వివాద రహితంగా భర్తీ చేసింది. అంతేకాకుండా సచివాలయాల్లో ఒకేసారి 1.21 లక్షల మందిని నియమించి రికార్డు సృష్టించింది. గత ప్రభుత్వంలో నోటిఫికేషన్లు ఇచ్చి వివాదాల్లో ఉన్నవాటిని సైతం పరిష్కరించి, పోస్టుల భర్తీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ఇందులో విద్యావంతులైన నిరుద్యోగ యువతకు మేలు చేసేలా గ్రూప్–1, గ్రూప్–2 వంటి గెజిటెడ్ పోస్టులతో పాటు, వివిధ శాఖల్లో అసిస్టెంట్ ఇంజినీర్లు, అగ్రికల్చరల్ ఆఫీసర్లు, మరెన్నో నాన్ గెజిటెడ్ పోస్టులకు నియామకాలు పూర్తి చేశారు. ఒక్క కోర్టు కేసు లేదు.. ఒక్క విమర్శా లేదు.. ఒక్క ఫిర్యాదూ లేదు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో దేశంలోని 15 రాష్ట్రాల సర్వీస్ కమిషన్లు వివాదాల్లో చిక్కుకుంటే, వివాద రహితంగా ఉద్యోగాలు భర్తీ చేసిన బోర్డుగా ఏపీపీఎస్సీ ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక్కడే పచ్చ మీడియా బాసు రామోజీకి కాలేది. 'ఏ వివాదం లేకుండా, ఉద్యోగాలెలా ఇచ్చేస్తారు? అసలు వివాదాలు పెట్టేదే ఉద్యోగాలు ఎగ్గొట్టడానికి కదా. చంద్రబాబు హయాంలో అంతా ఇలానే జరిగింది కదా! ఇప్పుడంతా సక్రమంగా జరగడమేంటి' అంటూ లోలోన మండిపోయి.. ఏపీపీఎస్సీపై ఓ బండ వేయాలని చూశారు. చంద్రబాబు హయాంలో ఏపీపీఎస్సీలో చైర్మన్, సభ్యుల నియామకాల్లో జరిగిన ఆశ్రిత పక్షపాతం, అవకతవకలను వదిలేసి, ఇప్పుడు కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామకాలన్నీ రాజ్యాంగబద్ధంగా జరిగినప్పటికీ, ''ఏపీపీఎస్సీనా? వైసీపీఎస్సీనా?'' అంటూ ఈనాడు పత్రికలో విషం కక్కారు.

ఇప్పుడు ఉన్నది సమర్థవంతమైన ఏపీపీఎస్సీ

- గతంలోఏపీపీఎస్సీనీ అక్రమాలకు అడ్డాగా మార్చిన చంద్రబాబు
- ఎన్నారైల నుంచి పార్టీ ఫండ్ ఇప్పించిన వ్యక్తి చైర్మన్
- తన వర్గం వారికే సభ్యులుగా అవకాశం.. తాము చెప్పినట్టే చేయాలని హుకుం
- 2016 గ్రూప్–2 నిర్వహణలో జరిగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు
- కొన్ని సెంటర్లలో సాయంత్రం 5 నుంచి పరీక్ష.. ప్రశ్నల లీకేజీ
- ఈ వ్యవహారంపై పెద్ద ఎత్తున ఆందోళనలు
- 2014–18 మధ్య ఇచ్చిన నోటిఫికేషన్లపై 350కి పైగా కేసులు నమోదు
- మొత్తం ఏపీపీఎస్సీని ప్రక్షాళన చేసిన సీఎం వైఎస్ జగన్
- అర్హతలు, సమర్థత, నిరుద్యోగుల బాధలు తెలిసిన వారికి కమిషన్‌లో అవకాశం
- ఎటువంటి వివాదాల్లేకుండా, విజయవంతంగా పరీక్షల నిర్వహణ
- గత నాలుగేళ్లల్లో 78 నోటిఫికేషన్లు ఇచ్చి, 6,296 ఉద్యోగాల భర్తీ
- 1.21 లక్షల మందిని సచివాలయాల్లో నియమించడం దేశంలోనే ఓ రికార్డు
- దేశంలో వివాద రహిత కమిషన్‌గా ఏపీపీఎస్సీకి గుర్తింపు
- అయినా ఏపీపీఎస్సీపై విషం కక్కిన రామోజీ

కమిషన్‌ను కమీషన్లతో నింపేసిన బాబు

చంద్రబాబు సీఎంగా ఉండగా ఏపీపీఎస్సీని తన అభిమానులు, తనకు సేవ చేసే వారితో నింపేశారు. ఆయన హయాంలో నోటిఫికేషన్లు ఇచ్చినా పరీక్షలు ఎప్పుడు జరిగేది, నియామకాలు ఎప్పుడు పూర్తయ్యేదీ తెలియని పరిస్థితి. ఇచ్చిన ప్రతి నోటిఫికేషన్ పైనా అనేక వివాదాలు.. కోర్టు కేసులు వంటి కారణాలతో నిలిచిపోవడమో లేక పరీక్షలు రద్దు కావడమో జరిగేవి. 2014–18 మధ్య ఇచ్చిన నోటిఫికేషను వేళ్లపై లెక్కించేవే అయినా దాదాపు 350కి పైగా కేసులు పడ్డాయి. అసలు సభ్యుల నియామకమే కమీషన్లపై జరిగిందని ఆ పార్టీలోని ముఖ్య నేతలే విమర్శించారు. 2014 ఎన్నికలకు ఎన్నారైల నుంచి నిధులు సేకరించినందుకు ఉదయ్ భాస్కర్‌కు ఏపీపీఎస్సీ చైర్మన్ పదవి కట్టబెట్టారన్న విమర్శలు ఉండేవి. సభ్యుల విషయానికి వస్తే నాటి ఉరవకొండ టీడీపీ ఎమ్మెల్యే కుమార్తె గుర్రం సుజాత, తాడికొండలో టీడీపీ అభిమాని విజయకుమార్, నాటి హోం మంత్రి నిమ్మకాయల చిన రాజప్ప సిఫారసుతో పద్మరాజును నియమించారు. చంద్రబాబు ప్రభుత్వంలో చక్రం తిప్పిన నాటి ఐఏఎస్ అధికారి సతీష్‌చంద్ర తన శిష్యుడు రామరాజుకు సభ్యుడిగా పదవి ఇప్పించారు. మరో సభ్యుడు రంగ జనార్ధన్ కూడా ఇలా వచ్చినవారే. వీరికి పదవులు ఇచ్చే ముందే చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు, ఎస్వీ యూనివర్సిటీ ఉద్యోగి భాస్కర్ నాయుడు తిరుపతిలో వీరితో వేర్వేరుగా సమావేశమై, తాము చెప్పినట్టు వింటేనే పదవులు ఉంటాయని హెచ్చరించిన విషయం ఎల్లో మీడియా కప్పిపుచ్చినా బయటకు వచ్చేసింది.



- 2016లో నోటిఫికేషన్ ఇచ్చి, 2017 జూలైలో నిర్వహించిన గ్రూప్–2 మెయిన్స్ పరీక్షను ఎంత వివాదాలతో నింపేశారో ప్రతి నిరుద్యోగికీ తెలుసు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరగాల్సిన పరీక్షను వారికి అవసరమైన వారికోసం విశాఖపట్నం గీతం కాలేజీ, మరికొన్ని చోట్ల సాయంత్రం 5 నుంచి రాత్రి 9.30 గంటల వరకు నిర్వహించి వేల మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడారు. కొన్ని ప్రశ్నలు ఉద్దేశపూర్వకంగా బయటకు వెల్లడించగా.. ఇవన్నీ గీతం కాలేజీ కేంద్రంగానే జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. వీటిపై పెద్ద ఎత్తున ఆందోళనలు కూడా జరిగాయి.
- అధికార పార్టీ పెద్దలతో సాన్నిహిత్యమున్న కొన్ని కోచింగ్ సెంటర్ల యాజమాన్యాలు ఏపీపీఎస్సీలో తిష్టవేసి ఇష్టారీతిన వ్యవహారాలు నడిపించాయి. తమ వద్ద చదివిన వారు ఒకే కేంద్రంలో వరుసగా వచ్చేలా ఏర్పాట్లు చేయించుకొని మాస్ కాపీయింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రశ్నపత్రాలు, సమాధాన పత్రాల స్క్రీన్‌షాట్లు ఏకంగా వాట్సప్‌లలో ప్రత్యక్షమయ్యాయి.
- కమిషన్‌లో మెజారిటీ సభ్యుల ఆమోదంతో తీసుకోవాల్సిన నిర్ణయాలను నాటి చైర్మన్ ఉదయ్ భాస్కర్ ఒక్కరే తీసుకుని వివాదాలకు కేంద్ర బిందువయ్యారు.
- ప్రభుత్వ విభాగాల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాన్ని ప్రోత్సహించేందుకు చంద్రబాబు ప్రభుత్వం ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుంది. వారికి ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు రాకుండా 2017లో జీవో నం.55 విడుదల చేసి, డిపార్ట్‌మెంటల్ టెస్టుల్లో 'మైనస్ మార్కు'లను అమల్లోకి తెచ్చింది. దాంతో అంతకుముందు ఏటా సర్వీస్ కమిషన్ నిర్వహించే ఈ పరీక్షల్లో 60 శాతం మంది ఉత్తీర్ణులైతే.. జీవో నం.55 వచ్చాక ఆ సంఖ్య 4 నుంచి 6 శాతం మించలేదు. కొన్ని విభాగాల్లో ఒక్క శాతం కూడా పాసవలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ జీవోతో దాదాపు ఉద్యోగులు మూడేళ్లపాటు పదోన్నతులు, ఇంక్రిమెంట్లు కోల్పోయారు.
- అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2018 డిసెంబర్‌లో 32 నోటిఫికేషన్లు జారీ చేసి, భర్తీకి పరీక్షలు కూడా నిర్వహించలేదు.

ఇప్పుడు నిబద్ధతతో పనిచేసే వారికే సభ్యులుగా అవకాశం

వైఎస్ జగన్ ప్రభుత్వం ఏపీపీఎస్సీని ప్రక్షాళన చేసింది. అన్ని అర్హతలున్నవారు, సమర్థతతో పనిచేసే వారు, నిరుద్యోగుల కష్టాలు తెలిసిన వారిని సభ్యులుగా నియమించింది. దాంతో గత నాలుగేళ్లల్లో ఏపీపీఎస్సీ ద్వారా 78 నోటిఫికేషన్లు ఇచ్చి, 6,296 పోస్టులను సకాలంలో భర్తీ చేసింది. 'సచివాలయ' వ్యవస్థలో ఒకేసారి 1.21 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలిచ్చే బాధ్యతను కూడా కమిషన్ విజయవంతంగా నిర్వర్తించింది. ఇంత పెద్ద స్థాయిలో ఉద్యోగాల భర్తీ దేశచరిత్రలోనే లేదు. గత డిసెంబర్‌లో 899 గ్రూప్–2 పోస్టులతో పాటు గ్రూప్–1, పాలిటెక్నిక్ లెక్చరర్లు, జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ లెక్చరర్లు వంటి దాదాపు 1,446 పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చింది. ఈనెల 25న జరిగే గ్రూప్–2 పరీక్షకు ఎల్లో మీడియా, టీడీపీ కలిసి ఎన్ని అడ్డంకులు సృష్టించాలని ప్రయత్నించినప్పటికీ, సర్వీస్ కమిషన్ సమర్థంగా అధిగమించి ముందుకెళుతోంది. 2019–23 మధ్య ఏపీపీఎస్సీ నిర్వహించిన 78 నోటిఫికేషన్లలో ఒక్కటి కూడా వాయిదా పడలేదు. నిరుద్యోగుల నుంచి ఒక్క కేసు నమోదైందీ లేదు. కేంద్ర ప్రభుత్వ ప్రశంసలూ పొందింది. అయినా, వాస్తవాలన్నింటినీ కప్పిపుచ్చి ఎల్లో బాసు రామోజీ మాత్రం అక్రమాలంటూ అభాండాలు వేస్తున్నారు.

మార్చి 1న విశాఖకు ప్రధాని నరేంద్ర మోదీ!

- హెచ్‌పీసీఎల్ విస్తరణ ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్న పీఎం
- మరో 10 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

సాక్షి, విశాఖపట్నం: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటన మార్చి 1న దాదాపు ఖరారైంది. ఎయిర్‌పోర్టుకు ప్రత్యేక విమానంలో వచ్చి.. అక్కడి నుంచి నేరుగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానానికి హెలికాప్టర్‌లో చేరుకుంటారు. అక్కడ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా విశాఖలో రూ.26,264 కోట్లతో హెచ్‌పీసీఎల్ విస్తరణ ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్నారు. సబ్బవరంలో నిర్మిస్తున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం యూనివర్సిటీ (ఐఐపీఈ), ఓఎన్‌జీసీ ప్రాజెక్టుతో కలిసి మొత్తం 11 ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. మోదీ పర్యటన నేపథ్యంలో ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ డా.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ డా.రవిశంకర్ పరిశీలించారు.

పవన్ ఏకీక'రణ తంత్రం'!

- నలుగురు కలిస్తే కులాల ఐక్యతంటూ వ్యాఖ్యలు
- జనసేన అధినేత మాటలతో కలకలం
- స్వప్రయోజనాల కోసం పవన్ కళ్యాణ్‌ను కలిసిన టీడీపీ నేతలు
- అమలాపురం అల్లర్ల కేసులో నిందితులుగా సుభాష్, పల్లంరాజు
- ఎంపీ సీటు కోసం హరీష్ రాయబారం!

సాక్షి అమలాపురం: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తన రాజకీయ ప్రయోజనాల కోసం కులాల ఐక్యత పేరుతో ప్రజలపై కాలకూట విషం చిమ్ముతున్నారు. నలుగురు నాయకులు కలిస్తేనే కులాల ఏకీకరణ జరిగిపోయినట్టు ఆయన వ్యాఖ్యానించడం జనసేనతో పాటు టీడీపీలోనూ కలకలం రేపుతోంది. పైగా అమలాపురం అల్లర్ల కేసులో నిందితులుగా ఉన్నవారిని సామాజిక ఐక్య ప్రతినిధులుగా అభివర్ణించడం అగ్గి రాజేస్తోంది. ఇటీవల రాజమహేంద్రవరం వచ్చిన పవన్‌ను టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గంటి హరీష్, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, టీడీపీ నాయకులు గంధం పల్లంరాజు, వాసంశెట్టి సుభాష్ కలిశారు. వీరి కలయిక వెనుక రాజకీయ వ్యూహాలు, ఎత్తుగడలు ఉన్నాయి. అయితే వీరి కలయికను పవన్ కళ్యాణ్ ఏకంగా కులాల ఏకీకరణ, ఐక్యతతో పోల్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా పేరు పెట్టిన సమయంలో అమలాపురంలో చెలరేగిన అల్లర్లలో వాసంశెట్టి సుభాష్, గంధం పల్లంరాజు నిందితులు. ఆ అల్లర్ల తరువాత స్నేహితులుగా మారిన వీరిద్దరూ తమ కులాలకు ప్రతినిధులుగా చెలామణి అవుతున్నారు. ఈనేపథ్యంలో వీరిద్దరి కలయికను కాపులు, శెట్టిబలిజల ఐక్యతగా పవన్ అభివర్ణించడం విడ్డూరమని దాదాపు అన్ని రాజకీయ పార్టీల నాయకులు విమర్శిస్తున్నారు. పైగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు నియోజకవర్గాలలో జనసేన నేతల మధ్య వర్గపోరు నడుస్తున్నా పట్టించుకోని పవన్.. అమలాపురం టీడీపీ నేతలతో గంటలపాటు మంతనాలు జరపడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హరీష్‌పై దళితుల మండిపాటు

టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జిగా ఉన్న హరీష్ బాలయోగి నెలరోజులుగా పార్టీ నాయకత్వంపై అసంతృప్తితో ఉన్నారు. ఎన్నికలకు అవసరమైన ఆర్థిక వనరులు సమకూర్చలేరనే ఉద్దేశంతో ఆయనను అమలాపురం అసెంబ్లీకి పంపాలని టీడీపీ అధిష్టానం భావించింది. దీంతో హరీష్ కొద్దిరోజులు అజ్ఞాతంలోకి వెళ్లారు. ఎన్నికలలో ఆర్థిక అవసరాల కోసం ఇటీవల సుభాష్, పల్లంరాజుతో సఖ్యతగా ఉంటున్నారు. మరోవైపు అమలాపురం నుంచి మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు చెక్ పెట్టేందుకు మాజీ హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప వర్గం కాచుకు కూర్చుంది. ఇటీవల ఈ వర్గంతో సఖ్యతగా ఉంటున్న మాజీ మున్సిపల్ చైర్మన్ గణేష్ తదితర నేతలు ఆనందరావును అడ్డుకునే యత్నాలు ప్రారంభించారు. దీనిలో భాగంగా అమలాపురం నుంచి జనసేనను బరిలో నిలపాలని, పార్లమెంట్‌కు టీడీపీ తరఫున హరీష్‌ను ఉండేలా సహకరించాలని వారు పవన్‌ను కోరినట్టు తెలిసింది. పవన్‌తో రాయబారం ద్వారా సొంత పార్టీ టీడీపీపై ఒత్తిడి పెంచాలని హరీష్ భావించారు. కానీ పవన్ వద్దకు సుభాష్, పల్లంరాజుతో కలిసి ఆయన వెళ్లడంపై దళితులు మండిపడుతున్నారు. అమలాపురం అల్లర్ల కేసులో నిందితులతో కలిసి రాజకీయాలు ఏమిటని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు.

గురివింద గింజను గుర్తుచేస్తున్న నాదెండ్ల

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం రూరల్: 'జనసేన నేత నాదెండ్ల మనోహర్ మాటలు గురివింద గింజ సామెతను గుర్తుచేస్తున్నాయి. మనోహర్ ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకో...' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పెదతాడేపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ–జనసేన ఉమ్మడి సభ నిర్వహణ ఏర్పాట్ల కోసం తాడేపల్లిగూడెంలో నాదెండ్ల మనోహర్ పర్యటనలో టీడీపీ నాయకులు కనిపించకపోవడం చూస్తే.. టీడీపీ–జనసేన పార్టీల సమన్వయానికి ఆదిలోనే హంసపాదు పడినట్లు అర్థమవుతోందన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా, ఎప్పుడైనా, ఎక్కడైనా సభ పెట్టుకోవచ్చని, దానిపై ఎవరికీ అభ్యంతరం ఉండదన్నారు. అయితే నాదెండ్ల మనోహర్ చాలా విచిత్రంగా మాట్లాడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. టీడీపీ–జనసేన–బీజేపీ కలిసి 2014లో అధికారం పంచుకున్నాయని, అయినా విభజన హామీల సాధనలో ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ భద్రత కోసం ప్రభుత్వం రెండు హెలికాప్టర్లు అద్దెకు తీసుకుంటే ప్రతిపక్ష నాయకులు ఎందుకు ఉలిక్కిపడుతున్నారని మంత్రి కొట్టు ప్రశ్నించారు. ఇంటెలిజెన్స్ నివేదికల ఆధారంగా ముఖ్యమంత్రి భద్రత కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనే కనీస పరిజ్ఞానం లేదా.. అని నిలదీశారు. సంక్షేమ పథకాలతో జనం సోమరులుగా మారుతున్నారని 6 నెలల క్రితం వరకు గగ్గోలు పెట్టిన టీడీపీ, జనసేన... నేడు తామే ఎక్కువ పథకాలను అమలు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

తెలంగాణ

హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై ప్రమాదం జరిగిన చోట దెబ్బతిన్న కారు



కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత (ఫైల్)



రోడ్డు ప్రమాదంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే
లాస్య నందిత దుర్మరణం

హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై పటాన్‌చెరు సమీపంలో దుర్ఘటన

- భారీ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టి రెయిలింగ్‌ను గుద్దుకున్న కారు
- ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలించే లోపే మృతి
- కారు నడుపుతున్న పీఏ ఆకాష్‌కు తీవ్ర గాయాలు
- అధికార లాంఛనాలతో ఎమ్మెల్యే అంత్యక్రియలు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/పటాన్‌చెరు/పటాన్‌చెరు టౌన్/కంటోన్మెంట్: దివంగత రాజకీయ నేత జి.సాయన్న కుమార్తె, బీఆర్ఎస్ సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.లాస్య నందిత(37) శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. సంగారెడ్డి అదనపు ఎస్పీ సంజీవరావు తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్‌రోడ్డుపై రామేశ్వరం బండ సమీపంలో ఆమె ప్రయాణిస్తున్న కారు ఓ గుర్తుతెలియని భారీ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొని ఆపై నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కనున్న రెయిలింగ్‌ను గుద్దుకోవడంతో ఈ ప్రమాదం జరిగింది. కారు ముందు సీట్లో కూర్చున్న నందిత తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. వాహనం నడిపిన ఆమె పీఏ ఆకాష్ కాళ్లు విరిగాయి. కారు గంటకు సుమారు 100 కి.మీ. వేగంతో వెళ్తుండటంతో ప్రమాద తీవ్రతకు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది.

బ్రేక్‌ఫాస్ట్ చేసేందుకు వెళుతున్న క్రమంలో..

ఎమ్మెల్యే లాస్య నందిత తన అక్క కూతురు స్కూల్‌లో చేరుతుండటంతో కుటుంబసభ్యులతో కలిసి రెండు వాహనాల్లో గురువారం రాత్రి సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఆరూరు సమీపంలోని సూఫీ మిస్కిన్ దర్గాను దర్శించుకున్నారు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో హైదరాబాద్ చేరుకున్నారు. ఇతర కుటుంబ సభ్యులను వారి నివాసాల్లో దింపిన అనంతరం బ్రేక్‌ఫాస్ట్ చేసేందుకు శామీర్‌పేట వైపు నుంచి పటాన్‌చెరు వైపు వెళ్తున్న క్రమంలో ఈ రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఎమ్మెల్యే లాస్య నందిత పీఏ ఆకాష్‌పై పటాన్‌చెరు పోలీసులు సెక్షన్ 304 కింద కేసు నమోదు చేశారు. కాగా, లాస్య నందిత పార్థివదేహానికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌రావు, ప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్‌రావు సహా పలువురు మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు నివాళులర్పించారు. గాంధీ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం కార్ఖానాలోని స్వగృహానికి పార్థివదేహాన్ని తరలించారు. శుక్రవారం సాయంత్రం ఈస్ట్ మారేడుపల్లిలోని హిందూ శ్మశానవాటికలో అధికార లాంఛనాలతో లాస్య నందిత అంత్యక్రియలు జరిగాయి.

యువతకు ఉపాధి.. రైతులకు లాభం

490 ఎకరాల్లో వుడ్ పార్క్‌ను అభివృద్ధి చేసిన ఏపీఐఐసీ

- యాంకర్ యూనిట్‌గా సెంచురీ ప్యానల్స్
- తొలి దశలో రూ.1,000 కోట్లతో ఏర్పాటు
- పనులు ప్రారంభించిన రెండేళ్లలోనే ఉత్పత్తి ప్రారంభం
- ఈ ఒక్క యూనిట్ ద్వారానే 2,226 మందికి ఉపాధి
- ఇంతకు రెట్టింపు సంఖ్యలో పరోక్ష ఉపాధి
- 25 వేల మంది రైతులకు ఆర్థిక ప్రయోజనాలు
- సెంచురీ బాటలో మరిన్ని పరిశ్రమల స్థాపనకు సన్నాహాలు


గోపవరం పారిశ్రామిక పార్క్‌లో సెంచురీ ప్యానల్స్ యూనిట్

స్టేటస్ రిపోర్ట్ సాక్షి

సాక్షి, అమరావతి: ఓవైపు యువతకు ఉపాధి.. మరోవైపు రైతులకు ఆర్థిక ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జిల్లా బద్వేలు నియోజకవర్గం గోపవరంలో పారిశ్రామిక పార్క్‌ను అందుబాటులోకి తెచ్చింది. కలప ఆధారిత పరిశ్రమల కోసమే ప్రత్యేకంగా ఈ పారిశ్రామిక పార్క్‌ను అభివృద్ధి చేసింది. ఈ వుడ్ పార్క్‌లో ప్రధాన (యాంకర్) కంపెనీగా అగ్రగామి సంస్థ సెంచురీ ప్యానల్స్ భారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. రూ.1,000 కోట్ల పెట్టుబడితో 100 ఎకరాల్లో నెలకొల్పిన సెంచురీ ప్యానల్స్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నెల రోజుల క్రితం లాంఛనంగా ఉత్పత్తిని ప్రారంభించారు. సెంచురీ ప్యానల్స్‌కు డిసెంబర్ 23, 2021లో సీఎం వైఎస్ జగన్ భూమి పూజ చేయగా రాష్ట్ర ప్రభుత్వ చొరవతో కేవలం రెండేళ్లలోనే వాణిజ్యపరంగా ఉత్పత్తిని ప్రారంభించడం విశేషం. ఈ యూనిట్ ద్వారా 2,266 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించనుండగా అంతకు రెట్టింపు సంఖ్యలో పరోక్ష ఉపాధి లభించనుంది. ఈ నేపథ్యంలో త్వరలోనే రెండో దశ విస్తరణ పనులను ప్రారంభించడానికి సెంచురీ ప్యానల్స్ ప్రణాళికలు సిద్ధం చేసింది.

పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు..

ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ పాదయాత్ర చేస్తున్న సమయంలో సుబాబుల్, జామాయిల్ సాగు చేసే రైతులు గిట్టుబాటు ధరలు లేక గుట్టలుగా పేరుకుపోయిన కలప లాట్లను చూపించి ఆయనకు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చాక 2021 జూలైలో బద్వేలు నియోజకవర్గ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గోపవరం పారిశ్రామిక పార్క్‌ను అభివృద్ధి చేయాలని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ)కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో వేగంగా భూసేకరణ పూర్తి చేసిన ఏపీఐఐసీ గోపవరం వద్ద 490.36 ఎకరాల్లో కలప ఆధారిత పరిశ్రమల కోసం ప్రత్యేకంగా పారిశ్రామిక పార్క్‌ను అభివృద్ధి చేసింది.

రైతులకు సబ్సిడీ ధరలకే 50 లక్షల విత్తన మొక్కలు..

సెంచురీ ప్యానల్స్‌లో హై ప్రెజర్ లామినేట్స్ (హెచ్‌పీఎల్), మీడియం డెన్సిటీ ఫైబర్ బోర్డ్స్ (ఎండీఎఫ్) తయారవుతాయి. రోజుకు 950 టన్నుల సామర్థ్యం గల ఎండీఎఫ్‌లను తయారు చేస్తారు. ఇందుకోసం భారీ సంఖ్యలో కలప అవసరమవుతుంది. ఈ నేపథ్యంలో 150 కి.మీ పరిధిలో వైఎస్సార్, అన్నమయ్య, నంద్యాల, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం జిల్లాల రైతుల నుంచి సెంచురీ ప్యానల్స్ జామాయిల్‌ను సేకరించనుంది. ఇందుకోసం సుమారు 80,000 ఎకరాల్లో జామాయిల్ పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు సెంచురీ ప్యానల్స్ జనరల్ మేనేజర్ రమేష్‌కుమార్ రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధరకు తక్కువ కాకుండా జామాయిల్‌ను కొనుగోలు చేస్తామన్నారు. దీనివల్ల సుమారు 25,000 రైతు కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఇప్పటికే రైతులకు 50 లక్షల విత్తన మొక్కలను సబ్సిడీ ధరలకు అందించినట్లు వెల్లడించారు. అంతేకాకుండా ఉద్యోగ నియామకాల్లో 80% మంది స్థానిక యువతనే తీసుకుంటున్నామన్నారు. తొలుత గోపవరం, బద్వేలు మండలాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. వీటి తర్వాత వైఎస్సార్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అలాగే ఈ యూనిట్‌కు అవసరమైన ముడి సరుకును అందించే రీసిన్ తయారీ యూనిట్‌ను నాయుడుపేట వద్ద రూ.50 కోట్లతో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ యూనిట్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి అందుబాటులోకి వస్తుందన్నారు. యాంకర్ యూనిట్ ఏర్పడటంతో దీనికి అనుబంధంగా అనేక కలప ఆధారిత పరిశ్రమలు ఇక్కడకు రానున్నాయని పరిశ్రమల శాఖ అధికారులు వెల్లడించారు.

ఇక ఉద్యోగం రాదనుకున్నా..

ఐటీఐ ఎలక్ట్రికల్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఐదేళ్లపాటు ఎదురుచూశాను. ఇక ఉద్యోగం రాదనుకున్నా. సెంచురీ ప్యానెల్స్ ఏర్పాటుతో స్థానికులకే 75 శాతం ఉద్యోగాలు ఇవ్వడంతో నన్ను ఉద్యోగం వెతుక్కుంటూ వచ్చింది. దీంతో మా కుటుంబం ఆనందానికి అవధులు లేవు.

– గుడి మెగురయ్య, కలసపాడు, వైఎస్సార్ జిల్లా

నిరుద్యోగులకు ఉద్యోగాలు.. రైతులకు మేలు..

సెంచురీ ప్యానెల్స్‌కు అవసరమయ్యే రా మెటీరియల్ కోసం జామాయిల్ సాగు చేసుకునేందుకు పరిశ్రమ వారు రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఎలాంటి రవాణా ఖర్చు లేకుండా మొక్కలను సబ్సిడీ ద్వారా నేరుగా రైతు పొలాల వద్దకే తెచ్చిస్తామన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా కనీస మద్దతు ధరకు వారే కొనుగోలు చేస్తామన్నారు. జామాయిల్ సాగుపై ఇప్పటికే రైతులకు అవగాహన కల్పించారు. ఈ ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు వల్ల నిరుద్యోగులకు ఉద్యోగాలు, కూలీలకు ఉపాధితో పాటు రైతులకు మేలు జరుగుతుంది.

– రూకల దేవదాసు, గోపవరం ప్రాజెక్టు కాలనీ, వైఎస్సార్ జిల్లా

వెనుకబడిన ప్రాంతంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

బాగా వెనుకబడిన ప్రాంతమైన బద్వేలులో యూనిట్ ఏర్పాటు చేయడానికి సెంచురీ ప్యానల్స్ ముందుకు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ నుంచి 0.07 టీఎంసీల నీటిని కేటాయించడంతోపాటు 132 కేవీ విద్యుత్ సరఫరా, రహదారుల నిర్మాణం వంటి మౌలిక వసతులను కల్పించాం. పరిశ్రమలకు ఇచ్చే రాయితీలతోపాటు సబ్సిడీ ధరపై విద్యుత్ అందించాం. స్థానిక యువతకు ఉపాధి కల్పించడానికి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ అందిస్తున్నాం.

– ఎస్.యువరాజ్, కార్యదర్శి, రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక వసతుల శాఖ

100 ఇంగ్లండ్ జట్టుపై టెస్టుల్లో 100 వికెట్లు తీసిన తొలి భారతీయ బౌలర్‌గా రవిచంద్రన్ అశ్విన్ గుర్తింపు పొందాడు. ఓవరాల్‌గా ఈ ఘనత సాధించిన ఎనిమిదో బౌలర్‌గా నిలిచాడు. గతంలో షేన్ వార్న్, డెన్నిస్ లిల్లీ, ట్రంబెల్, గ్లెన్ మెక్‌గ్రాత్, నాథన్ లయన్ (ఆస్ట్రేలియా), ముత్తయ్య మురళీధరన్ (శ్రీలంక), కోట్నీ వాల్ష్ (వెస్టిండీస్) ఇంగ్లండ్‌పై 100 కంటే ఎక్కువ వికెట్లు పడగొట్టారు.



8 అరంగేట్రం టెస్టులో నోబాల్‌పై తొలి వికెట్ తీసి దానిని దక్కించుకోలేకపోయిన ఎనిమిదో బౌలర్‌గా ఆకాశ్ దీప్ నిలిచాడు. ఈ జాబితాలో లసిత్ మలింగ (శ్రీలంక), మైకేల్ బీర్ (ఆస్ట్రేలియా), బెన్ స్టోక్స్ (ఇంగ్లండ్), మార్క్ వుడ్ (ఇంగ్లండ్), స్టువర్ట్ బిన్నీ (భారత్), టామ్ కరన్ (ఇంగ్లండ్), నసీమ్ షా (పాకిస్తాన్) కూడా ఉన్నారు.

313 టెస్టుల్లో భారత్ తరఫున అరంగేట్రం చేసిన 313 ప్లేయర్‌గా ఆకాశ్ దీప్ నిలిచాడు. ఇంగ్లండ్‌తో ప్రస్తుత సిరీస్‌లోనే భారత్ నుంచి నలుగురు (రజత్ పటిదార్, ధ్రువ్ జురేల్, సర్ఫరాజ్ ఖాన్, ఆకాశ్ దీప్) అరంగేట్రం చేయడం విశేషం.

10 భారత్‌పై టెస్టుల్లో అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్‌గా జో రూట్ గుర్తింపు పొందాడు. రూట్ భారత్‌పై 10 సెంచరీలు సాధించాడు. ఈ జాబితాలో స్టీవ్ స్మిత్ (9-ఆస్ట్రేలియా), గ్యారీ సోబర్స్ (8-వెస్టిండీస్), వివియన్ రిచర్డ్స్ (8-వెస్టిండీస్), రికీ పాంటింగ్ (8-రికీ పాంటింగ్) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

31 టెస్టుల్లో రూట్ సెంచరీల సంఖ్య. టెస్టుల్లో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్ల జాబితాలో రూట్ తొమ్మిదో స్థానంలో ఉన్నాడు. మరో రెండు సెంచరీలు చేస్తే ఇంగ్లండ్ తరఫున టెస్టుల్లో అత్యధిక సెంచరీలు చేసిన అలిస్టర్ కుక్ (33) రికార్డును రూట్ సమం చేస్తాడు.

ఆకాశ్ దెబ్బ కొట్టినా... ఇంగ్లండ్ 'రూట్' మారింది

అరంగేట్ర బౌలర్ ఆకాశ్ దీప్ పేస్‌కు... అశ్విన్, జడేజా స్పిన్‌కు... లంచ్ లోపే ఇంగ్లండ్ కీలకమైన ఐదు వికెట్లు కోల్పోయింది . దాంతో టీ విరామం వరకు ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌కు తెర పడుతుందేమోననే సందేహం కలిగింది... కానీ అలా జరగలేదు. అనుభవజ్ఞుడైన జో రూట్ తన అసలు సిసలు ఆటతీరును ప్రదర్శించాడు... ఈ సిరీస్‌లో తమ జట్టు దూకుడైన 'బజ్‌బాల్' వ్యూహానికి భిన్నంగా 'రూట్' మార్చాడు... సంయమనంతో ఆడుతూ ఇంగ్లండ్‌ను ఆదుకున్నాడు... సహచరుడు ఫోక్స్ సహాయంతో రెండో సెషన్‌లో భారత బౌలర్లను కాచుకున్నాడు ...ఆ తర్వాత ఫోక్స్ వెనుదిరిగినా... రాబిన్సన్ అండగా నిలబడటంతో... రూట్ పట్టుదలతో ఆడుతూ వీరోచిత సెంచరీతో ఇంగ్లండ్ స్కోరును 300 దాటించాడు.

- జో రూట్ అజేయ సెంచరీ
- ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 302/7
- అరంగేట్రంలో ఆకట్టుకున్న ఆకాశ్ దీప్



క్రాలీ వికెట్ తీసిన ఆనందంలో ఆకాశ్ దీప్



జో రూట్ సెంచరీ అభివాదం

రాంచీ: సిరీస్ గెలిచేందుకు భారత్... సమం చేసేందుకు ఇంగ్లండ్... ఈ నేపథ్యంలో రెండు జట్ల మధ్య మొదలైన నాలుగో టెస్టు తొలిరోజు ఆట ఆసక్తికరంగా సాగింది. కొత్త పేసర్ ఆకాశ్ దీప్ (3/70) నిప్పులు చెరిగే బౌలింగ్ భారత్‌ను మురిపిస్తే... సీనియర్ బ్యాటర్ జో రూట్ (226 బంతుల్లో 106 బ్యాటింగ్; 9 ఫోర్లు) అజేయ శతకం ఇంగ్లండ్‌ను కుప్పకూలకుండా కాపాడింది. దీంతో పూర్తిగా ఎవరి పైచేయి లేకుండా తొలిరోజు ఆట సమఉజ్జీగా ముగిసింది. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 7 వికెట్లకు 302 పరుగులు చేసింది. ఓపెనర్ క్రాలీ (42 బంతుల్లో 42; 6 ఫోర్లు, 1 సిక్స్), మిడిలార్డర్‌లో బెన్ ఫోక్స్ (126 బంతుల్లో 47; 4 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడారు. ఆకాశ్ దీప్ 3 వికెట్లు తీయగా.. సిరాజ్‌కు 2 వికెట్లు దక్కాయి. స్పిన్నర్లు జడేజా, అశ్విన్ చెరో వికెట్ తీశారు.

'టాప్'లేపిన ఆకాశ్

ఈ సిరీస్‌లో భారత్ తరఫున నాలుగో ఆటగాడిగా అరంగేట్రం చేసిన ఆకాశ్ దీప్ తన పేస్‌తో ఆకట్టుకున్నాడు. ఇన్నింగ్స్ నాలుగో ఓవర్ ఐదో బంతికి క్రాలీని ఆకాశ్ దీప్ క్లీన్ బౌల్డ్ చేశాడు. కానీ అది నోబాల్ కావడంతో ఆకాశ్ దీప్‌కు నిరాశ తప్పలేదు. ఆ తర్వాత క్రాలీ దూకుడు పెంచాడు. సిరాజ్ వేసిన ఇన్నింగ్స్ ఏడో ఓవర్‌లో క్రాలీ చెలరేగిపోయాడు. వరుసగా 4,4,4,6తో అదరగొట్టాడు. సాఫీగా సాగిపోతున్న ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌ను ఆకాశ్ దీప్ దెబ్బ కొట్టాడు. పదో ఓవర్లో ఆకాశ్ రెండో బంతికి ఓపెనర్ డకెట్ (11)ను, నాలుగో బంతికి వన్‌డౌన్ బ్యాటర్ ఒలీ పోప్ (0)లను అవుట్ చేసి భారత శిబిరాన్ని సంబరంలో ముంచాడు. ఇదే జోరుతో తన మరుసటి ఓవర్లో (ఇన్నింగ్స్ 12వ) ఓపెనర్ క్రాలీని క్లీన్‌బౌల్డ్ చేశాడు. 47/0తో ఉన్న ఇంగ్లండ్ ఆకాశ్ దెబ్బకు 57/3 స్కోరు వద్ద టాపార్డర్‌ను కోల్పోయింది. ఈ దశలో జో రూట్‌కు జతయిన బెయిర్‌స్టో (35 బంతుల్లో 38; 4 ఫోర్లు, 1 సిక్స్) భారత బౌలింగ్‌పై ఎదురుదాడికి దిగాడు. దీంతో వన్డేను తలపించేలా 20వ ఓవర్లోనే ఇంగ్లండ్ స్కోరు 100కు చేరింది. రెండో సెషన్ ఆరంభంలో బెయిర్‌స్టోను అశ్విన్ ఎల్బీగా పంపాడు. అంపైర్ తోసిపుచ్చినా... రివ్యూకు వెళ్లడంతో బెయిర్‌స్టో వికెట్ దక్కింది. కాసేపటికే కెప్టెన్ స్టోక్స్ (3)ను జడేజా వికెట్ల ముందు దొరక బుచ్చుకున్నాడు. అక్కడే 112/5 స్కోరు వద్ద తొలి సెషన్ ముగిసింది.

అడ్డుకుని... ఆదుకున్నాడు

ఒక్క సెషన్‌లోనే 5 వికెట్లను కోల్పోయిన ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌కు వెటరన్ బ్యాటర్ రూట్ అంతా తానై నడిపించాడు. బెన్ ఫోక్స్ అండతో రెండో సెషన్‌లో పరుగులు పేర్చాడు... వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. ఈ క్రమంలో 108 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. ఈ సెషనంతా భారత సీమర్లు, స్పిన్నర్లు ఎంతగా కష్టపడినా రూట్, ఫోక్స్ జోడీని మాత్రం విడగొట్టలేకపోయారు. రెండో సెషన్‌లో 86 పరుగులు చేసిన ఇంగ్లండ్ ఒక్క వికెట్‌ను సమర్పించుకోలేదు. ఆఖరి సెషన్లో ఎట్టకేలకు సిరాజ్ పేస్ పదును పెంచడంతో ఫోక్స్ ఆట ముగిసింది. ఆరో వికెట్‌కు 113 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కాసేపటికి హార్ట్‌లీ (13)ని సిరాజే అవుట్ చేయగా... రాబిన్సన్ (60 బంతుల్లో 31 బ్యాటింగ్; 4 ఫోర్లు, 1 సిక్స్) అండతో రూట్ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు.

ఇంకో వికెట్ చిక్కేదే కానీ...

మూడో సెషన్లో అప్పటికే భారత జట్టు 3 రివ్యూలు అయిపోవడంతో రాబిన్సన్ బతికిపోయాడు. ఇన్నింగ్స్ 81వ ఓవర్లో జడేజా బౌలింగ్‌లో రాబిన్సన్ ఎల్బీడబ్ల్యూ అప్పీల్‌ను అంపైర్ ధర్మసేన తిరస్కరించాడు. టీవీ రీప్లేలో బంతి వికెట్లను తాకుతున్నట్లు తేలింది. కానీ భారత జట్టుకు డీఆర్‌ఎస్‌కు వెళ్లే అవకాశం లేకపోవడంతో రాబిన్సన్ బతికిపోయాడు.

ఇంత కష్టంలో అంత స్కోరు...

ఈ సిరీస్‌లో మూడు టెస్టుల్లో రూట్ అత్యధిక స్కోరు 29! కానీ ఈ మ్యాచ్ తన అనుభవాన్నంతా రంగరించి క్లాసిక్ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. ఆరంభంలో 57/3తో కష్టాల్లో పడిన ఇంగ్లండ్ లంచ్ విరామానికే 112/5 స్కోరు వద్ద సగం వికెట్లను కోల్పోయింది. ఈ దశలో ఇంకా రెండు సెషన్ల ఆటలో ఏ జట్టయినా ఆలౌట్ అయినా అవుతుంది. లేదంటే... కిందామీదా పడినా 200 నుంచి 240 పరుగులు చేయడానికి కష్టపడుతుంది. కానీ ఇన్నింగ్స్‌ను నడిపించిన రూట్ ఆతిథ్య బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని జట్టు స్కోరును ఒక్కరోజులోనే 300 పైచిలుకు చేర్చడం అతని అసాధారణ పోరాటానికి నిదర్శనం!

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలీ (బి) ఆకాశ్ దీప్ 42; డకెట్ (సి) జురెల్ (బి) ఆకాశ్ దీప్ 11; ఒలీ పోప్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఆకాశ్ దీప్ 0; రూట్ (బ్యాటింగ్) 106; బెయిర్‌స్టో (ఎల్బీడబ్ల్యూ) (బి) అశ్విన్ 38; స్టోక్స్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జడేజా 3; ఫోక్స్ (సి) జడేజా (బి) సిరాజ్ 47; హార్ట్‌లీ (బి) సిరాజ్ 13; రాబిన్సన్ (బ్యాటింగ్) 31; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (90 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి) 302.** **వికెట్ల పతనం:** 1-47, 2-47, 3-57, 4-109, 5-112, 6-225, 7-245. **బౌలింగ్:** సిరాజ్ 13-3-60-2, ఆకాశ్‌దీప్ 17-0-70-3, జడేజా 27-7-55-1, అశ్విన్ 22-1-83-1, కుల్దీప్ 10-3-21-0, యశస్వి 1-0-6-0.

తండ్రి వద్దన్నా... తనయుడు వినలేదు!

స్ఫూర్తిదాయకం... ఆకాశ్ దీప్ ప్రస్థానం






పిల్లలు ఏదైనా ఇష్టపడితే అందుకోసం కష్టపడే తల్లిదండ్రులుంటారు. కానీ ఆకాశ్ దీప్ స్టోరీ మాత్రం భిన్నమైంది. బీహార్‌లోని రోహ్తాస్ జిల్లా బడ్డీ గ్రామానికి చెందిన ఆకాశ్ క్రికెట్‌ను ఇష్టపడేవాడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన ఆకాశ్ తండ్రి రామ్‌జీ సింగ్ తన కుమారుడి ఇష్టాన్ని గట్టిగానే వ్యతిరేకించాడు. ఆకాశ్ తనకు క్రికెట్టే ప్రపంచమంటే... కన్నతండ్రి ఆ ప్రపంచం నుంచి బయటికి రమ్మన్నాడు. క్రికెటర్ కావడం తన కల అంటే... ఆ కల కనడం మానేయమన్నాడు. ఎలాగైనా ఆటగాడిని అవుతానంటే... వద్దే వద్దని ఖరాకండీగా చెప్పేశాడు. కానీ ఈ బిహారీ కుర్రాడు వినలేదు. తండ్రి మాటల్ని తలకెక్కించుకోలేదు. కల సాకారం కోసం... తన క్రికెట్ ప్రపంచం కోసం ఇంటి నుంచి బయటికొచ్చాడు. మొదట దుర్గాపూర్‌లో తెలిసినవారి సాయంతో అకాడమీలో క్రికెట్ ఓనమాలు నేర్చుకున్నాడు. తర్వాత కోల్‌కతా పయనమై తన పేస్‌కు పదును పెట్టాడు. కానీ విధి అతనికి మరో పరీక్ష పెట్టింది. అనారోగ్యంతో 2015లో అతని తండ్రి... ఆరు నెలల్లోపే అన్న కూడా చనిపోవడంతో మధ్యలో మూడేళ్లు కుటుంబభారం మోశాడు. కానీ క్రికెట్ పట్టుమాత్రం వీడలేదు. ఎట్టకేలకు అతని కలకు బెంగాల్ తొలి రూపమిస్తే అతని పేస్ ప్రతాపం టీమిండియాలో చోటిచ్చింది. కట్ చేస్తే... ఆకాశ్ దీప్ ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టులో అరంగేట్రం చేశాడు. భారత 313 టెస్టు క్రికెటర్‌గా అతనికి హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ క్యాప్ అందిచ్చాడు. అతని ఇష్టం... పడ్డ కష్టం తెలుసుకున్న ద్రవిడ్ జట్టు సభ్యులందరి మధ్య అతని ప్రయాణాన్ని వివరించి స్ఫూర్తినింపాడు. ఓ బిహారి కుర్రాడు కోల్‌కతాలో అండర్-23 జట్టు సభ్యుడయ్యాడు. అనంతరం బెంగాల్ రంజీ ప్లేయర్‌గా దేశవాళీ క్రికెట్‌లో సత్తాచాటుకోవడంతో అటునుంచి టీమిండియాకు ఎంపికయ్యాడు. బుమ్రా విశ్రాంతితో రాంచీలో అంతర్జాతీయ క్రికెట్ ఆడాడు. తన మాతృమూర్తి, ఇద్దరు సోదరిల కళ్లముందు అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ఆకాశ్ దీప్ భావోద్వేగానికి గురయ్యాడు.

ముంబై ఇండియన్స్ శుభారంభం

- తొలి పోరులో ఢిల్లీ క్యాపిటల్స్‌పై నాలుగు వికెట్లతో విజయం
- చివరి బంతికి నెగ్గిన డిఫెండింగ్ చాంప్
- ఘనంగా మొదలైన డబ్ల్యూపీఎల్



బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌ను డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్ విజయంతో మొదలు పెట్టింది. గత ఏడాది రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై 4 వికెట్ల తేడాతో గెలిచింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. అలైస్ క్యాప్సీ (53 బంతుల్లో 75; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు అర్ధ సెంచరీతో చెలరేగగా... జెమీమా రోడ్రిగ్స్ (24 బంతుల్లో 42; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ మెగ్ లానింగ్ (25 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. సివర్ బ్రంట్, అమేలియా కెర్ చెరో 2 వికెట్లు పడగొట్టగా... తొలిసారి డబ్ల్యూపీఎల్ మ్యాచ్ ఆడిన దక్షిణాఫ్రికా పేసర్ షబ్నిమ్ ఇస్మాయిల్ పొదుపుగా బౌలింగ్ చేసి ఒక వికెట్ తీసింది. అనంతరం ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 173 పరుగులు చేసింది. యస్తిక భాటియా (45 బంతుల్లో 57; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (34 బంతుల్లో 55; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. ఆఖరి ఓవర్లో విజయానికి 12 పరుగులు అవసరమయ్యాయి. 4 బంతుల్లో 7 పరుగులు వచ్చాయి. ఐదో బంతికి హర్మన్ అవుటైనా...చివరి బంతి ముంబై విజయానికి 5 పరుగులు అవసరంకాగా.. సజన సిక్సర్‌గా మలిచి ముంబైను గెలిపించింది.

క్యాప్సీ అర్ధసెంచరీ...

షఫాలీ వర్మ (1) ఆరంభంలోనే వెనుదిరగ్గా... లానింగ్, జెమీమాలతో రెండు అర్ధసెంచరీ భాగస్వామ్యాలు నెలకొల్పి క్యాప్సీ జట్టును ఆదుకుంది. 10 ఓవర్లలో జట్టు 65 పరుగులు చేయగా లానింగ్‌ను బ్రంట్ అవుట్ చేయడంతో 64 పరుగుల (51 బంతుల్లో) రెండో వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. అనంతరం హేలీ మాథ్యూస్ ఓవర్లలో 2 సిక్స్‌లు, ఫోర్ బాదిన క్యాప్సీ 36 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకుంది. క్యాప్సీతో పాటు క్రీజ్‌లో ఉన్నంత సేపు జెమీమా దూకుడుగా ఆడటంతో మూడో వికెట్‌కు 40 బంతుల్లోనే 74 పరుగుల భాగస్వామ్యం నమోదైంది. వీరిద్దరు తక్కువ వ్యవధిలో వెనుదిరగ్గా...కెర్ వేసిన చివరి ఓవర్లో 3 ఫోర్లు కొట్టి మరిజాన్ కాప్ (16 నాటౌట్) కీలక పరుగులు జోడించింది.

కీలక భాగస్వామ్యం...

ఛేదనలో రెండో బంతికే హేలీ మాథ్యూస్ (0) అవుట్ కాగా, అయితే కాప్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్‌తో సివర్ బ్రంట్ (19) ధాటిని ప్రదర్శించింది. మరో ఎండ్‌లో యస్తిక చక్కటి ఇన్నింగ్స్‌కు హర్మన్ అండగా నిలిచింది. శిఖా పాండే ఓవర్లో యస్తిక కొట్టిన 2 ఫోర్లు, 2 సిక్స్‌లు హైలైట్‌గా నిలిచాయి. రాధ బౌలింగ్‌తో భారీ సిక్స్‌తో 35 బంతుల్లో యస్తిక హాఫ్ సెంచరీని అందుకుంది. యస్తిక, హర్మన్ రెండో వికెట్‌కు 56 పరుగులు జత చేసిన తర్వాత అరుంధతి ఈ జోడీని విడదీసింది. అయితే హర్మన్, అమేలియా కెర్ (18 బంతుల్లో 24; 3 ఫోర్లు) దూకుడైన భాగస్వామ్యం జట్టును గెలుపు దిశగా నడిపించింది. చివర్లో కొంత ఉత్కంఠ ఎదురైనా...ముంబై గెలుపు తీరం చేరింది.

ఆటా మాటా...

తొలి మ్యాచ్‌కు ముందు బాలీవుడ్ స్టార్ల ప్రదర్శనతో డబ్ల్యూపీఎల్ అట్టహాసంగా మొదలైంది. కార్తీక్ ఆర్యన్, టైగర్ ష్రాఫ్, షాహిద్ కపూర్, వరుణ్ ధావన్, సిద్ధార్థ్ మల్హోత్రా వేర్వేరు పాటలకు డ్యాన్స్‌లు చేసి అలరించారు. అనంతరం షారుఖ్ ఖాన్ ఐదుగురు కెప్టెన్లను పరిచయం చేయగా... వారంతా ప్రత్యేక రథాల్లో వేదిక వద్దకు వచ్చి ట్రోఫీని ఆవిష్కరించారు. **నేడు జరిగే మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో యూపీ వారియర్స్ తలపడుతుంది.**

స్వీట్ 36...

హైదరాబాదీ వెటరన్ స్పిన్నర్ గౌహర్ సుల్తానా పునరాగమనం

- డబ్ల్యూపీఎల్‌తో మళ్లీ వెలుగులోకి

అంతర్జాతీయ మ్యాచ్ ఆడి దశాబ్ద కాలం గడిచిన తర్వాత ఒక ప్లేయర్‌ను క్రీడా ప్రపంచం, అభిమానులు గుర్తుంచుకోవడం దాదాపు అసాధ్యం... ఇక మహిళా క్రికెటర్లకు మన వద్ద దక్కే గుర్తింపును బట్టి చూస్తే ఇంకా కష్టం... స్వయంగా ఆ ప్లేయరే ఆటను మరచిపోయి ఇక తన పని ముగిసినట్లే భావించి అజ్ఞాతంలోకి వెళ్లపోతారు... కానీ 10 సంవత్సరాల విరామం తర్వాత కూడా ఒక పెద్ద టోర్నీలో మళ్లీ తెరపైకి రావచ్చని ఒక ప్లేయర్ నిరూపించింది. ఆమె పేరే గౌహర్ సుల్తానా. హైదరాబాద్‌కు చెందిన లెఫ్టార్మ్ స్పిన్నర్. 2014లో భారత్‌కు ఆఖరిసారిగా ప్రాతినిధ్యం వహించిన గౌహర్ ఇప్పుడు 2024 డబ్ల్యూపీఎల్‌లో మళ్లీ కనిపించబోతోంది. వేలంలో యూపీ వారియర్స్ జట్టు సొంతం చేసుకున్న గౌహర్ 36 ఏళ్ల వయసులో తనలో ఇంకా క్రికెట్ మిగిలి ఉందని నిరూపించేందుకు సిద్ధమైంది.





మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) తాజా సీజన్‌లో ఆడుతున్న వారిలో 2010కు ముందు అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన ప్లేయర్లు ఇద్దరే ఉన్నారు. 2009లో హర్మన్‌ప్రీత్ కౌర్ తన తొలి మ్యాచ్ ఆడితే అంతకుముందు ఏడాదే 2008లో గౌహర్ సుల్తానా భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. 2008 నుంచి 2014 మధ్యలో గౌహర్ భారత్ తరఫున 50 వన్డేలు, 37 టి20లు ఆడి మొత్తం 95 వికెట్లు పడగొట్టింది. చక్కటి బౌలింగ్ ప్రదర్శనతో ఆ సమయంలో అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకరిగా గుర్తింపు తెచ్చుకుంది. ఆ ఆరేళ్ల కాలంలో వన్డేల్లో భారత బెస్ట్ బౌలర్‌గా (66 వికెట్లు) కొనసాగింది. రెండు వన్డే ప్రపంచకప్‌లలో ఆడింది కూడా. తన చివరి 2 వన్డేల్లో నాలుగేసి వికెట్లు చొప్పున తీసినా అనూహ్యంగా ఆమెపై సెలక్టర్లు వేటు వేశారు. అప్పుడు గౌహర్ వయసు 26 ఏళ్లు. కారణాలేమిటో తెలియకపోయినా మళ్లీ భారత జట్టు కోసం ఆమె పేరును పరిశీలించనేలేదు.

సైకాలజిస్ట్ సహాయంతో...

'సాధారణంగా భారత్‌లో మహిళా ప్లేయర్లకు 26–27 ఏళ్లు వస్తే వారిని ఇక వారి వయసు అయిపోయిందని, ఆటకు పనికి రారని భావిస్తారు. ఇక 30 తర్వాత అయితే బరువు పెరుగుతుంది. ఎవరూ పట్టించుకోరు. కానీ నా ఫిట్‌నెస్ విషయంలో రాజీ పడరాదని భావించాను. అందుకే చాలా కష్టపడ్డాను' అని గౌహర్ చెప్పింది. జాతీయ జట్టుకు దూరమైన తర్వాత ఆమె ఆగిపోలేదు. గత పదేళ్లలో దేశవాళీ క్రికెట్‌లో హైదరాబాద్, పుదుచ్చేరి, బెంగాల్, రైల్వేస్ జట్లకు ఆడుతూ వచ్చింది. అయితే కొత్త అమ్మాయిలతో పోలిస్తే తాను బాగా ఆడలేక వెనుకబడిపోతున్నానని భావించి తనపై తనకే అనుమానం వేసింది. ఇది మానసికంగా ఆమె ఆరోగ్యంపై ప్రభావం చూపించింది. ఇలాంటి స్థితిలో మాజీ క్రికెటర్, భారత అండర్-19 జట్టు కోచ్ నూషీన్ అల్ ఖదీర్ తగిన రీతిలో అండగా నిలిచింది. భారత జట్టులో గౌహర్‌తో కలిసి ఆడిన నూషీన్... సైకాలజిస్ట్ వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించడంతో పరిస్థితి మెరుగైంది.


పట్టుదలగా నిలిచి...

గౌహర్ తన ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన రోజులతో పోలిస్తే మహిళా క్రికెట్ ఎంతో మారింది. వేగంలో, వ్యూహాల్లో, ఆదరణలో అంతా మారిపోయింది. అయితే చికిత్స తర్వాత దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా బౌలింగ్ చేస్తుండటంతో గౌహర్‌లో ఆత్మవిశ్వాసం పెరిగింది. గత రెండేళ్లలో వరుసగా వికెట్లు పడగొట్టడంలో కూడా సఫలమైంది. దాంతో 2023 డబ్ల్యూపీఎల్ వేలం కోసం తన పేరును నమోదు చేసుకుంది. కానీ సహజంగానే ఈతరం అమ్మాయిల గురించి ఆలోచించే ఫ్రాంచైజీలు ఆమెను పట్టించుకోలేదు. ఈసారి కూడా సందేహంగానే అనిపించింది. కానీ ఎట్టకేలకు ఆ అవకాశం వచ్చింది. 36 ఏళ్ల వయసులో తాను పోటీ క్రికెట్ ఆడగలనని నమ్మకం వల్లే ఈ పునరాగమనం సాధ్యమైంది. 30 ఏళ్లు దాటిన తర్వాత ఒక సీనియర్ ప్లేయర్ ఎన్నో ప్రతికూలతలను దాటి దేశవాళీ క్రికెట్‌ను నమ్ముకొని ముందుకు సాగడం అసాధారణం. గత పదేళ్ల ఆమెను ఎవరూ పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు గౌహర్ వేసే ప్రతీ బంతిపై అందరి దృష్టీ ఉంటుంది. ఈ ఇన్నింగ్స్‌లో ఆమె అదృష్టం ఎలా ఉంటుందనేది ఆసక్తికరం.

– సాక్షి క్రీడా విభాగం

బంతితో మెరిసిన శశికాంత్, నితీశ్

మధ్యప్రదేశ్ 234/9 • రంజీ క్వార్టర్ ఫైనల్





ఇండోర్: భారీ స్కోరు దిశగా సాగుతోన్న మధ్యప్రదేశ్ జట్టును తమ మీడియం పేస్ బౌలింగ్‌తో ఆంధ్ర బౌలర్లు శశికాంత్ (4/37), నితీశ్ కుమార్ రెడ్డి (3/50) కట్టడి చేశారు. శుక్రవారం మొదలైన రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మధ్యప్రదేశ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 81 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 234 పరుగులు సాధించింది. పచ్చికతో కూడిన పిచ్‌పై ఓపెనర్లు యశ్ దూబే (133 బంతుల్లో 64; 7 ఫోర్లు, 1 సిక్స్), హిమాన్షు మంత్రి (97 బంతుల్లో 49; 4 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 123 పరుగులు జోడించి శుభారంభం ఇచ్చారు. అయితే ఇన్నింగ్స్ 37వ ఓవర్లో హిమాన్షును శశికాంత్ అవుట్ చేయడంతో మధ్యప్రదేశ్ ఇన్నింగ్స్ పతనం మొదలైంది. 36 పరుగుల తేడాలో మధ్యప్రదేశ్ 7 వికెట్లు కోల్పోయింది. దాంతో 123/0తో పటిష్టంగా కనిపించిన మధ్యప్రదేశ్ 159/7తో కష్టాల్లో పడింది. ఈ దశలో సారాంశ్ జైన్ (108 బంతుల్లో 41 బ్యాటింగ్; 3 ఫోర్లు, 1 సిక్స్), కుమార్ కార్తికేయ (79 బంతుల్లో 29; 2 ఫోర్లు) ఎనిమిదో వికెట్‌కు 51 పరుగులు జోడించి మధ్యప్రదేశ్ స్కోరును 200 దాటించారు. కార్తికేయను అవుట్ చేసి శశికాంత్ ఈ భాగస్వామ్యాన్ని విడగొట్టగా... అవేశ్ ఖాన్‌ను గిరినాథ్ రెడ్డి రనౌట్ చేయడంతో మధ్యప్రదేశ్ తొమ్మిదో వికెట్ కోల్పోయింది.

ఆసీస్‌దే టి20 సిరీస్

రెండో మ్యాచ్‌లోనూ న్యూజిలాండ్ ఓటమి



ఆక్లాండ్: బ్యాటర్ల వైఫల్యంతో ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టి20 మ్యాచ్‌లోనూ న్యూజిలాండ్ ఓటమి పాలైంది. దాంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను ఆస్ట్రేలియా 2–0తో దక్కించుకుంది. శుక్రవారం జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 72 పరుగుల తేడాతో గెలిచింది. 175 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 17 ఓవర్లలో 102 పరుగులకే కుప్పకూలింది. లెగ్ స్పిన్నర్ ఆడమ్ జంపా (4/34) న్యూజిలాండ్‌ను దెబ్బ తీశాడు. గ్లెన్ ఫిలిప్స్ (42; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అంతకుముందు ఆస్ట్రేలియా 19.5 ఓవర్లలో 174 పరుగులకు ఆలౌటైంది. హెడ్ (22 బంతుల్లో 45; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), కమిన్స్ (22 బంతుల్లో 28; 5 ఫోర్లు) రాణించారు.

సాక్షి బిజినెస్
శనివారం 24-2-2024

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	15	73,143
నిఫ్టీ ▽	5	22,213

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,039	▽	1
డోజోన్స్	39,156	△	87
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,706	▽	22
డాక్స్	17,419	△	49
షాంఘై	3,005	△	17
నికాయ్	39,099	△	836

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (24 క్యారట్)	61,300
బంగారం (22 క్యారట్)	58,380
వెండి (కేజీ)	76,000

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్		81.31	84.06
£	బ్రిటన్‌ పౌండ్		102.90	107.47
€	యూరో		87.78	90.86
¥	జపాన్‌ ఎన్ (100)		45.00	66.00
AUS	ఆస్ట్రేలియా డాలర్		52.35	56.06
S$	సింగపూర్‌ డాలర్		59.59	63.82
SAR	సౌదీ రియాల్		21.21	22.78
UAE D	యూఏఈ దిర్హామ్		21.69	23.47
¥	చైనా యువాన్		10.39	12.39

'పేటీఎం' కస్టమర్లకు సాయం చేయండి



- వేరే బ్యాంకులకు మార్చే అంశం పరిశీలించండి
- ఎన్‌పీసీఐకి ఆర్‌బీఐ సూచన

ముంబై: యూపీఐ హ్యాండిల్‌ '@పేటీఎం'ను ఉపయోగిస్తున్న పేటీఎం పేమెంట్స్‌ బ్యాంక్‌ (పీపీబీఎల్‌) కస్టమర్లను 4–5 వేరే బ్యాంకులకు మార్చే అవకాశాలను పరిశీలించాలని నేషనల్‌ పేమెంట్స్‌ కార్పొరేషన్‌ (ఎన్‌పీసీఐ)కి ఆర్‌బీఐ సూచించింది. తద్వారా చెల్లింపుల వ్యవస్థలో అంతరాయం కలగకుండా చూడాలని, కస్టమర్లకు అసౌకర్యం కలగకుండా సహాయం చేయాలని పేర్కొంది. నిబంధనల ఉల్లంఘనకు గాను మార్చి 15 నుంచి దాదాపు అన్ని కార్యకలాపాలు నిలిపివేయాలంటూ పీపీబీఎల్‌ను ఆర్‌బీఐ ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సంస్థ కస్టమర్లకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటోంది. పీపీబీఎల్‌ వెబ్‌సైట్‌ ప్రకారం 30 కోట్ల వాలెట్లు, 3 కోట్ల మంది బ్యాంకు కస్టమర్లు ఉన్నారు. దేశీయంగా రిటైల్‌ చెల్లింపులు, సెటిల్మెంట్‌ వ్యవస్థను ఎన్‌పీసీఐ నిర్వహిస్తోంది. వేరే బ్యాంకులకు '@పేటీఎం' హ్యాండిల్‌ను మైగ్రేట్‌ చేసే క్రమంలో పేమెంట్‌ సర్వీస్‌ ప్రొవైడర్లుగా (పీఎస్‌పీ) 4–5 బ్యాంకులను ఎన్‌పీసీఐ ఎంపిక చేయొచ్చని సూచించింది. తద్వారా ఒకే బ్యాంకుపై ఆధారపడితే తలెత్తే రిస్కులు తగ్గుతాయని తెలిపింది. '@ పేటీఎం' హ్యాండిల్‌ను ఉపయోగిస్తున్న కస్టమర్లు, వ్యాపారుల హ్యాండిల్స్‌కు మాత్రమే మైగ్రేషన్‌ వర్తిస్తుందని, వేరే యూపీఐ అడ్రస్‌లు ఉన్నవారికి అవసరం లేదని పేర్కొంది. పీపీబీఎల్‌లో ఖాతాలు ఉన్న వారు మార్చి 15లోగా వేరే బ్యాంకులకు మారేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని మరోసారి సూచించింది.

ప్రమోషన్లు .. ఇంక్రిమెంట్లు..
గ్రహాలేం చెబుతున్నాయ్‌..

జ్యోతిష్యానికి పెరుగుతున్న డిమాండ్ • ఆన్‌లైన్‌ ఆస్ట్రాలజీ పోర్టల్స్‌ను ఆశ్రయిస్తున్న యువత
పది రెట్లు పెరిగిన ఆస్ట్రోయోగి యూజర్లు • ఆస్ట్రోటాక్, గణేషాస్పీక్స్‌ ఆదాయాల్లో వృద్ధి



న్యూఢిల్లీ: సర్వత్రా అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో ఉద్యోగాల్లో మార్పులు ఉంటాయా, ఇంక్రిమెంట్లు పడతాయా వంటి అనేకానేక సందేహాలు చాలామంది ఉద్యోగులను వెంటాడుతున్నాయి. తమ భవిష్యత్తు గురించి గ్రహాలేం చెబుతున్నాయో తెలుసుకోవాలనే ఆరాటం కొద్దీ ఆన్‌లైన్‌ జ్యోతిష్యం పోర్టల్స్‌ను ఆశ్రయించే వారి సంఖ్య పెరుగుతోంది. ఇలాంటి వారిలో యువ ఉద్యోగులే కాకుండా ఔత్సాహిక వ్యాపారవేత్తలు కూడా ఉండటం గమనార్హం. ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు, కెరియర్‌లో పురోగతి, ఉద్యోగంలో మార్పులు వంటి అంశాలపై ఉద్యోగులు ఆరాటపడుతుండగా, స్టార్టప్‌ వ్యవస్థాపకులు తమ నిధుల సమీకరణ యత్నాలు సక్రమంగా సాగుతాయా లేదా, ఇతర వ్యవస్థాపకులతో సంబంధాలు బాగుంటాయా లేదా అనే విషయాలు తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఆన్‌లైన్‌ ఆస్ట్రాలజీ పోర్టల్స్‌కి డిమాండ్‌ పెరుగుతోంది. కెరియర్, బిజినెస్‌ గురించి తెలుసుకునేందుకు డిజిటల్‌ ఆస్ట్రాలజీ ప్లాట్‌ఫాం గణేషాస్పీక్స్‌డాట్‌కామ్‌కి యువ ప్రొఫెషనల్స్, ఎంట్రప్రెన్యూర్ల నుంచి వచ్చే కన్సల్టేషన్ల అభ్యర్థనలు పది రెట్లు పెరిగాయి. వారిలో చాలా మంది 23–35 ఏళ్ల మధ్య వారే కావడం విశేషం. ఇక ఆస్ట్రోయోగి ప్లాట్‌ఫాంపై యూజర్ల సంఖ్య .. కోవిడ్‌ పూర్వ స్థాయితో పోలిస్తే 10 రెట్లు పెరిగింది. ఆస్ట్రోటాక్, ఆస్ట్రోయోగి వంటి ప్లాట్‌ఫాంలు అందించే మొత్తం కన్సల్టేషన్లలో సుమారు 30 శాతం కన్సల్టేషన్లు .. ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు, ఉద్యోగాల్లో కోతల భయాలు మొదలైన వాటి గురించే ఉంటున్నాయి.

రూ. 10 నుంచి కన్సల్టేషన్‌..

జ్యోతిష్యుల అనుభవాన్ని బట్టి కన్సల్టేషన్‌కు వసూలు చేసే చార్జీలు ఉంటున్నాయి. నిమిషానికి రూ. 10 నుంచి మొదలుపెడితే రూ. 200 వరకు కూడా ఇవి ఉంటున్నాయి. జ్యోతిష్యుల్లో పక్కాగా జ్యోతిష్యం నేర్చుకున్నవారే కాకుండా ఇంజనీర్లు, ఎంటెక్, సీఏలు చేసిన వారు కూడా ఉంటున్నారు. సోషల్‌ మీడియా వినియోగం అత్యధికంగా ఉండే నగరాల్లోని మొత్తం ఆన్‌లైన్‌ ఆస్ట్రాలజీ యూజర్లలో 60 శాతం వాటా జనరేషన్‌ జెడ్‌ యువతదే ఉండటం ప్రస్తావించతగ్గ అంశమని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. వ్యాపారాల విషయంలో అనిశ్చితి నెలకొన్న తరుణంలో చిన్న పట్టణాలు మొదలుకుని మెట్రో నగరాల వరకు అన్ని చోట్లా యువ యూజర్ల నుంచి దాదాపు ఒకే తరహా సందేహాలకు కన్సల్టేషన్‌ అభ్యర్థనలు వస్తున్నాయని పేర్కొన్నాయి. ఆస్ట్రో యూజర్లలో ఎక్కువ శాతం మంది ఢిల్లీ, ముంబై, బెంగళూరు, లక్నో, జైపూర్, చండీగఢ్, లూధియానా వంటి పెద్ద నగరాల నుంచి ఉంటున్నట్లు వివరించాయి.

వ్యాపారం జోరు..



పెరుగుతున్న యూజర్ల సంఖ్యకు అనుగుణంగా ఆస్ట్రో పోర్టల్స్‌ ఆదాయాలు కూడా జోరుగా ఉంటున్నాయి. 2021 ఆర్థిక సంవత్సరంలో ఆస్ట్రోటాక్‌ ఆదాయం రూ. 65 కోట్లుగా ఉండగా 2023 ఆర్థిక సంవత్సరానికల్లా రూ. 282 కోట్లకు పెరిగింది. లాభాలు రూ. 11.2 కోట్ల నుంచి రూ. 27 కోట్లకు చేరాయి. యూజర్ల సంఖ్య 25 లక్షల నుంచి ఇప్పటివరకు 1.9 కోట్లకు ఎగిసింది. 2024 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ. 630 కోట్లకు, లాభం రూ. 130 కోట్లకు చేరగలదని ఆస్ట్రోటాక్‌ అంచనా వేస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లకు కూడా విస్తరించాలనే యోచనలో కంపెనీ ఉంది. ఇందులో భాగంగా ఇతర సంస్థలను కొనుగోలు చేయడం, కొత్త విభాగాలను ప్రారంభించడం, సీనియర్ల హోదాలో నియామకాలు చేపట్టడం మొదలైన వాటిపై కసరత్తు చేస్తోంది. మరోవైపు, గణేషాస్పీక్స్‌ పోర్టల్‌ను తీసుకుంటే 2022 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2023 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం 58 శాతం పెరిగింది.

ఐఐఎస్‌సీతో నోకియా జట్టు



6జీ టెక్నాలజీపై పరిశోధనలు

న్యూఢిల్లీ: భారత్‌లో 6జీ టెక్నాలజీలు, వాటిని వినియోగించుకునేందుకు గల అవకాశాలపై అధ్యయనం చేసేందుకు ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ సైన్స్‌ (ఐఐఎస్‌సీ)తో నోకియా చేతులు కలిపింది. బెంగళూరులో తాము కొత్తగా ప్రారంభించిన 6జీ ల్యాబ్‌లో ఈ పరిశోధనలు సాగనున్నట్లు నోకియా వివరించింది.

కొటక్‌లో జ్యూరిచ్‌కు భారీ వాటా



70% కొనుగోలుకి రెడీ

న్యూఢిల్లీ: కొటక్‌ మహీంద్రా సాధారణ బీమా సంస్థలో ముందుగా (నవంబర్‌ నాటి) అనుకున్న 51 శాతానికి బదులుగా జ్యూరిచ్‌ ఇన్సూరెన్స్‌ కంపెనీ 70% వాటాను కొనుగోలు చేయనుంది. కొటక్‌ మహీంద్రా బ్యాంక్‌ తాజాగా ఈ విషయాన్ని తెలియజేసింది. ఇందుకు రూ. 5,560 కోట్లు ఇన్వెస్ట్‌ చేయనున్నట్లు వెల్లడించింది.

రికార్డు గరిష్టాల నుంచి నిఫ్టీ వెనక్కి

స్వల్ప నష్టాలతో ముగింపు



ముంబై: ట్రేడింగ్‌లో లాభ, నష్టాల మధ్య పరిమిత శ్రేణిలో కదలాడిన స్టాక్‌ సూచీలు శుక్రవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఆరంభంలోనే నిఫ్టీ 80 పాయింట్లు పెరిగి 22,297 వద్ద వరుసగా అయిదో రోజూ జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. రికార్డు స్థాయిల వద్ద లాభాల స్వీకరణతో ఆరంభ లాభాలు కోల్పోయాయి. ఆఖరికి ఐదు పాయింట్ల నష్టపోయి 22,213 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 392 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్‌ చివరికి 15 పాయింట్ల స్వల్ప నష్టంతో 73,143 వద్ద నిలిచింది.

రూ. 2 లక్షల కోట్ల పైకి జియో ఫైనాన్స్‌ మార్కెట్‌ క్యాప్



జియో ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ మార్కెట్‌ క్యాపిటలైజేషన్‌ రూ.2 లక్షల కోట్లను అధిగమించింది. ట్రేడింగ్‌లో 14.50 శాతం పెరిగి రూ.347 లతో జీవిత కాల గరిష్ఠ స్థాయిని తాకింది. చివరికి పదిశాతం లాభంతో రూ.334 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్‌ క్యాప్‌ రూ.2.12 లక్షల కోట్లు నమోదైంది.

ఫోన్‌ డిస్‌ప్లేపై కాలర్‌ పేరు



ట్రాయ్‌ సిఫారసు

న్యూఢిల్లీ: కొత్త నంబర్‌ నుంచి కాల్‌ వస్తుంటే ఎవరు చేస్తున్నారు? అనే సందేహం వస్తుంటుంది. ఆ సందేహానికి చెక్‌ పెడుతూ కాల్‌ చేస్తున్న వారి పేరు ఫోన్‌ డిస్‌ప్లేపై కనిపించే ఫీచర్‌ త్వరలో సాకారం కానుంది. టెలికం నెట్‌వర్క్‌లో 'కాలింగ్‌ నేమ్‌ ప్రెజెంటేషన్‌ సప్లిమెంటరీ సర్వీస్‌'(సీఎన్‌ఏపీ)ను ప్రవేశపెట్టాలంటూ టెలికం రెగ్యులేటరీ సంస్థ ట్రాయ్‌ సిఫారసు చేసింది. సిఫార్సు అమలైతే కస్టమర్‌ అభ్యర్థన మేరకు టెలికం కంపెనీలు ఈ సేవను అందించాల్సి ఉంటుంది. స్పామ్, మోసపూరిత కాల్స్‌కు దీనితో చెక్‌ పెట్టొచ్చన్నది ట్రాయ్‌ ఉద్దేశ్యంగా ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

24-2-2024	
విశాఖ	525–00
చిత్తూరు	588–00
ఈస్ట్, వెస్ట్‌ గోదావరి	515–00
విజయవాడ	515–00
రిటైల్‌ ధర (డజను)	72.00
23-2-2024 ఫామ్‌ ధర...	
హైదరాబాద్	520–00
వరంగల్	522–00
రిటైల్‌ ధర	5.80

ఏటా రూ. 1,000 కోట్ల పెట్టుబడులు

థర్మాక్స్‌ ఎండీ ఆశీష్‌ భండారీ



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: వచ్చే మూడేళ్లలో కార్యకలాపాల విస్తరణపై ఏటా రూ. 500–1,000 కోట్ల మేర పెట్టుబడి వ్యయాలు చేయనున్నట్లు పర్యావరణహిత శక్తికి సంబంధించిన సొల్యూషన్స్‌ అందించే థర్మాక్స్‌ లిమిటెడ్‌ ఎండీ ఆశీష్‌ భండారీ తెలిపారు. గ్రీన్‌ హైడ్రోజన్, బయో–సీఎన్‌జీ వంటి పర్యావరణ అనుకూల విద్యుత్‌ విధానాల వైపు మళ్లడంలో కంపెనీలకు సేవలు అందిస్తున్నట్లు ఆయన వివరించారు. తెలంగాణలో ఫార్మా, ఫుడ్‌ అండ్‌ బేవరేజెస్‌ తదితర రంగాల సంస్థలపై ప్రధానంగా దృష్టి పెడుతున్నట్లు వివరించారు. వివిధ ఉత్పత్తుల తయారీ కోసం తమ 9 అధునాతన ప్లాంట్లు ఉన్నాయని సంస్థ ఉత్పత్తులు, కార్యకలాపాలపై అవగాహన పెంచేందుకు శుక్రవారమిక్కడ నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్న సందర్భంగా భండారీ పేర్కొన్నారు. దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ, తమిళనాడులో తమకు ప్లాంట్లు ఉన్నట్లు తెలిపారు.

రూ. 160 కోట్ల రుణాలపై 'ద్వార ఈ–రిజిస్ట్రీ' దృష్టి


హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: అగ్రి ఫిన్‌టెక్‌ సంస్థ 'ద్వార ఈ–రిజిస్ట్రీ' రైతులకు వచ్చే ఆర్థిక సంవత్సరం రూ. 160 కోట్ల రుణ వితరణను లక్ష్యంగా పెట్టుకుంది. రెండేళ్ల క్రితం పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత నుంచి ఇప్పటి వరకు ఏడు వేల మంది పైచిలుకు రైతులకు దాదాపు రూ. 59 కోట్లు అందించినట్లు సంస్థ సహ వ్యవస్థాపకుడు తారకేశ్వర్‌ గంటా తెలిపారు. రైతు రుణ అవసరాలకు సంబంధించి ఆరు బ్యాంకులతో భాగస్వామ్యం ఉన్నట్లు చెప్పారు.



తారకేశ్వర్‌ గంటా

సినిమా

మేలో ఇండియన్‌ 2?



• కమల్‌ హాసన్

కమల్‌హాసన్‌ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఇండియన్‌ 2' ఈ ఏడాది మేలో విడుదల కానుందనే టాక్‌ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఇందుకు సంబంధించిన కార్యాచరణను కూడా స్టార్ట్‌ చేశారట మేకర్స్. త్వరలోనే 'ఇండియన్‌ 2' సినిమా రిలీజ్‌ గురించిన అధికారిక ప్రకటన కూడా రానుందని కోలీవుడ్‌ బోగట్టా. కమల్‌ హాసన్, దర్శకుడు శంకర్‌ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన సూపర్‌ హిట్‌ ఫిల్మ్‌ 'ఇండియన్‌' (తెలుగులో 'భారతీయుడు'). ఈ సినిమాకు సీక్వెల్‌గా 'ఇండియన్‌ 2'(తెలుగులో 'భారతీయుడు 2') రూపొందుతోంది. 'ఇండియన్‌' సినిమాకు దర్శకత్వం వహించిన శంకరే 'ఇండియన్‌ 2'ను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో కాజల్‌ అగర్వాల్‌ హీరోయిన్‌గా నటించగా, సిద్ధార్థ్, బాబీ సింహా, రకుల్‌ ప్రీత్‌సింగ్‌ కీలక పాత్రలు పోషించారు. సుభాస్కరన్, ఉదయనిధి స్టాలిన్‌ నిర్మించిన 'ఇండియన్‌ 2' కి అనిరుధ్‌ స్వరకర్త.



• వెంకటేష్



• త్రిష

టార్గెట్‌ ఫిక్స్‌!



• రామ్‌చరణ్

హీరో రామ్‌చరణ్, దర్శకుడు శంకర్‌ కాంబినేషన్‌లో రూపొందుతున్న పొలిటికల్‌ యాక్షన్‌ థ్రిల్లర్‌ మూవీ 'గేమ్‌చేంజర్‌'. ఈ సినిమాలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఐఏఎస్‌ ఆఫీసర్‌ రామ్‌నందన్‌ పాత్రలో రామ్‌చరణ్‌ నటిస్తున్నారని తెలిసింది. ఇటీవల 'గేమ్‌చేంజర్‌' సినిమా కొత్త షెడ్యూల్‌ చిత్రీకరణ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. 'కేజీఎఫ్‌' ఫేమ్‌ స్టంట్‌ కొరియోగ్రాఫర్స్‌ అన్బు, అరివు డిజైన్‌ చేసిన ఓ యాక్షన్‌ సీక్వెన్స్‌ చిత్రీకరణలో రామ్‌చరణ్‌ పాల్గొంటున్నారు. ఈ యాక్షన్‌ సీక్వెన్స్‌తో పాటుగా, రామ్‌చరణ్, నవీన్‌చంద్ర, మరికొందరు కీలక పాత్రధారులపై టాకీపార్టు చిత్రీకరణ కూడా జరగనుంది. కాగా ఈ సినిమా చిత్రీకరణను జూలైలోపు పూర్తి చేయాలని చిత్రయూనిట్‌ టార్గెట్‌ పెట్టుకుందని ఫిల్మ్‌నగర్‌ సమాచారం. అంజలి, శ్రీకాంత్, జయరాం, సునీల్, ఎస్‌జే సూర్య కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు తమన్‌ సంగీతం అందిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై 'దిల్‌' రాజు, శిరీష్‌ నిర్మిస్తున్న 'గేమ్‌చేంజర్‌' డిసెంబరులో విడుదల కానుందనే ప్రచారం ఫిల్మ్‌నగర్‌ సర్కిల్స్‌లో జరుగుతోంది.

ఆలియా సాహసం



• ఆలియా భట్, వేదంగ్‌ రైనా

'జిగ్రా' సినిమా షూటింగ్‌ను పూర్తి చేశారు హీరోయిన్‌ ఆలియాభట్. అలాగే ఈ సినిమాను ఈ ఏడాది సెప్టెంబరు 27న రిలీజ్‌ చేస్తున్నట్లు వెల్లడించి ఆన్‌ లొకేషన్‌ ఫొటోలను షేర్‌ చేశారామె. ఆలియాభట్, వేదంగ్‌ రైనా లీడ్‌ రోల్స్‌లో నటించిన చిత్రం 'జిగ్రా'. హిందీలో 'మౌనిక ఓ మై డార్లింగ్‌', 'పెడ్లర్స్‌' వంటి సినిమాలు తీసిన వాసన్‌ బాల 'జిగ్రా' కి దర్శకుడు. కరణ్‌జోహార్, అపూర్వ మెహతా, ఆలియాభట్‌ ఈ సినిమాను నిర్మించారు. తన సోదరుడి రక్షణ కోసం ఎలాంటి సాహసానికైనా వెనకాడని ఓ అమ్మాయి కథే ఈ చిత్రం అని బాలీవుడ్‌ టాక్. ఇదిలా ఉంటే.. 'జిగ్రా' కాకుండా సంజయ్‌ లీలా భన్సాలీ డైరెక్షన్‌లో 'లవ్‌ అండ్‌ వార్‌', ఆదిత్యాచోప్రా నిర్మాణంలో ఓ స్పై థ్రిల్లర్, 'బ్రహ్మాస్త్రం' ఫ్రాంచైజీతో బిజీగా ఉన్నారు ఆలియాభట్.

జోడీ కుదిరిందా?

హీరో వెంకటేశ్, హీరోయిన్‌ త్రిష నాలుగోసారి జోడీగా నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్‌ వర్గాలు. వీరిద్దరూ గతంలో 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' (2007), 'నమో వెంకటేశ'(2010), 'బాడీగార్డ్‌'(2012) వంటి సినిమాలతో ప్రేక్షకులను అలరించారు. ఈ హిట్‌ జోడీ ఇప్పుడు నాలుగోసారి కలిసి నటించేందుకు సిద్ధమవుతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. వెంకటేశ్‌ హీరోగా అనిల్‌ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ మూవీకి త్రిష గ్రీన్‌ సిగ్నల్‌ ఇచ్చారని టాక్. వెంకటేశ్, వరుణ్‌ తేజ్‌లతో 'ఎఫ్‌ 2', 'ఎఫ్‌ 3' వంటి సినిమాలు తీసి, హిట్‌ అందుకున్నారు అనిల్‌ రావిపూడి. ఈ ఫ్రాంచైజీలో 'ఎఫ్‌ 4' సినిమా ఉంటుందని 'ఎఫ్‌ 3' క్లైమాక్స్‌లో హింట్‌ ఇచ్చింది చిత్రయూనిట్.

'ఎఫ్‌ 2, ఎఫ్‌ 3' సినిమాలు నిర్మించిన 'దిల్‌' రాజే తాజాగా వెంకీ–అనిల్‌ కాంబినేషన్‌లో మూడో సినిమా నిర్మించనున్నారట. ఈ మూవీలో హీరోయిన్‌గా త్రిషని ఎంపిక చేసుకున్నట్లు సమాచారం. అంటే.. దాదాపు పుష్కర కాలం తర్వాత వెంకటేశ్–త్రిష మరోసారి జోడీగా నటించనున్నారన్నమాట. పూర్తి గ్రామీణ నేపథ్యంలో రూపొందనున్న ఈ సినిమా 2025 సంక్రాంతికి విడుదల కానున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. వెంకటేశ్‌తో అనిల్‌ రావిపూడి తెరకెక్కించేది 'ఎఫ్‌ 4' సినిమానా? లేక మరొక చిత్రమా? అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

విమానంలో చోరీ



• కృతీ సనన్ • టబు • కరీనా కపూర్

టబు, కరీనా కపూర్, కృతీసనన్‌ ప్రధాన పాత్రల్లో, దిల్జీత్‌ సింగ్‌ కీలక పాత్రలో నటించిన చిత్రం 'ది క్రూ'. కార్పొరేట్‌ ఏవియేషన్‌ బిజినెస్‌ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో టబు, కరీనా, కృతీ ఎయిర్‌హోస్టెస్‌గా నటించారు. ఓ విమానం హైజాకింగ్, దొంగతనం నేపథ్యంలో 'ది క్రూ' సినిమా కథనం ఉంటుందని బీ టౌన్‌ టాక్. ఇక బాలీవుడ్‌లో 'లూటికేస్‌' సినిమా తీసిన రాజేష్‌ కృష్ణన్‌ ఈ సినిమాకు దర్శకుడు. 'వీరే ది వెడ్డింగ్‌ (2018)', 'థ్యాంక్యూ ఫర్‌ కమింగ్‌(2023)' వంటి ఉమెన్‌ సెంట్రిక్‌ ఫిల్మ్స్‌ నిర్మించిన రేఖా కపూర్, ఏక్తా కపూర్‌ 'ది క్రూ' సినిమాను నిర్మించారు. తాజాగా ఈ సినిమాలోని ప్రధాన తారాగణం అయిన టబు, కరీనా, కృతీసనన్‌ల కొత్త పోస్టర్స్‌ను రిలీజ్‌ చేశారు మేకర్స్. తొలుత ఈ సినిమాను మార్చి 22న రిలీజ్‌ చేయాలనుకున్నారు. ఆ తర్వాత మార్చి 29కి వాయిదా వేసిన సంగతి తెలిసిందే.

మార్చిలో తంత్ర



• ధనుష్‌ రఘుముద్రి, అనన్య నాగళ్ల

అనన్య నాగళ్ల లీడ్‌ రోల్‌లో నటించిన 'తంత్ర' చిత్రం విడుదల తేదీ ఖరారు అయింది. మార్చిలో ఈ సినిమాని రిలీజ్‌ చేయనున్నట్లు చిత్రయూనిట్‌ ప్రకటించింది. శ్రీనివాస్‌ గోపిశెట్టి దర్శకత్వం వహించిన ఈ మూవీలో ధనుష్‌ రఘుముద్రి, సలోని, 'టెంపర్‌' వంశీ, మీసాల లక్ష్మణ్, కుశాలిని కీలక పాత్రల్లో నటించారు. ఫస్ట్‌ కాపీ మూవీస్, బి ద వే ఫిల్మ్స్, వైజాగ్‌ ఫిల్మ్‌ ఫ్యాక్టరీపై నరేష్‌ బాబు పి, రవి చైతన్య నిర్మించారు. ఈ మూవీని మార్చి 15న విడుదల చేయనున్నట్లు పోస్టర్‌ని రిలీజ్‌ చేశారు మేకర్స్. ''హారర్‌ నేపథ్యంతో రూపొందిన 'తంత్ర' చిత్రం ప్రేక్షకులను థ్రిల్‌ చేస్తుందనే నమ్మకం ఉంది. పల్లెటూరి అమ్మాయిగా, క్షుద్రపూజలకి గురైన బాధితురాలిగా అనన్య నాగళ్ల చక్కగా నటించారు'' అన్నారు దర్శక–నిర్మాతలు. ఈ చిత్రానికి సహ నిర్మాత: తేజ్‌ పల్లి, కెమెరా: సాయి రామ్‌ ఉదయ్, విజయ భాస్కర్‌ సద్దాల, సంగీతం: ఆర్‌ఆర్‌ ధ్రువన్.

రొమాంటిక్‌ ఎంటర్‌టైనర్



• విజయ్‌ ఆంటోనీ, మృణాళిని రవి

'బిచ్చగాడు' వంటి బ్లాక్‌బస్టర్‌ మూవీతో తెలుగు ప్రేక్షకుల్లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు విజయ్‌ ఆంటోనీ. ఆయన హీరోగా తెరకెక్కుతున్న తాజా తమిళ చిత్రం 'రోమియో'. వినాయక్‌ వైద్యనాథన్‌ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మృణాళినీ రవి హీరోయిన్‌గా నటిస్తున్నారు. మీరా విజయ్‌ ఆంటోనీ సమర్పణలో విజయ్‌ ఆంటోనీ ఫిలిం కార్పొరేషన్‌పై విజయ్‌ ఆంటోనీ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం తెలుగులో 'లవ్‌ గురు' పేరుతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. భరత్‌ ధనశేఖర్‌ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చెల్లెమ్మవే చెయ్యి పట్టు కోవే..' అంటూ సాగే పాటని రిలీజ్‌ చేశారు మేకర్స్. ఈ సాంగ్‌కి భాష్యశ్రీ సాహిత్యం అందించగా, ఆదిత్య ఆర్కే పాడారు. ''విజయ్‌ ఆంటోనీ తొలిసారి రొమాంటిక్‌ ఎంటర్‌టైనర్‌ జానర్‌లో నటిస్తున్న చిత్రం 'లవ్‌ గురు'. ఇందులో మనసుని కదిలించే చెల్లెలి సెంటిమెంట్‌ కూడా ఉంటుంది. వేసవిలో ఈ చిత్రం విడుదల చేయనున్నాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి కెమెరా: ఫరూక్‌ జే బాషా.

టెట్, టీఆర్‌టీ నోటిఫికేషన్ల నిలుపుదలకు 'నో'



- పరీక్షల రీ షెడ్యూల్‌కూ హైకోర్టు ససేమిరా
- తదుపరి విచారణ 28కి వాయిదా

సాక్షి, అమరావతి: ఏపీ ఉపాధ్యాయ భర్తీ పరీక్ష (టీఆర్‌టీ), ఏపీ టీచర్ అర్హత పరీక్ష (టెట్)ల నోటిఫికేషన్ల అమలును నిలుపుదల చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. అలాగే, పరీక్షల వాయిదాకు సైతం తిరస్కరించింది. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీచేయడం సాధ్యం కాదంది. ఈ వ్యవహారంపై తుది విచారణ జరుపుతామని తెలిపింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పాఠశాల విద్యాశాఖను ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 28కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. టీఆర్‌టీ, టెట్ పరీక్షల నోటిఫికేషన్లను సవాలు చేస్తూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎం.పెద్దిరాజు మరో నలుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. టెట్, టీఆర్‌టీ నోటిఫికేషన్లను రద్దుచేయాలని కోరారు. రెండు పరీక్షల మధ్య తగినంత సమయంలేదని, పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఆ సమయం సరిపోదని వారు వివరించారు. టీఆర్‌టీ నిర్వహణ కోసం ఈ నెల 12న, టెట్ పరీక్ష నిర్వహణకు 8న నోటిఫికేషన్లు జారీచేశారని తెలిపారు. టెట్‌లో అర్హత సాధించిన వారు టీఆర్‌టీకి హాజరయ్యేందుకు అర్హులన్నారు. టెట్ ఫలితాలను మార్చి 14న విడుదల చేస్తారని, ఆ మరుసటి రోజే అంటే మార్చి 15న టీఆర్‌టీ పరీక్ష నిర్వహిస్తారని వివరించారు. టెట్ పరీక్ష సిలబస్ చాలా ఎక్కువని, ఆ పరీక్షకు హాజరయ్యేందుకు ఉన్న గడువు కేవలం 19 రోజులు మాత్రమేనన్నారు. ఇది ఎంతమాత్రం సరిపోదన్నారు. టీఆర్‌టీ పరీక్షకు సైతం తక్కువ సమయమే ఉందన్నారు. అందువల్ల ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని పిటిషనర్లు కోరారు. నోటిఫికేషన్ల అమలును నిలుపుదల చేయడంతో పాటు పరీక్షలను వాయిదా వేసి తిరిగి షెడ్యూల్‌ను ఖరారు చేసేలా ఉత్తర్వులివ్వాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి శుక్రవారం తన నిర్ణయాన్ని వెలువరించారు. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు సాధ్యంకాదని, అలా ఇస్తే తుది ఉత్తర్వులు ఇచ్చినట్లేనన్నారు. ఈ వ్యవహారంపై అత్యవసర విచారణ అవసరమని పిటిషనర్లు చెబుతున్న నేపథ్యంలో ఈనెల 28న తుది విచారణ జరుపుతామని న్యాయమూర్తి స్పష్టంచేశారు.

నేటి నుంచి మిలాన్ సీ ఫేజ్ విన్యాసాలు

సాక్షి, విశాఖపట్నం: తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం విశాఖ వేదికగా జరుగుతున్న మిలాన్–2024లో హార్బర్ ఫేజ్ విన్యాసాలు ముగిశాయి. శనివారం నుంచి 27వ తేదీ వరకు సీ ఫేజ్ విన్యాసాలు జరగనున్నాయి. సముద్ర దశ విన్యాసాల్లో భారత నౌకాదళ నౌకలు, జలాంతర్గాములతో పాటు రష్యా, యూఎస్, ఆస్ట్రేలియా, మలేషియా, శ్రీలంక, బంగ్లాదేశ్, మయన్మార్ తదితర స్నేహపూర్వక దేశాలకు చెందిన 15 యుద్ధ నౌకలు, ఒక ఎయిర్‌క్రాఫ్ట్ ఈ విన్యాసాల్లో పాలుపంచుకోనున్నాయి. సీ ఫేజ్ విన్యాసాల్లో భారత నౌకాదళానికి చెందిన ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్స్ ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.



ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు శుభపరిణామం

- విశాఖ పరిపాలనా రాజధాని కాకుండా ఆపడం ఎవరి తరం కాదు
- వికేంద్రీకరణ నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ లజపతిరాయ్



సాక్షి, విశాఖపట్నం: విశాఖకు మాత్రమే పరిపాలన రాజధాని కాగల అన్నీ అర్హతలూ ఉన్నాయని మరోమారు రుజువైందని, విశాఖలో ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడమే ఇందుకు నిదర్శనమని రాష్ట్ర పరిపాలనా వికేంద్రీకరణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ లజపతిరాయ్ స్పష్టం చేశారు. శుక్రవారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. కొంతమంది స్వార్థంతో విశాఖను పరిపాలనా రాజధానిగా కాకుండా అడ్డుకుంటున్నారని, ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా విశాఖ పరిపాలనా రాజధాని కాక తప్పదని ధీమా వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర వికాసానికి విశాఖ 'గ్రోత్ ఇంజిన్'గా పనిచేస్తుందని తద్వారా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దోహదం చేస్తుందని జేఏసీ భావిస్తున్నదన్నారు. విశాఖ పరిపాలనా రాజధాని అయితే.. సమర్థ ఆర్థిక కేంద్రంగా మారనుందని కేంద్రం భావిస్తున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయ నిర్మాణానికి విశాఖలోనే స్థల సేకరణ చేయాలని ఆర్బీఐ విజ్ఞప్తి చేసిందని చెప్పారు.

సంబంధంలేని అధికారిని ప్రతివాదిగా చేరుస్తారా?

- ముంబై నుంచి కోర్టు ముందుకు వచ్చేలా చేస్తారా?
- ఆ అధికారికి రూ.30వేలను ఖర్చుల కింద చెల్లించండి
- పిటిషనర్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ఏమాత్రం సంబంధంలేని ఓ అధికారిని కోర్టు ధిక్కార కేసులో ప్రతివాదిగా చేర్చి, అతన్ని కోర్టు ముందు హాజరయ్యేలా చేసినందుకు ఓ పిటిషనర్‌పై హైకోర్టు మండిపడింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన వ్యవహారంతో ఏమాత్రం సంబంధం లేకపోయినా ప్రతివాదిగా చేర్చడంతో ముంబై నుంచి అమరావతి హైకోర్టుకు వచ్చిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) చైర్మన్‌కు రూ.30వేలను ఖర్చుల కింద చెల్లించాలని పిటిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ తీరు వల్ల సీసీఐ చైర్మన్‌కు అసౌకర్యం కలిగిందని ఘాటుగా వ్యాఖ్యానించింది. కోర్టు ధిక్కార కేసుల్లో అధికారుల పేర్లను వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చే ముందు న్యాయవాదులు అప్రమత్తంగా ఉండాలని హితవు పలికింది. కోర్టు ఆదేశాల ఉల్లంఘనలకు బాధ్యులైన అసలు అధికారులు ఎవరో వారిని ప్రతివాదులుగా చేర్చేందుకు పిటిషనర్‌కు అనుమతినిచ్చింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎలాంటి విచారణ జరపకుండానే సీసీఐ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) తనను ఉద్యోగం నుంచి తొలగించారంటూ గుంటూరు బ్రాంచ్‌కు చెందిన జూనియర్ కమర్షియల్ ఎగ్జిక్యూటివ్ వికాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు వికాస్ తొలగింపు ఉత్తర్వులపై స్టే విధించింది. అయితే, అధికారులు హైకోర్టు ఆదేశాలను అమలుచేయకపోవడంతో వికాస్ కోర్టు ధిక్కార పిటిషన్‌ను దాఖలు చేశారు. ఇందులో సీసీఐ చీఫ్ జనరల్ మేనేజర్ లలిత్‌కుమార్ గుప్తా, గుంటూరు బ్రాంచ్ మేనేజర్ స్వప్నిల్, గతంలో మేనేజర్‌గా పనిచేసిన సాయి అదిత్యలను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన హైకోర్టు, ప్రతివాదులుగా ఉన్న అధికారులను స్వయంగా కోర్టు ముందు హాజరుకావాలని ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు సీసీఐ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న లలిత్‌కుమార్ గుప్తా శుక్రవారం కోర్టు ముందు హాజరయ్యారు. కోర్టు ధిక్కార వ్యాజ్యంలో పిటిషనర్ తనను సీజీఎంగా పేర్కొన్నారని ఆయన కోర్టుకు వివరించారు. దీంతో న్యాయమూర్తి పిటిషనర్ తీరును ఆక్షేపించారు. ముంబై నుంచి లలిత్‌కుమార్‌ను రప్పించినందుకు అతనికి రూ.30వేలు ఖర్చులు కింద చెల్లించాలని వికాస్‌ను ఆదేశించారు.

విశ్రాంత ఐఏఎస్ జన్నత్ హుస్సేన్ కన్నుమూత

- నేడు హైదరాబాద్‌లో అంత్యక్రియలు
- వైఎస్ తొలి సంతకం చేసిన రైతులకు ఉచిత విద్యుత్ ఫైలు రూపకర్త



సూళ్లూరుపేట రూరల్ (తిరుపతి జిల్లా)/సాక్షి, హైదరాబాద్ : విశ్రాంత ఐఏఎస్ అధికారి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (స్పెషల్ చీఫ్ సెక్రటరీ)గా పనిచేసిన ఐఏఎస్ అధికారి జన్నత్ హుస్సేన్ శుక్రవారం తుది శ్వాస విడిచారు. గత ఆరేళ్లుగా అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్న ఆయన తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో కన్నుమూశారు. అంత్యక్రియలు శనివారం హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని సిద్ధార్థనగర్‌లో రైతు కుటుంబంలో జన్మించిన జన్నత్‌హుస్సేన్ 1977 బ్యాచ్‌లో ఐఏఎస్‌లో చేరారు. 33 ఏళ్ల సర్వీసు అనంతరం 2010లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో పదవీ విరమణ చేశారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే సమయంలో సీఎంవో ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. వైఎస్ ఆదేశాల మేరకు ఉచిత విద్యుత్ అమలు చేసే తొలి ఫైలును రూపొందించి, విధివిధానాలు తయారు చేయడంలో జన్నత్‌హుస్సేన్ కీలకపాత్ర పోషించారు.

గవర్నర్, సీఎం సంతాపం

సాక్షి, అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సమాచార శాఖ ప్రధాన కమిషనర్‌గా, అలాగే వివిధ హోదాల్లో విశేష సేవలు అందించిన విశ్రాంత ఐఏఎస్ అధికారి జన్నత్ హుస్సేన్ మృతికి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

నారా లోకేశ్ మళ్లీ ఇంటికే..

మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, చిత్రంలో గంజి చిరంజీవి

మంగళగిరి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నారా లోకేశ్‌కు మరోమారు ఓటమి తప్పదని, వైఎస్సార్‌సీపీ తరఫున సీటు ఎవరికి కేటాయించినా వారి విజయానికి కృషి చేస్తానని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవితో కలసి మంగళగిరిలోని పెదకోనేరు అభివృద్ధి పనులను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. మంగళగిరి నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో ఉన్న చేనేత వర్గానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అసెంబ్లీ టికెట్ కేటాయించారని, ఆయన ఆదేశాల మేరకు తాను పూర్తిస్థాయిలో కలిసి పనిచేస్తానన్నారు. గుంటూరు ఎంపీ అభ్యర్థి, మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానని చెప్పారు. తాను స్థానికేతరుడిని అయినప్పటికీ మంగళగిరి ప్రజలు గెలిపించుకున్నారని, దానికి తగినట్లుగా ఐదేళ్లకాలంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. నారా లోకేశ్, తాను ఇద్దరం స్థానికేతరులమని.. అయినప్పటికీ 2019లో ప్రజలు తననే గెలిపించారని చెప్పారు. ఐదేళ్లపాటు మంత్రిగా ఉన్న నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గంలో నివాసం ఉంటూ, ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఇక్కడే నివాసం ఉంటూ మంగళగిరి అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదని విమర్శించారు. సీఎం జగన్ సంక్షేమ పథకాలు చూసి.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి బరిలో దిగుతున్న లోకల్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శనివారం । 24 । ఫిబ్రవరి । 2024



కొండలమ్మ సేవలో ఐజీ

గుడ్లవల్లేరు: వేమవరం కొండలమ్మ అమ్మవారిని ఏలూరు రేంజి ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ శుక్రవారం దర్శించుకున్నారు.



రథోత్సవం ప్రారంభం

నందిగామ టౌన్: రామలింగేశ్వర స్వామి రథోత్సవాన్ని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎం.జగన్‌మోహనరావు, అరుణకుమార్ ప్రారంభించారు.



అనితరుడు గ్రంథ పరిచయం

విజయవాడ కల్చరల్: పలువురు రచయితలు రచించిన కవిత్వ విశ్లేషణా గ్రంథం అనితరుడు గ్రంథం పరిచయ సభ శుక్రవారం బాలోత్సవ్ భవన్‌లో నిర్వహించారు.

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి ఏలూరు జిల్లాకు చెందిన భక్తులు శుక్రవారం విరాళం అందజేశారు. జీలుగుమిల్లికి చెందిన అంజూరి నవీన్‌కుమార్ దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,16,150 విరాళాన్ని అందచేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ ఏఈవో ఎస్.రమేష్‌బాబు, ప్రధాన అర్చకులు ఎల్‌డీ ప్రసాద్, ఆలయ పర్యవేక్షకులు జగదీష్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు అందించారు.

వైభవంగా వీరమ్మతల్లి తిరునాళ్ల



ఉయ్యూరు: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి వీరమ్మతల్లి తిరునాళ్ల ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించేందుకు భక్తులు డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తరలిరావటంతో ఉయ్యూరు పట్టణం సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు జోడు పాట్లేళ్ల ప్రభ బండ్లుతో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి పాట్లేళ్ల ప్రభ బండ్లు సమర్పించి భక్తి పారవశ్యం చెందారు. తిరునాళ్ల ఊరేగింపులో డప్పు కళాకారుల విన్యాసాలు, ఆట పాటలు ఆకట్టుకుంటున్నాయి.

దుర్గమ్మ సేవలో జస్టిస్ నాగార్జునరెడ్డి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ జస్టిస్ సి.వి. నాగార్జునరెడ్డి శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన జస్టిస్ నాగార్జునరెడ్డి, బృంద సభ్యులను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనతంరం వేద పండితులు ఆశీర్వచనం అందచేశారు. అనంతరం ఆలయ ఈవో కెఎస్. రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



ఏఎన్‌యూ :ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను వీసీ ఆచార్య పి రాజశేఖర్ శుక్రవారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు విజయవంతం కావాలని, ఫలప్రదమైన చర్చలు జరగాలన్నారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎం రామిరెడ్డి మాట్లాడుతూ 'మెటీరియల్ సైన్స్ అండ్ కేరెక్టరైజేషన్ టెక్నిక్స్' అనే అంశంపై మార్చి 6, 7 తేదీలలో నిర్వహిస్తున్నామన్నారు, సదస్సులో దేశ వ్యాప్తంగా పలు యూనివర్సిటీలకు చెందిన అధ్యాపకులు, పరిశోధకులు, పరిశోధనా సంస్థలకు చెందిన భౌతిక శాస్త్రవేత్తలు హాజరై పరిశోధనా పత్రాలు సమర్పిస్తారని తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సెమినార్ కో- డైరెక్టర్ ఆచార్య సంధ్యాకోల్, కోశాధికారి ఆచార్య జి నాగరాజు, సభ్యులు ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్ తదితరులున్నారు.

పథకాలతో పచ్చగా!

కుటీర పరిశ్రమపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న మహిళలకు జగనన్న ప్రభుత్వం ఆర్థిక చేయూతనందించి భరోసా కల్పిస్తోంది. వైఎస్సార్ ఆసరా, చేయూత, డ్వాక్రా లింకేజీ రుణాలు, ఉన్నతి తదితర పథకాలు పొంది తాము చేస్తున్న ఉపాధి పనులకు వినియోగించుకొని మరింత ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. పిల్లలను చదివించుకుంటూ వారి అభివృద్ధికి దోహదపడుతున్నారు. పట్టాలు కుడుతూ పనులు చేసుకొనే మహిళలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పచ్చగా బతుకుతున్నారు.



సంచులు విప్పదీస్తున్న మహిళా కూలీలు

- అనిగండ్లపాడులో కుటీర పరిశ్రమగా పట్టాల తయారీ
- వందల సంఖ్యలో మహిళల ఉపాధి
- ఏడాదికి రూ.50 కోట్ల వ్యాపారం
- మహిళలకు అండగా ప్రభుత్వ పథకాలు
- ఆర్థికంగా కుటుంబాలు అభివృద్ధి

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): తిరుపతమ్మ పుట్టినిల్లు అయిన అనిగండ్లపాడు గ్రామంలో ప్రజలు తమ జీవనోపాధి కోసం ఒక ప్రత్యేక మార్గాన్ని ఎంచుకున్నారు. ఒకప్పుడు పనికోసం వలస వెళ్లిన వీరు ప్రస్తుతం ప్లాస్టిక్ గోతాలతో పరదా పట్టాలు తయారు చేస్తూ తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ పట్టాలను రైతులు తమ వ్యవసాయోత్పత్తులను కప్పుకోవటానికి, నిర్మాణాలు జరిగేటప్పుడు గోడలుగా అడ్డం కట్టటానికి ఉపయోగిస్తున్నారు. గ్రామంలో జనాభా 8 వేల మంది ఉండగా 4 వేల మంది వరకు ఈ పరదా పట్టాలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వీరిలో మహిళలే కీలకంగా ఉన్నారు. 1000 మందికి పైగా మహిళలు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన వారు పట్టాల తయారీలో 365 రోజులూ నిమగ్నమవుతారు. గతంలో పనులకు ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు నేడు గ్రామంలోనే ఉపాధి పొందుతున్నారు. పరదా పట్టాల తయారీలో అనిగండ్లపాడు గ్రామస్తులది అందె వేసిన చేయి. చిన్న చిన్న కుటుంబాల వారు పట్టాల తయారీని కుటీర పరిశ్రమగా మార్చుకొని ముందుకు సాగుతున్నారు. ఆగస్టు నుంచి ఏప్రిల్ వరకు పట్టాలకు డిమాండ్ ఉంటుంది. దీంతో గ్రామం పరదా పట్టాల తయారీకి ప్రముఖ కేంద్రంగా మారింది. ఆంధ్రా, తెలంగాణలోని వివిధ ప్రాంతాలకే కాకుండా ముంబయి, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, తదితర రాష్ట్రాలకు సైతం ఎగుమతి అవుతుంటాయి. దీంతో గ్రామంలో వ్యాపారం ఏడాదికి రూ.50 కోట్ల వరకు జరుగుతోంది.

మహిళలదే ప్రధాన పాత్ర....

పరదా పట్టాల తయారీలో మహిళలు ప్రముఖ పాత్ర వహిస్తున్నారు. వందల సంఖ్యలో మహిళలు వీటి తయారీలో ఉంటారు. పట్టాలు ఊడదీయటం, శుభ్రపరచటం, కుట్టటంలో మహిళలే ఎక్కువగా ఉన్నారు. కొందరు మహిళలు భర్తలు మరణించినా అధైర్య పడకుండా పట్టాలు కుట్టుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. పిల్లలను ఉన్నత విద్యలు చదివించుకుంటున్నారు. సీజన్ బట్టి రోజుకు రూ.1000 వరకు సంపాదిస్తున్నారు. మహిళలకు పట్టా కుడితే రూ.20 ఇస్తారు. ఒక్కో మహిళ రోజుకు 50 పట్టాలు అవలీలగా కుడుతుంది. గతంలో కేవలం బ్యాంక్ ఇచ్చే రుణాలపై ఆధారపడగా నేడు డ్వాక్రా సంఘాలు ఇచ్చే బ్యాంక్ లింకేజీ, వైఎస్సార్ ఆసరా, స్త్రీనిధి, వైఎస్సార్ సున్నా వడ్డీ, ఉన్నతితో పాటు వైఎస్సార్ చేయూత కూడా మహిళల అభివృద్ధికి దోహదం చేస్తున్నాయి. దీంతో పట్టాల తయారీకి అవసరమైన ముడి సరుకుతో పాటు కుటుంబాలను ఉన్నతంగా మలుచుకుంటున్నారు.

హాయిగా జీవిస్తున్నాం



ఆసరా కింద ఏడాదికి రూ.10 వేలు చొప్పున రూ.40 వేలు రుణమాఫీ అయ్యాయి. పట్టాలు కుడుతూ జీవనం సాగిస్తున్న తమకు డ్వాక్రా రుణాలు కూడా అందిస్తున్నారు. దీంతో దారాలు, కుట్టు మిషన్ల మరమ్మతులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. నాభర్త మహ్మద్ ఆలీకి దివ్యాంగుల పింఛనుతో పాటు ఇద్దరు పిల్లల్లో ఒకరికి ఏడాదికి అమ్మ ఒడి కింద రూ.15 వేలు వస్తున్నాయి. జగనన్న పాలనలో హాయిగా జీవిస్తున్నాం.

–షేక్ మీరాబీ

జగనన్న పాలనలో మరింత ఆసరా



గతంలో కేవలం బ్యాంక్ రుణాలు, అప్పుల మీద ఆధారపడేవాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు డ్వాక్రా సంఘంలో రుణాలను సద్వినియోగం చేసుకుంటూ హాయిగా జీవిస్తున్నాం. ఆసరా కింద ఏడాదికి రూ.13 వేలు చొప్పున నాలుగేళ్లలో మొత్తం రూ.52 వేలు రుణమాఫీ అయింది. బ్యాంక్ లింకేజీ కింద రూ.1.50 లక్షలు, ఉన్నతి కింద రూ.40 వేలు వచ్చాయి. భర్త చనిపోయినా ఈ డబ్బులన్నిటినీ పరదా పట్టాల తయారీకి ఉపయోగిస్తున్నాం. పెద్ద కుమార్తెకు పెళ్లి చేశాను. చిన్న కుమార్తెను బ్యూటీషియన్ కోర్సు చేయించాను.

–భూక్యా ఆదిలక్ష్మి

విరివిగా డ్వాక్రా రుణాలు



గ్రామంలో మొత్తం 187 డ్వాక్రా సంఘాలు ఉండగా 1870 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 1000 మందికి పైగా పట్టాల తయారీపై ఆధారపడి ఉన్నారు. వీరందరికీ డ్వాక్రా రుణాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగు విడతల్లో 1680 మందికి రూ.7,11,56,300 రుణమాఫీ అయ్యాయి. బ్యాంక్ లింకేజి కింద ఈ ఏడాది 1450 మందికి రూ.4,27,61,000 వచ్చాయి. వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రెండు ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో 1710 మందికి రూ.27,03,510 వచ్చాయి. స్త్రీనిధి(2019–24) మధ్య 215 మందికి రూ.98,52,365, ఉన్నతి కింద (2019–24) మధ్య 88 మందికి రూ.10,57,000 వచ్చాయి. అలాగే వైఎస్సార్ చేయూత కింద రూ.18,750 చొప్పున మహిళలు 400 మంది వరకు వస్తున్నాయి. ఈ రుణాలు పట్టాల తయారీకి, కుటుంబాల అభివృద్ధికి వినియోగిస్తున్నారు.

–గింజుపల్లి నాగలక్ష్మి, గ్రామైక్య సంఘం

గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డీఆర్‌ఎం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ శుక్రవారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అమృత్ భారత్ స్టేషన్స్ పథకంలో భాగంగా ఈ నెల 26న వర్చువల్‌గా ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా గుణదల రైల్వే స్టేషన్ పునరాభివృద్ధికి శంకుస్థాపన కార్యక్రమానికి గవర్నర్‌కు ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అమృత్ భారత్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా 554 స్టేషన్‌లకు శంకుస్థాపన చేయడంతో పాటుగా 1500 ప్రాంతాల్లో ఫ్లైఓవర్‌లు, ఆర్‌యూబీలను జాతికి అంకితం చేయనున్నట్లు తెలిపారు. గవర్నర్‌ను కలిసిన వారిలో సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు ఉన్నారు.

రేపు కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి కబడ్డీ సీనియర్ పురుషుల పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టును ఈ నెల 25వ తేదీన ఎంపిక చేస్తున్నట్లు కృష్ణా జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి నత్తా యోనారాజు తెలిపారు. విజయవాడలోని ఆంధ్రా లయోల కాలేజీలో ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు జట్టు ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 85 కేజీల లోపు బరువు ఉన్న వారు మాత్రమే ఈ పోటీలకు అర్హులన్నారు. ఎంపికైన జట్టు మార్చి 8 నుంచి పదో తేదీ వరకు నెల్లూరు జిల్లా కోవూరులో జరిగే 70వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9640936777 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

కమనీయం.. తిరుపతమ్మ కల్యాణం



విద్యుద్దీపకాంతులతో అమ్మవారి ఆలయం

పెనుగంచిప్రోలు: గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి కల్యాణం శుక్రవారం రాత్రి భక్తుల జయ జయ ధ్వానాల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. విద్యుద్దీప కాంతులతో శోభిల్లుతున్న ఆలయ ప్రాంగణం బయట ప్రత్యేకంగా ఖమ్మంకు చెందిన కళాకారులు నిర్మించిన బంగారు ఛాయ కలిగిన మండపంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల సాక్షిగా అమ్మవారు, స్వామి వార్ల కల్యాణ ఘట్టం కమనీయంగా సాగింది. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, సామినేని ఉదయభాను, విమలాభాను దంపతులు ప్రభుత్వం తరుపున అమ్మవారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి పీటలపై కూర్చొన్నారు. అమ్మవారి వంశీకుల తరుపున కొల్లా రఘురామయ్య, రంగమ్మ దంపతులు, ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో కె.రమేష్‌నాయుడు, ఏసీపీ డాక్టర్ రవికిరణ్ దంపతులు కల్యాణ పీటలపై కూర్చొనగా వేద పండితులు, గ్రామ పురోహితులు, ఆలయ ప్రధాన అర్చకులు పాపమాంబ వంశీకులు కల్యాణం జరిపించారు. భక్తులు విశేషంగా తరలి వచ్చారు. భారీ స్క్రీన్‌లతో పాటు, భక్తి ఛానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేశారు. నెడ్‌కాప్ కార్పొరేషన్ చైర్మన్ రవికుమార్, ఎంపీపీ గాంధీ, దేవదాయ శాఖ మాజీ కమిషనర్ పి.సుందర్‌కుమార్, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, సీఐ జానకీరామ్, ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు, తిరుమలగిరి ఆలయ చైర్మన్ కొమరగిరి భరద్వాజ్, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను దంపతులు

అలరిస్తున్న హస్తకళ మేళా

- ఒకే వేదికపై 20 రాష్ట్రాల కళా రూపాలు
- ప్రారంభించిన మార్కెటింగ్ శాఖ కమిషనర్ ప్రశాంతి

లబ్బీపేట(విజయవాడతూర్పు: దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన విభిన్న హస్త కళా రూపాలు అద్భుత అనుభూతి కలిగిస్తున్నాయని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ పి. ప్రశాంతి అన్నారు. సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ కళాశాల ప్రాంగణంలో క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'దస్తకార్ క్రాఫ్ట్ బజార్'ను శుక్రవారం మార్కెటింగ్ శాఖ కమిషనర్ ప్రశాంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనసుకు నచ్చిన వస్తువులు కొనుగోలు చేయడం కోసం మాత్రమే కాదని, అంతకు మించి సందర్శకులు అబ్బురపడేలా ప్రాంగణం రూపుదిద్దుకుందన్నారు. దేశంలోని 20 రాష్ట్రాలలోని గ్రామీణ ప్రాంత పారిశ్రామికవేత్తల చేతులలో రూపుదిద్దుకున్న అపూర్వ హస్త కళా సంపద కనువిందు చేస్తాయన్నారు. గృహాలంకరణ మాత్రమే కాకుండా చిన్నపిల్లలకు ఎంతో సంతోషాన్నిచ్చే ఎన్నో ఆట వస్తువులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నగరవాసులు ప్రదర్శనను తిలకించిన హస్త కళలను ప్రోత్సహించాలని ప్రశాంతి కోరారు.



వస్త్రాలు పరిశీలిస్తున్న కమిషనర్ ప్రశాంతి

27వ తేదీ వరకూ..

క్రాఫ్ట్ కౌన్సిల్ చైర్ పర్సన్ ఎస్. రంజన మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ వరకు నిర్వహించే ప్రదర్శనలో రాగితో చేసిన బెల్స్, గ్రామీణ కళ్మీర్ కార్మికులు తయారుచేసిన పేపర్ మెష్, బంగారు వర్ణంలో ఉండే గడ్డితో చేసిన కేన్ బాస్కెట్స్, సముద్రపు శంఖుతో వస్తువులు, అద్దాల తాపడాలు వంటి అపురూప ఉత్పత్తులను దస్తకార్ బజార్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మురిపిస్తున్న మల్లేశ్వరాలయం

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.70 కోట్ల కేటాయింపు
- రూ.5.70 కోట్లతో ఆలయం అపు'రూపం'
- పుష్కరాల పేరిట బాబు హయాంలో మండపాలు, అన్నదాన భవనాలు తొలగింపు
- ఆ సర్కారు జమానాలో పట్టని ఆలయాభివృద్ధి
- రానున్న రోజుల్లో మరింతగా ప్రగతి పరుగులు



మల్లేశ్వర స్వామి వారి ఆలయం

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయం చరిత్ర పుటల్లో నిలిచిపోయేలా నిర్మాణం పూర్తి చేసుకుందని భక్తులు తన్మయత్వం చెందుతున్నారు. దుర్గగుడి అభివృద్ధిలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.70 కోట్ల నిధులను కేటాయించారు. ఈ నిధుల నుంచి రూ.5.70 కోట్లను వెచ్చించి నిర్మించిన ఈ ఆలయం ఎంతో అద్భుతంగా ఉందని భక్తులు మురిసిపోతున్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం, స్వర్ణ కలశం, దేవతా విగ్రహాల ప్రతిష్టా మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. సోమవారం నుంచి స్వామి వారికి నిత్యాభిషేకాలు, పూజలు ప్రారంభం కావడంతో భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకుంటున్నారు. ఆలయం చుట్టూ నిర్మించిన రాతి మండపంలో శిల్ప నిర్మాణం అందరి ప్రశంసలు అందుకుంటోంది. రాతి మండపంలోనే స్వామి వారికి సేవలు నిర్వహించేలా విశాల ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. ప్రతి నిత్యం ఆది దంపతుల శాంతి కల్యాణంతో పాటు ప్రతి ఆదివారం సూర్యోపాసన సేవలు నిర్వహించేలా నిర్మాణం చేపట్టారు. ఈ ఆలయం 500 ఏళ్లపాటు పటిష్టంగా ఉండేలా నిర్మాణం చేసినట్లు ఆలయ ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. దుర్గగుడిపై మొత్తం రూ. 2 వందల కోట్ల వ్యయంతో వివిధ పనులు మాస్టర్ ప్లాన్‌లో భాగంగా జరుగుతున్నాయి.

బాబు హయాంలో అంతా విధ్వంసమే...

2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పుష్కరాల పేరిట ఇంద్రకీలాద్రిపై పలు నిర్మాణాలను కూల్చివేసింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని భవానీదీక్ష మండపం, షాపింగ్ కాంప్లెక్స్, పరిపాలనా భవనంతోపాటు రాధాకృష్ణుల విగ్రహాల వద్ద అన్నదాన భవనం, ప్రసాదాల తయారీపోటు, యాగశాల వద్ద అన్నదాన భవనాలను కూల్చివేసింది. అప్పట్లో అన్నదాన భవనం, ప్రసాదాల తయారీ కేంద్రాన్ని నిర్మించి పదకొండేళ్లే అయింది. ఆ విషయాన్ని ఆలయ పెద్దలు చెప్పినా పెడచెవిన పెట్టి పడగొట్టేశారు. నిర్మాణానికి రూ.20 లక్షలు వ్యయం చేయగా కూల్చేందుకు రూ. 20 లక్షలు వెచ్చించడం అప్పట్లో విమర్శలకు దారి తీసింది.

జగన్ నేతృత్వంలో పునర్నిర్మాణాలు...

2016లో టీడీపీ ప్రభుత్వం కూల్చివేసిన భవనాల స్థానంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఆలయ ప్రాంగణంలోని అన్నదాన భవనం, ప్రసాదాల తయారీ కేంద్రాలతోపాటు దాతల సహకారంతో యాగశాల, పూజా మందిరాలను నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా యాగశాల, పూజా మందిరాలను దేవస్థానం నిర్మించాలని భావించినా...దాత సంగా నరసింహారావు రూ. 5 కోట్లతో యాగశాల నిర్మాణానికి ముందుకు వచ్చారు. ఇప్పటికే యాగశాల పునాదుల పనులు పూర్తి కాగా, నిర్మాణానికి అవసరమైన రాతి స్తంభాలు, ఇతర సామగ్రిని సిద్ధం చేశారు. దసరా నాటికి యాగశాల నిర్మాణం పూర్తి చేయాలనే తపనతో దేవస్థాన అధికారులున్నారు.

నగర అందాల వీక్షణకు అనువుగా...

మల్లేశ్వర స్వామి వారి ఆలయం వద్ద తూర్పు వైపున జరిగిన విస్తరణతో నగర అందాలను వీక్షించే అవకాశం భక్తులకు కలుగుతుంది. స్వామి వారి ఉత్సవాలు, అన్నదానాలను నిర్వహించేందుకు సువిశాల ప్రాంగణం అందుబాటులోకి వచ్చిందని ఆలయ అధికారులు చెబుతున్నారు. స్వామి వారి దర్శనం పూర్తయిన అనంతరం బయటకు వస్తే ప్రకాశం బ్యారేజీ మురిపిస్తుంది.

వేగంగా యాగశాల, పూజా మందిర నిర్మాణం



అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సువిశాలమైన ప్రాంగణంతో యాగశాల నిర్మిస్తున్నాం. ఆ పక్కనే అన్ని ఆర్జిత సేవలు నిర్వహించేందుకు వీలుగా పూజా మందిరాల నిర్మాణం కూడా కొనసాగుతుంది. వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేస్తాం.

– ఈవో రామారావు

గత ప్రభుత్వాలకు దీటుగా అభివృద్ధి



దుర్గగుడి అభివృద్ధిని గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో నిధులు కేటాయించడమే కాకుండా పనులు త్వరితగతిన పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించారు. సమష్టి కృషి ఫలితంగా అపురూపంగా ఆలయం సాక్షాత్కరించింది.

– చైర్మన్ రాంబాబు



టీడీపీ హయాంలో పుష్కరాల పేరిట తొలగించిన నిర్మాణాలు ఇవే (ఫైల్)



తొలగింపు తర్వాత ఆలయ పరిసరాలు

క్లుప్తంగా

అత్తను హత్య చేసిన అల్లుడికి జీవిత ఖైదు

పెనమలూరు: అత్తను హత్య చేసిన అల్లుడికి జీవితఖైదు విధిస్తూ విజయవాడ 7వ అదనపు కోర్టు జిల్లా జడ్జి ఎస్.నాగేశ్వరరావు గురువారం తీర్పు ఇచ్చారు. కృష్ణాజిల్లా పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వణుకూరు గ్రామంలో కన్నా శశిరేఖ భర్త జేజి ప్రసాద్‌తో ఉంటుంది. వీరికి వివాహం జరిగి మూడేళ్లయినా పిల్లలు పుట్టలేదు. కాగా 2018లో ఫిబ్రవరి 24వ తేదీ జేజి ప్రసాద్ మద్యం తాగి ఇంటికి వచ్చాడు. దీంతో భార్యాభర్తలకు గొడవ జరగగా జేజి ప్రసాద్ గొడ్డలితో భార్య శశిరేఖను చంపటానికి ప్రయత్నించాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న అత్త శివలీల అడ్డు వెళ్లింది. దీంతో జేజిప్రసాద్ గొడ్డలితో అత్త శివలీలను నరికి చంపాడు. ఈ ఘటనలో తప్పించుకున్న శశిరేఖ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ దామోదర్ హత్య కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పరారీలో ఉన్న జేజి ప్రసాద్ అదే నెల 27వ తేదీన పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరు పర్చగా కోర్టు రిమాండ్ విధించింది. 16 మంది సాక్షులతో చార్జిషీట్ సీఐ దామోదర్ కోర్టులో వేశారు. విచారణలో నేరం రుజువు కావటంతో జడ్జి తీర్పు చెబుతూ జేజిప్రసాద్‌కు జీవితఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు.

తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: మద్యం మత్తులో తెలుగు దేశం పార్టీ నాయకులు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో హనుమాన్ జంక్షన్ పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బాపులపాడులోని కోనేరు చెరువు గట్టు వాటర్ ట్యాంక్ వద్ద గురువారం రాత్రి తెలుగు యువత బాపులపాడు పట్టణ అధ్యక్షుడు చెరుకూరి హరికృష్ణ, స్థానిక టీడీపీ నాయకులు గూడవల్లి జగదీష్, సత్యనారాయణ మద్యం మత్తులో బాహాబాహీకి దిగారు. ఈ ఘటనలో చెరుకూరి హరికృష్ణ, గూడవల్లి సత్యనారాయణకు గాయాలయ్యాయి. దీంతో హరికృష్ణ ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో, సత్యనారాయణ గన్నవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఒకరిపై ఒకరు కౌంటర్ కేసులు పెట్టడంతో ఎస్‌ఐ ఏడీఎల్ జనర్దన్ దర్యాప్తు చేపట్టారు.

తారస్థాయికి సీట్ ఫైట్

- మైలవరంలో తీసికట్టుగా మాజీ మంత్రి ఉమా పరిస్థితి
- ముప్పేట దాడి చేస్తున్న ఆశావహులు
- అయోమయంలో టీడీపీ కేడర్



జి.కొండూరు: మూడు దశాబ్దాలకు పైగా రాజకీయ చరిత్ర, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన దేవినేని ఉమామహేశ్వరరావు రాజకీయంగా గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. రానున్న శాసన సభ ఎన్నికలలో తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసేందుకు దేవినేని ఉమామహేశ్వరరావు పాటు అతని ముఖ్య అనుచరుడు గన్నే వెంకటనారాయణ ప్రసాద్(అన్నా), బొమ్మసాని సుబ్బారావుతో పాటు ప్రస్తుత నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ సైతం పోటీ పడుతున్నారు. దేవినేని ఉమా మినహా ముగ్గురు ఆశావహులు తమ స్టైల్లో అంతర్గతంగా, బహిరంగంగా ప్రచారం చేస్తూ ముప్పేట దాడి చేస్తుండడంతో దేవినేని ఉమా రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. గత కొన్ని నెలల క్రితం బొమ్మసాని సుబ్బారావు టీడీపీ అభ్యర్థిత్వం ఆశిస్తూ నియోజకవర్గ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించడంతో పాటు శుక్రవారం నియోజకవర్గంలోని పలువురు నాయకులను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అదేవిధంగా గన్నె వెంకటనారాయణప్రసాద్(అన్నా) సైతం గత కొన్ని నెలలుగా నియోజకవర్గంలో సంచరిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలను సైతం నిర్వహించడం, ఇటీవల నారా లోకేష్‌ని కలవడం చూస్తే తానూ మైలవరం స్థానాన్ని ఆశిస్తున్నట్లు అర్థమవుతోంది.

నమ్మకం కలిగించేందుకు..

ఇదిలా ఉంటే అధిష్టానం నుంచి ఎటువంటి స్పష్టత లేకపోవడంతో దేవినేని ఉమామహేశ్వరరావు తన అభ్యర్థిత్వం కోసం నానా యాతనలు పడుతున్నారు. తానే నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అని కేడర్‌కి నమ్మకం కలిగించేందుకు గత మూడు రోజులుగా నియోజకవర్గంలోని పలు గ్రామాలలో బాబు గ్యారంటీ భవిష్యత్తు ష్యూరిటీ పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో దేవినేని ఉమామహేశ్వరరావు కార్యక్రమానికి దూరంగా ఉండాలని పార్టీ ముఖ్య నాయకులకు ఇప్పటికే అధిష్టానం నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో దేవినేని ఉమా నిర్వహిస్తున్న కార్యక్రమాలకు హాజరయ్యేందుకు పార్టీ కేడర్ పెద్దగా ఆసక్తి చూపడంలేదని తెలుస్తుంది.

కారణమిదేనా..

దేవినేని ఉమాకి రాజకీయంగా గడ్డు పరిస్థితులు ఎదురు కావడానికి కారణాలు లేకపోలేదు. ఉమా తన వైఖరితో పార్టీ ముఖ్య నాయకులపై అహంకార పూరితమైన వ్యాఖ్యలు చేయడం, స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులకు ఆర్థిక పరమైన సహకారం ఇస్తానని మోసం చేయడం, కొంత మంది అనుచరులకే కాంట్రాక్టులు కట్టబెట్టడం వంటి చర్యలే దేవినేని ఉమాకి నేడు శాపాలుగా మారాయని సొంత పార్టీ నేతలే చర్చించుకుంటున్నారు.

రేపు గ్రూప్- 2 పరీక్ష

- హాజరుకానున్న 24,373 మంది అభ్యర్థులు
- జిల్లాలో 54 పరీక్ష కేంద్రాలు
- ఆర్డీవో బీహెచ్ భవానీ శంకర్



మాట్లాడుతున్న ఆర్డీఓ భవానీ శంకర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్రూప్- 2 పరీక్షలు ఈనెల 25వ తేదీ ఆదివారం నిర్వహించనున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో బీహెచ్ భవాని శంకర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో ఏపీపీఎస్సీ గ్రూప్- 2 పరీక్షల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లపై అధికారులు, రూట్ ఆఫీసర్లు, లైజన్ ఆఫీసర్లు, వెన్యూ సూపర్ వైజర్లతో ఆర్డీవో బీహెచ్ భవాని శంకర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10:30 గంటల నుంచి 01:30 గంటల వరకు గ్రూప్ -2 పరీక్ష జరుగుతుందన్నారు. జిల్లాలో 24,373 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. జిల్లాలో 54 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు, 26 రూట్లను ఏర్పాటు చేసి 26 మంది సీనియర్ జిల్లా స్థాయి అధికారులను రూట్ ఆఫీసర్లుగా నియమించామన్నారు. ఎటువంటి తప్పులు దొర్లకుండా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

144 సెక్షన్ అమలు..

అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎటువంటి సంఘటలను జరగకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర మందులను అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా ఉండాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిధిలో జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలన్నారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ జరగకుండా ఇన్విజిలేటర్స్ పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని, అన్ని కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. దూరప్రాంతాల నుంచి అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా ఆయా రూట్లలో ఏపీఎస్ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం 9:30 గంటలకల్లా అభ్యర్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, హాల్ టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. పరీక్ష సమయం పూర్తయిన తర్వాతనే బయటకు పంపించాలన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు కేంద్రాల్లోనికి అనుమతించమని చెప్పారు.

రసవత్తరంగా క్రికెట్ టోర్నీ



విష్ణు కాలేజ్, వీఎస్ ఎస్ఆర్‌కే జట్లతో శౌరయ్య, వంశీకిరణ్

కంచికచర్ల : స్థానిక మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో జేఎన్‌టీయూ కాకినాడ సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నిమ్మగడ్డ శౌరయ్య శుక్రవారం తెలిపారు. ఈ పోటీల్లో మొత్తం 8 జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరాయని తెలిపారు. మొదటి క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాల(విజయవాడ)జట్టు, విష్ణు ఇంజినీరింగ్ కళాశాల(భీమవరం) జట్టు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విష్ణు కాలేజ్ జట్టు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి 78 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్ ఆరంభించిన ఎస్ఆర్‌కే జట్టు నిర్ణీత ఓవర్లలో అన్ని వికెట్లు నష్టపోయి 67 పరుగులు మాత్రమే సాధించింది. రెండో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ వీఆర్ సిద్ధార్థ(కానూరు) జట్టు సెయింట్ ఆన్స్(చీరాల) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చీరాల జట్టు నిర్ణీత ఓవర్లలో అన్ని వికెట్లు నష్టపోయి 82 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన వీఆర్ సిద్ధార్థ కళాశాల జట్టు 17 ఓవర్లలో 83 పరుగులు చేసి సెమీ ఫైనల్‌కు అర్హత సాధించింది. క్రీడాకారులకు కళాశాలలో అన్ని సదుపాయాలు కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. వంశీకిరణ్ తెలిపారు.

మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాట్లు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) సీఈవో మార్గదర్శకాలకు అనుగుణంగా సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎన్నికల సన్నద్ధత కార్యకలాపాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులతో కలిసి హాజరయ్యారు. సార్వత్రిక ఎన్నికలను సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై సీఈవో ముఖేష్ కుమార్ మీనా మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ జిల్లాలో ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ ఢిల్లీరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తుది ఓటర్ల జాబితా అనంతరం ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు తదితరాలకు సంబంధించిన దరఖాస్తులను పకడ్బందీగా పరిష్కరిస్తున్న విధానం, పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల కల్పన, ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు, భద్రతా సిబ్బందికి శిక్షణ, నియోజకవర్గాల వారీగా రూట్లు, అవసరమైన వాహనాలు, ఎన్నికల సిబ్బంది డేటాబేస్, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు తదితర అంశాలపై ఏర్పాట్లను వివరించారు. షెడ్యూల్ ప్రకారం ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు.

యార్డులో 1,39,924 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,10,512 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,39,924 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ. 21,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 21,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 85,622 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

నిమ్రా కళాశాలకు యూజీసీ గుర్తింపు

జూపూడి(ఇబ్రహీంపట్నం): నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ గుర్తింపు లభించిందని కళాశాల అకడమిక్ డైరెక్టర్ తమ్మినేని నారాయణమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1997లో ప్రారంభించిన కళాశాల దినదినాభివృద్ధి చెంది నేడు ఇంజినీరింగ్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ తదితర కోర్సులు విద్యార్థులకు అందిస్తోందన్నారు. ఈ కోర్సులకు యూజీసీ 2 ఎఫ్ గుర్తింపు లభించిందని తెలిపారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

రాయనపాడు(ఇబ్రహీంపట్నం): విజయవాడ రూరల్ మండలం రాయనపాడు రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్‌రైలు ప్రమాదవశాత్తూ పట్టాలు తప్పింది. ఐదు రైలు బోగీలు అదుపుతప్పి రైల్వే పక్కన ట్రాక్స్‌పై ఒరిగాయి. గురువారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపు గ్రానైట్ రాళ్లతో వస్తున్న గూడ్స్ రైలు రాయనపాడు రైల్వే స్టేషన్ సమీపంలో కొద్దిసేపు నిలిచింది. రాత్రి సమయంలో బయలుదేరిన కొద్దిసేపటికి పట్టాలు తప్పింది. రెండు రైల్వే ట్రాక్‌లపై వాలిపోవడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. విజయవాడ డివిజన్ అధికారులు, కార్మికులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని రైలు బోగీలు పట్టాలపైకి ఎక్కించారు. రైళ్ల రాకపోకలు క్రమబద్ధీకరించారు.

క్లుప్తంగా

రేపు త్రిశక్తి పీఠంలో సరస్వతీ పూజ, హోమం

కృష్ణలంక(విజయవాడతూర్పు): త్వరలో జరగనున్న పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థుల పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 25వ తేదీన బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో సరస్వతీ పూజ, సరస్వతీ సహిత మేధా దక్షిణామూర్తి హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు సీహెచ్ విజయకిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఉచితంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూజలో పాల్గొన్న విద్యార్థులకు అమ్మవారి ప్రతిమ, రక్ష, ప్రసాదం పంపిణీ చేస్తామని చెప్పారు.

మాతృత్వం ఒక మధురానుభూతి

అంకుర హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ రేఖా ప్రశాంత్‌ప్రభు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరికీ మాతృత్వం అనేది ఒక మధురానుభూతిని కలిగిస్తుందని అంకుర హాస్పిటల్ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ రేఖా ప్రశాంత్ ప్రభు తెలిపారు. అయితే డెలివరీ విషయంలో అనేక సందేహాలు తలెత్తుతున్నాయని, సహజ జననం, సిజేరియన్‌ను ఎంచుకోవడం కీలకంగా మారుతుందని అన్నారు. నగరంలోని తమ ఆస్పత్రిలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 75 నుంచి 80 శాతం ప్రసవాలు సహజంగానే జరుగుతున్నాయన్నారు. తల్లి, బిడ్డ ఇద్దరి వైద్య పరిస్థితి, రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులు, ప్రసూతి ఆరోగ్య పరిస్థితులు వంటివి సహజ ప్రసవం అనుకూలతలను ప్రభావితం చేస్తాయని చెప్పారు. ప్లాసెంటా ప్రెవియా, కాంట్రాక్టెడ్ పెల్విక్ , ఫీటల్ డిస్ట్రెస్, బ్రీచ్ ప్రెజెంటేషన్ వంటి సమస్యలున్న వారికి సిజేరియన్ అవసరం కావచ్చన్నారు.

పచ్చదనంతో గార్డ్స్ యూనిట్



విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఏపీఎస్పీఎఫ్) విజయవాడ గార్డ్స్ యూనిట్‌ను ఐజీ బి.వెంకట్రామిరెడ్డి శుక్రవారం సందర్శించారు. అసిస్టెంట్ కమాండెంట్ మల్లికార్జున ఆధ్వర్యంలో యూనిట్ ఆవరణలో నాటిన పలు రకాల మొక్కలను ఆయన పరిశీలించారు. తులసీ వనంతో పాటు వివిధ రకాలైన మొక్కలతో ఆవరణ పూర్తిగా పచ్చదనంతో నిండి ఆహ్లాదాన్ని పంచడంతో ఐజీ వెంకట్రామిరెడ్డి ముగ్ధులయ్యారు. ఆ పరిసరాల్లో తాను కొన్ని మొక్కలు నాటారు. కార్యాలయం ఆవరణలో పచ్చదనాన్ని అభివృద్ధి చేసిన సిబ్బందిని అభినందించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో విజయవాడ జోనల్ కమాండెంట్ శంకరరావు, సీఐ కామేశ్వరరావు, ఎస్ఐ ఫణికుమార్ పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. విజయవాడకు చెందిన వాగ్దేవి కూచిపూడి నృత్యాలయకు చెందిన నాట్యాచార్య సప్పా శివకుమార్ పర్యవేక్షణలో భవ్య, చరిష్మా, హాసిని, సాధన, లాస్యలతో పాటు పలువురు చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి అభినయాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన ఈ ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం అధికారులు చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలను అందజేశారు.

అక్కినేనికి స్వరాభిషేకం



విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, గీతాంజలి మ్యూజికల్స్, వేదగంగోత్రి ఫౌండేషన్ ఆధ్వర్యాన సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. వేటూరి పాటల పరిశోధకుడు డాక్టర్ జయంతిచక్రవర్తి ఆధ్వర్యంలో గాయనీ గాయకులు డాక్టర్ భాగ్యశ్రీ, రూపశ్రీ, జానపద గాయకుడు దామోదర గణపతిరావు అక్కినేని నటించిన చిత్రాల్లోని పాటలను మధురంగా ఆలపించారు. గీతాంజలి మ్యూజికల్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ జయంతిచక్రవర్తి మాట్లాడుతూ అక్కినేని స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. తొలుత అక్కినేని నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

తూర్పులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తాం

- 5.50 కోట్లతో అభివృద్ధి పనులు
- తూర్పులో మౌలిక వసతుల కల్పన
- ఎంపీ కేశినేని నాని



రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కేశినేని నాని, దేవినేని అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయవాడ తూర్పు నియోజకవర్గంలో దేవినేని అవినాష్ విజయం సాధించి వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడం ఖాయమని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) అన్నారు. తూర్పు నియోజకవర్గం పరిధిలోని 3వ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్రాన్ని మౌలికంగా అభివృద్ధిపరిచేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తోందన్నారు. ఆయన రూపొందించి అమలు పరుస్తున్న సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. కుల మతాలకు అతీతంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న మంచి పనులకు ఆకర్షితుడనై తాను వైఎస్సార్ సీపీలో చేరినట్లు స్పష్టం చేశారు.

మౌలిక వసతుల కల్పన అభినందనీయం..

ప్రజలకు మౌలిక వసతులు చేరువ చేయటంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని తెలిపారు. రోడ్లు, విద్యుత్ , తాగునీరు, మురుగునీటి వ్యవస్థలను అభివృద్ధిపరచటంలో ప్రభుత్వం చొరవ తీసుకుందన్నారు. విజయవాడ నగరంలోని అన్ని డివిజన్‌లు మౌలికంగా అభివృద్ధి చెందాయన్నారు. ముఖ్యంగా తూర్పు నియోజకవర్గం పరిధిలో ఇప్పటికే రూ.660 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ ఎప్పటికప్పుడు అధికారులతో సమన్వయంగా ఉంటూ మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారని అభినందించారు. కోట్లాది రూపాయల అభివృద్ధి, ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ప్రభుత్వానికి ప్రజలు ఎప్పుడూ అండగా నిలుస్తారని ఎంపీ కేశినేని నాని అన్నారు. తూర్పులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటిఎప్పుడు ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఇంటికే పరిమితమయ్యారని అన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలకు సేవ చేసే వాడే నిజమైన నాయకుడన్నారు. నిత్యం ప్రజా సమస్యలపై పనిచేస్తున్న తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడం, తూర్పులో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

రూ.5.50 కోట్లతో అభివృద్ధి పనులు..

మూడవ డివిజన్ పరిధిలోని పలు ముఖ్యమైన రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5.50 కోట్లు మంజూరు చేసిందని తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ చెప్పారు. కనకదుర్గ నగర్ కాలనీ, మహానాడు రోడ్డు జంక్షన్, నాగార్జున నగర్ కాలనీ రోడ్ల అభివృద్ధికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఎంతో కాలంగా గతుకులమయంగా ఉన్న ఈ రహదారులను అభివృద్ధి చేయటం ద్వారా వేలాది మంది ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. అనంతరం మేయర్ భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గతో కలసి రోడ్ల అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, కో ఆప్షన్ సభ్యుడు ముసునూరి సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే బీసీలకు న్యాయం

ఎంపీ కేశినేని నాని



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని బీసీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించిన గొప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ విజయవాడ పార్లమెంట్ సమన్వయకర్త, ఎంపీ కేశినేని నాని అన్నారు. బీసీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబిరాణి ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర బీసీ నాయకులు ఎంపీ కేశినేని నానిని మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీలను చంద్రబాబునాయుడు కేవలం ఓట్ల కోసం వాడుకుని వదిలేసేవాడని, కానీ జగనన్న బీసీలకు అన్ని రంగాల్లో అత్యధిక ప్రాధాన్యతను కల్పించి వారి అభ్యున్నతికి పెద్దపీట వేశారని కొనియాడారు. వేముల బేబీరాణి మాట్లాడుతూ బీసీలంటే సీఎం వైఎస్ జగన్‌కు అమితమైన ప్రేమ అని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో మాత్రమే బీసీలకు అసలైన గౌరవం లభించిందన్నారు. రాష్ట్రంలోని బీసీలంతా సీఎం జగనన్న వెంటే నడుస్తామని హామీ ఇచ్చారు.

అభివృద్ధి చేశాం కాబట్టే ధైర్యంగా ముందడుగు

వైఎస్సార్‌సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు తరఫున బళ్లు అందజేస్తున్న దేవినేని అవినాష్, పార్టీ నాయకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో రూ.వందలకోట్ల మేరకు అభివృద్ధి చేశాం కాబట్టే దమ్ముగా, ధైర్యంగా తాము ముందడుగు వేయగలుగుతున్నామని వైఎస్సార్‌సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. ఎల్లో పత్రికల్లో అసత్య కథనాలు రాయడం కాదని, నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిపై ఎప్పుడైనా, ఎవరితోనైనా చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, మాటలు కాదని, పనులు చేసి చూపిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని 10వ డివిజన్‌కు చెందిన నాలుగు కుటుంబాలకు చిరు వ్యాపారాలతో జీవనోపాధి పొందేలా రూ.90 వేలు విలువ గల ఒక టిఫిన్ బండి, ఇస్త్రీ బండి, రెండు తోపుడు బళ్లను దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు తరఫున శుక్రవారం అవినాష్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.650 కోట్ల అభివృద్ధి, రూ.900 కోట్ల సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సతీమణి దేవినేని సుధీర అన్నారు. గడప గడపకు మీ అవినాష్ అన్న కార్యక్రమంలో భాగంగా సుధీర 4వ డివిజన్ ట్రెజరీ ఎంప్లాయిస్ కాలనీలో, దేవినేని అవినాష్ సోదరి దేవినేని క్రాంతి 11వ డివిజన్‌లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేసి, ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని కోరుతున్నారు.

ప్రజలకు మంచి చేసిన వారిని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని ఇంటింటికీ వెళ్లి విజ్ఞప్తి చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలు, పరిష్కరించేందుకు హామీతో కూడిన కరపత్రాలను అందజేస్తున్నారు. వారి వెంట స్థానిక నాయకులు గల్లా పద్మావతి, కో ఆప్షన్ సభ్యులు ముసునూరు సుబ్బారావు తదితరులు ఉన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

ఎంపీ కేశినేని నాని



ప్రపంచ షూటర్ మద్దినేని ఉమామహేష్‌ను సత్కరిస్తున్న విజయవాడ ఎంపీ కేశినేని నాని

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటూ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తోందని విజయవాడ ఎంపీ కేశినేని నాని అన్నారు. అంతర్జాతీయ షూటర్ మద్దినేని ఉమామహేష్‌ను ఎంపీ కేశినేని తన కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. విజయవాడకు చెందిన ఉమామహేష్ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తూ ఆంధ్ర రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచానికి చాటుతున్నాడని కొనియాడారు. దేశంలో ఎవరూ సాధించలేని రీతిలో ఇప్పటి వరకు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో విజేతగా నిలిచి 27 స్వర్ణ, 15 రజత, 10 కాంస్య పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. గడిచిన నెల రోజుల్లో ఒక ప్రపంచ కప్, ఆసియా కప్ పోటీలతో పాటు జాతీయ విశ్వవిద్యాలయాల పోటీల్లో రాణించి పతకాలు సాధించాడని గుర్తు చేశారు. ప్రపంచ షూటర్ మద్దినేని ఉమామహేష్‌కు ప్రభుత్వ పరంగా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాయ్) నుంచి రావాల్సిన ప్రోత్సాహకాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కేంద్రం నుంచి రావాల్సిన ప్రోత్సాహకాలను అందజేయాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాసినట్టు చెప్పారు.

ఓటుహక్కుపై అందరికీ అవగాహన కల్పించాలి

క్యాంపస్ అంబాసిడర్స్ స్వీప్ వర్క్‌షాప్‌లో కలెక్టర్ ఢిల్లీరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాల్సిన అవసరం అధికారులపై ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ముఖ్యంగా అర్బన్ ప్రాంతంలో నిర్లిప్తతను తొలగించి ఓటింగ్ శాతం పెంచేందుకు చేపడుతున్న కార్యక్రమాల్లో కీలక భాగస్వాములు కావాలని క్యాంపస్ అంబాసిడర్స్‌కు పిలుపునిచ్చారు. త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్లను చైతన్యపరచడం-భాగస్వామ్యం చేయడం (స్వీప్) కార్యక్రమంలో భాగంగా క్యాంపస్ అంబాసిడర్స్ (పాఠశాలలు, కళాశాలలు) వర్క్‌షాప్ శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. వర్క్‌షాప్‌ను ప్రారంభించిన అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో జిల్లాలో మిగిలిన నియోజకవర్గాలతో పోల్చితే విజయవాడ అర్బన్ నియోజకవర్గాల్లో తక్కువ ఓటింగ్ శాతం నమోదైందన్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ అర్బన్‌లో 85 శాతానికి పైగా ఓటింగ్ శాతం పెంచే లక్ష్యంగా స్వీప్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఓటు నమోదుకు సువర్ణావకాశం

అర్హత ఉండి ఓటరుగా నమోదు చేసుకోని వారు వెంటనే ఫారం-6 ద్వారా ఓటు నమోదు చేయించుకునేలా చూడాలని కలెక్టర్ ఢిల్లీరావు సూచించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల వరకు ఓటర్ల జాబితాలో తొలగింపు, సవరణలకు అవకాశం ఉందన్నారు. నామినేషన్ల ప్రారంభం వరకు చేర్పులు, బదిలీలకు అవకాశం ఉంటుందని వివరించారు. ఈ విషయాన్ని అంబాసిడర్స్ గుర్తించాలంటూ ఫారం-6, ఫారం-7, ఫారం-8 ప్రయోజనాల గురించి వివరిచారు. ఓటర్ హెల్ప్ లైన్, ఫిర్యాదుకు వీలుకల్పించే సీ విజిల్ తదితర ఆన్‌లైన్ వేదికలపై కూడా అవగాహన పెంపొందించుకొని విద్యార్థులకు, ప్రజలకు తెలియజేయాలన్నారు. క్యూఆర్ కోడ్‌తో ఉండే ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్‌లను కూడా ఓటర్లకు ఇస్తామన్నారు. ఈ-ఎపిక్ కార్డును కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

అందుబాటులో ఆన్‌లైన్ వేదికలు

-స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాసరావు

ఆధునిక సాంకేతికత అందరికీ చేరువైన ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు భారత ఎన్నికల కమిషన్ వివిధ యాప్స్, పోర్టల్స్‌ను అందుబాటులో ఉంచిందన్నారు. వీటిపై అవగాహన పెంపొందించుకొని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీవైఈవో కేవీఎస్ కుమార్, జిల్లా ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త కె.రమేష్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మార్పు అనేది మనతోనే మొదలు కావాలి

యువ రచయిత సౌమ్య



పుస్తక రచయిత సౌమ్యను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సమాజంలో మార్పు రావాలని అనుకునే వారు ముందుగా ఆ మార్పు అనేది మనతోనే మొదలు కావాలనే విషయాన్ని గుర్తించాలని యువ రచయిత తూములూరి సౌమ్య చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో పుస్తక సమీక్ష-రచయిత పరిచయం కార్యక్రమం కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో శుక్రవారం జరిగింది. యువ రచయిత తూములూరి సౌమ్య హాజరై తన తొలి రచన 'ది పాలిస్ట్ ఇన్ హ్యూమన్ ట్రీట్‌మెంట్ ఫ్రమ్ షాడోస్ టూ స్పాట్‌లైట్' అనే పుస్తకంపై సమీక్ష జరిగింది. కళాశాల విద్యార్థులు జాహ్నవి, పర్వానా, హనిత పుస్తకాన్ని సమీక్షించారు. సమాజంలో వితంతువుల పట్ల చూపించే వివక్ష, భర్త చనిపోయిన తర్వాత మహిళలు నిర్వహించే కార్యక్రమాల గురించి పుస్తకంలో తెలియజేశారన్నారు. రచయిత సౌమ్య మాట్లాడుతూ భర్త చనిపోయిన తర్వాత వితంతువుల పట్ల వ్యవహరిస్తున్న తీరులో పూర్వ కాలానికి ఇప్పటికీ చాలా మార్పులు వచ్చాయని, కాని పూర్తిగా రూపుమాపడం యువత చేతుల్లోనే ఉందన్నారు. కళాశాల గ్రంథాలయ విభాగాధిపతి కె.వాణిశ్రీ మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంపొందించడానికి ప్రతి నెలా పుస్తక సమీక్షను నిర్వహిస్తున్నామన్నారు. ఇంగ్లిష్ విభాగాధిపతి జి.శ్రీలత, కళాశాల బుక్ క్లబ్ ఇన్‌చార్జి డాక్టర్ రాజేశ్వరితో పాటుగా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పుస్తక సమీక్ష అనంతరం రచయిత సౌమ్యను కళాశాల ప్రతినిధులు సత్కరించారు.

నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందించడం అభినందనీయం



రైతు ఉత్పత్తులను పరిశీలిస్తున్న నాబార్డ్ జీఎం కె.వి.ఎస్.ప్రసాద్

పటమట(విజయవాడతూర్పు): నాణ్యమైన ఆహార ఉత్పత్తులను అందిస్తున్న రైతులను నాబార్డ్ జీఎం కె.వి.ఎస్.ప్రసాద్ అభినందించారు. నాబార్డ్ తరంగ్‌లో భాగంగా స్టెల్లా కాలేజీలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం మేళాను ఆయన శుక్రవారం సందర్శించారు. బాపట్ల సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలోని క్షేత్ర రైతు ఉత్పత్తిదారుల సంఘం, భవిత బ్లాక్ గ్రామ్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయన్నారు. నాణ్యమైన ఆహార ఉత్పత్తులను అందిస్తున్న రైతులను అభినందించారు. ఈ ప్రదర్శన శనివారంతో ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం మిలింద్ సొశాల్కర్, ఎఫ్‌పీవో సి.హెచ్.ఆల్బర్ట్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- తక్కువ ఖర్చు.. అధిక ఆదాయం
- కోవే ఏపీ చాప్టర్ ఆధ్వర్యంలో కేక్‌ల తయారీలో శిక్షణ



కేక్‌ల తయారీలో మహిళలకు శిక్షణ ఇస్తున్న నిపుణులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో కేక్‌ల తయారీపై శిక్షణ ఇస్తున్నట్టు కోవే ఏపీ చాప్టర్ అధ్యక్షురాలు రాధిక తెలిపారు. గత రెండు రోజుల నుంచి భారతీనగర్‌లో 50 మంది మహిళలకు కేక్‌ల తయారీపై శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ పలురకాల హోం బేకింగ్, బై మిలెట్స్‌పై శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. రకరకాలైన స్వీట్ బేకరీలను తయారు చేయిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రాగి కేక్, మిలెట్స్, చాక్లెట్, బనానా, ఓట్స్ బ్రోనింగ్, చాక్లెట్ కేక్, పైనాపిల్ కేక్‌లను తయారు చేసినట్టు చెప్పారు. గుణదలకు చెందిన స్వీట్‌వే వారితో ఈ శిక్షణ ఇప్పిస్తున్నట్టు తెలిపారు. విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన మహిళలు శిక్షణకు అధికంగా వస్తున్నట్టు తెలిపారు. తక్కువ ఖర్చుతో కేక్‌లు తయారు చేసి అధిక ఆదాయం పొందవచ్చన్నారు. శిక్షణ అనంతరం ఇంటి వద్దనే తయారు చేసి షాపులకు వేసే విధంగా అన్ని రకాలుగా వీరికి శిక్షణ ఇస్తున్నామన్నారు. దీని వల్ల మహిళలు ఆర్థికంగా కొంత మేర సంపాదించుకునేందుకు వీలుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోవే కార్యదర్శి విజయలక్ష్మి, మోహిని, వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెనమలూరు: పోరంకి గ్రామంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు శుక్రవారం తెలిపారు. రాజమాతనగర్, మహాలక్ష్మినగర్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. ఈ కారణంగా బీజేఆర్‌నగర్, నిడమానూరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు సహకరించాలని కోరారు.

సామాజిక అంశాల సమాహారం.. మువ్వా శ్రీనివాసరావు కవిత్వం



విజయవాడ కల్చరల్: మువ్వా శ్రీనివాసరావు కవిత్వం సామాజిక అంశాల సమాహారమని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో బందరురోడ్డులోని బాలోత్సవ భవన్‌లో గురువారం మువ్వా శ్రీనివాసరావు రచించిన నాలుగు కవితా సంపుటలోని కవిత్వం ఆధారంగా 366 మంది రచయితలు రచించిన కవిత్వ విశ్లేషణా గ్రంథం 'అనితరుడు' పరిచయ సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాపినేని మాట్లాడుతూ కవి మువ్వా శ్రీనివాసరావు కవిత్వంలో సామాజిక స్పృహ కనిపిస్తోందన్నారు. విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ ఏ సాహిత్య ప్రక్రియకైనా ప్రధాన లక్ష్యం సమాజ శ్రేయస్సేనని అన్నారు. ఆయన కవిత్వంలో నేడు సమాజంలో జరుగుతున్న అనేక అంశాలను ప్రస్తావించారని, సమాజం పట్ల రచయితకు ఉండవల్సిన బాధ్యతను మరోసారి వివరించినట్లు తెలిపారు. సమావేశంలో అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, కవులు రావి రంగారావు, ఖాదర్ మొహిద్దీన్, అరసవల్లి కృష్ణ మువ్వా శ్రీనివాసరావు కవిత్వంలోని అంశాలను సమీక్షించారు. గ్రంథ సంపాదకులు అనిల్ డ్యానీ, పగడిపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన కవులు శ్రీనివాసరావు కవిత్వంతో అనుబంధాన్ని పంచుకున్నారు.

గ్రాండ్ విజయవాడ బై జీఆర్‌టీ హోటల్ ప్రారంభం



ప్రారంభోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న సీఈఓ విక్రమ్ కోట, ఇతర సిబ్బంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): జీఆర్‌టీ హోటల్స్-రిసార్ట్స్ వారి ఆధ్వర్యంలో గ్రాండ్ విజయవాడ బై జీఆర్టీ హోటల్ అందుబాటులోకి వచ్చింది. లబ్బీపేట వైవీరావు ఆస్పత్రి రోడ్డులో అత్యాధునిక వసతులు, విలాసవంతమైన సౌకర్యాలతో సేవలు అందుబాటులో ఉంటాయని హోటల్ సీఈవో విక్రమ్ కోట తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెండో జీఆర్‌టీ హోటల్‌ను విజయవాడలో ప్రారంభించినట్లు తెలిపారు. దీంతో దేశంలో జీఆర్‌టీ హోటల్స్ సంఖ్య 20కి చేరినట్లు తెలిపారు. ఎంతో డైనమిక్ ల్యాండ్‌స్కేప్‌తో కూడిన హోటల్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. విజయవాడకే పరిమితమైన ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలకు తమ వద్దకు వచ్చే అతిథులకు అందించేందుకు తమ హోటల్ సిద్ధంగా ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: కానూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సోదరులకు గాయాలయ్యాయి. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరుకు చెందిన సోదరులు తారకేష్, కార్తికేష్ గురువారం సాయంత్రం బైక్‌పై కామయ్య తోపునకు వెళుతుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టింది. ఘటనలో బైక్ పై ఉన్న ఇద్దరు సోదరులు రోడ్డుపై పడి పోవటంతో గాయాలయ్యాయి. వారిని పోరంకిలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్చారు.బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

29లోపు లైసెన్సులను రెన్యువల్ చేయించుకోవాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర పాలక సంస్థ పరిధిలో వివిధ వ్యాపారాలు నిర్వహించుకునేవారు తమ వ్యాపార లైసెన్స్‌లను ఈ నెల 29వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా సంబంధిత సచివాలయాల్లో లేదా సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ట్రేడ్ లైసెన్స్ రుసుము చెల్లించి రెన్యువల్ చేయించుకోవచ్చని నగరపాలక సంస్థ కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటివరకు సుమారుగా 60 శాతం మంది వ్యాపారస్తులు మాత్రమే వారి లైసెన్స్‌లను రెన్యువల్ చేయించుకున్నారని, మిగిలిన వ్యాపారస్తులు కూడా ఈ నెల 29 లోపు తప్పనిసరిగా రెన్యువల్ చేయించుకోవాలని సూచించింది. తరువాత అయితే 25 శాతం అపరాధ రుసుంతో లైసెన్స్‌లను రెన్యువల్ చేయించుకోవల్సి ఉంటుందన్నారు.

ఫస్ట్ టైమ్

అద్వితీయ ప్రతిభ


అదితి సేన్ డె

పాపులర్ అయిన తరువాత ఆ బాటలో ప్రయాణించడం విశేషమేమీ కాదు. దార్శనికులు మాత్రం వర్తమానంలో ఉంటూనే భవిష్యత్ వెలుగును దర్శిస్తారు. ఇలాంటి వారిలో ఒకరు అదితి సేన్ డె. 'క్వాంటమ్' అనే కాంతి మిణుకు మిణుకుమంటున్న కాలంలోనే దాని ఉజ్వల కాంతిని ఊహించింది అదితి. క్వాంటమ్ సైన్స్‌లో చేసిన కృషికి డా.అదితి సేన్ డె 'జీడీ బిర్లా అవార్డ్ ఫర్ సైంటిఫిక్ ఎక్సెలెన్స్' పురస్కారానికి ఎంపికైంది. ఈ అవార్డ్‌కు ఎంపికైన 33వ శాస్త్రవేత్త, తొలి మహిళా శాస్త్రవేత్త అదితి సేన్ గురించి....

అలహాబాద్‌లోని హరీష్‌చంద్ర రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో క్వాంటమ్ ఇన్ఫర్‌మేషన్ అండ్ కంప్యూటేషన్ (క్యూఐసీ)లో అదితి ప్రొఫెసర్‌గా పనిచేస్తోంది. 'క్యూఐసీ' అనేది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అత్యున్నత రూపం. ఎన్నో రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగల శాస్త్రం. 'ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆసక్తికరమైన, ఆకర్షణీయమైన పరిశోధన రంగాలలో క్వాంటమ్ ఇన్ఫర్‌మేషన్ అండ్ కంప్యూటేషన్ ఒకటి' అంటుంది అదితి.

కోల్‌కతాలో పుట్టి పెరిగిన అదితికి చిన్నప్పటి నుంచి గణితం ఇష్టమైన సబ్జెక్ట్. తల్లి లక్ష్మి టీచర్. తండ్రి అజిత్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి. కలకత్తా యూనివర్శిటీలో అప్లాయిడ్ మ్యాథమేటిక్స్‌లో ఎంఎస్‌సీ చేసిన అదితి పోలాండ్‌లోని గడాన్స్క్ యూనివర్శిటీలో భౌతికశాస్త్రంలో పీహెచ్‌డీ చేసింది. తన థీసిస్‌కు క్వాంటమ్ ఫిజిక్స్‌కు సంబంధించిన అంశాన్ని ఎంచుకుంది.

'రెండు వేల సంవత్సరంలో నా కెరీర్‌ను మొదలు పెట్టాను. ఆ సమయంలో క్వాంటమ్ ఫిజిక్స్ ప్రారంభ దశలో ఉంది. పరిమిత సంఖ్యలో అప్లికేషన్‌లు ఉండేవి' అంటూ ఆనాటి పరిమితులను గుర్తు తెచ్చుకుంటుంది అదితి. పరిమితులు, ప్రతిబంధకాలతో పనిలేకుండా 'క్వాంటమ్ ఫిజిక్స్'పై తన ఇష్టాన్ని పెంచుకుంటూ పోయింది.

కాలంతో పాటు నడుస్తూ, ఎప్పటికప్పుడు 'క్వాంటమ్ ఫిజిక్స్'ను అధ్యయనం చేస్తూ ప్రయాణాన్ని కొనసాగించింది. క్వాంటమ్ థర్మల్ యంత్రాల రూపకల్పన(బ్యాటరీలు, రిఫ్రిజిరేటర్ లాంటివి) నుంచి క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ అల్గారిథమ్‌ల సమర్థవంతమైన అమలు, సూటబుల్ క్వాంటమ్ సిస్టమ్స్ వరకు... ఎన్నో విషయాలపై పని చేస్తోంది అదితి.

ప్రతిష్ఠాత్మక శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డ్ (2018) అందుకుంది. 2022లో ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ మెంబర్‌గా ఎంపికైంది. క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ స్పిన్‌సిస్టమ్, క్వాంటమ్ ఇన్ఫర్‌మేషన్ విత్ అల్ట్రా – కోల్డ్ గ్యాసెస్, క్వాంటమ్ కోరిలేషన్స్... మొదలైన వాటికి సంబంధించి అదితి లెక్చర్స్, టాక్స్ ఆదరణ పొందాయి. బెనర్జీ, శ్రీజన్ ఘోష్, శైలాధిత్యలతో కలిసి 'స్ప్రెడింగ్ నాన్ లోకాల్టీ ఇన్ క్వాంటమ్ నెట్‌వర్క్స్', కవన్ మోదీ, అరుణ్ కుమార్, ఉజ్వల్ సేన్‌లతో కలిసి 'మాస్కింగ్ క్వాంటమ్ ఇన్ఫర్‌మేషన్ ఈజ్ ఇంపాజిబుల్...మొదలైన పుస్తకాలు రాసింది.

క్లాసులో పాఠం చెప్పినా, సెమినార్‌లో ఉపన్యాసం ఇచ్చినా, పుస్తకం రాసినా విషయాన్ని కమ్యూనికేట్ చేయడంలో తనదైన శైలిని ఎంచుకుంది. సంక్లిష్టమైన శాస్త్రీయ విషయాలను సులభంగా అర్థమయ్యేరీతిలో కమ్యూనికేట్ చేయడం ఆమె శైలి. 'క్వాంటమ్'పై ఆసక్తి చూపుతున్న ఈతరంలోని చాలామందికి మొదటగా గుర్తుకు వచ్చే పేరు అదితి సేన్. 'క్వాంటమ్' అనేది ఆమె ఇంటి పేరుగా మారింది.

సమన్వయం చేసుకుంటూ...



కెరీర్, ఫ్యామిలీలో ఏదో ఒక ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవడంపైనే మహిళా శాస్త్రవేత్తల కెరీర్ కొనసాగుతుందా, ఆగిపోతుందా అన్నట్లుగా ఉంటుంది. అయితే కెరీర్, ఫ్యామిలీని సమన్వయం చేసుకుంటూ వెళితే సమస్యలు ఉండవు. ఒక బిడ్డకు తల్లి అయిన తరువాత తిరిగి పనిలో చేరి అద్భుతమైన శక్తి సామర్థ్యాలను చాటుకున్న మహిళా శాస్త్రవేత్తలు ఎంతోమంది ఉన్నారు.

– అదితి సేన్

ఆ చిరు లేత గానానికి నూరేళ్లు

(గాయకుడు తలత్ మెహమూద్ శత జయంతి నేడు)

జల్తే హై జిస్కే లియే...
ఆ పాట చిరుకెరటాల అలికిడిలా ఉండేది.
ఫిర్ వహీ షామ్.. వహీ గమ్...
ఆ గొంతు సాయం సంధ్యలో వీచే వీవెన వలే ఉండేది.
సీనే మే సులగ్‌తే హై అర్మాన్...
ఆ గానం పడగ్గది దీగూటిలో శిఖను కంపించే దీపంలా అనిపించేది.
తలత్ మెహమూద్.. గజల్ నవాబ్.
మృదుగాన చక్రవర్తి.
హిందీ సినిమా గోల్డెన్ ఎరాలో వెలిగిన త్రిమూర్తులు... రఫీ, ముఖేష్, తలత్‌లలో ఒకడు.
నేడు అతని శతజయంతి.


తలత్ మెహమూద్

భారతీయ సినిమా సంగీతంలో మెత్తని గొంతును ప్రవేశపెట్టి శ్రోతలను సమ్మోహితులను చేసిన తొలి గాయకుడు తలత్ మెహమూద్. అతడు గజల్ గానానికి మార్గదర్శకుడు. నిరుపమానమైన గజల్ గాయకుడు మెహదీహసన్‌కు కూడా తొలి దశలో తలత్ మెహమూదే స్ఫూర్తి. తలత్‌ది ఘనమైన గాన చరిత్ర. అందుకే అతని శతజయంతి సందర్భం గాన ప్రియులకు వేడుక.

1941–44 మధ్య కాలంలో 'తపన్ కుమార్' పేరుతో కలకత్తాలో బెంగాలీ పాటలు పాడాడు తలత్. 1945లో కలకత్తాలో నిర్మితమైన 'రాజలక్ష్మీ' హిందీ సినిమాలో నటుడు–గాయకుడుగా తలత్ తన మొదటి సినిమా పాట 'ఇస్ జగ్ సే కుఛ్ ఆస్ నహీన్' పాడాడు. 1951లో 'తరానా'లో పాడిన 'సీనేమే సులగ్‌తే హైన్ అర్‌మా' పాట తలత్ తొలి సినిమా హిట్ పాట. అంతకు ముందు 'ఆర్‌జూ'లోని 'ఏ దిల్ ముఝే ఏసీ జగ్‌హ లేచల్' పాటా, 'బాబుల్' లోని 'మేరా జీవన్ సాథీ బిఛడ్ గయా' చెప్పుకోతగ్గవి.

'సంగ్‌దిల్' సినిమాలో తలత్ పాడిన 'ఏ హవా.. ఏ రాత్... ఏ చాందినీ' మన దేశంలో వచ్చిన ఒక ప్రశస్తమైన పాటగా నిలిచిపోయింది. 'సంగ్‌దిల్' సినిమాలోనే 'కహాన్ హో కహాన్' అంటూ తలత్ మరో గొప్ప పాట పాడాడు. 'దాగ్'లో పాడిన 'ఏ మేరే దిల్ కహీన్ ఔర్ చల్' పాట దేశాన్ని ఒక ఊపు ఊపేసింది. తలత్ పాడిన 'బారాదరీ' సినిమాలోని 'తస్వీర్ బనాతా హూ', 'ఫుట్‌పాత్'లోని 'షామే గమ్ కీ కసమ్', 'ఠోకర్'లోని 'ఏ గమే దిల్ క్యా కరూన్', 'దిల్–ఎ–నాదాన్' సినిమాలోని 'జిందగీ దేనే వాలే సున్' పాటలూ, ఈ స్థాయి ఇంకొన్ని పాటలూ సినిమా గానంలో కాలాలు ప్రశంసించేవయ్యాయి. హిందీ సినిమా పాటల్లోనే పెద్ద పల్లవి పాట 'ఉస్నే కహా థా' సినిమాలోని 'ఆహ్ రిమ్ జిమ్ కే యే ప్యారే ప్యారే గీత్ లియే' తలత్ పాడాడు.

అప్పటి వరకూ దేశం వింటూ వచ్చిన సైగల్ గానాన్ని మరపిస్తూ తలత్ క్రూనింగ్ (లాలిత్యమైన గానం) ఒక్కసారిగా దేశ గాన విధానాన్ని మార్చేసింది. 1944లో తలత్ పాడిన 'తస్వీర్ తేరే దిల్ మేరా బెహ్‌లాన సకే గీ' గజల్ రికార్డ్ విడుదలయింది. విడుదలయిన నెల రోజుల్లోనే లక్షన్నరకు పైగా ప్రతులు అమ్ముడయింది. ఆ గజల్ గానం దేశ సినిమా, లలిత, గజల్ గాన పరిణామానికి, పరిణతికి, ప్రగతికి మార్గదర్శకమైంది. తలత్ 1941లో 'సబ్ దిన్ ఏక్ సమాన్ నహీన్ థా...' గజల్‌ను రికార్డ్‌పై విడుదల చేశారు. ఆ తరువాత 'గమ్ –ఎ–జిందగీ కా యారబ్ న మిలా కోఈ కినారా' (1947), 'సోయే హువే హేన్ చాంద్ ఔర్ తారేన్' (1947), 'దిల్ కీ దునియా బసా గయా' (1948) వంటి గజళ్లతో సాగుతూ 1950వ దశాబ్దిలో 'రోరో బీతా జీవన్ సారా', 'ఆగయీ ఫిర్ సే బహారేన్', 'చన్ద్ లమ్హేన్ తేరీ మెహఫిల్ మేన్' వంటి గజళ్లతో రాణించి రాజిల్లింది. బేగం అఖ్తర్ గజల్ ధోరణికి భిన్నంగా గజల్ గానం పరివర్తనమవడానికి తలత్ ముఖ్యకారణమయ్యాడు. అందుకే అతను 'గజల్ నవాబ్' అనిపించుకున్నాడు.

గైర్–ఫిల్మీ (సినిమా పాటలు కాని) గానంగా తలత్ కృష్ణ భజన్‌లు, దుర్గా ఆర్తి, నాత్‌లు, గీత్‌లు చక్కగానూ, గొప్పగానూ పాడాడు. 'నిప్పులాంటి మనిషి' సినిమాలోని 'స్నేహమే నా జీవితం స్నేహమేరా శాశ్వతం' పాట మనకు తెలిసిందే. ఈ పాట 'జంజీర్'లో మన్నాడే పాడిన 'యారీ హైన్ ఇమాన్ మేరా' పాటకు నకలు. ఆ హిందీ పాటకు కొంత మేరకు ఆధారం ముబారక్ బేగమ్‌తో కలిసి తలత్ పాడిన 'హమ్ సునాతే హైన్ మొహమ్మద్' అన్న నాత్. 'అమృత' సినిమాలో ఎ.ఆర్. రహ్మాన్ చేసిన 'ఏ దేవి వరము నీవు' పాట పల్లవి తలత్ పాడిన గజల్ 'రాతేన్ గుజర్ దీ హైన్'కు దగ్గరగా ఉంటుంది.

తలత్ మహ్మూద్ 1959లో విడుదలైన 'మనోరమ' తెలుగు సినిమాలో రమేష్ నాయుడు సంగీతంలో మూడు పాటలు 'అందాల సీమ సుధా నిలయం', 'గతి లేనివాణ్ణి గుడ్డివాణ్ణి', 'మరిచిపోయేవేమో ' పాడాడు. అంతకు ముందు తెలుగువారైన ఈమని శంకరశాస్త్రి సంగీతంలో 1951లో 'సంసార్' హిందీ సినిమాలో 'మిట్ నహీన్ సక్తా', 'యే సంసార్ యే సంసార్ ప్రీత్ భరా సంసార్' పాటలూ, 1952లో వచ్చిన 'మిస్టర్ సంపత్' సినిమాలో 'ఓ మృగనయనీ...', 'హే భగవాన్' పాటలూ పాడారు. హిందీలోకి డబ్ ఐన తెలుగు సినిమాలు 'పాతాళభైరవి', 'చండీరాణి' సినిమాలలో ఎన్.టి.రామారావుకు తలత్ పాడారు.

1964లో వచ్చిన 'జహాన్ ఆరా' సినిమాలోని 'ఫిర్ వోహీ షామ్...' పాట తరువాత తలత్ చెప్పుకోతగ్గ పాటలు పాడలేదు. అంతకు ముందు 1963లో 'రుస్తమ్ సొహరాబ్' సినిమాలో తలత్ 'మాజన్దరాన్ మాజన్దరాన్' అంటూ ఒక విశేషమైన పాట పాడాడు. తలత్ పాడిన చివరి గొప్ప సినిమా పాట అది. అన్నీ కలుపుకుని తలత్ మొత్తం 747 పాటలు పాడాడు. తలత్ 16 సినిమాల్లో నటించాడు. పలు పురస్కారాలతో పాటు 1992లో పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకున్నాడు తలత్. 1924 ఫిబ్రవరి 24న పుట్టిన తలత్ 1998లో తది శ్వాస విడిచాడు.

తలత్ క్రూనింగ్‌ను దక్షిణ భారతదేశంలో పి.బి. శ్రీనివాస్ అర్థం చేసుకుని అందుకుని అమలు చేశారు. పి.బి. శ్రీనివాస్ నుండి అది కె.జె.ఏసుదాస్‌కు, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యంకు, ఇతరులకూ చేరింది. మనదేశంలో క్రూనింగ్ ఉంది అంటే అది తలత్ మెహమూద్ వచ్చింది అన్నది చారిత్రికం.

1968లో అమెరికాలో జరిగిన ఒక టాక్ షోలో తలత్‌ను ప్రముఖ ఇంగ్లిష్ గాయకుడు ఫ్రాంక్ సినాట్రాతో పోల్చి 'ఫ్రాంక్ సినాట్రా ఆఫ్ ఇండియా' అని అన్నారు. ఇవాళ్టికీ దేశ వ్యాప్తంగా తలత్ పాటలు వినిపిస్తూనే ఉన్నాయి; ఎప్పటికీ మన దేశంలో తలత్ గానం వినిపిస్తూనే ఉంటుంది. ఒక మెత్తని పాటలా తలత్ ఈ మట్టిపై వీస్తూనే ఉంటాడు.

– రోచిష్మాన్

లైఫ్@360

నల్లగా నిగనిగలాడే ఒత్తైన కురులు, అందంగా మెరిసే చర్మం, దృఢమైన పళ్లు, ఎర్రటి పెదవులు, పొడవాటి గోళ్ల కోసం సౌందర్య సాధనాల మీదనే ఆధారపడుతుంటారు చాలామంది. అవేమీ చౌకగా లభించవు. బోలెడంత డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. పైగా ఆయా ఉత్పత్తుల్లో వాడే రసాయనాల వల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి.

ఆహారం... సౌందర్యం



చర్మాన్ని సహజంగా... ఆరోగ్యంగా... అందంగా తయారు చేసే కొన్ని ఆహారాలు ఉన్నాయి. వీటిని రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటే ఎలాంటి ఇతర ఖర్చులు చేయాల్సిన అవసరమే లేదు. అవేంటో చూద్దాం.



చిలగడదుంప..
విటమిన్ ఎ పుష్కలంగా ఉండే చిలగడదుంప చర్మానికి వరం. ఇది చర్మాన్ని మృదువుగా చేస్తుంది. ముడతలను తగ్గిస్తుంది, మెరుపునిస్తుంది.



చేపలు..
ఇవి జుట్టును ఒత్తుగా, మెరిసేలా చేయడం లో సహాయపడతాయి. అలాగే, చర్మాన్ని మృదువుగా, యవ్వనంగా ఉంచుతుంది. సాల్మన్, ట్యూనా, మాకేరెల్ వంటి చేపలలో ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగా ఉంటాయి.



అవకాడో..
అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వు, విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇది చర్మాన్ని తేమగా ఉంచుతుంది,



గింజలు..
బాదం, వాల్నట్, చియా సీడ్స్, అవిసెల వంటి గింజ ధాన్యం విటమిన్ ఇ, జింక్, బయోటిన్‌కు మంచి మూలాధారాలు. ఇవి గోళ్లను దృఢంగా మార్చడంతోపాటు జుట్టు రాలడాన్ని నివారిస్తాయి.



గుడ్లు..
ప్రోటీన్, బయోటిన్, విటమిన్ డి పుష్కలంగా ఉండే గుడ్లు జుట్టు, గోళ్లను బలోపేతం చేయడంలో సహాయపడతాయి. అలాగే, ఇవి చర్మానికి పోషణనిచ్చి ఆరోగ్యవంతంగా చేస్తాయి.





ఆకుకూరలు..
పాలకూర, మెంతికూర, బ్రోకలీ వంటి ఆకుకూరల్లో విటమిన్ ఎ, సి ,కె పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యవంతం చేస్తాయి. కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి చర్మం మీద ముడతలను తగ్గిస్తాయి.



నీరు అధికంగా ఉండే ఆహారాలు..
పుచ్చ, దోస, టమోటా వంటి నీరు అధికంగా ఉండే కూరగాయల వల్ల చర్మం తేమగా... మృదువుగా ఉంటుంది



ఆయిస్టర్
జింక్ పుష్కలంగా ఉండే ఆయిస్టర్ గోళ్లను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా చర్మాన్ని యవ్వనంగా ఉంచడంలో కూడా ప్రభావం చూపుతుంది.

అందంగా కనిపించడం కోసం రకరకాల సౌందర్య సాధనాలను కొనుగోలు చేసి ఆరోగ్యాన్ని, డబ్బును పాడు చేసే బదులు ఆహారంతోనే అందంగా... ఆరోగ్యంగా మెరిసిపోవచ్చు. ఏమంటారు?

అధిక టీతో ఐరన్ లోపం



అలసిన శరీరాన్ని సేదతీర్చడం లోనూ, మనసును సాంత్వన పరచడంలోనూ టీని మించింది లేదని అందరూ అంటారు. అలాగని టీ ఎక్కువగా తాగడం అంత మంచిది కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఎక్కువసార్లు టీ తాగడం వల్ల శరీరంలో ఐరన్ లోపం ఏర్పడుతుందంటున్నారు.

టీలో అధికంగా ఉండే టానిన్ ఐరన్ శోషణను నిరోధిస్తుంది. ఐరన్ లోపం వల్ల శరీరంలో బలహీనత, అలసట, నిద్రలేమి, అనేక ఇతర సమస్యలు పెరుగుతాయి. టీ లో కెఫిన్ శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది విశ్రాంతి లేకపోవడం, నిద్ర లేకపోవడం, వికారం వంటి దుష్ప్రభావాలకు కారణమవుతుంది. జీర్ణ సమస్యలు ఖాళీ కడుపుతో టీ తాగడం వల్ల శరీరంలో జీర్ణ సమస్యలు వస్తాయి. ఇది గ్యాస్, మలబద్ధకం, ఉబ్బరం వంటి సమస్యలకు దారితీస్తుంది. ఇది జీర్ణశక్తిని ప్రభావితం చేస్తుంది. జీర్ణక్రియ మందగిస్తుంది. గుండెల్లో మంట ఖాళీ కడుపుతో టీ తాగడం వల్ల గుండెల్లో మంట పుడుతుంది. దీని కారణంగా ఆహార నాళంలో యాసిడ్ ఏర్పడి యాసిడ్ రిఫ్లక్స్ సమస్యలతో పాటు పుల్లని తేన్పులు, వికారం కలుగుతాయి.

నిద్ర సమస్యలు...
కొంతమందికి రాత్రి నిద్రపోయే ముందు టీ తాగడం అలవాటు. అయితే ఇది వారి నిద్రపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. నిద్ర నాణ్యత దెబ్బతింటుంది. ఇది రాత్రిపూట తరచుగా మూత్రవిసర్జన సమస్యను కలిగిస్తుంది. రాత్రి పడుకునే ముందు టీ కి బదులు ఒక గ్లాసు గోరువెచ్చని నీరు తాగడం మంచిది.

పేగులపై దుష్ప్రభావం...
అధికంగా తాగే టీ మన పేగులపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. ఎక్కువగా టీ తీసుకునే వ్యక్తులు కెఫిన్, టానిన్‌ల కారణంగా ఆందోళన, ఒత్తిడి, విశ్రాంతి లేకపోవడం, తలనొప్పి, తల తిరగడం వంటి సమస్యలను ఎదుర్కొంటారు.

ఆరోగ్య యోగం

ప్రస్తుతం మానసిక ఒత్తిడి, సమస్యలు లేని జీవితం లేదంటే అతిశయోక్తి కాదు. పని ఒత్తిడితో పాటు ఆర్థికపరమైన సమస్యలు తదితర ఇతర సమస్యల కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అందుకే దైనందిన జీవితంలో రోజూ కొద్దిసేపయినా యోగా చేయాలంటున్నారు నిపుణులు. యోగాతో కలిగే ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయని చెపుతున్నారు. వాటిలో కొన్నింటిని తెలుసుకుందాం.

యోగా అంటే శారీరక వ్యాయామాలు, యోగాసనాలు మాత్రమే కాదు. మన మేధా శక్తి, ఆత్మశక్తి పెరగడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా యోగా చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలను సొంతం చేసుకోవచ్చు. యోగా చేయడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలేమిటో చూద్దాం.

యోగా అనేది ఒక శక్తిమంతమైన మైండ్‌ఫుల్‌నెస్ సాధన. యోగా ఒత్తిడిని తగ్గించి ప్రశాంతంగా వుండేట్లు చేస్తుంది. యోగా చేయడం వల్ల రక్తపోటు కూడా అదుపులో వుంటుంది. ఆరోగ్యకరమైన జీవితానికి యోగా ఎంతో సహాయపడుతుంది.

యోగా చేయడం వల్ల శరీరానికి నూతనోత్సాహం కలుగుతుంది. బలాన్ని పెంపొందించుకోవడానికి యోగా సహాయపడుతుంది. కీళ్లను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది యోగ.


యోగా చేయడం వల్ల శ్వాసకు సంబంధించిన సమస్యల నుంచి బయటపడవచ్చు. మానసిక ప్రశాంతత పొందడంలో యోగా ఎంతో సహాయపడుతుంది. ప్రస్తుతం ఉన్న బిజీ లైఫ్‌లో కోపం, ద్వేషం వంటి లక్షణాలు కనిపిస్తు ఉంటాయి. ఈ సమస్యలను తగ్గించడంలో యోగా ఎంతగానో సహకరిస్తుంది. యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత, ఆరోగ్యం పొందవచ్చు.

యోగా వల్ల శ్రద్ధ, ఏకాగ్రత పెరుగుతాయి. దీంతో పనులను సులువుగా చేసుకోవచ్చు. ఎముకలు, కండరాలు దృఢంగా మారతాయి. నీరసం, బలహీనత వంటి సమస్యల బారి నుంచి సులభంగా బయట పడవచ్చు.



శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపించడంలో ఎంతో సహాయపడుతుంది. రకరకాల ఇతర పద్ధతులను అనుసరించడం కన్నా యోగా చేయడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందుతుంది. ముఖ్యంగా పిల్లలకు చిన్న వయసు నుంచే యోగా చేయడం అలవాటు చేయడం వల్ల వారి పెరుగుదలకు ఎంతో మేలు చేస్తుందని యోగా నిపుణులు, గురువులు చెబుతున్నారు.

గర్భిణులకు స్పెషల్ జ్యూస్



సన్నగా తరిగిన అరకప్పు లేత పాలకూర, నాలుగు పైనాపిల్ ముక్కలు, పావుకప్పు ఆవకాడో, అరకప్పు నీళ్లు తీసుకుని జ్యూసర్‌లో వేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఈ జ్యూస్‌ను వడగట్టకుండా అలాగే తాగాలి. గర్భిణులకు ఈ స్మూతీ అన్ని రకాల పోషకాలను అందిస్తుంది.